# మిసిమి

మాసపత్రిక


**సంపుటి 31** **సంచిక 5 – 6**

**మే – జూన్ 2020**

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

*సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్***

*సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం*

KALA JYOTHI
— Since 1946 —

Printed & Published by

**BAPANNA ALAPATI**

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad,

**Hyderabad - 500 020.**

Ph: 040 - 27612436, 27645538.

పత్రిక ప్రతి నెలా ఒకటవ తేది మీ ముంగిట వాలుతుంది...

ప్రతి : ₹ 30/- సంవత్సరానికి : ₹ 360/-

విదేశాలకు ప్రతి : $ 3.00 సంవత్సరానికి : $ 36.00 (by Air Mail)

కార్యదర్శి : వి. ఆశారాణి

ఫోన్ : 040 - 27645538. సెల్ : 994 951 6567.

LIBRARY OF CONGRESS

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE

**LCCN 91-903060** **ISSN 2454-4329**

E-mail : misimi90monthly@gmail.com,

www.misimimonthly.com

e-magazine : www.kinige.com/misimi

facebook.com/misimimaasapathrika

https://twitter.com/MISIMIMONTHLY

YouTube **Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 100 పేజీలు


# మిసిమి

## మే - జూన్ నెల సూచికలు...


మోహిని


ఎడిటర్స్ డైరీ - కరోనా కాటు : అశ్వినీకుమార్... 5
శాసనాలు - సానులు : నాగోలు కృష్ణారెడ్డి... 7
తెలుగున నిఘంటు నిర్మాణము : పూషడపు సుబ్బారావు... 11
ముగ్ధ మోహనం - మోహినియాట్టం : ఆచార్య పప్పు వేణుగోపాలరావు... 17
కాకతీయులు - 3 : ప్రొ. రావినూతల సత్యనారాయణ... 23
కనగనహళ్ళి బౌద్ధస్థూపం : కొసరాజు వెంకటేశ్వరరావు... 36
కావ్యాలలో మనసు ప్రభావం : చెళ్ళపిళ్ళ సన్యాసిరావు... 41
లోకోత్తర పథం : కన్నూరి అలెగ్జాండర్... 46
సుచేత కృపలాని, మాలతీ చౌదరి : ముత్తంగి వేంకట భారతలక్ష్మి... 51
బుద్ధుడి అనన్యత : వేలూరి కృష్ణమూర్తి... 57
బహుముఖ ప్రజ్ఞాశాలి - జి.డి. నాయుడు : డా. వి.వి. వేంకట రమణ... 63
రఘునాథ నాయకుడు : అమినేని సిద్ధయ్య నాయుడు... 67
నిశ్శబ్దం : దామెర వెంకట రావు... 71
శ్రీశ్రీతో నా జ్ఞాపకం : ఆచార్య ఎండ్లూరి సుధాకర్... 75
మహా శూన్యత సూత్రం : డా. ఈమని శివనాగిరెడ్డి... 76
యన్.టి.ఆర్. సమగ్ర జీవిత కథ : డా. పాటిబండ్ల దక్షిణామూర్తి... 81
ప్రాణం రంగు ? : కిల్లాడ సత్యనారాయణ... 85
గానకోకిల - వేదవతి ప్రభాకర్ : డా. మంతెన సత్యనారాయణ... 88
వేనరాజు - ఖూనీ రూపకాలు : డా. పి.సి. వెంకటేశ్వర్లు... 90
తొలి తెలుగు నవల ఏది? : టి. రవిచంద్... 95
చదవండి... : మిసిమి... 96





జి.డి. నాయుడు



యన్.టి.ఆర్.

**అట్టమీద బొమ్మలు**


**తథాగతుడు**




**ఆఫ్రికా బాలలు** (జగార్ట్)



**బోధిసత్త్వ**
(క్వాన్ ఇన్ - ప్రజల ఆక్రందనలు వినే చైనా దేవత)

ఎడిటర్స్ డైరీ:

## కరోనా కాటు

*మిత్రులు కలసినప్పుడు - రెండు సంవత్సరాలుగా అనుకుంటూ ఉండేవాళ్ళం - 'అయ్యో! ఈ విచ్చలవిడి పిచ్చి మా'లోకం' ఏమైపోతుందో - ఎంత కాలంలో అంతమైపోతుందో' అని. ఇదిగో - మన కళ్ళ ముందు తిరిగే ఈ యువత (సినిమా హాళ్ళ గేట్ల దగ్గర, పీజా గుడిసెల్లో, డోమినో డొమియన్‌లో) తిరుగుతున్న వీళ్ళంతా మరో పాతిక ముప్పై ఏళ్ళలో ఏమైపోతారో అని వాపోయేవాళ్ళం. కానీ ఆ ఉపద్రవం ఇంత తొందరగా - మా జీవిత కాలంలోనే చూడాల్సి వస్తుందని అనుకోలేదు సుమా! కార్పొరేట్లు చెప్పే సుస్థిర - సమగ్ర సమాజ అభివృద్ధి ఎంత భ్రమో - ఎంత పగటికలో కరోనా మేల్కొల్పింది. మనం నిరాశావాదులం కాదు. అలా అని గుడ్డిగా ప్రతిదీ నమ్మే అమాయకులమూ కాదు. అభివృద్ధి అంటే వేగం అని, వేగం అంటే అంతర్గ్రహ ప్రయాణాలనీ నమ్మబలికి ప్రకృతి విధ్వంసానికి, రసాయన కాలుష్యానికి ఒక శతాబ్ద కాలంగా భూమి మీద ప్రకృతి వనరులన్నీ నాశనం చేస్తూ ఇప్పుడు ఒక కొత్త పదాన్ని సస్టైనబుల్ ఎనర్జీ అంటూ తెచ్చి మన మీదకు వదలి సొమ్ము చేసుకుంటున్నాయి ఈ కంపెనీలు. ప్రపంచంలో ఇంతవరకూ ఏ ప్రభుత్వమూ (అంటే ఏ పాలనా విధానంలో ఉన్నా) ప్రజల మేలు కోరినది ఎక్కడ? అధికారంలో ఎలా ఉండాలో - దానికి ఎవరి అండ కావాలో అని లెక్కలు వేసుకునే నాయకులకు ప్రజల మేలు పట్టిందా? భూమి పుట్టిన తర్వాత ఇలాంటి దుస్థితి చరిత్రలోనే కాదు పురాణాల్లో కూడా లేదు!*

*గత రెండు నెలలుగా విశ్రాంతి శూన్యంలో గడుపుతున్నాం. అది విశ్రాంతి కాదు - శూన్యంలో గడుపుతున్నాం. ఇది కాలుష్యాన్ని తగ్గించిందని సంతోష పడుతున్నాం. కానీ భూభ్రమణం ఆగలేదు. జీవనచక్రం నిలబడిపోయింది. ఉద్యోగ విజయాలన్నీ వ్యక్తిత్వ వికాస నిపుణులకు అందకుండా పోయాయి. ఇప్పుడు ఏ తత్త్వశాస్త్రం దారిచూపుతుంది? ఏ సూపర్‌మేన్ వచ్చి రక్షిస్తాడు? రాత్రింబవళ్ళు శ్రమించే శాస్త్రజ్ఞులే మనకు దిక్కు. వారికి కోట్లలో పారితోషికం (సినిమా హీరోలకు ఇచ్చినట్లు) ఎవ్వరూ ఇవ్వరు. చివరికి వాక్సిన్ తయారు చేసినవారి పేరు కూడా వినపడదు. మళ్ళీ విచ్చలవిడి పిచ్చి మా'లోకం' పరుగులు పెడుతుంది - నా మాట నమ్మండి.*



*ఈ రెండు నెలలలో చాలా ఫోన్లు వచ్చాయి. **మిసిమి** పాఠకులు ఎంతో అభిమానంతో పిలిచేవారు. 'అయ్యో! ఈ విశ్రాంతి సమయంలో పూర్వపు **మిసిమి** పత్రికలు చదువుతున్నాం. ఈ రోజు ఈ వ్యాసం చదివాను - అని వారి సంతోషాన్ని, ఆశ్చర్యాన్ని తెలియజేసేవారు. కొందరు - మేము ముప్పై సంవత్సరాల **మిసిమి** సారస్వత సముద్రంలో మంచి ముత్యాలన్నీ ఏరుతున్నాం. మీరు ఈ **మిసిమి** ముత్యాలు ఒక పుస్తకంగా తీసుకురావాలి అని ఆప్యాయంగా అంటుంటే మనస్సు పులకించేది. ఇలా పిలిచినవారిలో పతివాడ సూర్యనారాయణ, అనుమాండ్ల భూమయ్య, కోడూరు పుల్లారెడ్డి, డా. రాజగోపాలరావు, ఎన్.వి. హనుమంతరావు, డా. శ్రీమన్నారాయణ, ప్రొ. వెంకటేశ్వర్లు (హైదరాబాద్), గుడిపూడి సుబ్బారావు (ఖమ్మం), టి. రవిచంద్ (బాపట్ల), ప్రొ. లక్ష్మీ అయ్యర్ (రాజస్థాన్), సంజీవ నరసింహ అప్పడు (మారిషస్), చల్లా శ్రీరామచంద్రమూర్తి, ప్రొ. భమిడిపాటి విశ్వనాథ్ (కాశీ విశ్వవిద్యాలయం), ప్రొ. సాంబశివమూర్తి (సంస్కృత విశ్వవిద్యాలయం, జైపూర్), హేమలత, వీరమాచనేని ప్రమోద్ కుమార్, శ్రీనివాస రాయ్, రెహమాన్ (విజయవాడ), కాళిదాసు పురుషోత్తం (శ్రీకాకుళం), దేవరకొండ రామనరసింగరావు (విజయనగరం), పెద్ది సత్యనారాయణ, ప్రొ. కొలకలూరి ఆశాజ్యోతి, మనను' రాయుడు, (బెంగళూరు), ప్రొ. విజయ్‌కుమార్ (అనంతపురం), పెద్ది సాంబశివరావు, అన్నమయ్య గ్రంథాలయం శిరీష (గుంటూరు), సురేష్, ఆచంటి శ్రీనివాస్, గిరిధర్ గౌడ్ (తెనాలి), కోన రమణరావు (చీరాల), అమినేని సిద్ధయ్య నాయుడు (రాజాం), దేవినేని మధుసూదనరావు (వీరు వాషింగ్టన్‌లో చిక్కుకుపోయారు)... ముంబై నుంచి రాయవరపు సత్యనారాయణ గార్లు (లేఖ పుట. 6) ఇలా ఎందరో... అందరికీ వందనాలు.*

*ఏప్రిల్ - 2020 **మిసిమి** మాసపత్రిక ముద్రింపబడి సిద్ధంగా ఉన్నా పరిస్థితుల మూలంగా పంపలేకపోయాం. ఇదిగో - ఇప్పుడే కదులుతున్నాయి చక్రాలు. ఇక మే - జూన్ సంచికలు కలిపి ఇప్పుడు పంపిస్తున్నాం. **మిసిమి** ఎప్పటిలాగే మిమ్మల్ని అలరిస్తుందని విశ్వాసం మాకు మెండుగా ఉంది.*

*మే సంచికలో - బుద్ధపూర్ణిమ కదా - కొన్ని ప్రత్యేక వ్యాసాలున్నాయి. రెండున్నర శతాబ్దాలకు పూర్వమే బుద్ధునిలాంటి ఆధునిక ఆలోచనలుగల మహామనిషి ఈ భూమి మీద సంచరించి, నిర్వాణించాడంటే నమ్మలేకపోతున్నాం. మనము ఎటుపోతున్నామో అర్థంకాక, తథాగతులు ఎంతమంది అవతరిస్తే ఈ పిచ్చి మా'లోకం' నిర్వాణ దిశగా పయనిస్తుందో ఎవరైనా చెప్పగలరా?*



# కమ్మతెమ్మెరలు

"…. *మిసిమి* తో నా సహవాసం వయస్సు అయిదేళ్ళు దాటింది. నేను చూసిన తొలి సంచిక జనవరి - 2016, నన్ను ఉబ్బితబ్బిబ్బు చేసింది. విశేషమేమంటే ప్రస్తుత సంచిక అదే ఆనందోత్సాహాలను నాకు లభింపజేస్తోంది. *మిసిమి* నాలో ఒక మరువలేని మార్పు తీసుకొచ్చింది. నిద్రాణంగా ఉన్న నాలోని 'విద్యార్థి'ని జాగృతం చేసింది. *మిసిమి* చదువుకొంటూ నాలోని విద్యార్థితో సంభాషించుకొంటుంటాను. మాటలకందని చక్కని ఊహావస్థ. నా దైనందిన జీవనానికి ఒక నిర్వచనాన్ని, దిశానిర్దేశాన్ని ఇచ్చింది. ఇది భగవదనుగ్రహం, ఒక ఋణానుబంధం… నాకు జ్ఞానసముపార్జన నిరంతర యాత్ర. నిరంతర పఠనం ఒక సాధనం. స్థూలంగా జ్ఞానం పొందడానికి రెండు మార్గాలున్నాయని నా తలంపు. 1. పరిమిత విషయాల గురించి ప్రస్తుత జ్ఞానం. 2. విస్తృత విషయాల గురించి పరిమిత జ్ఞానం. నాకున్న పరిమితుల దృష్ట్యా రెండవ మార్గం ఎంచుకొన్నాను. ఈ ప్రయాణంలో నన్ను నీడలా వెంబడించేది *మిసిమి*. సరళంగా, స్నేహభావంతో ఎన్నో విషయాలు తెలియజేస్తుంది. ఎందరో నిష్ణాతులైన రచయితల/రచయిత్రుల వ్యాసాలు చదవడం ద్వారా పొందే తృప్తి అనిర్వచనీయం. *మిసిమి* పఠనీయత ఒక నిరంతర ప్రవాహంలాగా సాగుతుంది. రచయితలు/రచయిత్రులు వాళ్ళ పెన్నులలో '*మిసిమి* సిరా' పోసి వ్రాస్తున్నారా అన్న భావన చాలాసార్లు కలిగింది. సంపాదకుల ప్రతిభకు అభినందనలు.

*మిసిమి* ముఖచిత్రాలు కీ.శే. కాంద్రేగుల నాగేశ్వరరావుగారి ముద్దు పలుకులతో (49వ పేజి) పాఠకులను ఆప్యాయంగా ముచ్చటించేవి. వారి లేమితో సుందర ముఖచిత్రాలు మూగబోయాయి. సంపాదకులు అశ్వినీకుమార్ గారు ఎన్నో చింతనాత్మక విషయాలు ఆసక్తికరంగా ప్రస్తావించేవారు (50వ పేజి). ప్రతి సంచికలోనూ సంపాదకీయం తప్పనిసరి చేయమని నా కోరిక. అప్పుడు *మిసిమి* శతపత్ర సుందరి. బహుశ కొన్ని కార్యనిర్వాహక కారణాల వలన కావచ్చు కొన్ని నెలలుగా *మిసిమి* ఎనుబది రేకుల కుసుమంగా తావిని వెదజల్లుతోంది. 'చక్కనమ్మ చిక్కినా అందమే' అన్న భావనతో అభిమాన పాఠకులు సమాధానపడక తప్పదు. *మిసిమి* ప్రమాణాలు, ఆశయాలు ఉన్నతం. *మిసిమి* ని నిరాటంకంగా వెలువరిస్తున్న సంపాదక వర్గానికి, *మిసిమి* సహకార పరివారానికి, ఆదర్శ ప్రచురణకర్తలకు సదాభివందనం.

మీ నిత్య *మిసిమి* పోస్టులో *మిసిమి* ముత్యాలను ఎంపిక చేయమని ఆదేశించారు. నాకు ఈ ప్రయత్నం *మిసిమి* మేధస్సుకు పౌష్టికాహారమే కాకుండా, పునరావలోకానికి అవకాశం కల్పించింది. ఎంపికను నేను అవలంబించిన పద్ధతి పరిమితులు క్లుప్తంగా వివరిస్తాను.

1. ఇప్పటికి *మిసిమి*తో నా సహవాసం వయస్సు అయిదు సంవత్సరాలు దాటింది. 2. సుమారు ప్రతీ సంవత్సరం 180 వ్యాసాలు (12 సంచికలు × 15 వ్యాసాలు) మీరు ప్రచురిస్తున్నారు. 3. నేను ఇంచుమించుగా సంచికకు వ్యాసవిషయం ఆధారంగా, రెండు వ్యాసాలు ఎంపిక చేసి మీ పరిశీలనకు పంపుతున్నాను. ఈ ప్రయత్నం మీరు ఆశించినట్లుగా ఉందా లేదా తెలియజేస్తే ముందుకు సాగుదామని నా ఉద్దేశ్యం. మీ దిశానిర్దేశానికి ఎదురు చూస్తున్నాను. 4. కొన్ని సంచికలు కాకినాడలో ఉండిపోయాయి. ఉన్న సంచికల నుంచి ఎంపిక చేస్తాను. ఇది నాకొక పరిమితి. 5. నా ఆశ: వడపోత తర్వాత సంచికకు ఒక వ్యాసం చొప్పున ఎంపిక జరిగితే లభించిన 60 వ్యాసాలలో 'ముత్యాలసరం' మీరు ఏర్చి కూర్చి రూపుదిద్దితే బావుంటుందని. '*మిసిమి* ముత్యాలసరం - 2015 - 19' శీర్షికతో మీరొక ప్రచురణ సంకల్పిస్తే అది *మిసిమి* అభిమానులకు వరప్రసాదం. దాచిపెట్టుకొనే 'హస్తభూషణం' అవుతుంది. ధన్యవాదాలు మీ సమాధానం కోసం ఎదురుచూస్తూ… శుభాకాంక్షలతో మీ *మిసిమి* అభిమాని…."

*- రాయవరపు సత్యనారాయణ, ముంబయి/కాకినాడ*


*(చూడండి పుట. 87..)*

# శాసనాలు - సానులు

– నాగోలు కృష్ణారెడ్డి

ఈనాడు మనం చెడు అర్థం చూస్తున్న 'సాని' అనే పదం ప్రాచీన కాలంలో ఎంతో పవిత్రమైంది, గౌరవప్రదమైంది. ఇది 'స్వామిని' అనే సంస్కృత పదం నుండి వచ్చింది. స్వామిని అంటే 'గౌరవనీయమైన స్త్రీ' అని అర్థం. దీనికి 'యజమానురాలు' అని, 'స్వామికి అంకితమైన స్త్రీ' అని, సంగీతంలో 'స' నుండి 'ని' వరకు విద్య నేర్చిన వారిని సానులన్నారని ఇటీవల పూషడపు సుబ్బారావుగారు (**మిసిమి**-సెప్టెంబర్ - 2018) రాశారు.

ప్రాచీన, మధ్య యుగాల్లో పట్టపు మహారాణికున్నంత విలువ, గౌరవం సానికి కూడా ఉండేది. కొంతమంది మహారాణుల పేర్లలో కూడా సాని పదం ఉండేది. సానుల జీవితాలు దేవాలయాలతో ముడిపడి ఉండేవి. వీరు దేవాలయాల్లో ఉండి స్వామి సేవలో తరించేవారు. దేవాలయంలో అంగభోగం, రంగభోగం అనే రెండు రకాల సేవలు జరుగుతాయి. అంగభోగం దేవాలయంలో దేవతా విగ్రహాలకు జరిగే పూజా, పునస్కారాలకు సంబంధించింది. వీటిని పూజారులు, ఇతర అధికారులు నిర్వహించేవారు. సానులు కూడా ఈ విధుల్లో పాలుపంచుకునేవారు. పవిత్ర జలంతో దేవతా విగ్రహాలకు స్నానం చేయించడం, దేవతలకు వింజామరలతో వీయటం, రథయాత్రల సందర్భాల్లో వెండి దీప స్తంభాలను పట్టుకోవడం, అలంకరణ పనులు చేయటం, మాలలు కట్టటం, రంగవల్లులు వేయటం మొదలైన సేవలను సానులు కూడా చేసేవారు.



దేవాలయ పరిపాలనలో కూడా సానులు తమ ప్రతిభను చూపినట్లు అనేక శాసనాలు పేర్కొంటున్నాయి. ఇక రంగభోగమంటే దేవాలయంలో దేవుని భక్తుల ప్రీతి కోసం జరిగే సంగీతం, నాట్యప్రదర్శనలకు సంబంధించింది. వీటిని సానులే నిర్వహించేవారు. వీరి సంగీతాన్ని, నాట్యాన్ని చూసిన భక్తులు దేవునిపై భక్తివిశ్వాసాలు పెంచుకునేవారు. అందుకే సానులంటే సమాజంలో అందరికీ గౌరవం ఉండేది. శాసనాల్లో సాని అనే పదానికి అనేక పర్యాయపదాలున్నాయి. అందులో కొన్ని- విలాసిని, నర్తకి, భోగం, నట్టువ, లండ, వారకాంత, గణిక, పాత్రమాణిక్యం మొదలైనవి. ఇప్పుడు దేవదాసి అనే పదాన్ని సానికి పర్యాయపదంగా వాడుతున్నాం. కానీ తెలుగు శాసనాల్లో ఎక్కడా ఈ పదం లేదు. ఇది ఎక్కువగా సాహిత్యంలోనే కనిపిస్తుంది. తమిళ శాసనాల్లో 'దేవర్ అడియర్' అనే పదం దేవదాసి అనే అర్థంలో ఉంది. సాహిత్యంలో ఇది మొదటిసారిగా కౌటిల్యుని అర్థశాస్త్రంలో కనిపిస్తుంది. ఈ దేవదాసీలు ఏడు రకాలని వైదేహి కృష్ణమూర్తిగారు రాశారు. వారు- 1. దత్త - తన ఇష్టప్రకారం తనంత తానుగా దేవాలయానికి సమర్పించుకొనేది. 2. వికృత - ఇతరులచే దేవాలయానికి విక్రయించబడేది. 3. భృత్య - తన కుటుంబం అభివృద్ధిని కోరి దేవాలయంలో చేరేది. 4. భక్త - దేవునిపై తనకున్న భక్తి కారణంగా దేవాలయంలో చేరేది. 5. హృత - ఇతరులు మభ్యపెట్టటం వలన దేవాలయంలో

చేరేది. 6. అలంకార - తన వృత్తిలో అత్యంత శిక్షణ ఇచ్చి, సర్వాలంకార భూషితను చేసి, దేవాలయ దివ్యసౌందర్యాన్ని ఇనుమడింపజేయడానికి రాజులు, ఇతర ఉన్నత వర్గాల వారిచే దేవాలయానికి సమర్పించబడేది. 7. పద్రగణిక లేక గోపిక - సంగీత, నాట్యాలలో తనకున్న ప్రావీణ్యాన్ని ప్రదర్శించి అందుకు ప్రతిఫలంగా దేవాలయం నుండి జీతం తీసుకునేది.

ఈ ఏడుగురిలో కొందరి ప్రసక్తి మాత్రమే శాసనాల్లో కనిపిస్తుంది. వీరందరూ దేవనర్తకులే. తల్లిదండ్రులు సర్వశుభలక్షణాలు కలిగిన తమ పిల్లలకు నృత్య, గానాది కళలను నేర్పి, భుజాల మీద శంఖ, చక్ర ముద్రలు వేసి, ఐచ్ఛికంగా వైష్ణవాలయాలకు, త్రిశూల, పుష్పముద్రలు వేసి రుద్రగణికలుగా శివాలయాలకు అర్పించేవారని పూషడపు సుబ్బారావుగారు భావించారు (*మిసిమి* - సెప్టెంబర్ - 2018). ఇలా సమర్పించడం పవిత్ర కార్యంగా, గౌరవంగా భావించేవారు. బాగా అలంకరించుకుని ఆందోళిక మీదో, పల్లకీ మీదో గుడికి వెళ్ళే సానులను చూసి ప్రజలు దేవతలతో సమానంగా చూసేవారని పూషడపు సుబ్బారావు గారు చెప్పిన మాటలు అక్షర సత్యాలు. కొన్ని సందర్భాలలో పాలకులు, ధనవంతులు సానులకు పల్లకీలు కూడా బహూకరించిన వివరాలు కూడా కొన్ని శాసనాల్లో ఉన్నాయి. అజంతా, ఎల్లోరా, ఖజరహోల్లాంటి చోట్ల కనిపించే అందమైన శిల్పాలను చూస్తే ఆనాటి సానులు గుర్తుకొచ్చేవారు.

సానులంటూ ప్రత్యేక వర్గమేమీ లేదు. సమాజంలోని అన్ని వర్గాలకు చెందిన స్త్రీలు సానులుగా ఉండేవారు. ఉన్నత కులాలకు చెందినవారు, పెద్దపెద్ద హోదాల్లో ఉన్నవారు కూడా సానులుగా ఉండడానికి ఇష్టపడేవారు. అటువంటి అవకాశం రావడం తమ అదృష్టంగా భావించేవారు. దేవునిపై ఉండే అపారమైన భక్తి, సంగీత, నాట్యాల్లో తమకున్న ప్రావీణ్యం అందుకు ప్రధాన కారణం. ఇతర సానులతో పాటు ఒక శెట్టి కూతురు కూడా ఉన్నట్లు క్రీ.శ. 13వ శతాబ్ది నాటి మాల్కాపురం శాసనంలో ఉంది. క్రీ.శ. 1404 నాటి సింహాచలం శాసనం ఒక రెడ్డి కూతురు, ఒక శెట్టి కూతురు సానులుగా ఉన్నట్లు తెలుపుతున్నది. వివాహాలై, తమ పిల్లలు ఉద్యోగాల్లో ఉన్నా, కుటుంబ జీవనాన్ని కొనసాగిస్తూ, సానులుగా ఉండడానికి కొందరు స్త్రీలు ఇష్టపడేవారని కొన్ని శాసనాలు పేర్కొంటున్నాయి.

సాధారణంగా ఉన్నతమైందే దేవునికి సమర్పిస్తారు. దేవాలయానికి సమర్పించే స్త్రీలు అందంగా, సొగసుగా, అపార ప్రతిభాపాటవాలు కలవారు కాబట్టే దేవునికి సమర్పించేవారు. చాలా చిన్న వయసులోనే దేవాలయాల్లో సానులుగా చేరేవారు. కాకతీయ గణపతి దేవుని గజసాహిణి జాయపసేనాని చేబ్రోలు శాసనం, ఎనిమిది సంవత్సరాల చిన్న వయసులోనే దేవాలయాల్లో సానులుగా చేరే విషయాలను పేర్కొంటున్నది. వారి వసతి కోసం దేవాలయంలోనే రెండు మూడంతస్తుల భవనాల్ని నిర్మించినట్లు కూడా ఈ శాసనంలోనే ఉంది. అప్పటి నుండి వారు జీవితాంతం దేవుని సేవలోనే గడిపేవారు. వారికి సంగీత, నాట్యాల్లో శిక్షణ ఇప్పించేవారు. తెలుగు, సంస్కృత భాషల్లో ప్రావీణ్యం కల్పించేవారు. వారికి శిక్షణ ఇచ్చేందుకు నిష్ణాతులను నియమించేవారు. సానులతో పాటు సంగీత వాద్యకారులు, నాట్యం నేర్పించేవారు మొదలైనవారి వివరాలు కూడా కొన్ని శాసనాల్లో ఉన్నాయి. వీటన్నిటి నిర్వహణ కోసం అనేకమంది చేసిన దానాల వివరాలు ఎన్నో శాసనాల్లో ఉన్నాయి. సానులు చేసిన దానాలు కూడా ఎన్నో ఉన్నాయి.

ముఖ్యంగా కోస్తాంధ్రలో లభించిన శాసనాల్లో సాని మున్నూర్వురు లేదా సాని - 300 ప్రసక్తి ఉంది. ఈ 300 సంఖ్య అర్థం ఖచ్చితంగా ఇది అని నిర్ధారణ కాలేదు. ఇది సానులు వచ్చిన కుటుంబాల సంఖ్యను సూచిస్తున్నదని కొందరు పండితులు భావించారు. కొందరు సానుల సంఘంగా పేర్కొన్నారు. దక్షిణ భారత దేశంలోని అనేక దేవాలయాల్లో వందల సంఖ్యలో సానులుండేవారు. కొన్ని శాసనాల్లో సానులు - మానులనే జంట పదాలు కనిపిస్తాయి. ఈ మానులనే పదం సంస్కృత తద్భవమైన మాన్యులు నుండి వచ్చింది. మాన్యులంటే గౌరవనీయులని అర్థం. దేవాలయంలో

అన్ని విషయాల్లో సహాయసహకారాలు అందించే బృందమే మానులని పూషడపు సుబ్బారావుగారు అభిప్రాయపడ్డారు. మానులు అంగరంగ భోగానికి సంబంధించిన సేవలు, పరిపాలనా వ్యవహారాలు చూసేవారని భావించవచ్చు.

కోస్తాంధ్రలోని శాసనాల్లో ముఖ్యంగా సింహాచలంలాంటి దేవాలయాల్లోని శాసనాల్లో సానులతో పాటు సంప్రదాయపు సానులనే వారు కూడా కనిపిస్తారు. సంప్రదాయపు సానులెవరనే విషయంలో పండితుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. వీరు దేవాలయంలో వంశపారంపర్యంగా సేవ చేసే శాశ్వత సానులని వైదేహీ కృష్ణమూర్తి భావించారు. దేవాలయంలో ఉండే అవివాహిత సానులని సి.వి. రామచంద్రరావు గారు అభిప్రాయపడ్డారు. వివాహం చేసుకుని, స్వతంత్ర్యంగా జీవిస్తూ, పాక్షిక పద్ధతిలో దేవాలయంలో ఉండేవారని ఆయన భావించారు. అయితే శాసనాల్లో 'సంప్రదాయపువారు' అంటే కేవలం సానులనేగాక నాట్యకత్తెలు, సంగీత ప్రవీణులు అనే అర్థంలో కూడా పేర్కొన్నారు. వీరినే 'సంప్రదాయము', 'సంప్రదాయము వారు', 'సంప్రదాయపు సానులు' అని కూడా పిలిచారు. ముఖ్యంగా వీరిని పాలకులు, స్థానిక ప్రభువులు, రాజోద్యోగులు, ధనవంతులు వివిధ సేవల కోసం దేవాలయంలో నియమించేవారని శాసనాలు తెలుపుతున్నాయి. క్రీ.శ. 1250 నాటి శ్రీకూర్మంలో లభించిన ఒక శాసనం ఈ విషయాలను రూఢి పరుస్తున్నది. సింహాచలంలో లభించిన మరొక శాసనంలో నరసింహ దేవునికి ఉదయం, సాయంకాలం ధూప దీప నైవేద్యాల కోసం రెండు గ్రూపులు, ఒక్కో గ్రూపులో ఒక ముఖారి, ఇద్దరు లం..లు, మంగళ గీతాలు పాడటానికి సాని సాంప్రదాయానికి చెందినవారు (ఒకరు ఉదయం, మరొకరు సాయంత్రం) ఉండేవారని పేర్కొన్నారు.

సానులు, సంప్రదాయ సానులు కాకుండా మరో రెండు రకాల సానులు శాసనాల ద్వారా తెలుస్తున్నారు. వారు తిరువీథి సానులు, బేడి సానులు. క్రీ.శ. 1486 నాటి తిరుమలలో లభించిన ఒక శాసనంలో తిరువీథి సాని ప్రసక్తి ఉంది. వాలంది అనే ఒక తిరువీథి సాని తిరుమల వేంకటేశ్వరునికి ప్రసాద నైవేద్యం కోసం 300 నర్పణాలు (బంగారు నాణాలు) దానంగా ఇచ్చింది. తిరువీథి సానులకు దేవాలయం జీతాలు చెల్లిస్తున్నట్లుగా కొన్ని శాసనాలు పేర్కొంటున్నాయి. తిరుమలలాంటి దేవాలయాల్లో ఎక్కువమంది సానులుండేవారు. అక్కడ లభించిన శాసనాలను అధ్యయనం చేస్తే దేవాలయ అభివృద్ధిలో స్వామి సేవలో వారు నిర్వహించిన పాత్ర ఎటువంటిదో తెలుస్తుంది. చాలామంది సానులు మండపాలు, ఉద్యానవనాలు నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తున్నది. అచ్యుతదేవరాయలు శ్రీ వేంకటేశ్వరుని సేవల కోసం చాలామంది సానులను విజయనగరం నుండి తిరుమలకు పంపించారు. వారు తిరుమల తిరుపతి దేవాలయాలకు ఎన్నో దానాలు చేశారు. ఈ సానుల్లో కొందరు తిరుపతిలో నివాసిస్తూ కొన్ని ప్రత్యేక సందర్భాల్లో తిరుమలలో స్వామి సన్నిధిలో నాట్యం చేసేవారు. కొందరు గానంతో అలరించేవారు. వీరికి దేవాలయ అధికారులు ప్రతి రోజూ ప్రసాదాన్ని ఇంటికి పంపే ఏర్పాటు చేసేవారు. తిరుమలలో వేంకటేశ్వరుని సేవలో తరించిన సానులందరిలో ప్రసిద్ధి చెందినవారు లింగసాని, తిరువెంటక మాణిక్కం సోదరీమణులు. వీరు తిప్పసాని లేదా తిరువేంటకరాసి కూతుర్లు. వీరిని శాసనాల్లో ఎంబెరుమాన్ అడియల్ (Dancing girl) అని పేర్కొనటం జరిగింది. అన్ని శాసనాల్లో వీరు కలిసే దానాలు చేసినట్లున్నది. ఇది వీరి మధ్య ఉండే అనుబంధాన్ని సూచిస్తున్నది. వీరు అచ్యుత దేవరాయులు, సదాశివరాయుల కాలంలో 15 సంవత్సరాలు స్వామి సేవలో తరించారు. వీరు 12 సంవత్సరాల్లో మొత్తం 4,710 బంగారు నాణాలను వివిధ సేవల నిమిత్తం సమర్పించారు. స్థానిక పాలకులైన పొట్లపాడి తిమ్మరాజు, దేవాలయ స్థానత్తార్ తిరువెంకట మాణిక్కంకు ఒక దండిక (పల్లకీ)ని బహుమానంగా ఇచ్చి గౌరవించి సన్మానించారు. వంశపారంపర్యంగా ఒక పూర్తి ప్రసాద భాగాన్ని తిరుపతిలో ఆమె ఇంటికి పంపించే ఏర్పాటు చేశారు. మరో పూర్తి ప్రసాద భాగాన్ని తాను

నిర్మించిన అలర్మేలు మంగ నాచియార్ ఉద్యానవనాన్ని చూసే సంరక్షకులకు ఇచ్చే ఏర్పాటు చేశారు. ఆంధ్ర దేశ శాసనాల్లో దేవాలయ అధికారులు సానులను ఇలా గౌరవించిన ఆధారాలు మరెక్కడా లేవు. ఇలా సానులు చాలామంది ధనవంతులై తిరుమల తిరుపతి దేవాలయాలలో వివిధ సేవల నిమిత్తమై శ్రీ భండారంలో సమర్పించినట్లు అనేక శాసనాలు పేర్కొంటున్నాయి. వీటినిబట్టి దేవాలయ ఆర్థికాభివృద్ధిలో వీరు ప్రధాన పాత్ర వహించినట్లు తెలుస్తున్నది.

శాసనాల ద్వారా తెలుస్తున్న ఇంకో రకానికి చెందిన సానులు బేడిసానులు. అయితే దీని అర్థం తెలియదు. కొన్ని శాసనాల్లో మొదలిసాని ప్రసక్తి ఉంది. 'మొదలి' అంటే 'మొదటి' అని అర్థం. అంటే సానులందరిలో మొదటి సాని లేదా సానులందరికీ పెద్ద సాని అని అర్థం చెప్పుకోవచ్చు. ఈమె సాని సంఘానికి నాయకురాలు కావచ్చు. ఆంధ్ర దేశంలో లభించిన అనేక శాసనాలు భోగ స్త్రీలు లేదా వేశ్యలను పేర్కొంటున్నాయి. కొన్ని శాసనాలు వీరిని 'అనుంగు' అని పేర్కొన్నాయి. 'అనుంగు' అంటే తెలుగులో 'ప్రియమైన' అని అర్థం. దీనికి భోగమహిషికి పోలిక ఉంది. వీరు దేవాలయ సానులకంటే భిన్నమైనవారు. వీరు పాలకులకు, రాజోద్యోగులకు, ధనవంతులకు భోగ స్త్రీలు లేక వేశ్యలుగా ఉండేవారు. వీరికి కూడా సమాజంలో గౌరవ మర్యాదలుండేవి. ఉన్నత స్థితిలో ఉండే చాలామంది తాము ఫలానా భోగ స్త్రీ కొడుకులమని గర్వంగా చెప్పుకునేవారు. చిత్రలేఖనం మొదలైన లలిత కళల్లో ప్రావీణ్యం కలవారని శాసనాలు తెలుపుతున్నాయి. వీరు సమాజంలో కనిపించే సాధారణ వేశ్యలు కాదు. చెడు నడవడిగలవారు కాదు. రాజులకు, సామంతులకు, ఉన్నతోద్యోగులకు వాస్తవ (De Facto) భార్యలుగా చలామణి అయ్యేవారు. చాలామందికి ఒకరికంటే ఎక్కువమంది భోగస్త్రీలు ఉండేవారు. ఎంతమంది భోగస్త్రీలుంటే అది అతని అంతస్థుకు చిహ్నంగా భావించేవారు. ముఖ్యంగా సాహిత్యంలో వీరి గురించిన సమాచారం ఎక్కువ లభిస్తుంది. వీరికి భిన్నమైన వారిని కులపత్నులని శాసనాలు పేర్కొంటున్నాయి. క్రీ.శ. 16వ శతాబ్ది తరువాత శాసనాల్లో సానుల ప్రసక్తి అంతగా కనిపించదు. వీరు కాకుంగా వృత్తిరీత్యా వేశ్యలైనవారు సమాజంలో చాలామంది ఉండేవారు. వీరిపైన వృత్తిపన్ను వసూలు చేసినట్లు మధ్యయుగం నాటి కొన్ని శాసనాల ద్వారా తెలుస్తున్నది. సాహిత్యంలో వీరి గురించిన వివరాలు ఎక్కువగా ఉన్నాయి. వీరు అనేక ఆభరణాలతో చక్కగా అలంకరించుకునేవారు. విటులను ఆకర్షించడానికి తమ ఇళ్ళలో గోపికా కృష్ణులు, అహల్యా సంక్రందనులు, తారాచంద్రులు, మేనకా విశ్వామిత్రులు మొదలైన చిత్తరువులను అలంకరించేవారు. వీరిలో కొంతమంది వేశ్యలు వ్యక్తిత్వం లేనివారుగా, మోసగాండ్రుగా, క్రూరమైనవారుగా, డబ్బు కోసం విటులను కూడా చంపేవారుగా, విటులను డబ్బు కోసం జలగలుగా పీల్చేవారుగా, నీతినియమాలు లేనివారుగా, అవిధేయులుగా, అపాయకారులుగా చెప్పటం జరిగింది. వీరు ప్రత్యేక కాలనీల్లో నివసించేవారు.

రానురాను దేవదాసీ వ్యవస్థలో తీవ్ర భ్రష్టత ప్రారంభమైంది. దానికి కారణం స్త్రీని కామవస్తువుగా చూసిన పురుషపుంగవులే. దేవదాసీ వ్యవస్థ నిషేధానికి గురైనా బసివి, జోగినిల వ్యవస్థ అక్కడక్కడా ఉండేది. ప్రభుత్వాలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఈ వ్యవస్థ నిర్మూలన కోసం కృషి చేశాయి. స్త్రీలను బసివినిలుగా, జోగినిలుగా చేసి తమ వాంఛలు తీర్చుకున్న పురుషుల వలన మొత్తం వ్యవస్థ భ్రష్టుపట్టిపోయింది. ఆధునిక యుగంలో బెంగుళూరు నాగరత్నమ్మ, ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మి, వీణ ధనమ్మాళ్, పెండేల సత్యభామ, కాళహస్తి రాజమ్మలాంటి ఎంతోమంది దేవదాసీ కళాతపస్వినులు సామాజిక, సాంస్కృతిక రంగాల్లో కూడా ఎంతో సేవ చేసి తమ కళాహృదయాన్ని ఆవిష్కరించుకున్న విషయం మనందరికీ తెలిసిందే. అటువంటి కళామతల్లులందరికీ వేలవేల వందనాలు.

నాగోలు కృష్ణారెడ్డి
తిరుపతి. ఫోన్: 944 111 2636.

# తెలుగున నిఘంటు నిర్మాణము

*– పూషడపు సుబ్బారావు*

ఈ చరాచర సృష్టిలో మానవుణ్ణి అతని వాక్‌శక్తే మహితాత్ముణ్ణి చేసింది. కాలం కలసి వచ్చి భూమి మీద మనుష్య సంతతి ఇబ్బడి ముబ్బడిగా పెరగడానికి అనుకూల వాతావరణం ఏర్పడడంతో జనాభా దశ దిశలా వ్యాపించింది. విభిన్న భాషలతో పాటు నాగరికతలు తలెత్తాయి. పరస్పరం వైషమ్యాలు అంకురించాయి. ఈర్ష్యా దావానల కీలలలో చాలా తెగలు దగ్ధం కాగా, తమతోపాటు విశ్వశ్రేయస్సును కాంక్షించిన కొన్ని గణాలు మిగిలాయి. అలా మిగిలిన వాటిలో కొన్నింటికి భరత ఖండం శాశ్వత ఆశ్రయమిచ్చింది. ఎవరి భాష వారికున్నా, అపార శబ్ద కోశంతో విలక్షణంగా ఉన్న సంస్కృతం అందరినీ ఆకర్షించింది. దేవభాషగా ప్రచారమవ్వడం వలన కలిగిన అదనపు బలంతో నీటి మీద నూనె బిందువులాగా భిన్న భాషా కుటుంబాల సమాహారమైన ఈ దేశంలో త్వరగా విస్తరించింది. "భాషా విహంగానికి వ్యవహర్తలు కళ్ళు, కాళ్ళు అయితే మతం, రాజ్యాధికారం రెక్కలులాంటివి". భారతదేశంలో రాజఛత్రాల ఛాయల్లో తిరుగుతూ, సంస్కృతంతో సమానమైన హంగు, ఆర్భాటంగల భాషలున్నప్పటికీ ధార్మిక, మత కారణాల దృష్ట్యా సంస్కృతాన్ని సవాలు చేయలేకపోయాయి. కొన్నాళ్ళు పాళి, ప్రాకృతాలు సంస్కృతం బాటలోనే నడిచాయి (పాళీని భాషగా కాక ఒక లిపిగా గుర్తించేవారు కూడా ఉన్నారు.) కానీ గీర్వాణం రాజ రథమెక్కడంతో పోటీపడలేకపోయాయి. ఈ దేశంలో ఒక్కొక్క ప్రాదేశిక భూభాగంలో నివసించే జనం ఒక్కో భాషకు జన్మనిచ్చారు. విచిత్రమేమిటంటే సంస్కృతానికి మాతృస్థానంగా చెప్పబడే ఒక ప్రాంతం/రాజ్యం ఈ దేశంలోనే కాదు, ప్రపంచంలోనూ ఎక్కడా లేదు - అంటే సంస్కృతమే మాతృభాషగా మాట్లాడే అతి పెద్ద సమూహం ఒక్క చోట ఎప్పుడూ నివసించలేదు. ఒకటో రెండో సంస్కృతం మాట్లాడే గ్రామాలు అప్పుడూ ఉన్నాయి, ఇప్పుడూ ఉన్నాయి. ఇది ఎప్పుడూ రాజభాషగానే ఉండేది. అందుకే దీనిని దేవభాష అన్నారేమోననిపిస్తుంది. అనుసంధాన భాషగా కూడా దేశమంతా ఇది ఉపయోగపడింది. సంస్కృతానికి వ్యాపకధర్మమే ఆత్మ. అది అజరామరమైన త్రిపథగా ప్రవాహంలాంటిది. భాషా శాస్త్రవేత్తల వక్కాణింపుల ప్రకారం సంస్కృతం ఇండో- యూరోపియన్, ఇండో-ఆర్యన్ భాషా కుటుంబాలతో పాటు ద్రావిడ భాషా కుటుంబం పైనా విపరీతమైన ప్రభావం చూపింది. ద్రవిడ, ద్రమిళ ఈ శబ్దాలన్నీ తమిళానికే వర్తిస్తాయి కాని దక్షిణాది భాషలన్నింటికీ కాదు. తెలుగును పాశ్చాత్యులు తప్ప అంతకు ముందు ఎవరూ ఎక్కడా ద్రవిడమని పిలువలేదు. "జనగణమన"లో రవీంద్ర గురుదేవులు ఉపయోగించిన ద్రావిడ పదం కూడా ఒక్క తమిళనాడుకే వర్తిస్తుంది. నేడు చాలామందిని తృప్తిపరచడానికి దక్షిణాదికి పర్యాయపదంగా చెబుతున్నారు. తమిళకం అనే పేరుతో ప్రాచీనకాలంలో తమిళనాడు, కేరళ దక్షిణ భాగాలను కలిపి పిలిచేవారు. ఆదిశంకరులు తాను ద్రవిడ శిశువునని ప్రకటించుకున్నది అందుకే. దేశం నాలుగు చెరగులా ఉన్న భూభాగాలను రవీంద్రులు అలా ఉటంకించారు తప్ప దేశంలోని ప్రతి రాష్ట్రాన్ని అందులో చేర్చలేదు. అలాగైతే కాశ్మీర, కామరూప, భోజ, మగధ, కర్నాటకాంధ్ర, చేరాదులు

కూడా చేరిఉండేవి. ముఖ్యంగా నేటి ఇండో-ఆర్యన్, ద్రావిడ భాషలలో సంస్కృతంలో నుండి వచ్చి చేరిన తత్సమ, తద్భవాలను తొలగించి రాయలేని, మాట్లాడలేని స్థితి దాపురించింది. ఉచ్చారణ, లేఖనాలలో నిర్దిష్టమైన వైఖరిని ప్రదర్శించడం వలన సంస్కృతంలో చేరిన ఆదానాలు దాని మౌలిక స్వరూపాన్ని మార్చలేకపోయాయి.

మానవేతిహాసంలో నేటికి లభిస్తున్న ఆదిమ సాహిత్య విశేషాలైన వేద వాఙ్మయావశేషాలు కూడా రాను రాను పండితులకు కూడా మింగుడు పడకపోవడంతో అందులోని పదాలకు అర్థాలు, వ్యుత్పత్తి అర్థాలు చెప్పవలసిన పరిస్థితి ఏర్పడింది. శిక్ష, వ్యాకరణం, నిరుక్తం, ఛందస్సులను వేదాంగాలుగా అభ్యసించడం మొదలైంది. యాస్కాచార్యుడు "నిరుక్తం" పేరుతో సంస్కృతానికి తొలి నిఘంటువు తయారు చేశాడు. ఇదే ప్రస్తుతానికి లభిస్తున్న ప్రపంచంలోని ప్రాచీన నిఘంటువు. సంస్కృత పదాల సాధు, అసాధుత్వాలను కనుగొనడానికి పాణిని "అష్టాధ్యాయి" వ్రాశాడు. ఈ పాణినీయ సూత్రాలకు కాత్యాయనుడు "వార్తికలు" వ్రాశాడు. ఈ సూత్ర, వార్తికలకు సమగ్రమైన, విస్తృతమైన వ్యాఖ్యానాన్ని "మహాభాష్యం" పేరుతో పతంజలి వ్రాశారు. వీటి ఆధారంగా వేదపాఠం క్రమం తప్పకుండా చెప్పడానికి "ప్రాతిశాఖ్య గ్రంధాలు" రచింపబడ్డాయి. మన దేశంలో సంస్కృతంతో సంపర్కమున్న బలమైన భాషలన్నీ కూడా కాస్త అటూ, ఇటూగా పై గ్రంధాలననుసరించి నిఘంటు, వ్యాకరణాలను తయారు చేసుకున్నాయి. అందునా అమరకోశమును బాగా అనుకరించాయి. ఇదంతా పూర్వరంగము.

**తెలుగులో నిఘంటువులు:** శబ్దాన్ని సరిగ్గా పలుకకపోతే ఉచ్చారణదోషమేర్పడి క్రమంగా భావ, భాషా దోషంగా పరిణమించి చివరికి భ్రష్ట రూపాన్ని పొందుతుంది. శబ్దం యొక్క వ్యుత్పత్తి, పూర్వ రూపాలను తెలుసుకున్న జనులు తమ తప్పులను సరిదిద్దుకోగలరు. అలాగే తమ భాషలో/పరభాషలో పద, ప్రయోగ జ్ఞానాలను పొందగలుగుతారు. అందుకు నిఘంటువులు ఉపకరిస్తాయి. మెల్లగా నిఘంటువు భాషను శాసించే స్థాయికి ఎదిగింది. "ప్రయోగ శరణం వ్యాకరణమ్" అని అంటూనే వైయాకరుణులు భాషను ఒక చట్రంలో ఉంచేశారు. మహాపండితులైనా ఆ వలయంలోనే తమ విన్యాసాలు ప్రదర్శించవలసి వచ్చింది. అక్కడక్కడా కొందరు సాహసించి పిల్లిమొగ్గలు వేసినా వాటన్నింటికీ సాహిత్య గౌరవం దక్కలేదు. మహాకవులు కొందరు పద్యరచనలో అనివార్యమై వాడిన పదాలను "ఆర్య వ్యవహారంబు దృష్టంబు గ్రాహ్యంబని" ముక్తాయించారు. అమరం చదివిన పండితులు తయారు చేసిన నిఘంటువులు వచ్చాక భాషలో తత్సమాలు "అగ్ర వర్ణాలుగా" దేశ్యాలు, గ్రామ్యాలు "నిమ్న వర్ణాలు"గా మారిపోయాయి. అయితే భాషలలో ఉచ్చనీచముల ముచ్చట భరతుడు నాట్యశాస్త్రం వ్రాసేనాటికే స్థిరపడింది. ఇదంతా అన్ని భాషలకూ అమ్మ సంస్కృతమని నమ్మడం వలన జరిగినదేగానీ మరొకటి కాదు.

నిఘంటువు - వ్యాకరణము, గోవు - వత్సములాంటివి. నిఘంటు నిర్మాణంలో పాశ్చాత్యుల విధానం వేరు, భారతీయుల త్రోవ వేరు. పండిత ప్రకాండులకు కొరుకుడు పడని పదాల వివరణలను మనవాళ్ళు శ్లోకాలు, పద్యాల్లోనూ చెప్పారు. తెలుగున తొలిగా వేములవాడ భీమకవి ఒక ఛందో గ్రంథం వ్రాశాడని పండితులంతా నమ్ముతున్నారు. అంటే నేటికి వెయ్యేండ్లకు పూర్వమే నిఘంటువులుండి ఉండాలి. ఆ తరువాత నన్నయ్య భట్టు పేరుతో సంస్కృత ఆర్యావృత్తాలలో వ్రాయబడిన "ప్రక్రియా కౌముది" అనే వ్యాకరణ గ్రంథం "ఆంధ్ర శబ్ద చింతామణి"గా ప్రసిద్ధం చేయబడింది. దీనికే ఆ పై బాలసరస్వతి, వాసుదేవుడు, అప్పకవి ఆయా కాలాలలో మార్పులు చేర్పులూ చేసుకుంటూ వచ్చారు. దీనికి కొనసాగింపుగా "కవిశిరోభూషణమనే" పేరుతో అహోబల పండితుడు, తన పేరుతో నరసింహ పండితుడు, ఆంధ్రశబ్ద చింతామణి కర్త మిగిల్చిన బలపంతోనే తమ పలకల మీద అక్షరాలు దిద్దుకున్నారు. మధ్యలో ఆంధ్ర భాషా

భూషణం, కవి జనాశ్రయం వచ్చాయి. మార్గఛందోరీతిలో కవిత్వం వ్రాసిన కవి శ్రేష్ఠులకు, దేశీ విప్లవ ధ్వజారోహణం చేసిన పండితులకు తమకంటూ ప్రత్యేక నిఘంటువులను, వ్యాకరణాలను నిర్మించుకునే స్వేచ్ఛ ఉండేది. ప్రబంధ యుగం ముగిశాక పైడిపాటి లక్ష్మణ కవి ''ఆంధ్రనామ సంగ్రహం'' పేరుతో ఒక నిఘంటువును తయారు చేసి కాశీ విశ్వనాథునికి అంకితం చేశాడు. ''ఈ ఆంధ్రనామ సంగ్రహమందు జెప్పని కొన్ని తెనుగు మఱుగులన్నీ కూర్చి ఆంధ్ర నామ శేషమను పేర జెప్పెద''నని అడిదము సూరకవి 17వ శ॥ చివరి దశకాలలో మంచి కూర్పు చేశారు. ఆ కాలంలోనే నుదురుపాటి వెంకన్న ఆంధ్ర భాషార్ణవాన్ని, సంస్కృతంలో ఉన్న పద్మనాయక చరిత్రను తెలుగు చేసిన కస్తూరి రంగ కవి ''సాంబ నిఘంటువు''ను అచ్చ తెలుగులో సీస పద్యాలలో వ్రాశారు. 1650లో కవి చౌడప్ప సీస పద్య నిఘంటువును కూర్చారు. ఆ పై గణపవరపు వెంకట కవి 1684లో అచ్చ తెలుగు పద్యరూపంలో ''శ్రీవేంకటేశాంధ్ర నిఘంటువు''ను ప్రకటించారు. ఇది మధ్యరంగము.

**విదేశీయుల కృషి - స్వదేశీయుల కొనసాగింపు:** జర్మనీలో జాన్‌గూటెన్‌బర్గ్ 1450లో, విలియం కాక్స్‌టన్ 1456లో ముద్రణాయంత్రాలపై అచ్చుపుస్తకాలను తయారు చేసే వరకు చెక్కతో తయారు చేసిన అచ్చులతో ముద్రణ చేసేవారు (ఉత్తర హాలెండుకు చెందిన కోస్టర్ లారెన్స్ జాన్సన్ తొలిగా ఇలాంటి పుస్తకం వేసిన ఐరోపా వ్యక్తి). 11వ శ॥లోనే కాగితంపై చైనా వారు అచ్చులు వేసేవారు. 1556 A.D. నాటికి భారత పశ్చిమ తీరానికి ముఖ్యంగా గోవాకు ఐరోపా వారి చేత అచ్చు యంత్రాలు దిగుమతి అయ్యాయి. సెయింట్ జేవియర్ పోర్చుగీసు భాషలో వ్రాసిన "డౌక్టినా క్రిస్టా" అనే పుస్తకాన్ని 1578లో గోవాలో మలయాళం, తమిళంలోనికి అనువదించారు. బ్రిటన్, డెన్మార్క్, పోలండ్, హాలెండ్ దేశాల వారు విరివిగా మత ప్రచారం నిమిత్తమై భారతదేశానికి ఫాదరీలుగా వచ్చారు. వీరికి గోవా, నాగపట్నం, మద్రాసు, మదురై, గుంటూరు, బళ్ళారి, రాజోలు, చంద్రగిరి, విజయనగరం, విశాఖపట్నం, నర్సాపురం, అంబాలా, కలకత్తాలలో ముద్రణాశాలలుండేవి. ఫాదరీలు కృతనిశ్చయంతో పనిచేసి స్థానిక భాషలను నేర్చుకొని క్రైస్తవ సాహిత్యాన్ని వాటిల్లోకి తర్జుమా చేశారు. "షూల్జ్" ఇందులో భాగంగానే 1746, 1747 A.D.లలో జర్మనీలో "మోక్షానికి కొంచ్చుపోయే దోవ" మొదలైన 4 తెలుగు క్రైస్తవ పుస్తకాలను అచ్చొత్తించారు. తొలితరం తమిళ, మలయాళ గ్రంథాలు గోవాలో ముద్రించబడ్డాయి. తమిళ-పోర్చుగీసు నిఘంటువు కూడా పాలనా వ్యవహారాల కోసం అవసరమై వారు 1679లో అంబాలాకోట్‌లోని జెసూట్ ప్రెస్‌లో ముద్రించారు. దీనిని 1647లో అంటావోడీ ప్రొయిన్కా మదురైలో కూర్చారు. మార్కోస్ జోర్జి వ్రాసిన కన్నడ వ్యాకరణాన్ని 1640 A.D.లో తూ॥గో॥ జిల్లా రాజోలులోని "సెయింట్ ఇగ్నాచియస్ కాలేజ్ ప్రెస్''లో ముద్రించారు. గుంటూరు జెసూట్ ప్రెస్‌లో తెలుగు-ఫ్రెంచి నిఘంటువును 18వ శ॥పు పూర్వార్థంలో అచ్చువేశారు. 1713 నాటికి మద్రాసులో తొలి తమిళ నిఘంటువును పోర్చుగీసువారు రూపొందించారు. 1818 నుండి 1900 A.D.ల మధ్య మొత్తం 20 ఇంగ్లీషు-తెలుగు నిఘంటువులు పుట్టాయి. అందులో 1841లో A Vocabulary in English and Teloogoo వ్రాసిన శ్రీ సి. రామకృష్ణశాస్త్రులు, 1889లో Vocabulary in English and Telugu వ్రాసిన శ్రీ వీరాస్వామి మొదలియార్, 1900 నాటికి లఘుశబ్దార్థ సంగ్రహం పూర్తి చేసిన శ్రీపరవస్తు రంగాచార్యులు, 1900లలోనే Telugu - English Dictionary రూపొందించిన శ్రీ పి. శంకరనారాయణగార్లే భారతీయులు కాగా మిగిలిన వారంతా ఐరోపావారే. వీరు దేశమంతా విస్తరించి మద్రాసు, మచిలీపట్నం కేంద్రాలుగా తెలుగు నేల పై స్థిరపడ్డాక, పాశ్చాత్య తత్వశాస్త్రములు, నిఘంటువులు, సాహిత్య ప్రక్రియలతో ఇక్కడి వారికి పరిచయం ఏర్పడింది. క్రొత్తగా కళాశాలలు, పుస్తక ముద్రణలు ప్రారంభం కావడంతో సంప్రదాయ విద్యా వ్యవస్థ స్వరూపమే మారిపోయింది. ఈ సంధి కాలంలో క్రొత్త ఒరవడిలో తెలుగు నిఘంటు నిర్మాణం

ప్రారంభమైంది. ఆంగ్ల శకం 1806లో మచిలీపట్నం నివాసి మామిడి వెంకయ్యగారు అకారాది క్రమంలో తొలి తెలుగు నిఘంటువును వ్రాశారు. తూర్పు ఇండియా కంపెనీ తమ ఉద్యోగుల పై స్థానిక భాషలలో పట్టు సంపాదించాలన్న నిబంధన గట్టిగా అమలు చేస్తున్న రోజులవి. ఆ కారణం చేత వెంకయ్య గారు వ్రాసిన చేతి వ్రాత ప్రతులను కంపెనీ దొరలు కొనుగోలు చేశారు. కంపెనీ ఉద్యోగుల కోసం మద్రాసు సెయింట్ జార్జి కోటలో 1812 నుండి నిర్వహిస్తున్న కళాశాలలో ఆచార్యులైన వేదం పట్టాభిరామ శాస్త్రి గారు మామిడి వెంకయ్య గారి నిఘంటువును బోధించేవారు. దీని పేరు "ఆంధ్రదీపిక" ఇందులో తొలిగా పదాల మూలాలు, వ్యుత్పత్తి అర్థాలు, పదం ఎక్కడ నుండి వచ్చిందిలాంటి విషయాలు చర్చించే "ఎటిమాలజి" గురించి ఆయన వివరించి దీనినొక విభాగంగా చేశారు వెంకయ్య గారు. ఎన్నాళ్ళైనా కంపెనీ వారు దీనిని ప్రచురించకపోవడంతో తానే మరికొన్ని వ్రాత ప్రతులు తయారు చేయించి ప్రసిద్ధ తెలుగు సంస్థానములకు పంపించాడు. చార్లెస్ పిలిప్ బ్రౌన్ ఈ ప్రతిని ఎత్తి వ్రాయించడమేగాక అందులో వెంకయ్యగారు వ్రాసిన 30 పుటల పీఠికను యథాతథంగా ఉంచారు. (1) తెలుగు మాట (2) దానికి అర్థం (3) సంస్కృతంలో సమానార్థం అనేవి భాగాలను యథాతథంగా ఉంచి ఎటిమాలజీని తొలగించారు. 1130 పుటలున్న ఆంధ్ర దీపికను పుచ్చుకున్నందుకు తెల్లదొరతనం వెంకయ్యగారికి వారి సతీమణికి జీవించినంత కాలం భృతినిచ్చింది. ప్రస్తుతం ఈ గ్రంథం అలభ్యం. వెంకయ్యగారి పేరుతో 1965లోనూ 2015లోనూ వచ్చిన నిఘంటువులు చెట్టు పేరు చెప్పి కాయలమ్ముకుంటున్నవే.


తెల్లదొరల వద్ద మంచి పలుకుబడి ఉన్న పరవస్తు చిన్నయ సూరి అకారాది క్రమంలో ఒక గొప్ప తెలుగు నిఘంటువును వ్రాయడం ప్రారంభించారు. అది విన్న బహుజనపల్లి, సీతారామాచార్యులు ఆ మహాయజ్ఞం పూర్తవ్వడానికి చాలా పుష్కరాలు గడుస్తాయని భావించి తానే రంగంలోనికి దిగి శబ్ద రత్నాకరం పేరుతో పీఠికతో కలిపి 1150 పుటలతో ఒక నిఘంటువును 1885లో ప్రకటించారు. ఆ యుగంలోనే మారిస్ దొర, విలియం బ్రౌన్‌దొర (ఎ వొకాబులరీ ఆఫ్ జెంటూ (తెలుగు) అండ్ లాంగ్వేజ్) కాంబెల్ దొర (డిక్షనరీ ఆఫ్ తెలుగు లాంగ్వేజ్) పేర్లతో తెలుగులో నిఘంటువులు రూపొందించారు. పండిత పామర రంజకంగా ఉండేలాగున 1852లో చార్లెస్ ఫిలిఫ్ బ్రౌన్ "ఎ వొకాబులరీ ఆఫ్ జెంటూ అండ్ ఇంగ్లీష్" అనే గొప్ప నిఘంటువును కూర్చారు.

సందర్భోచితంగా సామెతలు, జాతీయాలనూ చేర్చారు. ఇది (1844-1853ల మధ్య) ఇంగ్లీషు-తెలుగు, తెలుగు-ఇంగ్లీషులలో సాగింది. పరిపాలనలో ముఖ్యంగా రెవిన్యూ బోర్డులో పారసీ, అరబ్బీ పదాల వాడకం విపరీతం కావడంతో సి.పి. బ్రౌన్ 1854లో తెలుగులో చేరిన ఈ అన్యదేశ్యాలను గుర్తించడానికి మిశ్ర భాషా నిఘంటువును తయారు చేశారు. తెలుగులో అకారాది నిఘంటువును తయారు చేసిన తొలి ఐరోపా వ్యక్తి క్యాంప్‌బెల్. అంతకు ముందే 1842లో తెలుగు జిల్లాల కలెక్టరు కచ్చేరీలలో నిత్యం ఉపయోగించే వ్యావహారిక పదాలను సేకరించి కూర్చే పనిని బ్రౌన్ దొర కంపెనీ డైరెక్టర్ల కోరికపై ఒప్పుకొని పూర్తి చేశారు. ఈ ప్రతి నేటికీ ఢిల్లీలోని నేషనల్ ఆర్కైవ్స్‌లో ఉంది. 1852లో నేటి మాండలిక పద కోశాలకు మాతృక అన్నట్లుగా కోస్తా, రాయలసీమలలోని వాడుక పదాల జాబితాను బ్రౌనుదొర "లిటిల్ లెక్సికన్" పేరుతో ప్రచురించారు. 24 భాషలతో మంచి పరిచయం ఉన్న బ్రౌన్ మహాశయుడు మరెన్నో గ్రంథాలు తెలుగులో వ్రాసి, వ్రాయించి ఆంధ్రులకు ప్రాతఃస్మరణీయుడయ్యారు. 1888లో ఆంధ్రపద పారిజాతము పేరుతో శ్రీఓగిరాల జగన్నాథకవి ఒక తెలుగు నిఘంటువును కూర్చారు. ఈ నిఘంటువులన్నీ సమగ్రమైనవి కావు. ఐరోపా వారికి స్థానిక భాషలు అర్థమవ్వడం కోసమే తయారయ్యాయి. పాలితుల భాషలోనే పాలకులు వ్యవహారములు నడపాలన్న ఇంగితము మనవారికి నేటికీ కలగకపోవడం మన దురదృష్టం.

ఒక ప్రక్క ద్రవిడియన్ ఎటిమాలజికల్

నిఘంటువును థామస్‌బరో, ఎమ్.బి. ఎమినో కలిసి తయారు చేశారు. మరో ప్రక్క చెలమచర్ల రంగాచార్యులు "ఆంధ్ర శబ్ద రత్నాకరాన్ని", ఆంధ్రసాహిత్య పరిషత్ వారు ''సూర్యరాయాంధ్ర నిఘంటువు''ను 1920లో శ్రీ జయంతి రామయ్య పంతులుగారిచే పరిష్కరింపచేసి చెన్నపురిలో ముద్రింపచేశారు. ఇవన్నీ 1854లో హిందూ భాషా సంజీవని పేరుతో వావిళ్ళ రామశాస్త్రుల వారు ముద్రణాలయం ఏర్పాటు చేయడంతో వెలుగు చూశాయి. పిఠాపురం మహరాజు రావు వెంకట కుమార మహీపతి సూర్యారావుగారి సహాయంతో, ఎందరో మహాపండితుల తపస్సుతో తయారైనది సూర్యరాయాంధ్ర నిఘంటువు. దీనికి ఎన్నో మార్పులు చేస్తూ ఆచార్య రవ్వా శ్రీహరి దానికి శేషగ్రంథంగా శ్రీహరి నిఘంటువును నేడు తెచ్చారు. 1903 తరువాత శ్రీ తాటికొండ తిమ్మారెడ్డి శబ్దార్థ చింతామణిని రూపొందించారు. 1934-1940 సం॥ల మధ్య శ్రీ కొట్ర శ్యామలకామశాస్త్రి ఆంధ్రవాచస్పత్యము పేరుతో 4 సంపుటాలుగా వెలువరించారు. దీనిని పండితలోకం ''శ్యామల కామశాస్త్రీయం'' అని పిలిచేది. 1930లో ఆంధ్రధాతుమాల వచ్చింది. తరువాత వావిళ్ళ ముద్రణాలయం వారు తమ పేర ఒక నిఘంటువును, మహంకాళి సుబ్బరాయుడుగారు "శబ్దార్థ చంద్రిక"లను కూర్చి ప్రకటించారు. 1971లో ముసునూరి వెంకట శాస్త్రి విద్యార్థి కల్పతరువు పేరుతో ఒక నిఘంటువును, 50వేల పదాలతో ఆంధ్రనామ సర్వస్వాన్ని వ్రాశారు. ఆంధ్ర, సంస్కృత కోశమును మహామహోపాధ్యాయ పుల్లెల శ్రీరామచంద్రుడు, కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగార్లు ప్రకటించారు. ఉప్పల లక్ష్మణరావుగారు తెలుగు-రష్యన్ నిఘంటువును వ్రాశారు. కోరాడ మహదేవ శాస్త్రిగారు తెలుగు వ్యుత్పత్తి నిఘంటువును కూర్చారు. అచ్చ తెలుగులో ఆంధ్ర పదవిధానము అనే నిఘంటువును తూము రామదాస కవి వ్రాశారు. హరికథా పితామహులు ఆదిభట్ల నారాయణదాసుగారు "సీమ పలుకు వహి" పేరుతో మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు "నుడికడలి" పేరుతో నిఘంటువులు తయారు చేశారు.


1957లో తెలుగు వ్యుత్పత్తి పదకోశాన్ని ఒక ప్రత్యేక పథకంగా ప్రారంభించిన ఆంధ్ర విశ్వకళాపరిషత్ వారు దానిని అకుంఠిత దీక్షతో 1,08,330 పదాలతో పూర్తి చేశారు (ఆచార్య తూమాటి దోణప్ప, ఆచార్య లకంసాని చక్రధరరావుగార్లు ఈ యజ్ఞంలో బ్రహ్మలుగా ఉండి 8 సంపుటాలు వెలువరించారు).




**ప్రత్యేకాంశాల మీద పదకోశాలు:** 1967లో కుందూరి ఈశ్వరదత్తుగారి శాసన శబ్దకోశము, బూదరాజు రాధాకృష్ణగారి ప్రాచీనాంధ్ర శాసనాలు, గృహవాస్తు పదకోశం, భద్రిరాజు కృష్ణమూర్తి గారిచే నేతవృత్తి కోశం, ముసునూరి వెంకట శాస్త్రి గారి విద్యార్థి కల్పతరువు వచ్చాయి. జిల్లాల వారీగా మాండలిక పదకోశాలతో పాటు వివిధ వృత్తుల, కళల పదకోశాలను తెలుగు అకాడమీ, శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు ప్రచురించారు. 1959లో ఆంధ్ర సాహిత్య అకాడమీ పదబంధ పారిజాతాన్ని ఆవిష్కరించింది. 1966లో వచ్చిన జి.ఎన్. రెడ్డిగారి ఇంగ్లీషు - తెలుగు నిఘంటువుతో పాటు, 1970లో వచ్చిన శ్రీ మదుపూరు కోదండరామిరెడ్డి గారి మాండలిక పదకోశం, పి. శంకర నారాయణ ఇంగ్లీషు - తెలుగు నిఘంటువు ప్రస్తుతం బాగా ప్రాచుర్యంలో ఉన్నాయి. 1973లో శ్రీ బోయి భీమన్నగారు సమానార్థక, వ్యతిరేకార్థక పదనిఘంటువు తయారు చేశారు. 1975లో శ్రీ కె. రామలక్ష్మిగారు తాళ్ళపాకవారి పలుకుబడులు అచ్చువేశారు. 1987లో ఆచార్య తూమాటి దోణప్ప వైకృతపదస్వరూప నిరూపణం వ్రాశారు. జి.ఎన్. రెడ్డిగారు 1990లో తెలుగు పర్యాయపద నిఘంటువు కూర్చారు. 1990లో ''ఈనాడు'' వారి పదకోశము వచ్చింది. శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు

విశ్వవిద్యాలయం ప్రత్యేకంగా గిడుగు వెంకటరామమూర్తి - ఆంగ్లాంధ్ర వైద్య నిఘంటువు/ఆచార్య పేర్వారం జగన్నాథం - ఆరెభాష నిఘంటువు/డా॥ ముదిగంటి సుజాతారెడ్డి - తెలంగాణా వ్యవహార పదకోశము/ డా॥ డి.సి.రెడ్డి - తెలుగు పదాలు ఫ్రీక్వెన్సీ డిక్షనరీ/ పత్రికాభాషా నిఘంటువు 1996/సి.పి. బ్రౌన్ - బ్రౌణ్య ఇంగ్లీషు-తెలుగు నిఘంటువు, తెలుగు-ఇంగ్లీషు నిఘంటువులను ప్రచురించింది. తెలుగు అకాడమీ వారు "శబ్ద సాగరాన్ని" రూపొందిస్తున్నారు. 15 పారిభాషిక పదకోశాలను ముద్రించారు. తెలుగు-ఫ్రెంచి నిఘంటువును మరల ఇన్నాళ్ళకు బయటికి తెచ్చారు. 2004లో శ్రీ చేకూరి రామారావుగారు, శ్రీ బూదరాజు రాధాకృష్ణగారు కలిసి ఇంగ్లీషు-తెలుగు పత్రిక పదకోశాన్ని వెలువరించారు. 2015లో శ్రీ వి.వి. వెంకటరమణగారు ఇంగ్లీషు-తెలుగు కంప్యూటర్ విజ్ఞాన శాస్త్ర నిఘంటువును రూపొందించారు. ప్రస్తుతం విశాలాంధ్ర ప్రచురణ కర్తలు త్రిభాషా నిఘంటువు (తెలుగు-హిందీ-ఇంగ్లీషు)ను తీసుకువచ్చారు. ఇది ఆధునిక రంగము.

మహామహోపాధ్యాయ శ్రీ పరవస్తు రంగాచార్యులు (1822-1900) లఘు శబ్దార్థ సర్వస్వం పేరుతో స్వదస్తూరీలో వ్రాసిన 4 లక్షల పుటల నిఘంటువును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలయం మరియు పరిశోధనాలయం వారు డిజిటలైజేషన్ చేసి రక్షించారు. వ్యావహారిక భాషా పితామహుడు కీ॥శే॥ గిడుగు రామమూర్తి పంతులుగారు సవర భాషకు మాన్యువల్ వ్రాశారు. నిఘంటువులను అడ్డుపెట్టుకుని పండితులు చేస్తున్న భాషా ద్రోహం గురించి గొప్ప పోరాటం చేస్తూ, గ్రాంథిక వాదులకు ప్రాణప్రదమైన సూర్యరాయాంధ్ర నిఘంటువులాంటి గ్రంథాలలోని ఎన్నో లోపాలను సభలలో బహిర్గతం చేసేవారు. నిఘంటు నిర్మాణంలో పండితుల దృష్టికి రాని, సరిపడని, రుచించని ఎన్నో దేశ్యపదాలు మరుగున పడ్డాయని నేడు భాషా ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. దీనిని గిడుగువారు ఆనాడే గుర్తించారు. ప్రామాణిక భాష పేరుతో ఎన్నో అపప్రయోగాలు, గారడీ పదాలు నిఘంటువులలో చోటుచేసుకున్నాయని రామమూర్తి పంతులుగారు బలంగా చెప్పారు. జానపదుల నోళ్ళలో నిత్యమూ నానుతున్నా, తరగని సుధలూరుతున్నా సాహిత్య గౌరవం దక్కించుకోలేని ఎన్నో ఆపాత మధురాక్షరాల పక్షాన గిడుగువారు నిలబడ్డారు. "అయిననూ పోవలే హస్తినకు" అన్నట్లుగా నిఘంటువుల అధ్యయనం కవి పండితులకు తప్పనిసరి అని పంతులుగారు ఎరుగని విషయం కాదు. వారికున్న విశాలదృష్టి నిఘంటుకారులందరికీ ఉంటే తెలుగుకు లక్షల పదకోశము మిగిలి ఉండేది.




2019 సంవత్సరంలో చీరాల వాస్తవ్యులు కోన రమణరావు గ్రామీణ వ్యవసాయ పదకోశం 'పల్లెపదాలు' పేర క్రోడీకరించి మూడువేల పదాలకు పైగా అర్థ సందర్భాల సహితంగా తయారు చేశారు.

**ముగింపు:** నిఘంటు జ్ఞానమున్న పాఠకునికి, లేఖకునికి, వక్తకు మంచి గుర్తింపు, రాణింపు ఉంటుంది. శబ్దాధికారానికి నిఘంటువుతో నిత్య సహవాసమే రాచబాట. చిన్నతనం నుండే విద్యార్థులకు నిఘంటువులతో తగు మాత్ర పరిచయాన్ని ప్రోత్సహిస్తే జీవిత పర్యంతం వారు దీని సత్ఫలితాలను ఆస్వాదిస్తారు. టీకా, తాత్పర్యాలు వ్రాయడానికి, గ్రంథ సమీక్షలు చేసి వ్యాఖ్యానాలు చేయడానికి, వ్రాసిన వాటికి సమర్థనలు చూపుకోవడానికి నిఘంటువులే మనకు పెన్నిధులు.

పూషడపు సుబ్బారావు
తెలుగు అధ్యాపకుడు, ప్రభుత్వ జూనియర్ కళాశాల,
అవనిగడ్డ, కృష్ణాజిల్లా. ఫోన్: 810 626 2243.



# ముగ్ధ మోహనం – మోహినియాట్టం

– పప్పు వేణుగోపాల రావు

కేరళ దైవభూమి, కళలకు కాణాచి. ప్రకృతి సౌందర్యంతో నిత్యం పచ్చగా ఉండే పచ్చి బాలెంతరాలు. ఇంతకుముందు కథకళి గురించి తెలుసుకున్నాం, కుడియాట్టం నాటక సంప్రదాయం పరామర్శించాం. రామనాట్టం, కృష్ణాట్టం గురించి చర్చించాం. దాదాపు అన్నీ పురుష ప్రధానమైన నాట్య రీతులు. లలిత, మధుర, ముగ్ధ, మోహనమైన స్త్రీ నృత్యం మోహినియాట్టం.

**సుమారు ఒక 30 రకాల నృత్యాలు కేరళలో కనిపిస్తాయి:**

1. చక్కియార్ కూత్తు, 2. చవిట్టు నాడకం, 3. దప్పుముట్టు, 4. కలంపట్టు, 5. కలియూట్టు, 6. కన్యర్కలి, 7. కథకళి, 8. కావడియాట్టం, 9. కేరళ నటనం, 10. కూడియాట్టం, 11. కృష్ణాట్టం, 12. కుంభంకలి, 13. కుమ్మట్టి కలి, 14. మార్గంకలి, 15. మయిలాట్టం, 16. మీనాక్షి నాటకం, 17. మోహినియాట్టం, 18. ఒప్పన డాన్సు, 19. ఓట్టంతుల్లల్, 20. పదయని, 21. పరిచముట్టు, 22. పథకం డాన్సు, 23. పూతం కలి, 24. పులికలి, 25. సర్పపాట్టు, 26. తట్టుమేల్ కూత్తు, 27. తెయ్యం, 28. తిడంబు నృత్తం, 29. తియ్యాట్టు, 30. వేలకలి.

భారతీయ శాస్త్రీయ నృత్యాలలో అన్నిటికంటే చివరగా అన్నిటికంటే ఆవిర్భావంలో చిన్నదిగా మోహినియాట్టాన్ని పరిగణించవచ్చు. కొందరు పరిశోధకులు ప్రాంతీయాభిమానంతో దీన్ని శిలప్పతికారం, (క్రీ.పూ. 5-6 శతాబ్దం) తొల్కాప్పియం, (క్రీ.పూ. 2వ శతాబ్ది) నాటికి, తీసుకువెళ్ళే వృధా ప్రయత్నం చేశారు. శిలప్పతికారం కథలో కోవలన్ కథానాయకుడు, కణ్ణగి కథానాయకి, కొత్తగా పెళ్ళయిన దంపతులు. కోవలన్, మాధవి అనే వేశ్య వలలో పడి కణ్ణగిని వదిలేస్తాడు. చాలా స్ఫూర్తిదాయకమైన ఈ కథలో మాధవి చేసే నృత్యం ప్రస్తావించబడింది. అది ఒక దేశీయ నృత్యం. అదే కొందరు పరిశోధకులు మోహినియాట్టంతో ముడిపెడతారు. మాధవి వేశ్య, నర్తకి. దేవదాసి కాదు. దక్షిణాదిన మిగిలిన రాష్ట్రాలలా కేరళలో దేవదాసి విధానం ప్రబలంగా లేదు. దేవదాసీలు లేరని కాదు, ఉన్నా వాళ్ళ నృత్యం అంత ప్రాముఖ్యమైనది కాదు. కులశేఖర ఆళ్వార్ తన కుమార్తె నీలను శ్రీరంగం దేవాలయానికి దేవదాసిగా అంకితం చేశాడు. ఈ నాటికీ ఆమె పేర ఒక చిన్న దేవాలయం మనకి శ్రీరంగం దేవాలయ ప్రాంగణంలో కనిపిస్తుంది. కాలక్రమంలో దేవదాసీ విధానం దాని పవిత్రతను కోల్పోయింది.

కేరళ దేవాలయాలలో నంగ్యార్ అనే స్త్రీలు, చాక్యార్ శాఖకు చెందినవారే నృత్యం చేసేవారు. వాళ్లకి దేవాలయంలో పూజారులకులాగానే అత్యధికమైన గౌరవం, పవిత్రత ఉండేవి. వాళ్లకి దేవునితో నృత్యనివేదన వరకే సంబంధం. నంబూద్రీలు పూజ చేసేవారు, వారియర్ తెగకు చెందిన స్త్రీలు, వారాసియారులు పూలమాలలు చేసేవారు, పొడువాల్‌లు మారార్‌లు సంగీత వాద్యాలు వాయించేవారు. ఇలా సంఘంలో ఒక్కో తెగకు చెందినవారు దేవాలయ కార్యక్రమాలలో ఒక్కో పాత్ర పోషించేవారు. అందుచేత కేరళలో దేవదాసీ నృత్యం బలీయమైనది కాదు. మోహినీయాట్టం, అన్నీ ఒకే మూసలో పోసి చూసే కొందరు పరిశోధకులు భావించినట్టు దేవదాసీ నృత్యంలోంచి ఉద్భవించలేదు. మోహినీయాట్టం

మూలం, ఆ నృత్యానికి వేళ్ళు నాంగియార్ కూత్తు నుంచి ఏర్పడ్డాయి అనేది సునిశితమైన పరిశోధనవల్ల తెలిసిన విషయం. నాంగియార్ కూత్తు గురించిన శిలాశాసనాలు ఈ విషయాన్ని ధృవపరుస్తున్నాయి. కాలికట్‌కు 15 మైళ్ళ దూరంలో చొక్కూరు గ్రామం ఉంది. అక్కడ లభించిన ఒక శిలా శాసనంలో ఒక చిత్రయిల్ నాంగియార్ దేవాలయానికి భూదానం చేసినట్టు ఉంది. ఇంకో శాసనంలో నాంగియార్‌కు నట్టువనారుకు దేవాలయం ఏ రకంగా జీతభత్యాలిచ్చేదో తెలుపుతుంది. అనేక కావ్యాలలో దేవాలయ శిల్పాలలో నృత్యం, నర్తకి, నృత్య భంగిమల ప్రసక్తి ఉంది. 16వ శతాబ్దానికి చెందిన *వ్యవహారమాల* అనే గ్రంథంలో మొదటిసారి మోహినియాట్టం నర్తకికి, మిగిలిన కళాకారులకు ఇచ్చే రుసుము గురించిన ప్రస్తావన కనిపిస్తుంది.

తిరువాన్కూర్ రాజులకు వాళ్ళు ఏ నక్షత్రంలో పుట్టారో ఆ పేరులు ఉండేవి. కృత్తికలో జన్మించిన మహారాజు కార్తీక తిరుణాల్ మహారాజు (1724-1798), తిరుణాల్ అంటే శుభప్రదమైనరోజు. అందుకే పండగలను తిరుణాల్ అంటూ ఉంటారు. ఆయన పేరు బలరామ వర్మ. ఈయన కాలంలోనే తిరువాన్కూర్ రాజ్యం స్థిరంగా ఉండేది. కళలు విలసిల్లాయి. కార్తీక తిరుణాల్ మహారాజు స్వయంగా కవి, కళాకారుడు. ఈయనే మోహినియాట్టంను పునరుద్ధరించి దీనికి ఒక రూపకల్పన చేసినవాడు. *బలరామ భరతం* అనే ఒక గ్రంథాన్ని కూడా రచించి భరతుని నాట్యశాస్త్రం అనుసరించి చేసే మోహినియాట్టంకి ఒరవడి ఏర్పరిచాడు. కానీ మోహినియాట్టంకి వైభవాన్ని ఏర్పరచిన ఘనత ఆ వంశంలోనే కొన్నేళ్ళకు రాజ్యం చేసిన మహారాజ స్వాతి తిరుణాల్ (1813-1846)కి చెందుతుంది. ఈయన స్వాతి నక్షత్రంలో జన్మించాడు గనుక పేరు స్వాతి తిరుణాల్, అసలు పేరు రామవర్మ. అప్పటికి వీరి రాజధాని తిరువనంతపురం, కులదైవం పద్మనాభస్వామి.

స్వాతితిరునాల్ మహారాజు స్వయంగా వాగ్గేయకారుడు, అనేక భాషలలో కవి, కళాకారుడు. ఈయన ఆస్థానంలో తంజావూర్ క్వార్టెట్ (Tanjorequartet), అని ప్రముఖులైన నలుగురు సోదరులు, చిన్నయ్య, పొన్నయ్య, వడివేలు, శివానందం అనేవారు ఉండేవారు. వీళ్ళే భరత నాట్యానికి మార్గం నేర్పిన మార్గదర్శకులు. ముత్తుస్వామి దీక్షితులవారి శిష్యులు, వాగ్గేయకారులు, నట్టువనారులు, అనన్య ప్రతిభావంతులైన కళాకారులు. జతిస్వరం, పదం, వర్ణం, తిల్లాన, ఇలా ఎన్నో రచించినవారు. స్వాతి తిరుణాల్ మహారాజు వీరి సహకారంతో మోహినియాట్టంని పునరుద్ధరించి దీనికి రూపకల్పన చేశాడు.

ఇలా ఆవిర్భవించిన మోహినియాట్టంకి చిలవలు పలవలుగా విష్ణుమూర్తి మోహిని అవతారం నుంచి స్వాతి తిరుణాల్ మహారాజా వరకు ఎలా ఎలా పుట్టిందో, పుట్టి ఉంటుందో ఊహాగానాలు, పరిశోధనలు. మొట్టమొదట మోహిని అవతారంలో విష్ణువు చేసినదే మోహిని ఆట్టం. అనే నృత్యం అనే ఒక విపరీత వాదన కూడా ఉంది. మోహింపజేసే నృత్యం మోహినియాట్టం అనేది విమర్శకులు అంగీకరించిన చారిత్రిక సత్యం.

మోహన్ కొక్కర్ వంటి నాట్య చారిత్రకులు మోహినియాట్టం ఆవిర్భావమే స్వాతి తిరుణాల్ ఆస్థానంలో అన్నారు. స్వాతి తిరుణాల్ మహారాజు పాపం 34 ఏళ్ల వయసులోనే దివంగతుడయ్యాడు. కాని మోహినియాట్టంకి ఊపిరి పోశాడు. మోహినియాట్టానికి దాదాపు 20 వర్ణాలు, 50 పదాలు, 5 తిల్లానాలు రచించాడు. ఆయనకు సుప్రసిద్ధమైన జోలపాట రచించినవాడు ఇరయమ్మన్ తంపి. ఆయన రాసిన 'ఓమన తింగళ్ కిడావో', మన 'జో అచ్యుతానంద'లాటిది. ప్రతి మలయాళం తల్లి పిల్లలకు పాడే జోలపాట. ఆయన, ఆయన కుమార్తె కుట్టికుంజు తంకచ్చి రచించి ప్రదర్శించినవి ఎన్నో ఈనాటికీ మోహినియాట్టంలో ఉపయోగిస్తారు. లాస్యం, శృంగారం ప్రధానమైనది మోహినియాట్టం. స్వాతి తిరుణాల్ కాలంలో పునర్నిర్మించబడి ఆయన జీవిత కాలంలో ఒక వెలుగు వెలిగి, 'చిత్రలో పుట్టి స్వాతిలో పోయింద'న్న సామెతలా, ఆయన మరణంతో ఆదరణ లేక అంతరించింది. ఆయన తరువాత రాజ్యానికి వచ్చిన ఉత్తర తిరుణాల్


స్వాతి తిరుణాల్

మహారాజుకు పురుష ప్రధానమైన కథకళి నచ్చింది. లాస్య ప్రధానమై ముగ్ధమోహనమైన మోహినియాట్టంకి ఆయన పోషణ లభించలేదు.

కాని అంతవరకు మోహినియాట్టం నేర్చుకున్న కళాకారులు ఏం చేస్తారు? కళాకారుల వల్లనే కళ దిగజారిపోయింది. విలువలు పోగొట్టుకొంది. పొట్ట గడుపుకోడం కోసం కలభం పూసల్, ముకుతి అనే రెండు అసభ్యకరమైన ప్రక్రియలు మోహినియాటంలో చేరాయి. కలభం పూసల్ అంటే నాయిక ప్రియునికై వేచి విరహంలో ఒళ్ళంతా చందనం పూసుకోడం. రెండవది ముక్కుత్తి వెతుక్కోడం. అంటే నర్తకి తను పోగొట్టుకొన్న ముక్కుపుడక కోసం వెతుకుతుంది. రంగస్థల మీదనే కాదు, స్వయంగా ప్రేక్షకులలోకి వచ్చి వాళ్ళ జేబులు వెతుకుతుంది. ఇలాంటి క్షీణదశ వచ్చి మోహినియాట్టం తెరమరుగయింది.

స్వాతి తిరుణాల్ పోయిన తరువాత అంతవరకు ఆయన ఆస్థానంలో ముఖ్య సంగీత విద్వాంసుడుగా ఉన్న పరమేశ్వర భాగవతార్ తిరువనంతపురం వదలిపెట్టి తన స్వంత ఊరు పాలఘాట్‌కు తరలిపోయాడు. దానితో మోహినియాట్టం కూడా తిరువనంతపురం వదలిపెట్టి కేరళలో మిగిలిన ప్రాంతాలలో నిలవదొక్కుకోడానికి ప్రయత్నం చేసింది.


వల్లతోల్ మహాకవి

మోహినియాట్టంను సృష్టించి నిలబెట్టి ఈనాడు అది ఒక శాస్త్రీయ నృత్యంగా నిలబెట్టినవారు ముగ్గురు. ఒకరు స్వాతి తిరుణాల్ మహారాజా. రెండవవారు మహాకవి వల్లతోల్, మూడవ ఆమె కళామండలం కల్యాణకుట్టి అమ్మ. ఈమెనే మోహినీయాట్టంకి తల్లిగా భావిస్తారు.



కళ్యాణకుట్టి అమ్మ

స్వాతి తిరుణాల్ మహారాజకు వల్లతోల్ మహాకవికి మధ్యలో మనం స్మరించుకోవలసిన ఒక ముఖ్యమైన వ్యక్తి కృష్ణమీనన్ అనే ఆయన. ఈయన త్రిచూర్ దగ్గర కోరట్టికర అనే గ్రామానికి చెందినవాడు, సుమారు 1920 ప్రాంతం. ఆయన కొందరు మహిళలకి కైకొట్టుకలి అనే ఒక బృంద నృత్యం నేర్పించేవాడు. అప్పుకెట్టు కృష్ణ పణిక్కర్ ఆసాన్ అనే గురువు ఇందులో కొందరిని ఎంచుకుని వాళ్ళకి మోహినియాట్టం నేర్పాడు.

మహాకవి వల్లతోల్ (1878-1958) గురించి కథకళి వ్యాసంలో చెప్పుకున్నాం. ఆయన 1930లో కేరళ కళామండలం స్థాపించడమే మోహినియాట్టంకి తిరిగి పునర్జన్మనిచ్చింది.


కైకొట్టి కలి

ముందు కున్నంకులంలో ప్రారంభించిన ఈ సంస్థ ఇప్పుడు ప్రపంచ ప్రసిద్ధమైన డీమ్డ్ యూనివర్సిటీ. 1933లో చెరుతురుతికి మార్చబడింది. వల్లతోల్ కేవలం ఒక మహాకవి మాత్రమే కాదు, కళలను పునరుద్ధరించి వాటి అభివృద్ధికి బాటవేసిన మహర్షి.ఆయన మోహినియాట్టంలో ఆనాటికి చోటుచేసుకున్న అసభ్యకరమైన సాహిత్యం, అభినయం తొలగించి మోహినియాట్టంని ప్రక్షాళన చేశాడు. లాస్యం, కైశికి వృత్తికి ప్రాధాన్యం పెంచాడు. రాష్ట్రం అంతటా తిరిగి ఏరి లక్షణమైన


కేరళ కళామండలం



కనక్ రేలే

స్త్రీలను తెచ్చి కలామండలంలో గురువులుగా ఏర్పరిచాడు. వారిలో ఒక ఆమె కళ్యాణ కుట్టి అనే పేరే గలిగిన ఇంకొక గురువు. రెండు సంవత్సరాల తరువాత ఈమె రవీంద్రనాథ్ ఠాగూర్ పిలుపుతో శాంతినికేతన్‌లో గురువుగా చేరింది.

ఇంకొక ఆమె మోహినియాట్టంకి తల్లి అని చెప్పుకున్న కల్యాణకుట్టి అమ్మ (1915-1999) ఈ కళకు జీవం పోసింది, జీవితం అంకితం చేసింది. తన ఇరవైయవయేట మోహినియాట్టం నేర్చుకున్న ఈమె 1937లో కేరళ కళామండలంలో చేరింది. ఒక్క చేతి మీదుగా ఈవిడే మోహినియాట్టంని పునర్నిర్మించింది అంటే అతిశయోక్తి కాదు. ఈమె అడుగు జాడలలో ఎందరో మహిళారత్నాలు, కలామండలం సత్యభామ, క్షేమవతి, సుగంధి, ఆచార్య కనక్ రేలే, భారతి శివాజీ, లీలా ఓంచేరివంటి వారివల్ల ఈ కళ ఈనాడు ఈ స్థాయికి ఎదిగింది. ఆమె కుమార్తె దీప్తి ఓంచేరిభల్లా ఢిల్లీ యూనివెర్సిటీలో ఆచార్య పదవిలో ఉంది.



అరమండి- గోపికా వర్మ

మిగిలిన అన్ని శాస్త్రీయ నృత్యాలలాగే మోహినియాట్టంలోనూ నృత్తం, నృత్యం రెండూ ఉన్నాయి. నృత్తంలో మండలాలు, పాదభేదాలు, పాదచారులు, నృత్త హస్తాలు మొదలైనవి వాడుతారు. నాట్యశాస్త్రంలో కొన్ని పేర్లు కేరళలో మలయాళంలో కొంచెం వ్యత్యాసంగా పిలుస్తారు. దాదాపు భరతనాట్యంలాగే ఉంటాయి మోహినియాట్టంలో చాలా ప్రక్రియలు. కేరళకు తనదైన ఒక హస్తలక్షణదీపిక అనే ఒక గ్రంథం ఉంది. అందులో హస్త ముద్రలు నేర్పుతారు, అవే



భారతీ శివాజీ



దీప్తి ఓంచేరి భల్లా

ఉపయోగిస్తారు. మనం తెలుగులో అడుగులు అంటాం, నృత్య పరిభాషలో వీటిని అడవులు అంటారు. అడవులు సంగీతంలో స్వర ప్రక్రియలలాంటివి. కొన్ని-కొన్ని కలిపితే కొత్త-కొత్త భంగిమలు ఏర్పడతాయి. ముందు సుమారు 20-30 అడవులు ఉండేవి. కలామండలం సుగంధి అమ్మ వీటిని దాదాపు 120 చేసింది. ముఖ్యంగా ఇవి 4 రకాలు. ఏ అక్షరంతో మొదలెడతారో ఆ పేరు పెట్టేరు వీటికి ఆ నాలుగు:

1. తొగణం, 2. జగణం 3. ధగణం, 4. మిశ్రం.

భరతనాట్యంలోలాగానే అరమండి అంటే అర్ధమండలం మోహినియాట్టంలో ప్రధానమైన భంగిమ - కానీ ఇందులో మోకాళ్ళు ఎంత వంచి ఉంచాలి అనే దానిని బట్టి 5 రకాలు. అవి: 1. సమమండలం, 2. కాల్ మండలం, 3. అర మండలం, 4. ముక్కాల్ మండలం, 5. ముళు మండలం. అర్థం తెలుస్తోందికదా.. మోకాళ్ళు ఎంత వంచితే అంత. కొంచెం కూడా వంచకపోతే సమం, 4వ వంతు వంచితే కాల్ మండలం, సగం వంచితే అర్ధ మండలం, మూడొంతులు వంచితే ముక్కాల్ మండలం, పూర్తిగా వంచితే ముళు మండలం. అర్ధమండలిలో తిరువనంతపురం రాజ కుటుంబానికి చెందిన శ్రీమతి గోపికావర్మ చిత్రం చూడండి. ఇందులో గమనించవలసింది ఏమిటంటే ఈ భంగిమలో శరీరం 6 త్రికోణాలుగా కనిపిస్తుంది.




దీప్తి- పార్వతి పాత్రలో

మోహినియాట్టంలో పాదచారులు 5.

1. హంసపాదం, 2. కుక్కుడ(ట) పాదం, 3. మయూర పాదం, 4. మాండూక పాదం, 5 నాగ బంధం.

మోహినియాట్టం నృత్యరచన అంటే choreography అంతా అడవుల మీద ఆధారపడి ఉంటుంది. అక్షరాలు పదాలై, పదాలు వాక్యాలై, వాక్యాలు వ్యాసం అయినట్టు, అడవులకు, హస్తాలను జోడించి, పాదభేదాలను చేర్చి, కదలికలలో చారులు మండలాలు కలిపి నృత్యరచన చేస్తారు. సంగీతాన్ని అనుసరించి మోహినియాట్టంని మూడు శైలులుగ విభజించవచ్చు.

1. కల్యాణకుట్టి అమ్మ శైలి. ఇందులో తంజావూరు శైలి సంగీతం అంటే పరిశుద్ధమైన కర్ణాటక సంగీతం ఉంటుంది. అభినయ ప్రధానమైన శైలి. 2. కాలమండలం శైలి. పటిష్టమైన శాస్త్రీయత, కేరళ కర్ణాటక సంగీతాల మేళవింపు, మణిప్రవాళం భాష, అంటే సంస్కృతం, మలయాళం కలిసి ఉంటాయి. ఇందులో మహాకవి ప్రభావం కనిపిస్తుంది. 3. సోపాన సంగీతం అనుసరించేది. కోవలం నారాయణ పణిక్కర్ ప్రభావంవల్ల ఏర్పడినది. పదయన్ని, తిరువాదరకలి, ఎడక్క ఉపయోగం గోచరిస్తుంది.



సునంద నాయర్

సోపాన సంగీతం అంటే ప్రతి కేరళ దేవాలయంలో గర్భగుడి ముందు సోపానాల దగ్గర (మెట్లవద్ద) ఉదయం 'పల్లి ఉనర్తల్' నుండి రాత్రి 'పల్లి ఉరక్కల్' (సుప్రభాతం నుండి, పవళింపు)వరకు పాడే సంగీతం. ఇది సాధారణంగా మారర్ జాతికి చెందినవాళ్ళు ఎద్క వాయిస్తూ పాడుతారు. కోవలం నారాయణ పణిక్కర్ ఈ సంగీతాన్ని మోహినియాట్టంలోకి తెచ్చి ఒక పవిత్రతను, ప్రాంతీయతను మోహినియాట్టంకి కల్పించారు.

**మోహినియాట్టం కార్యక్రమం:**

సాధారణంగా ఒక మోహినియాట్టం కార్యక్రమంలో ఏమేం చేస్తారో చూద్దాం.

ఒక ప్రార్థనతోనో గణేశస్తుతితోనో కార్యక్రమం ప్రారంభం అవుతుంది. ఒక్కొక్క మోహినియాట్టం కార్యక్రమంలో సాధారణంగా 5 ముఖ్యమైన ప్రక్రియలు చేస్తారు.

1. చొల్ కట్టు, 2. వర్ణం, 3. జతిస్వరం / ముఖచాలం, 4. పదం, 5. తిల్లానా.

మోహినియాట్టంలో జయదేవుని అష్టపదులు చాలా విరివిగా ఉపయోగిస్తారు.

భరతనాట్యంలో అలరిప్పులా మోహినియాట్టంలో చొల్‌కట్టు. అలరిప్పులోలా కాకుండా చొల్‌కట్టులో ఒకే రాగం తాళం ఉపయోగిస్తారు. నృత్తం మాత్రమే కాకుండా ఏదైనా ఒక దేవునిపై శ్లోకాలు కూడా ఇందులో ఉంటాయి. ఇందులో మనకి కొత్తగా కనిపించేది ముఖచాలం. ముఖంలో నృత్తం చలనం చూపడమే ముఖచాలం. ఇది కథాకళి నుంచి తీసుకున్న ఒక నృత్త ప్రధానమైన ప్రక్రియ. జతిస్వరంలో జతులు స్వరాలు ఉంటాయి. ఇందులో అనేక రాగాలు తాళాలు ఉపయోగిస్తారు. రెండూ నృత్త ప్రధానమైనవే.

పదం సాధారణంగా మలయాళం అయి ఉంటుంది. కథకళిలో వాడేవే కొన్ని ఉపయోగించినా చేసే విధానంలో తేడా ఉంటుంది. కుమ్మి, కైకొట్టుకలివంటి జానపద నృత్యాల జాడలు ఇందులో కనిపిస్తాయి.

మోహినియాట్టం ప్రాథమికంగా ఒకరే చేసే సోలో నృత్య ప్రక్రియ. 2-3 గంటలపాటు చేసే మోహినియాట్టం ప్రదర్శన ఎక్కువగా శృంగారం భక్తిప్రధానంగా ఉంటాయి. మోహినియాట్టం సుందర స్నిగ్ధ మృదుల మధుర ముగ్ధ మోహనమైన శైలి, కేరళేతరులను ఆకర్షించింది. కనక్ రేలే, భారతి శివాజీవంటివారు దీనికి ఒక కొత్త కోణాన్ని సృజించారు. కనక్ రేలే శిష్యురాలు సునంద నాయర్ మోహినియాట్టం మీద చేసిన పరిశోధనకు నేను పరీక్షకుడిని. ఆమె అమెరికాలో మోహినియాట్టంని ప్రాచారం చేస్తోంది.



ఆహార్యం

మోహినియాట్టంలో వాడే వాయిద్యాలు తొప్పి మద్దలం, ఇది మృదంగంలాగే ఉంటుంది. ముఖవీణ, వేణువు, తాళం. ఆధునిక కాలంలో భరతనాట్యంవంటి వాద్య బృందాన్నే వాడుతున్నారు.

ఆహార్యం చాలా సామాన్యంగా అర్భాటం లేకుండా ఉంటుంది. తెలుపు బంగారపు అంచు కేరళ ముద్ర గలిగిన వస్త్రాలు. చోలి వేసుకుని, బంగారపు అంచు లేదా ఎరుపు అంచు చీరను కసవు చీర అంటారు అది ధరిస్తారు. ఇది నడుం ముందు భాగంలో విసినికర్రలా తెరుచుకుంటుంది. జుట్టు ముడిగా ఒకపక్కు కట్టి దానిపై మల్లెలు ధరిస్తారు.

మోహినియాట్టంలో సాధారణంగా ఒకరే నృత్యం చేస్తారు. అభినయ ప్రధానంగా, కైశికీ శైలిలో ఉంటుంది. నీనాప్రసాద్ మోహినియాట్టంలో పరిశోధన చేసి మిగిలిన



ఆహార్యం

నృత్యరీతులు అభ్యసించిన ఒక ప్రముఖ నర్తకి. కాలక్రమంలో గ్రూపు డాన్సులు వచ్చాయి. అంతేకాకుండా ఏదైనా ఒక విషయాన్ని తీసుకుని దానిపై రచనలను అంటే thematic ప్రదర్శనలూ వచ్చాయి. ఇందులో ఒక చక్కని తత్త్వసాంద్రమైన ప్రక్రియ 'పందాటం'. అంటే బంతి ఆట. జీవితం ఒక కిందపడి, మీదకెగిరి, తిరిగి కిందపడి, మీదకిలేచే బంతివంటిది అనే ఈ తత్త్వం ఒక విశిష్టమైన రచన. నృత్తరత్నావళిలో జాయనాచార్యుడు కందుక నృత్తం అని ఒక ప్రక్రియ చెప్తాడు. అదే ఇది.

మోహినియాట్టం కార్యక్రమం సాధారణంగా తిల్లానా



నీనా ప్రసాద్- అభినయం

లేదా మంగళంతో ముగుస్తుంది. మోహినియాట్టంకి మూలపురుషులైన స్వాతి తిరుణాల్ మహారాజారచించిన భజనతోనో, లేదా వల్లతోల్ మహాకవి రచనతోనో కార్యక్రమం ముగిస్తారు.

భరతనాట్యం మోహినియాట్టం రెండింటిలో ఎన్నో సమాంతర రేఖలు కనిపిస్తాయి. రెండు శాస్త్రీయ నృత్యాలు, ప్రముఖంగా సోలో నృత్యాలు, ఒకే ప్రాంతంలో ఉంటూ ఒకదానిపై ఒకటి ప్రభావం చూపకుండా ఉండడం అసాధ్యం. మోహినియాట్టం తన వ్యక్తిత్వాన్ని ప్రత్యేకతను, వైశిష్ట్యాన్ని నిలుపుకోడానికి ప్రయత్నం చేస్తోంది. ఇంకొక విచిత్రం ఏమిటంటే మోహినియాట్టం నేర్చుకున్న చాలామంది భరత నాట్యం కూడా



నీనా - అభినయం

నేర్చుకోడం. కాని కలిసినట్టు కనిపిస్తూనే కలవని సమాంతర రేఖలు భరత నాట్యం, మోహినియాట్టం.


కేరళీయులకు వారి కళలపై మక్కువ ఎక్కువ. వారి ప్రాంతీయతపై మమకారం, శ్రద్ధ ఈ నృత్యాన్ని నిలపెడుతున్నాయి.

ఆచార్య పప్పు వేణుగోపాలరావు,
చెన్నై. e-mail: pappuvenu@gmail.com

# కాకతీయులు - 3

## సార్వభౌమ పాలకులు – రుద్రమదేవి, ప్రతాపరుద్ర చక్రవర్తి

*– రావినూతల సత్యనారాయణ*



క్రిందటి వ్యాసంలో కాకతీయ సార్వభౌమ పాలకులైన రుద్రదేవుడు, మహాదేవుడు, గణపతిదేవ మహారాజులను గురించిన చారిత్రకాంశాలను, మహావీరులుగా, దూరదృష్టిగల రాజనీతిజ్ఞులుగా వారు సాధించిన విజయాలు, తెలుగుదేశపు రాజకీయ సమైక్యతను చర్చించడం జరిగింది.

ప్రస్తుత వ్యాసంలో కాకతీయ చక్రవర్తులుగా, ఖ్యాతిగడించిన, పరిపాలనా దక్షులుగా చరిత్రకెక్కిన రుద్రమదేవి, ప్రతాపరుద్ర చక్రవర్తులను గూర్చి తెలుసుకుందాం. ఆకరాలను, ఆధారాలను పరిశీలించి, సమీకరించిన చారిత్రకాంశాలను వీలైనంత సమగ్రతతో చిత్రించే ప్రయత్నం జరిగింది. ఈ విధానం పాఠకుల అవగాహనకు తోడ్పడుతుందని ఆశిస్తాను.

**రుద్రమదేవి** *(క్రీ.శ.1262-1289)* :

తన పట్టపురాణి వలన మగసంతానం కలుగని గణపతిదేవుడు తన కూతురు రుద్రమదేవిని రాజ్యానికి వారసురాలిగా యెంపిక చేశాడు. ఆమె క్రీ.శ. 1259-60 నుండి రుద్రదేవ మహారాజన్న పేరుతో తండ్రితో పాటు రాజ్యం చేయసాగింది.

పాండ్యుల చేతిలో ముత్తుకూరు యుద్ధంలో కాకతీయ సైన్యాలు పరాజయం చవిచూచిన రోజులవి. గణపతిదేవ మహారాజు అంతిమంగా కృష్ణానది వరకు చొచ్చుకు వచ్చిన దాడిని తిప్పికొట్ట గలిగాడు కాని, దక్షిణ భూభాగాలపై తన పట్టును వదులుకోవలసి వచ్చింది. అతడి ఈ బలహీన పరిస్థితులను పసిగట్టిన కొంతమంది సామంతులు ఆ పరిస్థితిని తమ స్వార్థానికి ఉపయోగించుకోసాగారు. ముఖ్యంగా కాయస్థులు స్వతంత్రులవడానికి ప్రయత్నించారు.

కొన్ని శాసనాలు గణపతిదేవుడు పదవీ విరమణ చేశాక కూడా పాలిస్తున్నట్లు పేర్కొంటాయి. అలాంటి శాసనాలలో ఒకటి క్రీ.శ. 1269నాటి గుంటూరు జిల్లా, పల్నాడు ప్రాంతం దుర్గిలో జన్నిగదేవుడు వేయించినది. ఆ శాసనం రుద్రమదేవిని పట్టోద్ధతి అని అభివర్ణిస్తుంది కానీ, రాణి అని చెప్పదు! పట్టోద్ధతి అనే పదం వ్రాయసగాని పొరపాటు. అసలు పదం పట్టోధృతి (పట్ట - రాజరికానికి, ఉద్-ధృతి - ఎంపిక చేయబడినది). క్రీ.శ. 1269లో కూడా రుద్రమదేవి కాబోయే రాణిగా మాత్రమే పేర్కొనబడింది కాని, సార్వభౌమ పట్టం కట్టడం జరుగలేదు. వృద్ధరాజు యింకా బతికి ఉన్నారన్నది మాత్రం వాస్తవమే. అయితే, ఒక స్త్రీ సింహాసనానికి రావటమన్న విషయాన్ని ఆమె బంధువర్గంలోను, సర్దారులలోను, సమ్మతి పొందలేదు. *ప్రతాప చరిత్ర* అనే సాహిత్య గ్రంథం గణపతిదేవుడికి మరో రాణి వల్ల కలిగిన పుత్రులు హరహర మురారీదేవులన్న నాయకులు రుద్రమదేవికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి రాజధానిని ముట్టడించినట్లు తెలియజేస్తోంది. ఇది కొంతమేరకు నిజమనిపిస్తోంది. ఎందుకంటే, ఆనాటి హిందూ ధర్మశాస్త్ర ప్రకారం మహిళ సింహాసనార్హురాలు కాదు. అయితే, పైన పేర్కొనిన హరిహర, మురారులు గణపతిదేవుడి కుమారులా? సోదరులా? అన్నది ఖచ్చితంగా తేలలేదు. ఎందుకంటే, ఒక్క ప్రతాపచరిత్రలో తప్ప మరెక్కడా వారి ప్రస్తావన లేదు. అందుచేత, రాజ

కుటుంబీకులే రుద్రమదేవిపై తిరుగుబాటు చేశారని నమ్మవచ్చు. ఏమైనప్పటికీ, రుద్రమదేవి తన విశ్వాసనీయులైన మద్ధతుదారుల సహాయంతో ఆ తిరుగుబాటును అణచివేసి సింహాసనాన్ని నిలుపుకోగలిగింది. ఆ విధంగా రుద్రమదేవికి సహాయపడిన విశ్వాసనీయ సామంతులలో కాయస్థ నాయకుడు జన్నిగదేవుడు, అతని తమ్ముడు త్రిపురారి, వెలమ నాయకుడు ప్రసాదిత్యులను పేర్కొనవలసి ఉంటుంది.

మరో తెలుగు గ్రంథం వెలుగోటివారి వంశావళి ప్రకారం, (వచనం - 17) ప్రసాదాదిత్యుడు కాకతీయ స్థాపనాచార్య అన్న బిరుదాన్ని ధరించాడు. అతడిని రాయపితామహుడని కూడా అన్నారు. శాసనాధారాలు ప్రకారం, మిగతా నాయకులు అంబదేవుడు, మహాప్రధాన కన్నర నాయకుడు, మహాప్రధాన గణపతిదేవ మహారాజులు, నిశ్శంక మల్లికార్జునుడు, మల్యాల గుండనాయకుడు, మండయ నాయకుడు కూడా రాయస్థాపనాచార్య, స్వామిద్రోహరగండ మొదలైన బిరుదులు ధరించారు. ఏమయినా, గణపతిదేవుడు, తన చివరి రోజులలో రుద్రమదేవి సింహాసనంపై గట్టిగా (స్థిరముగా) కూర్చోగలిగే విధంగా తగిన ఏర్పాట్లు చేశాడని తెలియుచున్నది. గణపతిదేవుడి చివరి రోజులు, మనం యింతకు ముందు పేర్కొనినట్లు, కాకతీయ రాజ్య దక్షిణ భూభాగాలపై పాండ్యుల దాడితో కల్లోలితమయ్యాయి. పాండ్య సేనాని కొప్పెరున్‌జింగ ద్రాక్షారామంలో, త్రిపురాంతకంలో వేయించిన శాసనాల ప్రకారం, అతడు తెలుగుదేశంపై దాడి చేశాడు కానీ, గణపతిదేవుడి చేతిలో పరాజయం పొదవలసి వచ్చింది. అయితే, గణపతిదేవుడు అతడిని గౌరవించి, వీరకడియంతో సత్కరించాడు! ఏమైనా, కాకతీయరాజు తిరిగి నెల్లూరు ప్రాంతంపై తన అధికారాన్ని తిరిగి సాధించుకోలేకపోయాడు. ఫలితంగా నెల్లూరు ప్రాంతం పాండ్యుల యేలుబడిలోనే ఉండిపోయింది. దానిని వీరగండ గోపాలుని సోదరులు పరిపాలించారు. గణపతిదేవుడు కాయస్థ నాయకుని పాలనకు ఇచ్చిన ములికినాడు, మార్జవాడి ప్రాంతాలు, రుద్రమదేవి సింహాసనం అధిష్ఠించే కాలానికి గణపతిదేవుడి అదుపు ఆజ్ఞలలో లేవు. క్రీ.శ. 1267నాటి కడపజిల్లా, ఎల్లారెడ్డిపల్లె శాసనం (Annual Report on *Indian Epigraphy* and *South Indian Epigraphy* 1937-38:No.226) ప్రకారం, కాయస్థుల రాజధాని వల్లూరు పట్టణం నుండి కలుకడకు చెందిన భుజబలవీర నారాయణ సోమేశ్వర మహారాజు ముల్కినాడు 300, హొన్నవాడి90, పెండేకల్లు800ను పరిపాలిస్తున్నాడు. మహామండలేశ్వర మురారికేశవ మహారాజు పాలన గురించిన ప్రస్తావన చూస్తే, కాకతీయుల మద్దత్తు ఉన్నప్పటికీ కాయస్థ నాయకుడు కొన్ని ప్రాంతాలలో తన పట్టును కోల్పోయాడని స్పష్టమవుతున్నది.

క్రీ.శ. 1278-79 వరకు రాజ్యతీర భూముల్లో కాకతీయ పరిపాలన ఆనవాళ్ళు కనిపించవు. గోదావరీ ప్రాంతంలో కనీసం, పదహారేళ్ళ పాటు కాకతీయ అధికారానికి గ్రహణం పట్టిందన్నది స్పష్టం! ఆ తరువాత, రుద్రమదేవిని ప్రస్తావించే కొన్ని శాసనాలు ద్రాక్షారామంలోను, ఇతర ప్రదేశాలలోను కనిపిస్తాయి. క్రీ.శ. 1262నాటి ఒక ద్రాక్షారామక్షేత్రమ శాసనం ఒక నరసింహ నరాధిపుని పేరును పేర్కొంటుంది. అతడు ఒరిస్సా గాంగరాజైన మొదటి నరసింహుడే అయ్యే అవకాశాలు అధికం. అతడి కొడుకు, వారసుడు అయిన మొదటి భానుదేవుడు క్రీ.శ. 1274లో వేంగిపై దాడిచేసి ద్రాక్షారామంలో రెండు శాసనాలు వేయించాడు. పోతినాయకుడు, ప్రోలినాయకుల నాయకత్వంలో గాంగసైన్యాలు ముందుకు చొచ్చుకు రాకుండా నిలుపుదల చేసేందుకు తూర్పునకు రుద్రమదేవి సైన్యాన్ని పంపింది. వారు శత్రువును పారద్రోలడంలో విజయులైనట్లు తెలియుచున్నది. గోదావరీ నది రెండు రాజ్యాల మధ్య సరిహద్దు అయింది. అలా తీరాంధ్రంలో రుద్రమదేవి అధికారాన్ని పునఃస్థాపించడం జరిగింది. అది కాకతీయుల పాలనాంతంవరకు వారి చేతిలోనే ఉన్నది. (పి.వి. పరబ్రహ్మశాస్త్రి). తెలంగాణా ప్రాంతాలు యాదవరాజుల పరిపాలనలో ఉన్నాయి. అలా,

గణపతిదేవుడు పొందిన మొత్తం రాజ్యం, రుద్రమదేవి రాజ్యపు పగ్గాలు చేపట్టే సమ్యానికి చెక్కు చెదరకుండా లేదు. ఆమె తన స్థానాన్ని పదిలపరచుకుంటున్న తరుణంలోనే, సేవుణరాజు మహాదేవుడు రాజధాని వరంగల్లుపై దాడియెత్తి రావటమనే పెద్ద ప్రమాదాన్ని రుద్రమదేవి యెదుర్కోవలసి వచ్చింది. మహాదేవుని శాసనాలు, అతడు త్రిలింగాధిపతినీ, అతని ఏనుగులనూ పట్టుకున్నట్లు చెప్తాయి. యాదవుల కొలువులో ఉన్న ప్రసిద్ధ ధర్మశాస్త్రవేత్త, తన ప్రఖ్యాత వ్రతఖండంలో తన ప్రభువు మహాదేవుడికి తిలుంగురాయశిరఃకమల మూలోత్పతన అన్న ఘనతను కట్టబెట్టాడు. అంటే, తెలుంగురాయని శిరస్సును ఖండించిన వ్యక్తి! అయితే, ఈ బిరుదాన్ని పరిశీలిస్తే, మొదటి జైతుకికి కూడా ఈ బిరుదం ఉన్నట్లు తెలియుచున్నది. అతడు వాస్తవంగా క్రీ.శ. 1196లో రుద్రుడిని వధించాడు. మహాదేవుడికి సంబంధించినంతవరకు ఈ బిరుదం వారసత్వంగా వచ్చిందని మనం భావించవచ్చు.

పదిహేడో శతాబ్దపు సాహిత్యగ్రంథం *ప్రతాప చరిత్ర* ప్రకారం, యాదవరాజు మహాదేవుడు కాకతీయరాజ్యంపై దండెత్తి రాజధాని వరంగల్లును ముట్టడించాడు. రాణి రుద్రమదేవి అతడితో పదిహేను రోజులు యుద్ధం చేసి, అతడిని దేవగిరి కోట వరకు తరిమింది. ఆమె మూడు లక్షల సేవుణ అశ్విక బలాన్ని ధ్వంసం చేసినట్లు తెలియుచున్నది. శాసన సాక్ష్యం కూడా రుద్రమదేవి ఈ విజయాన్ని ధృవపరుస్తుంది. బీదరు కోటలోని ఒక శాసనం కాకతీయ ప్రభువులు - రుద్రుడు, మహాదేవుడు, గణపతిదేవుడు అతడి కుమార్తె రుద్రమల గురించి సుదీర్ఘంగా వర్ణిస్తుంది. ప్రస్తుతం లభ్యమౌతున్న భాగం చివరలో రాణి సామంతుడైన సిందవాడి వంశస్థుడు భైరవుని పరిచయం చేయడం జరిగింది. రుద్రమదేవి చేసిన అన్ని దండయాత్రల్లో సేనానిగా అతడు ఆమెను అనుసరించినట్లు చెప్పుకున్నాడు. ఈ శాసనం (పరబ్రహ్మశాస్త్రి 1965:No.61) శకలంగా ఉన్నప్పటికీ, సేవుణరాజ్యం దక్షిణ భూభాగంలో మరే కాకతీయ శాసనాన్ని కనుగొనకపోవడంవల్ల, రుద్రమదేవి యాదవ రాజ్యంపై దాడిచేసినట్లు ధృవపరుస్తుంది. బేడదకోట (బీదరు) కాకతీయ రాజ్యంలో చేరిపోవడం వల్ల ఆ దాడి విజయవంతమైందని తెలుస్తుంది. తన రాజుకు జరిగిన పరాభవాన్ని గ్రంథస్థం చేయడం యిష్టపడని హేమాద్రి వాస్తవాన్ని కప్పిపుచ్చి, తన ప్రభువు రుద్రమ స్త్రీ కనుక చంపడానికి యిష్టపడక వదలివేశాడని చెప్పి తప్పించుకున్నాడు! మరోవైపున, తన అధికారాన్ని యాదవరాజ్య దక్షిణ ప్రాంతంలో స్థాపించి, యాదవ భూభాగాన్ని ఆక్రమించిన ఏకైక కాకతీయ ప్రభువు రుద్రమే! మహాదేవుడు శాంతిని అర్థించి, నష్టపరిహారంగా ఎంతో ధనాన్ని, గుర్రాలను సమర్పించినట్లు పేర్కొనబడినది. మరో విషయం కూడా మనం గుర్తుంచుకోవాలి. కొంతమంది రాజకుటుంబానికి చెందిన యాదవ నాయకులు, సారంగపాణిదేవుడులాంటివాళ్ళు, మహాదేవుడితో విభేదించి ఆంధ్రదేశంలో ఆశ్రయం పొందారు. అంతేకాదు, రుద్రమదేవి ఆదరణలో చిన్న చిన్న రాజ్యాలు పొందగలిగారు. యాదవ రాకుమారుడు యల్లనదేవుని ఆలపాడు దానశాసనం ప్రకారం, అతడు భిల్లమ జైతుగిల వంశంలో జన్మించి, కాకతీయ రుద్రమదేవి కూతుర్ని వివాహం చేసుకున్నాడు. అందువల్ల, యాదవరాజు కుటుంబానికి చెందిన కొంతమంది సభ్యులు తమ స్వస్థలాలను వదలి, రుద్రమదేవి పరిరక్షణలో ఆంధ్రదేశంలో స్థిరపడినట్లు స్పష్టమవుతుంది.

రుద్రమ పాలన ప్రారంభంలో, కాయస్థ నాయకుడు జన్నిగదేవుడు పాండ్యుల ఆధిపత్యానికి వ్యతిరేకించి, అంతం పలికాడు. ఆ విషయాన్ని క్రీ.శ. 1264నాటి నందలూరు శాసనం రూఢి చేస్తుంది. అతడికి వారసుడుగా అతడి తమ్ముడు త్రిపురాంతకుడు లేక త్రిపురారి వచ్చాడు. కాకతీయ రుద్రమ సామంతుడుగ మూడేళ్ళు క్రి.శ. 1270 నుండి 1272 వరకు పాలించాడు. అయితే, అతడి తమ్ముడూ వారసుడు, ''అయిన అంబదేవుడు'' తన జీవిత ప్రారంభంలోనే తన కోసం స్వతంత్ర రాజ్యం నిర్మిచుకోవాలన్న నిశ్చయంతో ఉన్నాడు. అతడు తన పొరుగు రాజులతో నిత్యం

యుద్ధాలు చేశాడు. తన శాసనాలు అన్నిటిలోను తన ప్రభ్వీణి (రుద్రమ) పేరును ప్రస్తావించకపోవడం చూస్తే, రాణి రుద్రమదేవి పట్ల అతడి ధిక్కార ధోరణి వ్యక్త మవుతుంది. క్రీ.శ. 1290 నాటి అతని త్రిపురాంతకం శాసనం (South Indian Inscriptions X:465) తాను చాలామంది మాండలికుల పై సాధించిన విజయాన్ని గురించి చెప్తుంది. అయితే, వారంతా కాకతీయరాణి రుద్రమదేవి సామంతులే. అదే శాసనం పాండ్యులు, యాదవులలాంటి మరో రాచబృందం గురించి ప్రస్తావిస్తుంది. వారితో అతడు సంపర్కం పెట్టుకొని, వారినుండి బిరుదులు, గుర్రాలు, యేనుగులు, ఆభరణాలు మొదలైన వాటి రూపంలో బహుమతులు పొందాడు. త్రిపురాతకం శాసనం ప్రకారం అతడు ఓడించిన మొదటి శత్రువు శ్రీపతిగణపతి; అతడి బిరుదం రాయసహస్రమల్ల తాను జయించిన రాజులలో ఒకడని చెబుతూ, అంబదేవుడు నీలగంగవరంలో వేయించిన శాసనం (Epigraphia Indica XXV:227)లో చెప్పిన గురిందాల గణపతే పైన పేర్కొనిన గణపతి అని గుర్తించడం జరిగింది. అతడు రుద్రమదేవ మహారాజు ఉరఫ్ రాణి రుద్రమ సామంతుడుగా గుంటూరు జిల్లా గురింతల లేక గురజాలలో పరిపాలిస్తున్నవాడు. ఈ పోరాటంలో అంబదేవుడు కాకతీయరాణికి చెందిన డెబ్బైమంది నాయకులతో తలపడినట్లూ, వారి శిరస్సులు తాను ఖండించినట్లూ చెప్పుకున్నాడు. ఆ తర్వాత, అంబదేవుడు కలుకడ నాయకులైన కేశవదేవుడు, సోమిదేవులను, వారి మిత్రుడైన గుత్తి తెలుగు చోడ పాలకుడు అల్లుగాంగుని ఓడించి క్రీ.శ. 1263లో పాండ్య దండయాత్ర కాలము నుండి వారి ఆధీనంలోవున్న కాయస్థ దేశాన్నీ, రాజధాని వల్లూరు పట్టణాన్ని తన రాజధానిగా చేసుకొని, పెన్నానది ఒడ్డున ఉన్న బలమైన గిరిదుర్గం గండికోటను మరింత బలయుతం చేశాడు. అటు తర్వాత, అతడు ఏరువ ప్రాంతానికి చెందిన మనుమల్లి దేవునిపై దాడిచేసి, అతడిని యుద్ధంలో వధించి, అతడి భూప్రాంతాలను కైవసం చేసుకన్నాడు. అలాగే, ఏరువకు పొరుగు ప్రాంతమైన పెండేకల్లును కూడా, తన కూతుర్ని పెండేకల్లు నాయకుడైన బొల్లయ కొడుకు రాజన్నకిచ్చి వివాహం చేసి, ఆ సంబంధం కారణంగా, ఆ ప్రాంతాన్ని కాయస్థ రాజ్యంలో భాగంగా చేసుకున్నాడు.

అంబడిదేవుని ప్రగతి నిరోధించడానికి రాణీ రుద్రమదేవి పంపిన కాకతీయ సామంతులతో పోరాడటంవల్ల, అతడికీ విజయాలు లభించాయి. ఆ విధంగా, అంబదేవుడు ఆంధ్రదేశంలోని అందరు రాజులనూ జయించి, కీర్తి సంపాదించాడు. అయితే తన పాలన మొదటి సంవత్సరాలలో శీఘ్రగతిన అంబదేవుడు సాధించిన విజయాలు యెక్కువకాలం నిలువలేదు. కాకతీయ రాణి రుద్రమదేవికి కాబోయే వారసుడు ఆమె మనవడు (కూతురి కొడుకు) అయిన ప్రతాపరుద్రుడు, పాలనా పగ్గాలను యుక్తవయసు రాగానే చేపట్టాడు.

కుమార రుద్రదేవుడు (రెండవ ప్రతాపరుద్రుడు) మొదటగా చేసిన పని సైనిక నిర్మాణానికి వెన్నెముక అయినటువంటి నాయంకర విధానాన్ని పునర్వ్యవస్థీకరించడం. గడచిన కొన్నేండ్ల నుండి అది శక్తినీ, సామర్థ్యాన్నీ కోల్పోయినట్లు కనపడుతుంది. తన కొత్తగా యేర్పాటైన రాజ్య భద్రతకుండే ఈ ముప్పును గమనించిన అంబదేవుడు, తన భూభాగాలను కాపాడుకొనే చర్యలు చేపట్టాడు. ఎన్నో యుద్ధరంగాలలో తాను విజయం సాధించినప్పటికీ, తన సైన్యం నిశ్చితంగా కాకతీయుల బలగాలతో తలపడడానికి అసమర్థమన్న విషయాన్ని గుర్తించి, అంబదేవుడు దేవగిరి సేవుణలతోను, దక్షిణాన పాండ్యులతోను మైత్రి సంబంధాలు పెంచుకొన్నాడు. నీలగంగవరం శాసనం (Epigraphia Indica XXV:277) తమ గుర్రాలను పంపి పాండ్యులు సాయం చేశారని తెలియజేస్తుంది. అయితే, కుమార రుద్రదేవుడికి ఒక్క విషయం స్పష్టంగా తెలుసు. అంబదేవుడిపై సైనికుల దాడి చేయడంవల్ల అతని మిత్రులందరూ కాకతీయులతో యుద్ధానికి తలపడతారని అతనికి తెలుసు. అది ఒక ఘోర రణరంగంగా పరిణమించవచ్చు. అందుచేత, కుమార రుద్రదేవుడు అంబదేవుని మిత్రుల భూభాగాలపై త్రిముఖంగా దాడిని చేయ

నిశ్చయించుకున్నాడు. క్రీ.శ. 1291లో, కొలనిసోమ మంత్రి కొడుకు మనుమ గున్నయ, అతని బంధువు మరోమంత్రి ఇందలూరి పెదగన్నయ కుమారుడు అన్నమదేవుని నాయకత్వంలో ఒక సైన్యాన్ని త్రిపురాంతకం పైకి పంపాడు. ఈ సంఘర్షణ గురించిన వివరాలు మనకు తెలియకపోయినా, అంబదేవుడు ఓడిపోయి, దక్షిణంగా ములికినాడువైపుగా తిరిగి వెళ్ళిపోయి ఉంటాడన్నది నిశ్చిత విషయమే. ఒక్క దండయాత్రలో, కొలని, ఇందలూరి నాయకులు శత్రు బలగాలను చెల్లా చెదురు చేయడమేకాక, వారి డెబ్భైరెండు (72) కోటలను పట్టుకోవడం జరిగిందని శివయోగసారం (మొదటి భాగం - ఉపోద్ఘాతం) చెప్తుంది. త్రిపురాంతకం, ఆ చుట్టుప్రక్కల ప్రాంతాలూ మళ్ళీ రుద్రమదేవి ఆధీనములోకి వచ్చాయని, అంబదేవుడు వేయించిన శాసనం తర్వాత రెండు నెలల్లోనే ఇందులూరి అన్నయదేవుడు వేయించిన శాసనం (South Indian Inscriptions X:467) చెప్తుంది. నల్గొండ జిల్లాలోని చందుపట్ల శాసనం (Journal of Epigraphical Society of India, I:No9) పువ్వాడముమ్మడి అనే వీరుడు వేయించిన శాసనం. అది సోమనాథదేవుడికి భూమిని కానుకగా సమర్పించడాన్ని నమోదు చేస్తుంది. (రుద్రమదేవి తన సేనాని నాయక మల్లికార్జునుడు శివలోక ప్రాప్తి పొందాలన్న కోరికతో చేసిన దానమది) రాణీ రుద్రమదేవీ, ఆమె సేనాని నాయక మల్లికార్జునుడు ఒకే సమయంలో చనిపోయారని అది వెల్లడిస్తుంది. వారు అంబడిదేవుడితో త్రిపురాంతకంలో జరిగిన యుద్ధంలో మరణించి ఉండే అవకాశమే అధికం. ఆ తేదీ, ఇప్పుడు మనం ప్రస్తావించిన శాసనపు తేదీకి సమీపంలోనిదే. ఆ విధంగా, రుద్రమదేవి యుద్ధరంగంలో క్రీ.శ. 1290 - చందుపట్ల శాసన తిథిన మరణించినట్లు తెలియుచున్నది.

రెండవ కాకతీయ దండయాత్రకు స్థలం నెల్లూరు అయింది. త్రిపురాంతకం యుద్ధంలో రుద్రమదేవి స్వయంగా సైన్యాలకు నాయకత్వం వహించి, అంబదేవుడు, అతని మిత్రులపై యుద్ధానికి వెళ్తే, సకల సేనాధిపతి ప్రతాపరుద్రునికి కుడిభుజం అయిన, అడితమల్లు తీరం వెంబడి విక్రమసింహపురం (నెల్లూరు)వైపుగా సాగాడు. అక్కడ క్రీ.శ. 1282లో అంబదేవుడు పునఃప్రతిష్ఠించిన మనుమగండ గోపాలుడు రాజ్యం చేస్తున్నాడు. కాకతీయ సైన్యాలు మనుమగండ గోపాలుని వధించి, ఓ మధురాంతక పొత్తపి రంగనాథుడిని (అతడిని రాజగండ గోపాలుడని కూడా అంటారు) - బహుశా అతడు మరణించిన రాజకుటుంబానికి చెందినవాడై ఉంటాడు - సింహాసనంపై కూర్చోబెట్టాయి. అయితే, ఆ చర్య అవివేకపు పని అని త్వరలో ఋజువయింది. సింహాసనమెక్కిన అతడు తనకు లాభం కూర్చిన వారికి విద్రోహం చేశాడు, పాండ్యులతో చేయి కలిపాడు. ఇంక తప్పక ప్రతాపరుద్రుడు నెల్లూరుపై మరో దండయాత్రను చేయించాడు. సహజంగానే యుద్ధంలో పాండ్యులు పాల్గొన్నారు. కాకతీయ సైన్యానికి మనుమగొండ గోపాలుడు సారథ్యం వహించాడు. ఇతడు గుంటూరు జిల్లాలోని నరసరావుపేట ప్రాంత పాలకుడైన మరో తెలుగు చోడనాయకుడు. రాజగండ గోపాలుడు, అతని పాండ్య మిత్రులు గట్టి ప్రతిఘటన చూపారు కాని పరాజయం పాలయ్యారు. (South Indian Inscriptions IV:661). మనుమగొండ గోపాలుని నరసరావుపేట శాసనం కూడా సేవుణకటకవేణు కబళనదేవపావక (సేవుణ సేన అనే వేణు వనాన్ని దగ్ధం చేసిన అగ్ని) అన్న బిరుదాన్ని ప్రస్తావిస్తుంది. క్రీ.శ. 1294లో సేవుణ రాజుకు వ్యతిరేకంగా సాగిన కాకతీయ దండయాత్రలో అతడు పాల్గొన్నాడన్న అర్థమిస్తుంది అది. రాయచూరు కోట శాసనం (Andhra Pradesh Archeology Series 3:101-02) ప్రకారం, వర్ధమానపురానికి చెందిన కాకతీయ సామంతుడు గోనవిఠలుడు కర్నూలు జిల్లాలోని ఆదవాని, తుంబళం కోటలను, రాయచూరు నదీ మధ్య ప్రాంతములోని మనువ, హాలువలను కూడా పట్టుకున్నాడు. ఈ ప్రాంతాన్ని ఏలుతున్న నాయకులను ఓడించి, అంతిమంగా విఠలుడు రాయచూరులోకి ప్రవేశించాడు. అక్కడి నివాసస్థుల రక్షణార్థం ఒక కోటను కట్టించాడు. దేవగిరి యాదవుల నుండి కృష్ణ - తుంగభద్రా

నదీ మధ్య ప్రాంతాన్ని గోనవిఠలుడు కైవసం చేసుకున్నాడని స్పష్టమవుతున్నది.

**రుద్రమదేవి విశిష్ట వ్యక్తిత్వం:**

రాణి రుద్రమదేవి నిస్సందేహంగా ఆంధ్రదేశపు గొప్ప పాలకుల్లో ఒకామెగా పరిగణించబడుతుంది. అంతేకాదు, భారతదేశపు స్త్రీ పాలకులందరిలో ఆమెకు ప్రత్యేక స్థానం ఉన్నది. ఇతర స్త్రీ పాలకులందరూ తమ భర్తలకు పరిపాలనలో సహాయం చేశారు; లేదా చిన్నవారైన కొడుకుల తరపున రాజప్రతినిధిగా రాజ్యం చేశారు. రాణి రుద్రమదేవి భారతచరిత్రలోనే తొలి స్వతంత్ర స్త్రీ పరిపాలకురాలని చెప్పవచ్చు?! నిడుదవోలు ప్రభువు చాళుక్య వీరభద్రుడితో వివాహం అయినప్పటికీ, తనను తాను కాకతీయ వంశజగానే శాసనాలలో పేర్కొంది.

రుద్రమదేవి పాలన విషయానికి వస్తే, ఆమెను తండ్రి గణపతిదేవుడు చిన్ననాటి నుండే పాలనా వ్యవహారాలలో శిక్షణ యిచ్చి, తీర్చిదిద్దాడు. దీనికి సాక్ష్యంగా గణపతిదేవుడి పాలనా సంవత్సరాలలో రుద్రమదేవి ఆయన తరపున పాలించడం. తండ్రి మరణాంతరం కాకతీయ సామ్రాజ్యానికి పాలకురాలు అయింది. "రాజ్యపాలనలో ఆమె క్రియాశీల పాత్ర పోషించింది. పురుష వస్త్రాలు ధరించి రోజూ సభకు వచ్చేది, విదేశస్థులను కలిసేది, వేగులవారు అందించే సమాచారాన్ని వినేది, రాజ్యంలోని ప్రముఖులతో మంత్రులతో, సేనానులతో సంప్రదింపులు జరిపేది. రాజ్యపు ఆసక్తులకు అనుగుణంగా, వాటిని మెరుగుపరిచే విధంగా వారెలా ప్రవర్తించాలో, చర్యలు తీసుకోవాలో సలహా ఇచ్చేది. అవసర పడినప్పుడు, స్వయంగా యుద్ధభూమికి వచ్చి, శత్రువుకు యెదురుగా తలబడి తన సైన్యాన్ని నడిపేది. క్లుప్తంగా చెప్పాలంటే, ఆమె వీరత్వం, ధైర్యం కలిగిన యోధ; యుద్ధ సమయంలోనూ, ప్రశాంత సమయంలోనూ నాయకురాలు తన మనుషులను నడపగలిగే గొప్ప సామర్థ్యమున్న వనిత". (పి.వి. పరబ్రహ్మశాస్త్రి).

**మంత్రులు, సామంతులు, ఇతర అధికారులు:**

రుద్రదేవుడు, గణపతిదేవుడుల పరిపాలనా కాలంలో క్రియాశీలక భూమిక వహించి, సేవలందించిన విశ్వాసపాత్రులైన రేచర్ల, మల్యాలవంటి ప్రముఖులు రుద్రమదేవి హయాంనాటికి వయోవృద్ధులై విశ్రాంతి తీసుకునే దశకు చేరుకున్నారు. వారి స్థానంలో కొత్తవారు వచ్చారు. అట్టివారిలో గోన కుటుంబానికి చెందిన రెడ్డినాయకులు, వెలమనాయకులు పేర్కొనదగినవారు. వెలమ ప్రముఖుడైన ప్రసాదాదిత్యుడు రాణి రుద్రమదేవి పాలనా కాలంలోనే ఖ్యాతి గడించాడు. రుద్రమదేవి సామంతులలో కాయస్థనాయకులు శక్తిమంతులై కాకతీయ రాజ్యపు నైరుతి ప్రాంతానికి భద్రత కల్పించారు. కాయస్థనాయకులు అంబదేవుడి పరిపాలనకు ముందు కాకతీయులకు విధేయులై శత్రువులనణచటంలోను, రుద్రమదేవి పరిపాలన సుస్థిరపరచడంలోను పాటుపడ్డారు. స్వాతంత్ర్యము ప్రకటించుకొనేవరకు అంబదేవుడు కాకతీయులకు విధేయుడుగానే వ్యవహరించాడు. అతడు రుద్రమదేవికి యెదురు తిరిగి, స్వాతంత్ర్యము ప్రకటించుకోవడానికి దారితీసిన పరిస్థితులు ఏమిటో ఖచ్చితంగా తెలియదు. అయితే, కోనహైహయులు, వేంగిదేశపు పాలకులైన చాళుక్యులు రాణీ రుద్రమ ఆధిపత్యాన్ని అంగీకరించినట్లు తెలియుచున్నది. క్రీ.శ. 1262-1278 సంవత్సరాల మధ్య వేంగిదేశంలో ఎక్కడా కాకతీయుల శాసనాలు లభించకపోవడాన్నిబట్టి, ఆ కాలంలో రుద్రమదేవి వేంగిప్రాంతంపై తన పట్టును కోల్పోయిందేమోనన్న భావన కలుగుతుంది. చాళుక్య వంశీయుడైన వీరభద్రుని మంత్రి అయిన విష్ణువు ఇచ్చిన కొన్ని, దానాల ప్రస్తావన తణుకు, నరసాపురంలో లభించిన కొన్ని శాసనాలలో కనిపిస్తుంది. ఆరె, లేక మహారాష్ట్ర జాతీయులైన అనేక కుటుంబాలు దక్కను పశ్చిమ ప్రాంతము నుంచి తెలుగుదేశానికి వలస వచ్చి శ్రీశైల పర్వత ప్రాంతాలలో స్థిరపడ్డట్లు కనిపిస్తుంది. అందువలనే ఆప్రాంతం ఆరెభూమిగా ఆరెవీడుగా వాడుకలోనికి వచ్చినదని తెలియుచున్నది. రుద్రమదేవికి చేదోడు-వాడోడుగా ఉన్న సామంతుల్లో దేవగిరి రాజైన సింఘన యాదవుని కుమారుడు సారంగపాణి దేవుడు ముఖ్యుడు.

అలాగే ఆరె జాతీయుల్లో రాణకగోపదేవరాజు మరో ప్రముఖుడు. ఇతడు కాకతీయ సైన్యంలో దళాధిపతిగా సేవలందించాడు. సిందవంశానికి చెందిన మైల కుమారుడైన భైరవుడు రుద్రమదేవికి సామంతుడుగా ఉండేవాడనీ, వేంగి, ద్రావిడ దేశాలపైన, యాదవ రాజులపైన రుద్రమదేవి జరిపిన దండయాత్రల్లో భైరవుడు ఆమెతో యెక్కువగా సహకరించాడని యిటీవల వెలుగు జూచిన బీదరు శాసనం పేర్కొంది. పశ్చిమ ప్రాంతంలో చెరకు కుటుంబానికి చెందిన నాయకులు వారసత్వ సామంతులుగా సేవలందించారు.

రుద్రమదేవి, కుమార రుద్రదేవుల హయాంలో మహాప్రధానులుగా పనిచేసిన పలువురిని గురించి ఆనాటి శాసనాలలో ఉల్లేఖించారు. అటువంటి వారిలో రాజకుటుంబానికి చెందిన గన్నయ పుత్రుడైన ఇందలూరి అన్నయదేవుడు ముఖ్యంగా పేర్కొనదగిన మహాప్రధాని. రాణి రుద్రమదేవికి బాహత్తర నియోగాధిపతిగా పనిచేసిన పొంకల మల్లయ ప్రెగ్గడ తర్వాతి కాలంలో ప్రాముఖ్యత వహించాడు. గండ పెండెర గ్రహీత గంగయ సాహిణి క్రీ.శ. 1258లో మరణించడంతో మల్లయ ప్రెగ్గడ ఆ స్థానాన్ని భర్తీ చేశాడు. పైన పేర్కొన్నవారి సహాయ, సహకారాలతో రుద్రమదేవి పాలన సాగింది. ఆమె పాలనా కాలంలో ఎక్కువ భాగం సంఘటనాత్మకమై యుద్ధాల మధ్య గడచింది.

**రుద్రమదేవి కుటుంబ వివరాలు:**

ఇంతకు ముందే చెప్పుకున్నట్లు రుద్రమదేవి చాళుక్య రాకుమారుడైన వీరభద్రుని వివాహమాడింది. ఆ దంపతులకు మగ సంతానము లేదు కాని ముగ్గురు కుమార్తెలున్నారు. వారు: ముమ్మడమ్మ, రుద్రమ, రుయ్యమ్మ. పెద్ద కుమార్తెను మహదేవుడనే కాకతీయ రాజకుమారునికిచ్చి పెళ్ళి చేశారు. యాదవ రాజకుమారుడు ఎల్లణదేవుడు రెండవ కుమార్తెను పరిణయమాడాడు. మూడవ కూతురును ఇందలూరి నాయకుడు అన్నయను వివాహమాడింది. వీరిలో మొదటి కుమార్తె ముమ్మడమ్మ పుత్రుడే కుమార రుద్రుడు లేక రెండవ ప్రతాప రుద్రుడు. అతడే రుద్రమదేవి సింహాసనానికి వారసుడయ్యాడు.

**ప్రతాపరుద్రుడు (క్రీ.శ. 1290-1323):**

రుద్రమదేవికి వారసుడిగా ఆమె మనవడు (ఆమె పెద్ద కూతురు ముమ్మడమ్మ కొడుకు) ప్రతాపరుద్రుడు క్రీ.శ. 1290లో రాజ్యానికి వచ్చాడు. ప్రతాపరుద్రుడు కాకతీయ సింహాసనము అధిష్ఠించిన తరువాత కూడా, చాలా ఏళ్ళపాటు కుమార రుద్రదేవుడనే పిలువబడేవాడని తెలియుచున్నది. (పి.వి. పరబ్రహ్మశాస్త్రి). అయితే, ప్రతాపరుద్రుడు తన పట్టాభిషేకానికి ముందు కాలం నుండే, తన అమ్మమ్మతో పరిపాలనలోను, సైనిక దండయాత్రలలోను పాలుపంచుకున్నట్లు చరిత్ర చాటుచున్నది. ప్రతాపరుద్రుడు సింహాసనం అధిష్ఠించిన తరువాత దేశ శత్రువులు కానీ, సర్దారులు కానీ అతనిపై తిరుగుబాటు చేయటానికి సాహసించలేకపోయారు. యువరాజుగా అతడి మొదటి సైనికచర్య కాయస్థనాయకుడు అంబదేవుడికి వ్యతిరేకంగా సాగింది. అందులో అంబదేవుడు అపజయం పాలయ్యాడు. ఫలితంగా అంబదేవుడు త్రిపురాంతకం ప్రాంతాన్ని వదిలి వెళ్ళాల్సి వచ్చింది. అంబదేవుడి మరణానంతరం, అతని కొడుకు, వారసుడైన రెండవ త్రిపురారి ముల్కినాడుపై స్వతంత్రంగా అధికారంగా అధికారం చెలాయిస్తున్నట్లు కనిపిస్తుంది. ఆప్రాంతంలో కాకతీయ శాసనాలు లేకపోవడం, ఉన్న శాసనాలలో రెండవ త్రిపురారి కాకతీయ ప్రభువును ప్రస్తావించకపోవడంవల్ల, ఆ భావం కలుగుతుంది. మహారాయ పట్టసాహిణి సోమయ, ఇందలూరి అన్నయల నాయకత్వంలో క్రీ.శ. 1309లో ప్రతాపరుద్రుడు కాయస్థులను పూర్తిగా అణచివేసే ఉద్దేశంతో సైన్యాన్ని పంపాడు. కాయస్థులు పూర్తిగా పరాజయానికి లోనయ్యారు. వారిప్రాంతం కాకతీయ రాజ్యంలో కలిసిపోయింది. ఆ ప్రాంత పరిపాలనను సోమనాయకునికి (సేనానికి) అప్పగించుట జరిగింది.

దక్షిణ దిక్కున భూభాగాలను పదిలపరచుకోక ముందే ప్రతాపరుద్రుడు ఉత్తరం వైపున ఢిల్లీ నుండి ముస్లీం దండయాత్రలను ఎదుర్కొనవలసి వచ్చింది. ఢిల్లీ సుల్తాన్ జలాలుద్దీన్ ఖిల్జీ అల్లుడు గర్షాస్ప్ మాలిక్

యాదవ రాజధాని దేవగిరిపై క్రీ.శ. 1295లో దాడిచేసి, దాన్ని స్వాధీనము చేసుకున్నాడు. దేవగిరిరాజు రామదేవుడు సుల్తాన్‌తో సంధి చేసుకున్నాడు. రామదేవుడు సుల్తాన్‌కు కప్పం రూపంలో పెద్ద మొత్తంలో నగదును, ఆభరణాలను చెల్లించవలసి వచ్చింది. అవి గుంజుకొని, అతడు ఢిల్లీకి వెళ్ళిపోయాడు. ముస్లీముల నుండి ప్రమాదం ఉందని ఊహించిన ప్రతాపరుద్రుడు తన రాజ్య రక్షణ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించి, నాయంకర విధానానికి మెరుగులు దిద్ది, 9,00,000 విలుకాళ్ళను, 20,000 గుఱ్ఱాలను, 100 యేనుగులను సమకూర్చుకున్నట్లు చరిత్రకారులు చెప్తారు. అలా సిద్ధపడిన ప్రతాపరుద్రుడు ఏడుసార్లకు పైగా ముస్లింల దండయాత్రలు త్రిప్పిగొట్టగలిగాడు. రెండు-మూడుమార్లు సుల్తాన్‌తో సంధి చేసుకొని, వారికి పెద్ద మొత్తంలో నగదు, నగలు, ఏనుగులు, గుఱ్ఱాలు సమర్పించుకున్నాడు. (పి.వి. పరబ్రహ్మశాస్త్రి).

సిరిసంపదలతో తులతూగుతున్న ఓరుగంటిపై ఖిల్జీ కన్ను పడింది! తెలంగాణాపై సుల్తాన్ అలాఉద్దీన్ ఖిల్జీ తొలిదాడి క్రీ.శ. 1303లో మాలిక్ ఫక్రుద్దీన్‌జునా, ఝూజు లేక కారాల నాయకత్వంలో జరిగింది. అతడి లక్ష్యం కొల్లగొట్టడం, రాజ్య విస్తరణ. దండయాత్ర బెంగాలు మీదుగా తెలంగాణాకు చేరింది. ఉప్పరిపల్లి వద్ద కాకతీయ సేనానులు వెలమనాయకుడు వెన్న (రేచర్ల ప్రసాదిత్యుని కొడుకు), పోతుగంటిమల్లి సైన్య సారథ్యం వహించి, వెలుగోటివారి వంశావళి ప్రకారం, (ఎన్. వెంకటరమణయ్య 1939:Verse No.35) తురుష్కుల గర్వమణిచారు. తన సైన్యం పొందిన ఈ పరాజయానికి పగ తీర్చుకోవడానికి, అలాఉద్దీన్ క్రీ.శ. 1309లో పెద్ద సైన్యాన్ని మాలిక్ నాయబ్ కాఫర్, ఖ్వాజాహాజీల నాయకత్వంలో తెలంగాణాను జయించడానికి పంపాడు. తన కోటను పరిరక్షించుకోవడానికి ప్రతాపరుద్రుడు అన్ని సాధ్యమైన ఏర్పాట్లను చేసుకున్నారు. ప్రతాప చరిత్ర ప్రకారం, బయటి కోటకు డెబ్భైబురుజుల్లో రక్షణ కల్పించాడు. ప్రతి బురుజుకూ రక్షకుడుగా ఒక నాయకుడిని ఏర్పాటు చేశారు. కోట ముట్టడి క్రీ.శ. 1310 జనవరి 19న మొదలై, 25రోజులు కొనసాగింది. లోపలి కోట పరిరక్షణ కష్టమవడంతో ప్రతాపరుద్రుడు శాంతికి అభ్యర్థించవలసి వచ్చింది. అందుకు పెద్ద ఖర్చు కాగా, భవిష్యత్తులోనూ, సుల్తానుకు బంగారం, ఏనుగులు, గుఱ్ఱాల రూపంలో కప్పం చెల్లించడానికి వాగ్దానం చేయాల్సి వచ్చింది. ప్రతాపరుద్రుడు ఈ వాగ్దానాన్ని నిలబెట్టుకున్నాడనీ, ఆయనకూ ఢిల్లీ సుల్తాన్‌కూ మధ్య స్నేహ పూర్వక వాతావరణం చాలాకాలం సాగినట్లు తెలియుచున్నది. ప్రతాపరుద్ర మహారాజు అన్య విషయాలలో మరోచోట వ్యస్తుడై ఉన్నాడని పసిగట్టిన సరిహద్దు ప్రాంతాల సామంతులు యిదే అనుకూల సమయంగా భావించి, తమ స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకుంటూ, తిరుగుబాటును మొదలెట్టారు. ఇది ప్రతాపరుద్రునికి, ఒక స్థానిక సమస్యగా పరిణమించి, ఇబ్బంది పెట్టసాగింది.

ముస్లీముల రెండో దాడి తర్వాత, ప్రతాపరుద్రుడు తన రాజ్యపు దక్షిణ ప్రాంతంలోని తిరుగుబాటును అణచివేయుటలో నిమగ్నమయ్యాడు. నెల్లూరు తెలుగు చోడనాయకుడు రంగనాథుడు స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నాడు. కాయస్థ నాయకుడి మద్దత్తుతో కాకతీయ చక్రవర్తి అధికారాన్ని వైదుంబ నాయకుడు మల్లిదేవుడు ధిక్కరించసాగాడు! జుట్టలెంక గొంకయరెడ్డి నాయకత్వంలో ప్రతాపరుద్రుడు మల్లిదేవుడికి వ్యతిరేకంగా సైన్యాన్ని పంపి, అతడి కోట గండికోటను పట్టుకున్నాడు. గండికోట సీమ, ఆ పరిసర ప్రాంతాలకు, గొంకయ రెడ్డిని రాజప్రతినిధిగా నిలిపాడు. ఇలా ఉండగా, అలాఉద్దీన్‌ఖిల్జీ క్రీ.శ. 1311లో తాను పాండ్యులకు వ్యతిరేకంగా తలపెట్టిన దండయాత్రలో సాయం చేయవలసిందని ప్రతాపరుద్రుని అడిగాడు. ఈ అవకాశాన్ని అనుకూలంగా మలుచుకుంటూ ప్రతాపరుద్రుడు కంచికి బయలుదేరి, నెల్లూరు తెలుగు చోడనాయకుడు రంగనాథుని అణచివేశాడు. ఆ కాలంలో తమిళదేశంలోని రాజకీయ పరిస్థితులు సంతృప్తికరంగా లేవు. క్రీ.శ. 1310లో మారవర్మన్ కులశేఖరడు మరణించాడు. అతడి ఇద్దరు కొడుకులు వీరపాండ్య,

సుందరపాండ్యుల మధ్య అంతర్యుద్ధం మొదలయింది. ఈ విధంగా పాండ్య రాజ్యంలో ఏర్పడిన అరాజక పరిస్థితులను గమనించిన హోయసలరాజు మూడవ భల్లాలుడు తమిళదేశంలో తన భూభాగాన్ని తిరిగి కైవసం చేసుకునే ప్రయత్నం చేశాడు. దక్కనులోని మాలిక్‌నాయబ్ నాయకత్వంలోని సుల్తాన్ సైన్యాలు కొన్నేళ్ళపాటు హోయసలరాజు ప్రయత్నాలను అదుపులో ఉంచాయి. సుల్తాన్ మరణించడం, ముస్లిం బలగాలను దక్షిణం నుండి ఉపసంహరించుకోవడంతో, భల్లాలుడు కాంచీ నగరాన్ని జయించడంలో సఫలుడయ్యాడు. అయితే, అది తాత్కాలిక విజయం మాత్రమే. కాకతీయ బలగాల సేనాని, పెద్దరుద్రుడు భల్లాలుడినీ, అతని మిత్రులు పడైవీడు శంబువరాయని, చంద్రగిరి యాదవరాయుని కూడా జయించి, కంచిని ఆక్రమించాడు. కాకతీయ సైన్యాలు సాధించిన విజయాన్ని మరింత ముదుకు సాగించి, పాండ్యులను భయభీతులను చేయడానికి ఉపకరించాయి. ప్రతాపరుద్రుడే స్వయంగా నాయకత్వం వహించాడు. వెలమనాయకులు రేచర్ల ఎర్రదాచ, సేనాని దేవిరి నాయకుడు మొదలయినవారితో కూడిన తెలుగు కాల్బలం అతనికి సాయం చేసింది. తన ప్రభువు ఆదేశం మేరకు దేవిరి నాయకుడు మరింత ముందుకు సాగి, వీరపాండ్యుడు, అతని మిత్రుడు మళయాళ తిరువుడి రవివర్మన్ కులశేఖరులను ఓడించి, వీరధవళలో సుందరపాండ్యుని సింహాసనంపై పునఃప్రతిష్ఠితుని చేశాడు. (Annual Report of Indian Epigraphy and South Indian Epigraphy, 1938-39:No.73 and Para-8 Part-11).

అలాఉద్దీన్ మరణించిన తర్వాత, మాలిక్‌నాయబ్ కఫూర్ కుర్రవాడైన రాకుమారుడు షాబుద్దీన్‌ను సింహాసనంపై నిలిపి, అతని ప్రతినిధిగా దేశాన్ని పాలించసాగాడు. అయితే, త్వరలో నాయబ్‌కఫూర్‌ను హత్యచేయడం జరిగింది. అలాఉద్దీన్ మరో కొడుకు, కుతుబుద్దీన్ ముబారక్‌షా షాబుద్దీన్‌ను పక్కకు నెట్టి, తాను సింహాసనము అధిష్ఠించాడు. తన స్థానాన్ని పదిలపరుచుకున్న తర్వాత, సుల్తాన్ ముబారక్‌షా క్రీ.శ. 1318లో దక్కనుపై దండయాత్ర ప్రారంభించాడు. మహారాష్ట్రలో హరపాలదేవుడి తిరుగుబాటును అణచి వేశాడు. అతడి నుండి దేవగిరి కోటని జయించి, హరపాలదేవుడిని వధించాడు. అటుతర్వాత, ప్రతాపరుద్రుడు ఏటేటా చెల్లించవలసిన కప్పాన్ని చెల్లించక, ఎక్కువ నిర్లక్ష్యం చేస్తున్నాడని, ఇప్పుడా కప్పాన్ని వసూలు చేయడం కోసం సుల్తాన్ తన విశ్వాసనీయ గులాము ఖుస్రూఖాన్‌ను, పెద్దసైన్యంతో వరంగల్లు పంపాడు. ప్రతాపరుద్రుడు ఏమాత్రం ప్రతిఘటించకుండా, శాంతిని వేడుకొని, 100 ఏనుగులు, అధిక సంఖ్యలో గుఱ్ఱాలు, అదనంగా బంగారం, వజ్ర వైడూర్యాల కప్పాన్ని చెల్లించి, తన రాజ్యంలోని ఐదు జిల్లాలను ధారాదత్తం చేయడానికి కూడా సమ్మతించాడు.

తుంగభద్ర నైరుతీ తీరంలో ఉన్న పొరుగు హిందూ రాజ్యం కంపిలితో ప్రతాపరుద్రుడి సంబంధాలు చెడిపోయి ఉన్నాయి. దానికి కారణం హోయసలరాజు మూడవ భళ్ళాలుడు ఆ రాజ్యంపై దాడి చేయడం. కన్నడ గ్రంథం కుమారరామన సాంగత్య ప్రకారం కుమార రాముడు భళ్ళాలుడికి వ్యతిరేకంగా ప్రతాపరుద్రుని సాయమర్థించాడు. అయితే, ప్రతాపరుద్రుడు తిరస్కరించాడు. ఆ కారణంగా కుమార రాముడు ప్రతాపరుద్రుని రెచ్చగొట్టాడు. శ్రీనాథ విరచిత భీమేశ్వరపురాణం ప్రకారం, ప్రతాపరుద్రుడి సేనాని ప్రోలయ అన్నయ కంపిలిరాయని రాజధాని కుమ్మటను విధ్వంసం చేశాడు. అదే సమయంలో కాకతీయ సామంతుడు, ఆరవీటి నాయకుడు తాత పిన్నమ కొడుకులలో ఒకడైన కొటికంటి రాఘవుడు కంపిలిరాయని యుద్ధంలో ఓడించి, అతడి రాజ లాంఛనాలను లాక్కొన్నాడు. ఈ వాస్తవాలను పరిగణనలోనికి తీసుకుని, ప్రతాపరుద్రుడు కంపిలిరాయలతో సంఘర్షించి, అతడిపై కొన్ని విజయాలను సాధించాడని తెలియుచున్నది. అయితే, ఆ విజయాలవల్ల ప్రతాపరుద్రునికి భూభాగాలు లభించినట్లు తెలియుటలేదు. (పి.వి. పరబ్రహ్మశాస్త్రి).

ఇలా ఉండగా, ఢిల్లీలోని పరిస్థితులు మారి సంఘటనలు వేగంగా జరిగాయి. సుల్తాన్ కుతుబుద్దీన్ ముబారక్‌షా ఖిల్జీని, అతని విశ్వాసనీయ సేనాని ఖుస్రూఖాన్ హత్య చేసి, సింహాసనాన్ని ఆక్రమించాడు. అతడిని, ఒక తుర్కీఅమీరు ఘియాసుద్దీన్ తుగ్లక్ వధించాడు. అతడు తనను సుల్తానుగా ప్రకటించుకుంటూ క్రీ.శ. 1320లో ఢిల్లీ సింహాసనం అధిష్ఠించాడు. తన పాలన మొదటి మూడు సంవత్సరాలలో తన స్థానాన్ని పదిలపరచుకొని, అతడి దృష్టిని దక్షిణానికి మళ్ళించాడు. తన కొడుకు ఉలుగ్‌ఖాన్ నేతృత్వంలో సైన్యాన్ని క్రీ.శ. 1323లో తెలంగాణాను స్వాధీనం చేసుకోమని పంపాడు. తెలంగాణాపై తన బలగాలను కొత్త సుల్తాను ఎందుకు పంపాడో, ఆ పరిస్థితులేమిటో మనకు స్పష్టంగా తెలియుటలేదు. పదిహేడో శతాబ్దం తొలి యేండ్లలో వ్రాసిన ఫెరిస్తా - వరంగల్లు రాజు రుద్రదేవుడు ఇటీవలి భూతకాలంలో జరిగిన గందరగోళం కారణంగా, సుల్తానుకు కప్పం పంప నిరాకరించాడు కనుక, ఉలుగ్‌ఖాన్ తన బలగాలను రాజుకు వ్యతిరేకంగా నడిపించాడు అని చెప్పాడు (బ్రిగ్స్ 1910: ఫెరిస్తా, 403). అది అసంభవమేమీ కాదు. అలాంటి పరిస్థితులలోనే అంతకుముందొకసారి ప్రతాపరుద్రుడు ముస్లిం బలగాలను యెదుర్కొనవలసి వచ్చింది. ముస్లిం సైన్యాలు ముందుకు రావటాన్ని ప్రతాపరుద్రుడు ఉత్సాహంతోనే ఎదుర్కొన్నాడు. కానీ, తప్పక తన రాజధానికి తిరిగి వెళ్ళవలసి రావడంతో, వెంటనే ఉలుగ్‌ఖాన్ దాన్ని ముట్టడించాడు. పై ముట్టడి నిజానికి సుదీర్ఘంగాను, తీవ్రంగాను సాగింది. యుద్ధం వరంగల్లుకు, ఆ చుట్టుప్రక్కల ప్రాంతాలకు మాత్రమే పరిమితం కాలేదు. ఉలుగ్‌ఖాన్ వృధాగా వరంగల్లును పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్న సమయంలోనే, ఢిల్లీ సైన్యంలోని ఒక భాగం మజీర్ అబు-రిజా నాయకత్వంలో కోటగిరిని పట్టికోవడానికి ప్రయత్నించింది. వివిధ సైనిక విభాగాలు దేశంలోని మిగతా ముఖ్య ప్రాంతాల పైన, దాడి చేయడం సంభవించే ఉండవచ్చు.? ఏమైనా ఉలుగ్‌ఖాన్ తన లక్ష్యాన్ని సాధించుటలో విఫలమయ్యాడు. తెలంగాణా నుండి వేగంగా తిరుగు ముఖం పట్టవలసి వచ్చింది. పారిపోతున్న వారిని కాకతీయ బలగాలు వెంటబడి, తరిమాయి.

ఉలుగ్‌ఖాన్ పరాజయానికి ముస్లిం చరిత్రకారులు జ్యోతిష్యుడు, కవి అయిన ఉబైదు కుట్రలు కారణమని చెప్తారు. అతడు రాజకుమారునికి దుర్మార్గుడైన మిత్రుడు, సహచరుడు! బరనీ దీన్ని మరింత విపులంగా చెబుతాడు. అతని కథనం ప్రకారం ఉలుగ్‌ఖాన్ వరంగల్లు కోటను ముట్టడించి, కోటను రక్షిస్తున్న వారి పరిస్థితి వనరుల కొరత కారణంగా, దుర్భరమయ్యేటట్లు చేశాడు. నగరాన్ని చుట్టిన రెండు కోటల్లో, బయటి మట్టి కోట పడిపోయే స్థితిలో ఉంది. ప్రతాపరుద్రుడు శాంతికి అంగీకరించి, సుల్తాన్ అధికారానికి లొంగి ఉండేందుకూ, కప్పం చెల్లించేందుకూ ఒప్పుకున్నాడు. అయితే, ఉలుగ్‌ఖాన్ ప్రతాప రుద్రుడిని బంధించి, అతని రాజధానిని, పట్టుకోవాలన్న నిశ్చయంతో, సంధి రాయబారాలను తిరస్కరించాడు. ఇంతలో ముస్లి సైన్యం ఉత్సాహంలో ఓ మార్పు చోటు చేసుకుంది అని వ్రాశాడు బరనీ. ఉత్తారాల బట్వాడా వ్యవస్థ భగ్నమవ్వడంతో, రాజధాని నుండి కొత్త వార్తలు చేరే అవకాశం లోపించింది. అలాంటి సమయంలో ఉలుగ్‌ఖాన్‌కు సన్నిహిత మిత్రులైన ఉబైద్ షేక్‌జాదా-మె-దిమాష్కి, ఢిల్లీలో సుల్తాన్ మరణించాడన్న తప్పుడు పుకారు సైన్యంలో వ్యాపింప చేశారు. ఒక అక్రమదారుడు సింహాసనాన్ని దురాక్రమించాడని, ఖాన్ తమ ఖిల్జీ సానుభూతి కారణంగా శంకింపబడిన విశ్వాసనీయులైన సైన్యంలోని కొంతమంది ముఖ్య నాయకులను నిర్బంధించబోతున్నాడనీ, పుకార్లు ప్రబలాయి. ఈ సమాచారం ఖానుకు సన్నిహిత సహచారుల నుండి వచ్చిన కారణంగా భయాందోళనలు కలిగించాయి. నాయకులు తమ సహచరులతో సహా శిబిరాన్ని విడచి పారిపోయారు. వారు పోవడంవల్ల ముస్లిం సైన్యంలో గందరగోళం అలుముకు పోయింది! తమ శత్రువులను చుట్టుముట్టిన ఈ అకస్మాత్ దురదృష్టాన్ని అవకాశంగా తీసుకున్న హిందువులు ఉలుగ్‌ఖాన్ శిబిరాన్ని ముట్టడించి, కొల్లగొట్టారు. వారి

దాడిని తట్టుకోలేని ఉలుగ్‌ఖాన్, తన బలగాలను సమీకరించుకొని, హడావుడిగా పారిపోయాడు. (తారిఖె-ఫిరూజ్‌షాహీ 111:231-33).

పైన పేర్కొనిన సంఘటనలను గురించి తృప్తికరమైన కథనం, ఈ విషయంపై వ్రాసిన వాడు ఇసామీ. అతడు తన చరిత్రను క్రీ.శ. 1349లో పూర్తి చేసినట్లు తెలియుచున్నది. ఇసామీ కథనం ప్రకారం ఉలుగ్‌ఖాన్ వరంగల్లు చేరే వరకు దేశాన్ని కొల్లగొట్టాడు. ఆ తర్వాత కోటను ఆరునెలల కాలం ముట్టడించాడు. అయితే, లోపల ఉన్నవారు చెదరలేదు. ఢిల్లీ సుల్తాన్ ఓర్పు నశించింది. తన ఆదేశాల పాలనలో నిర్లక్ష్యం వహిస్తున్నావని నిందిస్తూ ఉలుగ్‌ఖాన్‌కు ఉత్తరం వ్రాశాడు. ముట్టడి విజయవంతంగా ముగించే ఆదుర్దాలో, ఉలుగ్‌ఖాన్ జ్యోతిష్కుడూ, కవి అయిన ఉబైద్‌ను, ఏ రోజు కోట తన చేతికి చిక్కుతుందో కనుగొనవలసిందని అడిగాడు. జ్యోతిష్కుడు లెక్కలు కట్టాడు, పతనం తేదీని నిశ్చయించాడు. ఆ రోజుకల్లా కోట లొంగిపోక పోయినట్లయితే సమీపంలోని ఉరిమ్రానుకు వ్రేలాడి తన ప్రాణాలు యిస్తానని అతడు ప్రకటించాడు. ఉబైద్ నిర్ణయించిన తేదీ సమీపించింది, అయితే కోట రక్షకులు లొంగిపోయే సూచనలేవీ కనిపించలేదు. ఉబైద్ భయపడిపోయాడు. తన జ్యోతష్యం తప్పితే, (అది నిశ్చితంగా తప్పిపోయేటట్లు కంపించింది కనుక) ఉలుగ్‌ఖాన్ అతణ్ణి తప్పక చావమని శాసిస్తాడు. తనను రక్షించుకోవడం కోసం ఉబైద్ సుల్తాన్ మరణించాడన్న తప్పుడు ప్రచారం చేశాడు. రాజధాని ఢిల్లీలో విప్లవం తలెత్తిందని చెప్పాడు. అమీర్ల సానుభూతులు వేరేగా ఉన్నాయన్న కారణంతో, శిబిరంలోని ముఖ్య అమీర్లను చంపడానికి ఉలుగ్‌ఖాన్ కృత నిశ్చయుడై ఉన్నాడని అతడు వెల్లడించాడు. అవి శిబిరంలో భయాందోళనలను కలిగించాయి. వారు ప్రతాపరుద్రుడితో శాంతిసంధి చేసుకొని వెంటనే వరంగల్లు నుండి పారిపోయారు. వారి వెంటనే ఉలుగ్‌ఖాన్ పారిపోయాడు. (పి.వి. పరబ్రహ్మశాస్త్రి). చరిత్ర కారులు మిగతావాటికంటే, ఇసామీ కథనాన్నే విశ్వాసనీయంగా భావిస్తారు. "నిజానికి వరంగల్లులో యేమి జరిగిందో ఊహించి క్లుప్తంగా చెప్పవచ్చు. సంఘటనలు అయితే, లభించే సాక్ష్యపు వైరుధ్య స్వభావం కారణంగా, వివాదరహితమైన వాస్తవ కథనం సాధ్యం కాదు. ఉలుగ్‌ఖాన్ తన సైన్యంతో దండెత్తి వెళ్ళాడు; ఆర్నెల్లపాటు కోటను ముట్టడించాడు, కానీ పట్టుకోవడంలో విఫలుడయ్యాడు. ఇంతకు ముందే చెప్పినట్లు, ఉబైద్ కుతంత్రం వల్ల శిబిరంలో విప్లవం తలెత్తింది.... ఫలితంగా ఉలుగ్‌ఖాన్ యింటివైపు తిరుగు ప్రయాణమయ్యాడు... అతడు కోటగిరి చేరిందాకా కాకతీయ బలాలు అతణ్ణి అనుసరించాయి. అచ్చట కోటగిరి ముట్టడించి ఉన్న మాజీర్‌అబురజా అతడికి సాయపడ్డాడు. అతడి సైన్యం నాశనం కాకుండా కాపాడాడు." (పి.వి.పరబ్రహ్మశాస్త్రి).

సుల్తాన్ ఘియాసుద్దీన్ తుగ్లక్ గట్టి మనోబలంగల వ్యక్తిగా చరిత్రకారులు చిత్రించారు. అతడు తిరుగుబాటుపై సైన్యాలను తీవ్రంగా శిక్షించినట్లు తెలియుచున్నది. దేవగిరికి అదనపు బలగాలను పంపాడు. అక్కడ ఉలుగ్‌ఖాన్ ఆశ్రయం పొదుతున్న సంగతి తెలిసిందే. మళ్ళా తెలంగాణాపై దండు వెడలి, ఆ ప్రాంతాన్ని వశం చేసుకోమని తన కొడుక్కు ఆదేశమిచ్చాడు. ఉలుగ్‌ఖాన్ వెంటనే పయనమై బద్రికోట (బీదరు)కు చేరుకున్నాడు. ఆ కోటను, దారిలోని మరికొన్ని కోటలను పట్టుకున్నాడు. అక్కడ గట్టి రక్షక సైన్యాన్ని విశ్వసనీయ అధికారుల నాయకత్వంలో ఉంచి, చివరి వరకు వాటిని రక్షించుకోవాలన్న ఆదేశమిచ్చి బయలుదేరాడు. బోధనుకు చేరుకున్నాడు. అది వరంగల్లుకు పదిరోజుల ప్రయాణపు దూరంలో ఉన్నట్లు తెలియుచున్నది. మూడు నాలుగు రోజుల ముట్టడి తరువాత కోటను పరిరక్షించేవారు అతనికి లొంగిపోయారు. రాజప్రతినిధీ, అతని అనుచరులు ఇస్లాం మతాన్ని స్వీకరించి తమ ప్రాణాలు కాపాడుకున్నారు.

తర్వాత ఉలుగ్‌ఖాన్ వరంగల్లు చేరాడు. నగరాన్ని ముట్టడించాడు. ఉలుగ్‌ఖాన్ రెండవసారి వరంగల్లు

కోటను ముట్టడించటం గురించి అధిక సమాచారం మనకు లభించుటలేదు. చరిత్రకారుడు బర్నీ దాన్ని క్లుప్తంగా చెప్పి ముగించినట్లు తెలుస్తున్నది. తర్వాతి ముస్లిం చరిత్రకారులు బర్నీ వ్రాతలనే అనుసరించారు. ఉలుగ్‌ఖాన్ మొదట మట్టికోటను ముట్టడించినట్లు తెలియుచున్నది. ఆ తర్వాత లోపలి కోట అతని చేత చిక్కింది. కోటను స్వాధీన పరచుకున్న తర్వాత ప్రతాపరుద్రుడిని బందీచేసి, ఢిల్లీలోని సుల్తాన్ దర్బారుకు పంపించడం జరిగిందన్నది కథనం!

అయితే వరంగల్లు పట్టుబడటం ఆ చరిత్రకారులు మనని నమ్మించేటట్లు చెప్పినంత సులభంగా జరుగలేదు. నిజానికి ముట్టడి ఐదునెలలు కొనసాగినట్లు తెలియుచున్నది. ఇసామీ ఈ ముట్టడినీ, ఎలాంటి పరిస్థితుల్లో కోటను పట్టుకోవడం జరిగిందీ వివరించాడు. తన మొదటి దండయాత్ర తర్వాత ఉలుగ్‌ఖాన్ వరంగల్లును వదలి వెళ్ళిపోవడంతో, ముస్లింలపై విజయం సాధించినందులకు ఆనందంతో ప్రతాపరుద్రుడు విందును ఏర్పాటు చేసినట్లు తెలియుచున్నది. ఇంక సమీప భవిష్యత్తులో వాళ్ళు తన రాజ్యంపై దాడి చెయ్యరని నమ్మి అతడు తన కోటలో ధాన్యాగారాన్ని తెరిపించి, అందులోని ధాన్యాన్ని అమ్మించాడు. సైనిక కార్యకలాపాలను విరమించి, తమ పశువుల వైపు, పంటల వైపు దృష్టిని సారించవలసినదని తన పౌరులకు ఆదేశాలు జారీ చేశాడు. మళ్ళా నాలుగు నెలలలోపు వరంగల్లును ముట్టడించడానికి కొత్త సైన్యంతో ఉలుగ్‌ఖాన్ తిరిగి రావడంతో, కోటను రక్షించే సైన్యం, ముట్టడి సమయంలో సైన్యానికి కావలసిన ఆహార పదార్థాలు కోటలో లేకపోయాయి. అతడిని ఆశ్చర్యంలో ముంచేటట్లు శత్రుసైన్యం యెత్తి వచ్చినా, ప్రతాపరుద్రుడు ధైర్యంగా పోరాడాడు. అయితే, ఉన్న ఆహార పదార్థాలు త్వరలోనే అయిపోయాయి. కోటలోని సైన్యం ఆకలితో మలమలమాడే పరిస్థితిలో ప్రతాపరుద్రుడికి లొంగక తప్పలేదు. అతడు కోట ద్వారాలను తెరిపించాడు. తన కుటుంబపు యితర సభ్యులతో, తననూ ఉలుగ్‌ఖాన్‌కు సమర్పించుకున్నాడు. అప్పుడు ముస్లింలు కోటలోనికి ప్రవేశించారు. ఇళ్ళను కొల్లగొట్టారు, ప్రభుత్వ భవనాలను ధ్వంసం చేశారు.

ముస్లిం దాడులకు సంబంధించిన కథనంలో చాలా భాగం, వెంకటరమణయ్య, సోమశేఖరశర్మ, యజ్దాని రచించిన కాకతీయుల అధ్యాయం, 1960ను అనుసరించి, రచించడమైనది. (పి.వి. పరబ్రహ్మశాస్త్రి).

ప్రతాపరుద్రుడిని దేశంలో ఉంచినందువలన ప్రజల తిరుగుబాట్లు, ఇతర రాజకీయ సంక్లిష్టతలు తలెత్తే ప్రమాదం ఉంది కనుక, ఉలుగ్‌ఖాన్ వెంటనే అతడిని, అతడి కుటుంబ సభ్యులందరితోనూ కలిపి, కదీన్‌ఖాన్, ఖ్వాజాహాజీల నాయకత్వంలో కొంత సైన్యాన్ని యిచ్చి, ఢిల్లీకి పంపే యేర్పాటు చేశాడు. అయితే, వారు ఢిల్లీకి చేరక ముందే ప్రతాపరుద్రుడు చనిపోయాడు. అతడు ఏ పరిస్థితిలో చనిపోయాడో బయటపెట్టలేదు. ప్రతాపరుద్రుడు ఢిల్లీకి బందీగా పట్టుకుని వెళ్ళేటప్పుడు అతడు నర్మదా నదీతీరంలో మరణించాడని ముసునూరి ప్రోలయ నాయకుని ఎలసదాన శాసనం (Epigraphia Indica XXXII%:261) చెప్తుంది. అతడి మరణం సహజ కారణాల ఫలిత మనిపించదు. క్రీ.శ. 1423నాటి రెడ్డిరాణి అని తల్లి కలువ శాసనం అతడు దేవలోకానికి తన ఆకాంక్ష మేరకు వెళ్ళాడని తెలియజేస్తుంది. అందువల్ల ప్రతాపరుద్రుడు ఆత్మహత్యయినా చేసుకుని ఉండాలి, లేదా ఆయన ఆజ్ఞ మేరకు అతని అనుచరులలో ఒకరు అతనిని హత్య చేసి ఉండాలి. అవమానంకంటే మృత్యువు మంచిదని అతడు భావించి ఉండవచ్చును. ప్రతాపరుద్రుడి పరాజయం, మరణంతో కాకతీయుల పాలన అంతమైంది. తెలుగుదేశం విదేశీజాతి, విదేశీ మతస్థులైన పాలకుల చేతుల్లోనికి వెళ్ళిపోయింది. (పి.వి. పరబ్రహ్మశాస్త్రి). చారిత్రక ఆధారాలు ప్రతాపరుద్రుడు ఆఖరి కాకతీయ చక్రవర్తిగా పరిగణిస్తాయి.

**ప్రతాపరుద్రుడి కుటుంబం:**

ప్రతాపరుద్రుడి మరణంతో కాకతీయ సామ్రాజ్యం అంతమయిందని భావించవచ్చు. అయితే, తర్వాత కాలంలో వెలువడిన *ప్రతాప చరిత్ర* అనే కథాత్మక గ్రంథం

విశాలాక్షిని ప్రతాపరుద్రుడి పట్టమహిషిగా పేర్కొని ప్రస్తావిస్తుంది. ఆ గ్రంథంలోనే ప్రతాపరుద్రుడికి మరోభార్య లక్ష్మీదేవి ఉన్నట్లుగా చెప్పబడినది. ప్రతాప చరిత్ర పట్టమహషి విశాలాక్షిని గురించి చర్చిస్తే, యేళ్లేడు శాసనం రాణి లక్ష్మీదేవిని గురించి చెప్తుంది! ప్రతాపరుద్రుడికి వీరభద్రుడనే కొడుకు ఉన్నాడని అతనిని ప్రతాపరుద్రుడి తమ్ముడు అన్నమదేవుడు పట్టాభిషిక్తుడ్ని చేశాడని ప్రతాప చరిత్ర చెప్తుంది. అయితే, ఇందుకు సంబంధించిన ప్రామాణికమైన చారిత్రక ఆధారాలు ఇంతవరకు లభించలేదు. (పి.వి. పరబ్రహ్మశాస్త్రి).

అయితే, మధ్యప్రదేశ్‌లోని బస్తర్‌లో దిక్పాలదేవుడు వేయించిన దంతేశ్వర శాసనంలో వారి పాలకుడు కాకతి అన్నమదేవుడని ఉండటం వల్ల రాజ్యము ఓరుగల్లులో కోల్పోయిన కాకతీయుల శాఖ అక్కడి వనచర రాజ్యంలో తలదాచుకొన్నారా? అనే అనుమానం కలుగుతుంది. (Epigraphia Indica XII, 242-50). (ప్రొ. ముదిగొండ శివప్రసాద్).

**ప్రతాపరుద్రుడి సామంతులు, సేనానులు:**

ప్రతాపరుద్ర మహారాజు సామంతులలో కాట్యదొనను పాలించిన తెలుగు చోళుడు ఓపిలిసిద్ధి, నెల్లూరి రాజైన మనుమగండ గోపాలుడు, తెలుంగు బిజ్జనలు ముఖ్యులు. తెలుంగు బిజ్జన ఢిల్లీ సుల్తాన్ ఆస్థానాన్ని దర్శించాడనీ అక్కడ ప్రతాపరుద్రుడి మరో నాయకుడైన పోతుగంటి మైలితో సరదా యుద్ధం చేశాడని, అలాఉద్దీన్ మాలిక్ నాయబ్‌ల సమక్షంలో జరిగిన యుద్ధంలో ఓడిపోయాడని అంటారు. వెలుగోటివారి వంశావళి, ప్రశస్తిలో పోతుగంటి మైలికి సంబంధించిన ఈ వృత్తాంతం ప్రస్తావించబడింది. కత్తి యుద్ధాలకు పేరుపొందిన దక్షిణాత్యుల ప్రతిభను ఢిల్లీ సుల్తాన్ ముందు అతని కుతూహలం తీర్చడానికి వీరిద్దరూ ఆ యుద్ధ ప్రదర్శన చేసివుండవచ్చు. చెరకు కుటుంబీకులు వారసత్వ సామంతులుగా కొనసాగుతూ రుద్రదేవుడి కాలము నుండి ప్రతాపరుద్రుడి వరకు కాకతీయ రాజులను అత్యంత భక్తిశ్రద్ధలతో, విశ్వాసంతో సేవించారు.

ప్రతాపరుద్రుడి సేనాధికారులులలో రెండు రకాలవారున్నారు. వారిలో ఒకరు సాహిణులు, మరొకరు సేనాధిపతులు. ఏనుగులకు యుద్ధశిక్షణ యిచ్చేవారిని గజసాహిణిలనీ, గుఱ్ఱాలకు శిక్షణ యిచ్చేవారిని అశ్వసాహిణిలనీ పిలిచేవారు. సాయుధదళాల అధిపతులను సేనాధిపతి అనేవారు. బెండపూడి అన్నయ మహారాజ గజసాహిణి (కాకతీయ గజదళానికి అధిపతి)గా వ్యవహరించినట్లు చెబుతారు. అన్నయ సైన్యాధిపతి నాయక పదవుల్ని కూడా నిర్వహించాడు. రకరకాల బిరుదాలతో శాసనాలు ఇతనిని వర్ణించాయి. సేనాధిపతులు, సకల సేనాధిపతులలో సోమయాజులు రుద్రదేవుడు, రేచర్ల ముమ్మడి నాయకుడు పేరెన్నికగన్నవారు. (పి.వి. పరబ్రహ్మశాస్త్రి).

**కాకతీయ పాలకుల వ్యక్తిత్వం:**

- ✧ కాకతీయ రాజులందరూ అసాధారణ సాహసోపేతులు.
- ✧ తొలి పాలకులను వదిలేస్తే రుద్రదేవుడు, గణపతిదేవుడు తప్ప మిగతా కాకతీయ రాజులందరూ వీరమరణం పొందారు. కాకతీయ రాజులెవరూ బలహీనులు కారు.
- ✧ కాకతీయ రాజులకు కొన్ని బిరుదులు ఉన్నప్పటికీ వాటికి ప్రత్యేక ప్రాధాన్యత యేమీలేదు.
- ✧ రాయగజకేశరి అని బిరుదు వహించిన గణపతిదేవుడు ఆ పేరుతో నాణాలు విడుదల చేశాడు. అలాగే తూనికల ప్రమాణాలు అమల్లోకి తెచ్చాడు.
- ✧ గణపతిదేవుడు రాయగజకేశరి బిరుదును అతని కుమార్తె రుద్రమదేవి స్వీకరించింది. ఆ పేరుతో నాణాలు, కొలతలు విడుదల చేయడమే కాకుండా శిల్పాలు, శాసనాలపై కూడా ఈ బిరుదును చెక్కించింది.
- ✧ ప్రతాపరుద్రుడు కూడా తన బిరుదైన రాయగజకేశరి పేరిట నాణాలు, ముద్రలు విడుదల చేశాడు.
- ✧ మధ్యయుగ రాజకీయ చరిత్రలో ఒక మహిళ సార్వభౌమ అధికారాన్ని చేపట్టి మహారాణి కావడం ఒక్క కాకతీయ వంశంలోనే సాధ్య మయింది. (పి.వి. పరబ్రహ్మశాస్త్రి).

ఈ వ్యాసంతో సార్వభౌమ పాలకులుగా ఖ్యాతి గడించిన కాకతీయ చక్రవర్తులను గూర్చిన వివరాలు పూర్తి అయినవి.

**ప్రొ. రావినూతల సత్యనారాయణ**
**హైదరాబాద్. ఫోన్**: 961 852 4702.

# కనగనహళ్ళి బౌద్ధస్థూపం

– కొసరాజు వెంకటేశ్వరరావు

కర్ణాటక రాష్ట్రంలో బౌద్ధ స్థూపాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఆ రాష్ట్రంలోని గుల్బర్గా (ప్రస్తుతం కలబుర్గి) జిల్లా, చిత్తాపూరు తాలూకాలో సన్నతి గ్రామం ప్రక్కనే ఉన్న కనగనహళ్ళి (కనగడి యొక్క ఊరు అని అర్థం) అనే కుగ్రామంలో ఒక బౌద్ధస్తూపం ఉన్నట్లుగా చరిత్రకారులు గుర్తించారు. ఈ స్థూపం కర్ణాటక రాష్ట్రంలో అత్యంత విస్తృతమైన మరియు కుతూహలకరమైన బౌద్ధస్తూపంగా ప్రసిద్ధి చెందింది. కృష్ణానది ఉపనది అయిన భీమానది ఎడమ గట్టున ఉన్న చారిత్రక గ్రామమైన సన్నతి (దీనినే సొంతి అని కూడా స్థానికులు వ్యవహరిస్తారు) గ్రామం చివర ఉన్న చంద్ర లాంబా (చండలా, చండాల, చంద్రలా) దేవాలయం ఉన్నందున ఇది ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా అనేకమంది భక్తుల్ని ఆకర్షిస్తున్నది. భీమానది ఎడమ ఒడ్డునే ఉన్న ఈ దేవాలయం శైవభక్తుల్ని ఆకర్షించే యాత్రాస్థలం అయింది.

కనగనహళ్ళి (కన్నడంలో హళ్ళి - తెలుగులో పల్లి అవుతుంది) యాదగిరి (నిరుటి సంవత్సరమే జిల్లా కేంద్రంగా మార్చబడింది) పట్టణం నుండి 50 కిలోమీటర్లలోను - గుంతకల్లు - వాడి రైల్వే లైన్‌లో ఉన్న నాల్వార్ స్టేషన్‌కు 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న ఊరు. ఈ ఊరిలో బౌద్ధస్తూపం ఉన్నట్లుగా 1935లో సురపురు మహారాజుల సంస్థానంలో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న దివంగత కపటరాళు కృష్ణరాయ గారు కాగా వీరి రిపోర్టు ఆధారంగా కర్ణాటక రాష్ట్ర పురావస్తు శాఖకు డైరెక్టర్‌గా ఉన్న డా. ఎమ్. శేషాద్రిగారు 1964-65లో ఈ ప్రాంతంలో విస్తృత పరిశోధనలు చేసి రిపోర్టులో ఇక్కడ ఉన్న శిల్పాలను, శాసనాలను, ఇటుకలతో నిర్మించబడిన బౌద్ధస్థూపాన్ని గురించి తన రిపోర్టులో వివరంగా తెలియజేశారు. ఆ తరువాత కర్ణాటక విశ్వవిద్యాలయం, ధార్వాడకు చెందిన డా. పి.బి. దేశాయ్ గారు 1966లో ఇంకొకసారి విశదంగా స్థల పరిశోధన చేసి కర్ణాటకలో ఉన్న అత్యంత ముఖ్యమైన మరియు చాలా పెద్దదైన బౌద్ధక్షేత్రం అని అభిప్రాయపడ్డారు.

వీరందరి స్థలపరిశోధనలో సన్నతి నుండి కనగనహళ్ళి వరకు ఉన్న 5 - 6 చ.కి. మీటర్ల ప్రదేశంలో శాతవాహన మరియు వారికి ముందు ఉన్న మౌర్యుల కాలం నాటి వాస్తునిర్మాణాలు వెలుగులోకి వచ్చాయి. ఆయా కాలానికి సంబంధించిన మృణ్మయ పాత్రలు, ఇటుకలు, బౌద్ధమతానికి చెందిన శిల్పాలతో సుందరంగా చెక్కబడిన దృశ్యాలు, శాతవాహన కాలంనాటి నాణాలు, నల్లటి మరియు ఎరుపు రంగు ఉన్న మట్టిపాత్రలు, స్ఫటికం, కార్నీలియన్ మొదలైన విలువైన రాళ్ళతో తయారు చేసిన వస్తువులు, ఆభరణాలు మొదలైనవి లభించాయి. ఇక్కడ లభించిన సున్నపురాతితో చెక్కిన శిల్పాలు అమరావతి స్థూపం వద్ద లభించిన శిల్పాలను పోలివున్నాయి. ఇక్కడ లభించిన అశోకుని బ్రాహ్మీ భాషలో ఉన్న శాసనాన్నిబట్టి మరియు స్థూపఫలకంపై ఉన్న అశోకుని చిత్రాన్ని, ఆ చిత్రంపై ఉన్న లఘుశాసనాన్నిబట్టి ఈ స్థూపం అశోకుని కాలంలోనే ప్రారంభించబడినట్లుగా తెలుస్తున్నది. శాతవాహనులు దీన్ని పూర్తిగా నిర్మించారు.

భీమానది ఎడమగట్టు ప్రక్కనే ఉన్న చంద్రలాంబా పరమేశ్వరి (శాక్తపందకు చెందిన ప్రముఖ దేవతలలో ఒకరు) దేవాలయానికి తూర్పువైపుగా ఒక కిలోమీటర్ దూరంలో భీమానది ఎడమవైపుగా సుమారు 300 మీటర్ల ఉత్తరంవైపుగా జొన్న మరియు కంది చేల మధ్య మూడు మీటర్ల ఎత్తులో ఈ స్థూపపు దిబ్బ ఉన్నట్లుగా చరిత్రకారులు గుర్తించారు. డా. శేషాద్రి దీని నిర్మాణంలో వాడిన కాల్చిన ఇటుక సైజునుబట్టి ఇది బౌద్ధస్థూపం అయివుంటుందని అభిప్రాయపడ్డారు. ఆ కాలంలో కర్ణాటక రాష్ట్రంలో ఉన్న బీదరు గుల్బర్గా, రాయచూరు జిల్లాలలో ఉన్న భారత ప్రభుత్వానికి చెందిన ప్రాచీన కట్టడాలు, స్థలాలు హైదరాబాద్‌లో ఉన్న భారత పురావస్తు సర్వేక్షణవారి ఆధీనంలో ఉండేవి. సన్నతి చుట్టుప్రక్కల ఉన్న మట్టిదిబ్బలను, భారత పురావస్తు సర్వేక్షణ శాఖ, హైదరాబాద్ వలయం మరియు దక్షిణాసియా అధ్యయన సంస్థ (South

Asia Studies Centre)కు చెందిన పరిశోధకులై డా. జేమ్స్ హోవల్ (Dr. James Howel) సంయుక్తంగా త్రవ్వకాలను నిర్వహించారు. వీరు కూడా కనగనహళ్ళి గ్రామంలో బౌద్ధస్థూపం ఉన్నట్లుగా గుర్తించారు. ఈ స్థూపానికి చెందిన అనేక స్థూప ఫలకాలు, అష్టభుజాకారంలో ఉన్న ఆయక స్తంభాలను, శిల్పాలను గుల్బర్గా పట్టణంలో ఉన్న కర్ణాటక రాష్ట్ర పురావస్తు శాఖ వారి ఆధీనంలో ఉన్న పురావస్తు ప్రదర్శనశాలకు 1960 ప్రాంతంలో తరలించి అక్కడ భద్రపరిచారు. హైదరాబాద్ వలయం మరియు దక్షిణాసియా అధ్యయన సంస్థ వారు నిర్వహించిన త్రవ్వకాల శిలాఫలకాలను, శిల్పాలను, బీదరు కోటలో ఉన్న భారత పురావస్తు శాఖ వారి ఆధీనంలో ఉన్న పురావస్తు ప్రదర్శన శాలకు తరలించి వాటిని భద్రపరిచారు.

ఈ సందర్భంలో భారత పురావస్తు శాఖలో జరిగిన సంఘటన గురించి ప్రస్తావించవలసి ఉంటుంది. కర్ణాటక రాష్ట్రంలో (బీదరు గుల్బర్గా, రాయచూరు జిల్లాలు తప్ప) ఉన్న ప్రాచీన కట్టడాలు, అవశేషాలు, స్థలాలు మొదలైనవి బెంగళూరు వలయం (సర్కిల్) వారి ఆధీనంలో ఉండేవి. 1990లో కేంద్ర మానవ వనరుల శాఖవారి ఆధీనంలో భారత పురావస్తు శాఖ ఉండేది. స్థానిక పురాతత్వ శాస్త్రజ్ఞుల ఒత్తిడి మేరకు ఆనాటి మానవ వనరుల శాఖా మంత్రిగా ఉన్న యస్.ఆర్. బొమ్మయ్‌గారు బెంగళూరు వలయాన్ని రెండుగా విభజించి ధార్వాడ కేంద్రంగా ఇంకొక వలయాన్ని ప్రారంభించారు. ఈ వలయంలో బీదరు, గుల్బర్గా మరియు రాయచూరు జిల్లాల్లో ఉన్న ప్రాచీన కట్టడాలు, స్థలాలు, 1996 సంవత్సరంలో ధార్వాడ వలయంకు బదిలీ చేయబడినాయి. ఆ సమయంలో బెంగళూరు సర్కిల్ అధికారి (అధీక్షక పురాతత్వవేత్త లేక సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్టు)గా ఉన్న డా. కె.పి. పూనాభాకు ధార్వాడ సర్కిల్ అదనపు బాధ్యత ఇవ్వబడింది. ఆ సమయంలో భారత పురావస్తుశాఖ వారి సంగ్రహాలయశాఖ (మ్యూజియమ్స్ బ్రాంచి) పశ్చిమ మండలం అధికారిగా వెల్హా గోవా కేంద్రంలో ఉన్న ఈ వ్యాసకర్తను గోవా నుండి నూతనంగా ప్రారంభించబడిన ధార్వాడ సర్కిల్‌కు ఉప అధీక్షక పురాతత్వ విద్‌గా బదిలీ చేయగా ఆయన 1996 డిసెంబర్ మాసంలో ధార్వాడలో జాయిన్ అయ్యారు.

పూనాబా నేతృత్వంలో కనగనహళ్ళి స్థూపం వద్ద 1997, 1998 సంవత్సరాల కాలంలో విస్తృతమైన త్రవ్వకాలు చేపట్టబడినాయి. వరదల మూలంగా మట్టితో కప్పబడిన స్తూప భాగాలను వెలుగులోకి తేబడినాయి. స్తూపం వద్దకు రావాలంటే ఆ భూమి యజమానుల అనుమతి తీసుకొనవలసి వచ్చేది. ఆ త్రవ్వకాలలో వచ్చిన మట్టిని తమ పొలాలలో వేయటానికి ఎవరూ అనుమతించకపోవటంతో ఆ మట్టిని భీమానది ఒడ్డు వరకు కూలీల ద్వారా మోయించవలసి రావటం ఖర్చుతో కూడుకొన్న పనేకాక సమయం కూడా వృథా అయ్యేది. అందువలన జిల్లా అధికారుల సహాయ సహకారాలతో ఆ స్థూపం చుట్టూ ఉన్న నాలుగు ఎకరాల భూమిని కొని ఆ భూమిని స్వాధీనం చేసుకోవలసి వచ్చింది. ఆ తరువాత ధార్వాడ సర్కిల్ అధికారిగా వచ్చిన కె. వీరభద్రరావు ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయించారు. వారు కూడా స్థూపం వద్ద త్రవ్వకాలను కొనసాగించారు. వీరికి సహాయకులుగా విశ్వేశ్వర, కేశవ, శేషాద్రి, నరసింహం, డ్రాఫ్ట్స్‌మెన్, ఫోటోగ్రాఫర్లు, రక్షక సిబ్బంది ఉండేవారు. ఆ స్థూపంలో లభించిన స్థూప ఫలకాలు, శిల్పాలు, వేసవి కాలపు ఎండలకు పగుళ్ళు రావటం ప్రారంభం కావటంతో స్థూపానికి దగ్గరలోనే ఉన్న దుర్గ గుడి ప్రక్కనే ఒక పూరిపాక వేయించి స్థూప ఫలకాలను, శిల్పాలను, ఆయక స్థంబాలను, శాసనాలను ఆ పాకలో ఉంచి భద్రపరిచారు. ఆ తరువాత ధార్వాడ సర్కిల్ అధికారిగా వచ్చిన వెంకటేశయ్య కూడా ఆ స్థూప రక్షణకు అనేక సౌకర్యాలు కల్పించారు. ఈ వ్యాసకర్తకు 1997 నుండి 2001 వరకు జరిపిన త్రవ్వకాలలో పాల్గొనే అవకాశం లభించింది. ఈ త్రవ్వకాలలో బౌద్ధస్థూప సముదాయం వెలుగులోకి తేబడింది. స్థూప ఫలకాలతో, శిల్పాలతో, శాసనాలతో, బుద్ధుని జీవిత కథలు, జాతక కథలతో అలంకరించబడిన దేశంలోనే అపూర్వమైన బౌద్ధస్థూపంగా అనావరణ చెందింది. స్థూపం సుమారు 22 మీటర్ల చుట్టుకొలతతోను 17 మీటర్ల ఎత్తు కలిగి ఉండేదని పురాతత్వ శాస్త్రజ్ఞులు నిర్ధారించారు. స్థూపం యొక్క వేదిక, మేధి, అండ, హర్మిక భాగాలు స్థానికంగా

లభించే సున్నపురాతి పలకలతో కప్పబడగా బండిచక్రం ఆకారంలో ఉన్న లోపలి భాగం 46×21×10 అంగుళాల సైజులో ఉన్న కాల్చిన ఇటుకలతోను మట్టితోను నిర్మించబడినట్లుగా తెలుస్తున్నది. ఈ స్థూపం భూకంపం మూలంగా నాశనమైనట్లుగా ఊహించవచ్చు.

కనగనహళ్ళి స్థూపం: స్థూపం వద్ద నిర్వహించిన త్రవ్వకాలలో లభించిన ఆధారాల ప్రకారం ఈ స్థూపం 30×30 చ.అ.ల విస్తీర్ణంలో నిర్మింపబడినట్లుగా చరిత్రకారులు గుర్తించారు. ఈ స్థూపానికి నాలుగు వైపులా ఆయక వేదిక 1 1/2 మీటర్ల ఎత్తున ఉన్నట్లు, ఆయక వేదిక పైభాగాన బుద్ధుని జీవితంలో 5 ప్రధాన ఘట్టాలైన జననం, సర్వసంఘ పరిత్యాగం, జ్ఞానోదయం, మొదటి ఉపదేశం - మహాపరినిర్వాణాలను సూచించే 5 స్థంభాలు ఉన్నట్లు, స్థూపానికి 2 1/2 మీటర్ల ఎత్తులో మేథి, భాగం, (DRUM) దాని చుట్టూ మూడు మీటర్ల వెడల్పుగల ప్రదక్షిణా పదం ఉన్నట్లు, మేథి పై భాగంలో కోడిగుడ్డు ఆకారంలో ఉన్న అండం (DOME) దాని పైన చతురస్రాకారంలో ఉన్న హర్మిక, దాని మధ్య భాగంలో ఛత్రం ఉన్నట్లుగా తెలుస్తున్నది. ప్రదక్షిణా పదం చుట్టూ సున్నపు రాతితో చెక్కబడిన నిలువు స్థంభాలు, మూడు సూచీ (Cross Bars)లతో నిర్మించబడిన 3 మీటర్ల ఎత్తు ఉన్న రాతికంచె (Railing) పద్మాలతో, అర్థచంద్రాకారాలతో బుద్ధుని జీవితంలోని దృశ్యాలు, జాతక కథలు, దాన శాసనాలు, జంతువులు, సామాన్యుల జనజీవన దృశ్యాలు విశిష్ట భంగిమలలో ఆనాటి శిల్పుల నైపుణ్యానికి తార్కాణాలుగా ఉన్నాయి. ఆ రాతి కంచె అమరావతి, నాగార్జునకొండ సాంచీ స్థూపాలలో చిత్రించిన మాదిరిగానే ఉన్నట్లు తెలుస్తున్నది. ఆయక వేదికకు ఎదురుగా నాలుగు వైపులా ఉన్న రాతి కంచెకు ప్రవేశ ద్వారాలు, ఆ ద్వారానికి ఎదురుగా అర్థచంద్రాకారంలో ఉన్న చంద్రశిల బయటపడింది. ఈ ద్వారాలకు రెండువైపులా తక్కువ ఎత్తులో ఉన్న యక్షవిగ్రహం ప్రతిష్టింపబడినట్లుగా తెలుస్తున్నది. స్థూపానికి ఉన్న నాలుగు ప్రవేశ ద్వారాలు సన్నతి గ్రామం వైపు నుండి, చంద్రలాంబ దేవాలయంవైపు నుండి, భీమానది వైపు నుండి మరియు కనగనహళ్ళి గ్రామం వైపు నుండి మహాస్థూప దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఉద్దేశింపబడినట్లుగా తెలుస్తున్నది. ఆ ప్రవేశ ద్వారాల వద్ద ఉన్న శిల్పాలను బట్టి సన్నతి గ్రామం వైపు నుండి మరియు భీమానది వైపు నుండి ఎక్కువమంది భక్తులు మహాస్థూపాన్ని నిరంతరం సందర్శించినట్లుగా ఊహింపవచ్చును. ఆయక వేదికపై బుద్ధుని పాదాలు, బుద్ధుని నిలువెత్తు విగ్రహం, పూజాసామగ్రి, కానుకలు మొదలైనవి త్రవ్వకాలలో బయటపడినట్లుగా తెలుస్తున్నది. మహాస్థూపంపై పడిన వర్షపు నీటిని ఆయక వేదికలో ఉన్న రంధ్రాల ద్వారా ప్రదక్షిణాపదంకు పంపే ఏర్పాటు చేయబడింది.

స్థూపం యొక్క మేధికు అంటించిన సున్నపు రాతి ఫలకలపై వివిధ రూపాలలో వివిధ ఆకృతులలో ఉన్న స్థూపాలు, ధర్మచక్రం, బంగారు నాణేలతో కొన్న జేతవనాన్ని అనాథపిండికుడు బుద్ధునికి దానం చేస్తున్న దృశ్యం, బుద్ధునికి ఆయన ముఖ్యమైన శిష్యులకు అనేక విహారాలు కట్టిస్తున్న దృశ్యాలు, బోధివృక్షం, సింహాసనం, సర్పాలతో చుట్టివేయబడిన రామగ్రామానికి చెందిన స్థూపం, తొమ్మిది లేక అంతకు తక్కువ పడగలు ఉన్న సర్పం (నాగము చలిందుడు) మొదలైన దృశ్యాలు అతి రమ్యంగా చిత్రింపబడినాయి. వీటన్నింటికంటే పశ్చిమ ద్వారం (భీమానదివైపున ఉన్న ద్వారం) వద్ద ప్రతిష్టింపబడిన తొమ్మిది పడగలు ఉన్న నాగము చలిందుని శిల్పం ఆ కాలం శిల్పుల అద్భుత నైపుణ్యానికి సాక్షిగా ఉన్నదనటంలో ఏమాత్రం సందేహం ఉండదు. దక్షిణం వైపు ధర్మచక్ర ప్రవర్తన ముద్రలో ఉన్న బుద్ధుని విగ్రహం కనిపిస్తుంది. ఇదేకాక ఉత్తరం వైపు ఉన్న ద్వారం వద్ద ఉన్న బహు అంతస్థుల విహారం, ధర్మచక్రం తూర్పు వైపున ఉన్న ఆయక భవ చక్రం మొదలైన చిత్రాలు కలిగిన రాతి ఫలకాలు ఆనాటి వాస్తుకళకు తార్కాణాలుగా నిలుస్తున్నాయి.

స్థూప వేదిక పైన అండంకు ఆనుకుని ఉన్న సుమారు 0-90 మీటర్ల వెడల్పులో వేదిక చుట్టూ ఉన్న భాగం బహుశా సాంచీ స్థూపంలో ఉన్నరెండవ ప్రదక్షిణా పదంలాగా ఉండి ఉంటుందని చరిత్రకారుల అభిప్రాయం. విశేషమైన


సందర్భాలలో స్థూపాన్ని నీటితో కడగటం, స్థూపానికి అలంకరణ, తోరణాలు కట్టే సమయానికి అనువుగా ఉండే విధంగా ఈ ప్రదక్షిణా పదానికి రంధ్రాలు ఏర్పాటు చేయబడినాయి. ఈ ప్రదక్షిణా పదం వెలుపలి అంచున మూడు సూచీలతో (Three Cross Bars) నిర్మించబడిన రాతికంచె (Railing) ఉన్నట్లుగా తెలుస్తున్నది. ఈ రాతి కంచె పై భాగంలో ఉన్న ఉష్ణీషం పైన బ్రాహ్మీ భాషలో ఉన్న అనేక లఘు శాసనాలు చెక్కబడినాయి. సూచీల పైన నిలువు స్థంభాల పైన (Uprights) స్థూపం వేదిక మరియు అండం చుట్టూ పుష్పాలహారం, వేరువేరు భంగిమలలో ఉన్న పక్షులు ఉన్న పట్టిక అండ భాగాన్ని రెండు విభాగాలుగా విభజించగా, ఆ భాగంలో బుద్ధుని జాతక కథలు, బుద్ధుని జీవితంలోని ముఖ్య సంఘటనలు, బౌద్ధధర్మ ప్రచార సంఘటనలు మౌర్య మరియు వాతవాహన రాజుల చిత్రాలు అతి రమ్యంగా చెక్కబడి ఆనాటి శిల్పుల కళానైపుణ్యానికి సజీవ సాక్ష్యాలుగా నిలిచాయి. బౌద్ధ ధర్మం చరిత్ర, బుద్ధుని దివ్యమైన జీవన చరిత్ర వివరంగా శిల్పరూపంలో చిత్రించబడినాయి.

బుద్ధుని జీవితంలోని ముఖ్య ఘట్టాలైన దేవతలు తుషిత స్వర్గంలో బోధిసత్వుని ప్రార్థిస్తున్న దృశ్యంతో ప్రారంభమై, మాయాదేవి స్వప్న వృత్తాంతము, సిద్ధార్థుని జననము అసిత మహాముని సిద్ధార్థుని జాతకమును వివరించుట, మారుని గర్వభంగము, బుద్ధుని శారీరక అవశేషాల విభజన, దాని కోసం జరిగిన పోరాటం, రామగ్రామంలో అష్టభాగాలుగా విభజింపబడిన చిత్రాలు అతి నైపుణ్యంగా చిత్రింపబడినాయి. బుద్ధుని జాతక కథలలో ముఖ్యమైన చాంపేయ, మహాకపి, నలపాన, కపి, ఛద్దంత, విదుర పండిత, వెస్సంతర హంస, సుతసోమ, సోనకీయ మొదలైన జాతక కథలు సున్నపురాతి ఫలకాలపై చక్కగా చిత్రింపబడినాయి. ఈ జాతక కథల ఘటనలను చిత్రరూపంలో మనోజ్ఞంగా చిత్రించిన ఆనాటి శిల్పుల కళానైపుణ్యం ఈ శిల్పాలలో గోచరిస్తున్నది.

శాసనాలలో ఈ స్థూపాన్ని "అధోలోక మహాచైత్యము"గా పేర్కొనబడింది. ఈ స్థూపంలో 250కు పైగా బ్రాహ్మీ భాషలో ఉన్న దాన శాసనాలు లభించగా, అందులో 241 లఘు శాసనాలు శాతవాహనుల కాలంనాటివి కాగా మిగిలినవి బాదామి చాళుక్య, రాష్ట్రకూట రాజుల కాలంనాటికి సంబంధించినవే అయి ఉండటం గమనార్హం. ఈ బ్రాహ్మీ శాసనాలలో క్రీ.పూ. 1వ శతాబ్దం నుండి క్రీ.శ. 3వ శతాబ్దాల వరకు ఉన్న శాసనాలలో ఉన్న లిపి, భాష, అమరావతి స్థూపం వద్ద లభించిన శిల్ప శాసనాలలాగే ఉన్నట్లు భాషాశాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. ఈ శాసనాల ఆధారంగా సన్నతి మరియు కనగనహళ్ళి పరిసర ప్రాంతాలు నిరంతరం సక్రియమైన రాజకీయ, ధార్మిక, సామాజిక మరియు ఆర్థిక వ్యవహారాలు నిర్వహింపబడిన కేంద్ర స్థానంగా ఉన్నట్లు తెలుస్తున్నది. దూర ప్రాంతాల నుండి బౌద్ధ భిక్షువులు, భిక్షిణులు ఈ స్థూపాన్ని సందర్శించినట్లుగా తెలుస్తున్నది. శాతవాహన రాజుల పరిపాలనలో వారి అమాత్యులు, అధికార్లు, గృహపతి, గృహపత్ని బౌద్ధ సంఘానికి సంబంధించిన థేర, ఆచార్య, భిక్షు, భిక్షుణి, శ్రమణులు, అంతేవాసినులు, నవకర్మికలు, శ్రీమంతులైన వైశ్యులు, మరియు సామాన్య జనులు ఈ స్థూపానికి అనేక దానాలు ఇచ్చినట్లుగా శాసనాధారాలు తెలియజేస్తున్నాయి. కొన్ని శాసనాల ద్వారా బుద్ధుని జీవితంలోని ముఖ్యమైన ఘటనలు ఆయనతో సన్నిహితంగా ఉన్న స్థలాలు, విహారాలు, బౌద్ధ ధర్మ ప్రచారానికి సంబంధించిన ఘటనలు, జాతక కథలు సులువుగా తెలుసుకునే వీలు కలిగింది. బౌద్ధ ధర్మ మత ప్రచారం కోసం అశోకునిచే స్థాపింపబడిన బౌద్ధ ధార్మిక గురువులు కూడా ఈ స్థూపాన్ని సందర్శించినట్లుగా తెలుస్తున్నది. బనవాస (బనవాసి), కొప్పళ, ధాన్యకటక, మహిసూరు (మైసూరు), పితాల్‌కోరా (మహారాష్ట్ర) మొదలైన ప్రాంతాల నుండి బౌద్ధ శిల్పులు కనగనహళ్ళి బౌద్ధస్థూపం వద్ద శిల్పాలు చెక్కినట్లుగా శాసనాల ద్వారా తెలుస్తున్నది. "నయకమికస దానం", "రాయపులుమావి" అనే పేర్లు మనకు తెలుస్తున్నాయి. నాగముచలిందుని అగ్నికి ఆహుతౌతున్న అడవి నుంచి బుద్ధుడు రక్షించి కాపాడాడు. దానికి ప్రతిఫలంగా బుద్ధుడు కఠోరమైన తపస్సు చేస్తుండగా వచ్చిన తుఫాను నుండి నాగముచలిందుడు తన పడగ విప్పి బుద్ధుని తుఫాను నుండి రక్షిస్తుంది.

ఈ మహాస్థూపం వద్ద నిర్వహించిన త్రవ్వకాలలో

అశోకుని చిత్రం ''రాన్యో అశోకా'' (రాజైన అశోకుడు) అని ఉన్న లఘు శాసనం ఉన్న చిత్రం దక్షిణ భారతదేశంలో లభించిన అరుదైన శిల్పంగా భావించవచ్చును. నిట్టూరు (బళ్ళారి జిల్లా) మస్కి (కొప్పళ జిల్లా)లో ఉన్న అశోకుని శాసనాలలో ''రాజా అశోకే'' అని ''యువరాజు అశోకే'' అని లఘు శాసనాలు ఉన్నాయి కాని అశోకుడు ఉన్న చిత్రం మొదటిసారిగా ఈ మహాస్థూపంలో లభించటం విశేషంగా చెప్పుకోవచ్చును. సాంచీ (మధ్యప్రదేశ్) స్థూపంతో రణంపై ఉన్న చిత్రంలో అశోకుడు తన భార్యలతో సహా బోధివృక్షాన్ని సందర్శించినట్లుగా చిత్రించబడింది. అశోకుని శాసనం మరియు చిత్రం ఉన్న శిల్పం భారతదేశంలోనే రెండవ శిల్పంగా పరిగణింపబడుతున్నది. ఈ చిత్రంతో పాటు శాతవాహన చక్రవర్తులైన సిముక, పులుమావి, సాతకర్ణి, సుందర సాతకర్ణి (శాతకర్ణి), మాతలక అనే పేర్లు పేర్కొనబడినాయి. నానాఘాట్ (మహారాష్ట్ర)లో ఉన్న శాసనంలో కొందరు శాతవాహన రాజుల చిత్రాలు చిత్రింపబడిన విషయం మనందరకు తెలిసిన విషయమే. సుందర శాతకర్ణి కూడా రాజ్యం చేసినట్లుగా మొట్టమొదటిసారిగా ఒక శాసనం ద్వారా తెలియవచ్చింది. కనగనహళ్ళికి సంబంధించిన గ్రానైట్ రాతిపై ఉన్న అశోకుని శాసనం ప్రస్తుతం చంద్రలాంబా పరమేశ్వరి దేవాలయంలో చూడవచ్చును. పులుమావి ఉజ్జయినిని జయించినట్లుగా ఈ స్థూపంపై ఉన్న చిత్రంలో చూడవచ్చును.




మహాస్థూపం వద్ద నిర్వహించిన పురాతత్త్వ ఉత్ఖననాలలో స్థూపానికి దగ్గరలోనే 10 లేక 12 వరుసల ఇటుకలతో నిర్మింపబడిన గజపృష్టాకారం (Elephant's back)లో ఉన్న బౌద్ధవిహారం, చదరస్రపు ఆకారంలో ఉన్న బుద్ధుని పాదుకలు ఉంచిన వేదికలు ధర్మస్థంభాలు ఉన్న వేదిక, గుండ్రంగా ఉన్న ఉద్దేశిక స్థూపాలు, శాతవాహన కాలంనాటి నాణాలు లభించినట్లుగా తెలుస్తున్నది. ఈ మహాస్థూపానికి ఉత్తరం వైపున ఆయతాకారంలో ఉన్న విహారానికి చెందిన అనేక కట్టడాలు వెలుగులోకి వచ్చాయి. స్థూపానికి దక్షిణ ప్రవేశ ద్వారం వద్ద నిల్చొని ఉన్న గంభీర వదనంతో ఉన్న ఎత్తైన బుద్ధుని విగ్రహం చాలా దూరం నుండే యాత్రికులకు కనిపిస్తుంది. ఈ విగ్రహం దగ్గరలోనే కూర్చొని ఉన్న వివిధ భంగిమలలో ఉన్న ఎనిమిది బుద్ధుని విగ్రహాలు (అష్టమానుషీ బుద్ధుని) కూడా లభించాయి. ఈ విగ్రహాల శైలినిబట్టి కృష్ణానది తీరంలో ఉన్న అమరావతి, నాగార్జునకొండ లోయలో లభించిన బుద్ధుని విగ్రహాలను పోలి ఉన్నట్లుగా తెలుస్తున్నది. అమరావతి స్థూపానికి కనగనహళ్ళి మహాస్థూపానికి చాలా దగ్గర పోలికలు ఉన్నట్లుగా పురావస్తు శాస్త్రజ్ఞులు గుర్తించారు. ఈ పైన పేర్కొన్న అష్టమానుషీ విగ్రహాలను మహాయాన సాంప్రదాయం ప్రకారం మహాస్థూపానికి ఎనిమిదివైపులా ప్రతిష్టింపజేసిన విషయం ఈ స్థూపంలో మాత్రమే కనిపిస్తుంది.

ఈ మహాస్థూపంలోని శిల్పాలు హీనాయాన మహాయాన సాంప్రదాయాలకు చెందినవే. హీనాయానంలో బుద్ధుని బోధివృక్షం, సింహాసనం, బుద్ధుని పాదుకలు, ధర్మచక్రం, బౌద్ధస్థూపం ఆకారంలో పూజింపగా మహాయానశాఖలో బుద్ధుని మానవాకారంలో మాత్రమే పూజించేవారు. ఈ మహాస్థూపంలో హీనయాన, మహాయాన శాఖల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. త్రవ్వకాలలో ఈ స్థూపం ఒక ప్రక్కకు ఒరిగినట్లుగా కనిపించటంతో భూకంపం మూలంగా స్థూపానికి నష్టం జరిగినట్లుగాను, ఆ తరువాత భీమానదిలో వచ్చిన వరదల మూలంగా ఈ స్థూపం చుట్టూ ఉన్న నల్లరేగడి మట్టితో పూర్తిగా కప్పివేయబడి ఉన్నది.

భగ్నమైన శిలాఫలకాలను, విగ్రహాలకు జీర్ణోద్ధారణ చేసి మహాస్థూపాన్ని తిరిగి పూర్వపు మహోన్నత స్థితికి తీసుకు రావాలని భారత పురావస్తు శాఖ వారు చేస్తున్న ప్రయత్నాలు విజయవంతం కావాలని, ఈ కార్యానికి కేంద్ర ప్రభుత్వం తగినన్ని నిధులు అందజేయాలని స్థానికులు కోరుకొంటున్నారు.

కొసరాజు వెంకటేశ్వరరావు
సుత్తూరు. ఫోన్: 949 063 6659.

# కావ్యాలలో మనసు ప్రభావం

– చెళ్ళపిళ్ళ సన్యాసిరావు

'మనసు' మనిషికి మార్గదర్శి. పంచేంద్రియాలకు అధిపతి. మనసుకున్న శక్తి మాటలకందనిది. ఒక రూపం లేనిది కానీ అన్ని రూపాలను సృష్టించే శక్తి కలిగినది. మనిషి నడవడిక అతని మనస్సుపై ఆధారపడి ఉంటుంది. ప్రశాంత మనస్కుడికి మానసిక బలంతో పాటు, ఆయువును వృద్ధి చేయనని శాస్త్రం చెబుతోంది.

మనసు ఒక అంతరింద్రియం. మనసుననుసరించి శరీరం చైతన్యవంతమై కార్యాలు నిర్వహిస్తూ ఉంటుంది. సకల భావాలకు మూలకేంద్రం మనస్సు. మనసు పలు రాగ భావాల వీణవంటిది. మానవ దేహం ఒక నావ అయితే దాని నావికుడు మనస్సు మనసు పూలతోటలా ఉండాలని పెద్దలంటారు.

మనసుకు పక్షితోనూ, రాగద్వేషాలను దాని రెక్కలతోనూ పోలుస్తూ మనసును అదుపులో పెట్టాలంటే రాగద్వేషాలను నియంత్రించుకోవాలన్నది మహర్షుల ప్రబోధం. మనసు ఎవరికీ అర్థం కానిది. సంకల్ప వికల్ప కార్యాలను నేర్పుగా నిర్వహిస్తుంది. ముఖం మనసుకు ప్రతీక అంటారు.

మనసుని పట్టడం, జయించడం చాలా కష్టం. నరకాన్నిగాని, స్వర్గాన్ని కాని సృష్టించుకునే శక్తి కేవలం మనసుకే ఉంటుందని, మనస్సును జయించినవారే ప్రపంచాన్ని జయిస్తారని మనసే ఉత్తమ జీవితానికాధారమని శాస్త్రం చెబుతోంది.

మన దోషం, వాగ్దోషం, దృష్టి దోషం, శ్రవణ దోషం, క్రియాదోషం అనబడే 'పంచ' దోషాలలో మనోదోషం ప్రబలమైందని శాస్త్రమంటుంది. మనసుకున్న లక్షణాలలో మైత్రీబంధాన్ని కోరుకోవడం ముఖ్యమైనది. మనసుపై శ్రద్ధ నుంచినచో అది మనిషికి మేలు చేస్తుంది. దీనినే అంకితభావమంటారు. ఇది మానవుణ్ణి మహనీయుడుగా మాధవుడుగా మలుస్తుంది.

కష్టనష్టాలకు, పునర్జన్మకు, మనస్సే మూలమని మహర్షుల ప్రబోధం. మనస్సు, వాక్కు, క్రియ - ఈ మూడింటి ఏకత్వమే 'ధర్మ'మని వీటితో ప్రధానమైనది మనస్సేయని వేదవిదులంటారు. ఇతరుల ధనాన్నాశించడం, చెడుని చింతించడం, అసత్యాన్ని పలకడం, ఈ మూడూ మనసు ద్వారా కలుగు పాపాలన్నారు. కామ, క్రోధాలు, మద-మాత్సర్యాలు, రాగ-ద్వేషాలు, సుఖ-దుఃఖాలు, హర్ష-విషాదాలు, ప్రేమ-మోహాలు, దయా-దాక్షిణ్యాలువంటివన్నీ మనస్సు యొక్క గుణాలని శాస్త్రం చెబుతోంది. హృదయం నుంచి సమస్త వికార భావాలతో స్వరూపమైన మనస్సు పుట్టిందని 'భాగవతం' చెబుతోంది. భోగలాలస లేని నిర్మలమైన మనస్సే మోక్షమని 'వశిష్ట గీత' చెబుతోంది.

బంధానికైనా మోక్షానికైనా మనసొక ఉపకరణమని 'గీతోపనిషత్తు' చెబుతోంది. మనసులో కదిలిన భావనలు, వాటిననుసరించిన క్రియలు, ఆత్మశక్తికి నిదర్శనమని అవే చైతన్యాన్ని కలిగిస్తాయని 'కేనోపనిషత్తు' చెబుతోంది.

గాలి కదలికతో మనసు కదలునని గాలి నిల్చిన మనసు నిలుచునని 'హఠయోగ దీపిక' సూచిస్తోంది. శరీరం రథమని, సారథి బుద్ధియని, గుర్రాలు ఇంద్రియాలని, మనసు పగ్గాలని, జీవుడు రథికుడని 'కఠోపనిషత్తు' చెబుతోంది. మనసు హృదయ స్థానాన్ని అల్లుకొని ఉంటుందని ఉపనిషత్తుల ఉపదేశం. మనసులో మంచిని పెంచుకుంటూ ఆరోగ్యవంతుడై నూరేళ్ళు జీవించాలని వేదాలు వెల్లడించాయి.

మదపుటేనుగును మచ్చిక చేసుకుని క్రమంగా

వశపరచుకున్నట్లే వివిధ సాధనాలతో, మనస్సుని అదుపులో పెట్టుకోవాలని, ఆధ్యాత్మికవేత్తలంటారు. ఇదే భావాన్ని 'కృష్ణ'పరమాత్మ 'గీత' ద్వారా లోకానికి అందించాడు.

సర్వకాలాల్లోనూ మనస్సును నిగ్రహించుకోవడం అత్యుత్తమమని వ్యాసమహర్షి వెల్లడించాడు. సత్యం, అహింస, ఇంద్రియ నిగ్రహం, దానం, దయ, సమత్వం, జ్ఞానంవంటివన్నీ మానస - తీర్థాలని, ముఖ్యమైనవని, 'అగస్త్య మహర్షి' అన్నారు. మనసు మనకు కనిపించదు. చాలా ప్రభావవంతమైనది. మనసు కలవాడే మనిషి. మనసు మర్మమెరిగిన మనిషికి, నే మ్రొక్కుతానన్నారు నాదబ్రహ్మ త్యాగరాజు స్వామి.

వికారం కలిగించి, మనస్సును చలింపజేసే వస్తువు దగ్గర ఉన్నప్పటికీ, ఎవరి మనస్సు ఏకాగ్ర భావంతో ఉంటుందో వారు, ధీరులని మహాకవి కాళిదాసు పేర్కొన్నాడు. నాది నాదనే అహంకారంతో నా దగ్గర ఉండిపోయింది. నా మనస్సు - దాన్ని నీకిచ్చేస్తాను, స్వీకరించు ప్రభూయని శివుణ్ణి వేడుకుంటారు తన 'శివానందలహరి'లో శ్రీ శంకరులు.

మానసిక బలహీనులకు, భయం చెందేవారికి, ఏ విజయం చేకూరదని, 'భాస' మహాకవి స్వప్నవాసవదత్త నాటకంలో వివరించాడు. జలంచే శరీరం, సత్యవాక్కుచే మనస్సు శుద్ధమగునని "అద్భిః గౌత్రాణి శుద్ధంతి మనస్సత్యేన శుద్ధ్యతి'యని నీతిశాస్త్ర సుభాషితం సూచిస్తోంది.

ప్రతి మనిషికీ మనోబలం ముఖ్యమని గౌతమ బుద్ధుని సందేశం. ఇంతటి శక్తిగల మనస్సుని దాని మర్మాలను కావ్యాలలో కవిపుంగవులెలా చిత్రించి రచించారో కొంచెం తెలుసుకుందాం. ఆస్వాదించి, ఆనందిద్దాం-

రామాయణంలో - మనిషి మనస్సునే, 'సీత'యని అంతరాత్మనే, రాముడని, మనస్సైన సీత, మనోహరమైన అంతరాత్మయందే, ఐక్యమగుటయే, సీతారామ కళ్యాణమని పెద్దలంటారు. మనసా, వాచా, కర్మణా హనుమంతుడు శ్రీరాముని భక్తుడై వెలుగొందాడు. రాముని మనస్సు రామాయణంగా ఆవిష్కృతమైంది. మనస్సును విరిచే మందరబుద్ధి కైకేయి మనస్సును విరిచింది. రాముని పట్టాభిషిక్తుని గాకుండా చేసింది. రామకథను కుత్సిత మనస్సుతో మలుపు తిప్పింది.

కవిసామ్రాట్ విశ్వనాథ వారి 'రామాయణం - కల్పవృక్షం'లో పేర్కొన్నట్లు - "రామచంద్రుడవికారుడు - కాననమేగువేళన్" - శాంత స్వభావ మానసుడైన రాముడు సీత వివాహం సందర్భంలో ఏ విధంగానుండెనో, కానలకు వెళ్లే సమయంలో కూడా అదేవిధంగా ప్రశాంత చిత్తవదనుండై విరాజిల్లెనని, అతని మనోనిర్మలత వర్ణించి చూపబడింది.

లంకలో ఉన్న సీతాదేవికి, రాముడు హనుమంతుని ద్వారా పంపిన సందేశంలో "దేవి! మన మధ్యనున్న ప్రేమతత్వం, ఒక్క నా మనస్సునకే తెలియును. ఆ నా మనస్సు నీ వద్దనే ఉంది. దానిలో నీవు నా ప్రేమతత్వాన్ని తెలుసుకోగలవు" - సూర్యుడు, కాంతి ఎలా వేరు కావో - అలా సీతా-రాముడు వేరుగా ఉన్నా - వారి మనస్సు ఒక్కటేయని, రాముని మనస్సు సీతదని తెలియజేసింది రామాయణం.

మహాభారతంలో - 'అరణ్య'పర్వంలో అశరీరవాణి రూపంలోనున్న యక్షుడడిగిన ప్రశ్నకు జవాబుగా - "మనస్సు" గాలికంటే వేగవంతమైనదని ధర్మరాజు చెప్పాడు.

'సభా'పర్వంలో - మనస్సులో వైర భావాన్ని తలచుకుండుట, ఓర్పు కలిగియుండుట, మంచిని యెంచి చెడును విడుచుట, ఉత్తములైనవారికి సహజ గుణాలని, ద్రౌపదీ వస్త్రాపహరణానంతరం, పాండవులకు వారి రాజ్యాన్నిచ్చే సందర్భంలో, ధృతరాష్ట్ర మహారాజు ధర్మరాజుతో చెప్పాడు.

*మనమున వైరమి దలపమి*
*యును, సక్షమ చిత్తుడగుటయును గుణములకై*
*కాని దోషంబులు విడుచుట*
*యును, నుత్తముడయిన పురుషునుత్తము గుణముల్*

ఉద్యోగ పర్వంలో - (విదురనీతి)-

*తనువున విరిగిన యలుగుల / ననువున బుచ్చంగ*

*వచ్చునతినిష్ఠురతన్ / మనమున నాటిన మాటలు*
*విను మెన్ని యుపాయములను వెడలునెయధిపా*

రాజా! శరీరంలో విరిగిన బాణాలను ఉపాయంతో తీసివేయవచ్చును. కానీ మిక్కిలి నిష్ఠూరంగా మనస్సులో నాటుకొన్న మాటలు ఎన్ని ఉపాయలతోపైనా బయటకు వస్తాయాయని విదురుడు ధృతరాష్ట్రునకు చెప్పాడు.

భాగవతంలో - మనసు గాయపడిన ధృవుడు నారద మహర్షితో 'ఓ మహర్షి! మా తండ్రిగారి తొడపై కూర్చున్నవేళ పినతల్లి వచ్చి అడ్డుకుంది. నాకు ఆ అర్హత లేదంది. ఆ అర్హత కోసం శ్రీమహావిష్ణువును ఆశ్రయించమంది. ఈ విషయాన్ని నా తల్లితో చెప్పగా ఆమె కూడా పినతల్లి చెప్పిందే చెప్పింది. అందుకే శ్రీహరిని శరణు వేడి, ధ్యానించడానికి అడవికి వచ్చాన'ని తన దృఢ నిర్ణయాన్ని తెలిపాడు.

బలిచక్రవర్తిని వామనుడు మూడడుగుల నేల దానముగా అడిగినవేళ నా మనోనిర్ణయం మారదని 'బలి' బదులు చెప్పాడు.

*సూనృతంబుగాని సుడియదునాజిహ్వ / బొంకజాల నాకు బొంకు లేదు / నీ తృతీయ పదము నిజము నా శిరమున / నెలవు సేసి పెట్టు నిర్మలాత్మ*

రుక్మిణీదేవి పెళ్ళికి ముందు తను ప్రేమించిన శ్రీకృష్ణుని వద్దకు తన మనస్సులో స్థిరపడిన ప్రియునకు తన మాటను తెలియజేయు నెపంతో 'అగ్నిజ్యోత'నుడను బ్రాహ్మణుని పంపింది. అతడు తిరిగి వచ్చేలోగా ఆమె మనసులో ఇలా తలచుకుంటుంది-

''ఆ బ్రాహ్మణుడు కృష్ణుడు వద్దకు చేరుకున్నాడో లేదో! అతని మాటలు విన్న కృష్ణుడు తప్పుగా భావించెనో! విధి, అనుకూలించునో, లేదో! నా భాగ్యమెలా ఉందో!'' అని మనస్సులో చింతించసాగింది.

*"ఘనుడా! భూసురుడేగెనో, నడుమ మార్గ శ్రాంతుడై చిక్కెనో, విని కృష్ణుండిది తప్పుగా దలచెనో, విచ్చేసెనో, ఈశ్వరుం డనుకూలింపదలంచునో తలపడో, యార్యామహాదేవియున్ నను రక్షింపనెరుంగునో యెరుగదో, నా భాగ్యమెట్లున్నదో!"*

మనుచరిత్రములో - సౌందర్యరాశి, వరూధిని మనస్సుని, పెద్దన కవి వీక్షింపజేశారిలా వినూత్నంగా -

*ఎక్కడివాడొ, యక్షతన యేందు జయంత వసంత కంతులన్ చక్కదనంబునన్ గెలువజాలెడువాడు మహీసురాన్వయం బెక్కడ? యీతనూవిభవమెక్కడ? యేలనిబంటుగా మరున్ దక్కగొనంగరాదె అకటా! నను వీడు పరిగ్రహించినన్*

అందాల వరూధిని ప్రవరుని తేజోరూపాన్ని చూసింది. అతని రూపం ఆమె మనస్సులో స్థిరపడింది. సృష్టిలో నలకూబరుడు, జయంతుడు, మన్మథుడు, చంద్రుడు, వసంతుడు అందగాళ్ళని పేరుపడ్డారు. కాని బ్రాహ్మణుడేంటి? ఇంత అందమేంటి? నన్నితడు చేపడితే, ఎంత బాగుంటుందని, తలుస్తూ, మనస్సులో మురుస్తుంది, మైమరుస్తుంది.

స్త్రీల మనస్సును తెలుసుకోలేము కదా! పూల సువాసనలను దండగా గుచ్చవచ్చును. ఇసుక బొమ్మల్ని నీటిపై తేలియాడించవచ్చును. వడగళ్ళతో గుడిని నిర్మించవచ్చునుగాని ఇంతుల మనోగతౌని సుంతైనా తెలుసుకోలేమని, 'గౌరన'కవి వెల్లడించాడిలా-

*కుసుమ సౌరభములు గుది గుచ్చవచ్చు / ఇసుక బొమ్మల నీటినీ దింపవచ్చు / వడివడగండ్లతో గుడికట్టవచ్చుగాని ఇంతుల మనోగతి గానగరాదు*

పారిజాతాపహరణంలో ఓసారి నారద మహర్షి దేవలోకం నుండి దిగి శ్రీకృష్ణుని రుక్మిణీ మందిరంలో దర్శించి పారిజాత పుష్పాన్నం దించి దాని మహిమను తెలిపాడు. కృష్ణుడందుకొని రుక్మిణీ కురులలో అలంకరించాడు. ఈ వార్త చెలికత్తె ద్వారా విన్న 'సత్యభామ' అలిగింది. కృష్ణుడు తన శయ్యాం మందిరానికి వచ్చి తనను లాలించే వేళ పాదతాడనం గావించింది. అంతట కృష్ణుని అనునయ వినయ పలుకులను నంది తిమ్మన కవి, వివరించాడిలా-

*నను భవదీయ దాసుని మనంబున నెయ్యపు గిన్కబూని దా చిన యది నాకు మన్ననయె, చెల్వగు నీ పదపల్లవంబు మ త్తను పులకాగ్ర కంటక వితానము తాకిన నొచ్చునంచు నే నని యెద నల్కమానవుగదాయికనైన, నరాళకుంతలా!*

ఓ నరాళ కుంతలా! (వంకరలు తిరిగిన ముంగురులు కలదానా) నేను నీ దాసుడను. నీ మనస్సులో కోపంతో నన్ను తన్నుటను, నే తప్పుగా

తలచలేదు. పైగా నన్ను గౌరవించుటయని, నా భావం. నా తనువు పులకించింది. అది ముళ్ళవలె నీ పాదానికి గ్రుచ్చుకొని బాధించెనేమో! యని తలచెదను. ఇకనైనా అలకను విడిచి శాంతించి నన్ను నీ దరిజేర్చుకోమని బ్రతిమాలాడాడు, సత్యభామను శ్రీకృష్ణుడు.

ప్రజాకవి వేమన సాహిత్యంలో - మనస్సును మనస్సుతోనే జయించాలని తెలియపరిచాడు.

*మనసునందు నిలిచె మాయ సంసారము / మనసు నిలిపెనేని తానె బ్రహ్మయగును / మనస్సును మనస్సున జంపిన / మనసందే ముక్తిగలదు మదిలో వేమా!*

కవిచక్రవర్తి 'జాషువ' సాహిత్యంలో అతని భార్య, ఇద్దరు బిడ్డలతో సాగే బ్రతుకు బండిని నడిపించడంలో పేదరికానికి ఎన్నడూ కృంగిపోని తన భావాన్ని, మనసు విప్పి ఇలా ప్రకటించాడు-

*ఇద్దరు సుతులుం గూరిమి / ముద్దియ మేరాంబతోడ ముట్టెడు జీతం / బద్దెకు ముద్దకు చాకలి / పద్దుకు సరిపోక పెక్కు పాంట్లంబడితిన్*

ఆధునిక సాహిత్యంలో - కవికోకిల దువ్వూరి రామిరెడ్డిగారి 'కృషీవలుడు' కావ్యంలో-

*ప్రొద్దువాడిచిన దాదిగా ప్రొద్దుగుంకు / వరకు కష్టింతువేగాని యిరుగు పొరుగు / వారి సంపదకై యీసు గూర బోవ వెంత నిర్మల మోయి నీ హృదయ కళిక*

దినమంతా కష్టపడతావేగాని, ప్రక్కవారి సంపదల గురించి అసూయ పడవు. నీ మనస్సెంత స్వచ్ఛమైందోయీ హాలికుడా! అని అభినందిస్తాడు.

తిలక్ రచనలో మంచి మనసు, మానవత్వం లేని చోట నేనుండలేను అంటాడు -

*మానవత లేని లోకాన్ని స్తుతించలేను / మానవునిగా శిరసెత్తుక తిరుగలేను / ఈ నాగరికతారణ్యావాసం భరించలేను / ఈ కృత్రిమ వేషాన్ని అభినయించలేను*

మనసైన శ్రీశ్రీ - *ప్రపంచాన్ని చూడలేని / కవిత నిజం చూపదు / ఇసకలో తలదూర్చిన / ఉష్ట్రపక్షి బాపతు* అంటూ మనసులోని మాటను, నిర్భయంగా ప్రకటించాడు.

నాయని సుబ్బారావుగారి 'వత్సల' చిన్ననాటి నుండీ కలసిమెలసి తిరిగిన కన్యను, తన హృదయ రాణిగ, మనస్సులో భావించాడు. కావ్య ప్రేయసిగా భావించి వేదనాగ్నిని, మనసులోనే అణుచుకున్న ప్రేమభిక్షకుడుగా పాడుకున్నాడు-

*చూడముచ్చటైన మనస్సున ప్రియమ్ము / వెల్గు గొలిపెడు చిన్నారి మల్లెపూవు / మండుటెండకు కందిపోకుండనాదు చేతిలోనికి వచ్చి వాసించుటెప్పుడొ*

ఇందులో ప్రణయరూపిణియైన 'వత్సల'ను మల్లెపూవుతోను, అడ్డు చెప్పిన ఆమె తండ్రిని, మండుటెండతోను సరిపోల్చడం సముచితంగా ఉంది.

కృష్ణశాస్త్రి రచనలో - *మతమన్నది కంటికి మసకైతే / మతమన్నది మనసుకి మచ్చైతే / మతం వద్దు గితం వద్దు / మారణహోమం వద్దు*

దాశరథి ప్రబోధంలో - *మనసైతే మల్లెలు విసరు రాళ్ళను విసరుట వద్దు సుమా / అడిగినచో దారి చూపు / పెడదారి చూపడం తగదు సుమా!*

మనసుగల సి.నా.రె. భావజాలంలో - *మనసు కలవరిస్తున్నది / మలుపై జీవించాలని / కాంక్ష మనసుకు వేరు / కదలిక దాని తీరు / మనస్సుకు తోడుగు మనిషి / మనిషికి ఉడుపు జగతి / ఇదే విశ్వంభరాతత్త్వం / ఇదే అనంతజీవన సత్యం*

శేషేంద్రశర్మ - మండే సూర్యుడు కావ్యంలో - *జీవిత సమరంలో ఉన్నది ఒక్కటే గుండె... వంద గాయాలకు చోటెక్కడి* దని ప్రశ్నిస్తారు?

*మనసు ఇచ్చిన గాయాలను / మమత కనుగొన్నది / బ్రతుకు సంతలో చివరకు / బాటసారి అయినది.*

డా. కోడూరి ప్రభాకర రెడ్డి గారి అనుసృజనలో - *మన్మథాగ్నులు మనసున మండుచుండ / చందనముపూయ కాయమ్ము చల్లబడునె? కుంభకారుడు పంకమ్ము కూర్చినంత / తాపమెక్కడౌ తగ్గిపోదు*

సమయానికి నాయకుడు రాకపోగా విరహతప్త అయిన నాయికకు చెలికత్తెలు చందన పూతలతో చల్లబర్చగలరా? కుమ్మరివాడు కాలిన కుండ వద్ద పంకానుంచినచో, దాని తాపం తగ్గుతుందా? అన్న భావం (కాళిదాసు శృంగార తిలకమందలి నాయిక).

డి.వి.యం. సత్యనారాయణగారి అనుసృజనలో - 'ఆంధ్ర గానలహరి'యందలి నాయిక, నాయకుడు కనపడగానే సిగ్గుతో తన రెండు చేతులతో కన్నులు మూసుకుంటుందిగానీ, కడిమి చెట్టు పూచినట్లుగా, తనువంతా నిండిన పులకలనెట్లు దాచగలను చెలీ! అని నాయిక తన మనసు విప్పి చెబుతుందిలా-

*మనసు దోచిన చెలికాడు కనపడంగ / చేతలనే నాదు కనుల మూసితినిగాని / పూచిన కదంబ వృక్షంబువోలెనున్న / తనువు పైగల పులకలదాచగలనె*

వేముగంటి నరసింహాచార్యులు - *మంజీరనాదాలు కావ్యంలో - నాలుగు భాషల / మేలిమి తెలిసిన / మహిత మనస్విని / మధుర యశస్విని* అంటూ మంజీరా నది గతులను దాని మానసిక స్థితులను హృద్యంగా చిత్రీకరించారు.

ఆచార్య తిరుమల రచనలో మనస్సు - *మనిషి తన మనస్సును నమ్మితేనే పరమార్థం / హృదయమును నమ్మి చేసినదేదియైన / సత్ఫలితమిచ్చు సజ్జన సభ్యజగతి / మమత నిండిన మనసు ఉంటే అందము*

మనిషికి మనస్సుకు ఉన్న సంబంధం పువ్వుకూ పరిమళానికీ ఉన్న అనుబంధంలాంటిదని, మనిషికి జీవన మూల్యాలను విశదంగా తెలిపేది మనస్సని, మనసులోని మాధుర్యానికి మత్తెక్కిపోయేదంతా మానవ జాతియని తెలిపారు.

బండి సత్యనారాయణ - తన శృంగార చాటువులు కావ్యంలో - తన మనసు ఇలా పరవశించిందట -

*బిందెను మూపున నిడుకొని / యందంబులు చిందులాడ హంసగమనవై / సుందరి నీ వరుగగ నా / నందము నాడెందమందు నాట్యములాడెన్*

కస్తూరి భాస్కరలక్ష్మిగారు 'మనస్సు'నిలా తెలిపారు-

*శరీరం వాలినా వాలలేని నా మనసు / ఆవేదనతో కృంగిపోయె నా మనసు / నీపై భ్రమిస్తున్నది, నీవేనా... నీవేనా... అని కలవరిస్తున్నది / మనం ఒకేచోట కలసి మెలసి తిరిగి చదివామని గుర్తు చేస్తున్నది*

ఇలా చాలామంది కవులు మనసుపై రచనలు చేసి మైమరపించారు. 'మనసు' మర్మాన్ని గ్రహించి మసలుకుందాం. మనమంతా, జగతికి జీవాన్నందిద్దాం.

*శుభం భవతు*

**చెళ్లపిళ్ల సన్యాసిరావు**
**రాజాం. శ్రీకాకుళం. ఫోన్: 703 260 6821.**

"…. ***మిసిమి*** మార్చి 2020 నెలలో ప్రచురించిన వ్యాసాలలో విలువైన వ్యాసం 'రాజ్యాంగ పరిషత్తులో మహిళలు - బేగం అయిజాజ్ రసూల్'. రాజ్యాంగ విషయాలలోనూ, మతాల వారీగాను మైనారిటీలకు ప్రత్యేక నియోజక వర్గాల ఏర్పాటు విషయంలో ఆమె భావాలకూ, ఆలోచనలకు ఈనాటి మైనారిటీ వర్గం వారు, వివిధ మత వర్గాల వారి ఆలోచనల మధ్య ఎంత వైవిధ్యమో కనిపిస్తున్నది. ఈనాటి మేధావులు, పార్లమెంటు సభ్యులు, జిజ్ఞాసులైన ప్రజలు విధిగా ఆలోచించవలసిన విషయం ఇది. ఆనాటి ఆమె ఆలోచనలకు, ఈనాటి వారి ఆలోచనలకు ఎక్కడా పొంతనే లేదు. పప్పు వేణుగోపాలరావు గారి వ్యాసాలు చదువుతున్నవారిలో నేనూ ఒకణ్ణి. వాగ్గేయకారులు త్యాగరాజు, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు - వారి కృతులను తెలుగులోనే రచించినప్పటికీ తమిళనాట తెలుగు కృతులు గానం చేయవద్దని, తమిళంలోనే వ్రాయాలని రాజకీయంగా పరిమితులు ఏర్పరచినప్పటికీ ఇప్పటి కర్ణాటక సంగీత విద్వాంసులు, వాగ్గేయకారులు తెలుగు కృతులను ఆనందంగా పాడటం అందరూ ఎరిగినదే. తెలుగు వారికి కర్ణాటక సంగీతం ఎందుకు దూరం అయిందీ, తెలుగు ప్రజలలోకి కర్ణాటక సంగీతం ఎందుకు చొచ్చుకుపోలేకపోయిందీ - తెలుగు రాష్ట్రాలకు ప్రక్కనే ఉన్న తమిళ, కన్నడనాడులలో ఎలా ప్రాచుర్యం పొందిందీ - ఈ కృతులు, సంగీతం - ప్రజలలో ఇంతగా ఎలా చొచ్చుకుపోయాయి - కర్ణాటక సంగీతం తెలుగు ప్రజలలో చొచ్చుకుపోవడానికి ఏ కారణాలు అడ్డు నిలిచాయి? ఈ విషయమై శ్రీ పప్పు గారు వివరంగా ఒక వ్యాసం వ్రాయగోర్తాను…"

*- గుడిపూడి సుబ్బారావు, అన్నవరగూడెం, సూర్యాపేట*

# లోకోత్తర పథం

*– కస్మూరి అలెగ్జాండర్*

*ఈనాడు మనకు శ్రేష్ఠమైన మార్గాలలో పయనించే అవకాశమున్నా, ప్రపంచంలో "మనవి" అనుకునే అశాశ్వతమైన వాటిని వదులుకోలేకపోవడం ఇది నేటి మన సమాజ దౌర్భాగ్య స్థితిని తెలియజేస్తుంది. ఈ విపత్కర పరిస్థితుల్లో తెలివిగా ప్రవర్తించడానికి బౌద్ధం తనదైన పద్ధతిలో కరుణతో మనకు 2,600 సం॥లుగా తరించడానికి జ్ఞాన ధీదితులను ప్రసరిస్తూనే ఉంది... సాధనా పథంలో మన నడక కొనసాగించడానికి మెళకువలను సూచిస్తూనే ఉంది. ఆ జ్ఞాన సంపదను వినయంతో అందుకొని లక్ష్యం సాధించడం అనేది మన బాధ్యతని గుర్తు చేస్తుంది. ఈ దివ్య ధర్మం కోసం సాధనకు ఉపక్రమించే సమయం ఇపుడు ఆసన్నమయినది. ఇది అనుకూల తరుణం కూడా. ఉన్నతము, శాశ్వతము అయిన ధర్మ మార్గం కోసం గట్టిగా ప్రయత్నం చేయడం మన బాధ్యత. ఈ రోజు కాకపోయినా రేపైనా మనం పట్టుకొని ప్రాకులాడే ఈ అజ్ఞాతపు పంథాన్ని విడువక తప్పదు. లోక విధానం ఇలా ఉంది. మన నడతలు అవి దుఃఖానికి దారితీసి అపోహలతో నిర్మించిన ఊహాసౌధాలు కూలినపుడే... ఏదో మంచి నేర్చుకోవాలి అని అరకొర ప్రయత్నాలు మొదలు పెడతాము కానీ పరిస్థితులు అదును తప్పిన తరువాత ఆ ప్రయత్నం చేస్తే ఫలితం ఏముంది? తథాగతుడు అనురాగంతో అందించి సూచించిన ఈ లోకోత్తర పథంలో బుద్ధిపూర్వకంగా, చక్కగా యోచించి, స్పష్టమైన ఎరుకతో, దృఢమైన సంకల్ప శక్తితో, ధర్మంపట్ల ఏక నిష్ఠతో మనం సాధనకు ఉపక్రమిద్దాం. ఈ లోకోత్తర పథంలో ఏ ఒక్క మార్గాన్నైనా ఎంచుకొని పూజనీయమైన భావంతో మన పయనం బోధివృక్షం వైపు కొనసాగించుదాం. విమోచనానందాన్ని చేరుకుందాం.*



భగవానుడు వైశాలిలోని మహావనంలో విడిది చేసిన సమయాన లిచ్ఛలి కుల పుత్రుడు మహాలి పెద్ద సంఖ్యలో అనుచరులను వెంటబెట్టుకొని భగవానుని వద్దకు వచ్చి నమస్కరించి ప్రక్కగా కూర్చొని ఇలా ప్రశ్నించాడు: "భగవాన్, మీ వద్ద ధర్మంలో చరించే భిక్షువులకు చరమ లక్ష్యం ఏమిటి? ధ్యానం ద్వారా దివ్యదర్శనాలు, మహిమలు సాధించడమా... లేక వేరైన ఉన్నత లక్ష్యాలు ఏవైనా ఉన్నాయా?" అని అడిగాడు.

అందుకు భగవానుడు ఇలా అన్నాడు... "ఇక్కడ భిక్షువులు ధ్యానాన్ని అభ్యసించేది అవేవో మహిమలు సాధించడమో లేక దివ్య దర్శనాల పరవశం కోసం తాపత్రయం చెందడమో కాదు. మానసిక పవిత్రత కోసం చిత్తైకాగ్రత కోసం. సత్యాన్ని యధాభూతం గావించుకొనడమే పరమ లక్ష్యంగా భిక్షువులు తమ సాధన కొనసాగిస్తున్నారు" అని బదులు చెప్పాడు.

భగవానుడు ఇంకా ఇలా అన్నాడు: "ఈ సాధనాపథంలో అరియపుగ్గలులు నలుగురున్నారు... (అరియ అంటే శ్రేష్ఠుడు, విశిష్టుడు అని అర్థం) వారు:

1. స్రోతాపన్నుడు (నదిని ప్రవేశించినవాడు), 2. సకదాగామి (నదిని దాటే ప్రయత్నంలో కొంత తడవు పయనించి ఒకసారి తిరిగి వచ్చినవాడు), 3. అనాగామి (నది ప్రయాణాన్ని పూర్తిచేసి వెనుదిరిగి రానివాడు), 4. అర్హంత (మలినాలన్నీ క్షయం కాగా నిర్మలత్వం పొందినవాడు).

ఈ పవిత్ర పథంలో 8 దశలున్నాయి. అరియపుగ్గలుడు ఈ 8 దశలలో ఏదో ఒక దశను దాటినవాడు అని భావం. వీటిలో నాలుగు లౌకిక మార్గాలు వీటికి అనుసంధానంగా మరి నాలుగు లోకోత్తర ఫలాలు ఉన్నాయి. అంటే ఇవి నాలుగు

జంటలు. మొత్తం కలిపి 8 దశలవుతాయి. అవి ఈ విధంగా ఉన్నాయి.

1. సోతాపత్తి - మగ్గ : నదిని ప్రవేశించినవాడు - స్రోతస్సున ప్రవేశించడంవల్ల సిద్ధించిన ఫలం. 2. సకదాగామి - మగ్గ : మార్గాన్ని దాటిన వాడు - మార్గాన్ని దాటడం వల్ల సిద్ధించిన ఫలం. 3. అనాగామి మగ్గ : పథాన్ని దాటినవాడు - పథాన్ని దాటడం వల్ల సిద్ధించిన ఫలం. 4. అరహంత మగ్గ : పథం నిర్దేశించిన లక్ష్యాలను సిద్ధింపజేసుకున్నవాడు - మార్గాన్ని స్థిరీకరించుకోవడం వల్ల సిద్ధించిన ఫలం.

ఇపుడు ఈ నాలుగు లోకోత్తర మార్గాల వివరణలోకి వెళదాం-

1. **స్రోతపన్నుడు:** సాధారణ అర్థం నదిని ప్రవేశించినవాడు అని చెప్పవచ్చు. (ఇక్కడ నది అనే మాటను ప్రతీకాత్మకంగా ఉపయోగిస్తున్నాము. నది అంటే సంసారం, అజ్ఞానం అని. ఈ నదిని దాటే ప్రయత్నంలో ఉన్నవాడు స్రోతపన్నుడు అని భావించవచ్చు). స్రోతపత్తి మార్గం ద్వారా అరియపుగ్గల 5 అవర భాగీయ సంయోజనలలోని (Lower Fetters) మొదటి మూడు సంయోజనల నుంచి విముక్తుడవుతాడు. వీటిని అధిగమించలేని పక్షాన అతడు ఇంద్రియ విషయ వాసనలలో చిక్కుకొని ఉంటాడు. బయటపడడం దుర్భరం.

మూడు సంయోజనాలు - 1. సక్కాయ దృష్టి (ఆత్మ ఉందని నమ్మడం) 2. విచికిత్సా దృష్టి (శంకాదృష్టి కలిగి ఉండడం) 3. శీలబ్బత పరామాస (శీలవ్రతాలలో అంటే క్రతువులు, ఆచార కర్మకాండలో కూరుకున్నవాడు). ఈ మూడు సంకెళ్ల నుంచి శ్రోతాపన్నుడు పూర్తి విమోచనపొందినవాడు అని అర్థం.

**స్రోతాపన్నుని శీల లక్షణాలు:** అ) బోధి పొందినవానియెడల అచెంచల విశ్వాసం ఆ) ఆయన బోధించిన దివ్య ధర్మం పట్ల మొక్కవోని శ్రద్ధ ఇ) బోధి సంఘం పట్ల పూర్ణ సంఘీభావం ఈ) శీలజీవానురక్తుడు.

**2. సకదాగామి:** ఒకసారి తిరిగివచ్చినవాడు అని అర్థం. నాలుగు లోకోత్తర మార్గాలలో మొదటి మార్గాన్ని స్థిరీకరించుకొన్న వానిని స్రోతపన్న అని, ఈ రెండవ మార్గాన్ని యదార్థీకరించుకున్న వానిని సకదాగామి అని అంటాం. సకదాగామిని అరియ (శ్రేష్ఠ) అని పిలవవచ్చు. సకదాగామి అయినవాడు 5 అవరభావీయ సంయోజనాలలోని 4, 5 సంయోజనాల నుంచి విడువడి స్వేచ్ఛను పొందినవాడు అని అర్థం. అవి నాలుగవ సంయోజనం ఐంద్రియ తృష్ణ (Sensious Craving - కామచ్ఛంద), ఐదో సంయోజన వ్యాపాద (Illwill : ద్వేషం).

**సకదాగామి శీల లక్షణాలు:** అవరభాగీయ సంకెళ్ళనయిదింటిని పూర్తిగా ఛేదించి దు:ఖం క్షయం కాగా విముక్తుడైన వాడు శ్రేష్ఠమైన స్థాయికి చేరినవాడు.

**3. అనాగామి:** అవరభాగీయ సంయోజనాలు (Lower Fetters) ఐదింటినుండి విడువడినవాడు ఈ ధమ్మ వినయంలో అనాగామి అవుతాడు. లోకోత్తర పథంలో మూడో దశను చేరుకొన్న థేరవాద సాధకుడితడు. ఎన్నటికినీ వెనుదిరుగనివాడు. ఇతడు ఈ కామధాతువుకు తిరిగి రావడం అనేది అసంభవం. శుద్ధవాస దివ్యలోకాలలో జన్మించి అటునుంచి విముక్తిపొందుతాడు. సకదాగామి స్థాయి కన్నా అనాగామి స్థాయి శ్రేష్టం. అనాగామి కన్నా శ్రేష్టమైన స్థాయి అర్హంత స్థాయి.

**4. అర్హంత:** అర్హుడు, బౌద్ధ ఋషి, జ్ఞానోదయం అయినవాడు. "ఊర్ధ్వ భాగీయ సంయోజనాలు (Higher Fetters) ఐదింటినీ ఛేదించి జీవించి ఉండగానే నిర్వాణ సాక్షాత్కారం సిద్ధింపజేసుకున్నవాడు అర్హంతుడు. ఆసవాలన్నీ క్షయం కాగా జీవిత పరమార్థాన్ని సాధించినవాడు సంసార చక్రాన్ని దాటినవాడు అంటే జీవన మరణాలను అధిగమించినవాడు. అర్హంత అయినవానికి ఆస్రవాలు, క్లేశాలు ఉండవు. పది ఊర్ధ్వ భాగీయ సంయోజనాల నుంచి అతడు బయటపడి ఉంటాడు. ఇపుడు అర్హంతకు - బుద్ధునికి తేడా ఏమిటో తెలుసుకోవడం అవసరం. గౌతమబుద్ధుడు సంబోధినిని తన స్వంత ప్రయత్నంతో తానే జ్ఞానోదయమయినవాడు. మరి అర్హంతో... వేరొకరి బోధ ద్వారా జ్ఞానం పొందడం

జరుగుతుంది. అందుకే అంటాం చరిత్రకు, కాలానికి సత్యాన్ని యథాభూతంగావించుకొని జ్ఞానోదయం పొందినది గౌతమ సిద్ధార్థుడొకడే అని. ఈ ధమ్మ వినయంలో ప్రధానంగా సాధించవలసిన గమ్యాలు ఇవి అని భగవానుడు లిచ్ఛలి కులపుత్రుడు మహాలికి స్పష్టం చేస్తాడు. ఈ దివ్యపథంలో అతీంద్రియ శక్తులు, దివ్య దర్శనాలు, దివ్య శబ్ద శ్రవణాలకు ప్రాధాన్యత లేదు. సాధకుడు బుద్ధుని బోధను అర్థం చేసుకొని క్రమక్రమంగా ఉన్నతమైన బాధ్యతలను నెరవేరుస్తూ బోధివృక్షపు నీడలో సేదతీరగా మన సాధనా ప్రయత్నాలన్నీ మటుమాయం కాగా తథాగతుని సంబోధిని కాంతిలో ఊరటనొందుతాము.

ఈ ఉన్నతమైన లక్ష్యాలను పొందడానికి మార్గమేమిటి అని అడిగినపుడు భగవానుడు ఇలా అన్నాడు... అది అష్టాంగమార్గము అని బదులిచ్చాడు.

*

**పూర్ణ మానవుడు:** గౌతమ సిద్ధార్థుడు సిద్ధి పొందినవాడు. జ్ఞానోదయమయినవాడు. "జ్ఞానోదయం" ఇది ఒక మనోహరమైన మనోజ్ఞమైన స్థితి. అలసిన మనసులకు చల్లని గాలిలా ఉపశమనం చేకూర్చే జ్ఞాన సుగంధం. ఒక బుద్ధుడు మాత్రమే జ్ఞానోదయం అంటే ఏంటో వివరించగలడు. కారణం చరిత్రకు, కాలానికి అతడొక్కడే బుద్ధుడు. సత్యాన్ని యథాభూతం గావించుకున్న లోకోత్తర పథికుడతడు. జ్ఞానం ఆయన అంతరంగపు లోతుల్లోంచి ఉప్పొంగి విశ్వపావనమైంది. అందం చిందే కమలం బురదనీటితో మైలపడనట్లు, మనోమాలిన్యాలన్నీ క్షయం కాగా నిర్మలుడైనవాడు ఆయన. మనిషిగా పుట్టి స్వయం ప్రయత్నంతో బుద్ధత్వమనే నిష్కళంకస్థితికి చేరుకున్న పూర్ణ మానవుడు, పరిపూర్ణ మానవుడు. ధర్మం నిత్యనూతనమై సర్వమానవులకు సర్వకాలాలలో అందుబాటులో ఉండగలిగేందుకు వీలుగా బౌద్ధ సంఘాలకు రూపకల్పన చేసిన అమరశిల్పి ఆయన. మనం మనల్ని చూడాలనుకుంటే అద్దం అవసరం. అలాగే జ్ఞానోదయం అంటే ఏంటో తెలియాలంటే గౌతమ బుద్ధుడు - ఆయన జీవితం - సందేశం ఒక ప్రత్యక్ష నిదర్శనం ఒక సజీవ దర్పణం. జ్ఞానోదయమనే విమోచనానంద ప్రవాహాలకు ఉద్గమస్థానం ఆయన. బోధివృక్షం నీడలో తాను పొందిన విముక్తి ఆనందం అది ఏ వివాదాలకు తావులేని అనుభవైక సత్యం. జ్ఞానోదయమైన మరుక్షణాన తథాగతుని విమలమైన మనస్సు తొలి ఉషస్సులా లోకాలన్నీ ప్రతిధ్వనించేలా ఒక విజయగీతం ఆలపించింది....

*అనేకజాతి, సంసారం సంధావిస్సం అనిబ్బసం / గహకారకం గవేస్సంతోదుక్ఖా జాతి పునప్పునం / గహకారక దిట్ఠోసి పున గేహం న కాహసి / సబ్బాతే పాసుకా భగ్గా గహకూటం విసంఖతం/ విసంఖారగతం చిత్తం తణ్హానం ఖయమజ్ఝగా ఎన్నో జన్మల నుంచి ఎడతెగని పరుగుతో / గృహనిర్మాత కోసం వెదికాను. / మళ్లీమళ్లీ పుట్టి దుఃఖంతో తల్లడిల్లాను. / ఓ గృహకారకా...! నిన్ను కనుగొన్నాను / ఇక పునర్భవానికి అవకాశం లేదు. / వాసాలన్నీ చీలిపోయాయి దూలాలు కూలిపోయాయి*

గృహం యొక్క వాసాలు: లోభం, ద్వేషం, భ్రమ, గర్వం, మిథ్యాదృష్టి, శంక, సోమరితనం, ఆరాటపడటం, నైతిక స్పృహలేని విచ్చలివిడితనం, భీతిలేని దుందుడుకుతనం. మలినాలను, వీటికి కారణమైన అవిద్యను మొత్తాన్ని తన జ్ఞానకాంతితో కూల్చిన ప్రజ్ఞాధురంధరుడు తథాగతుడు. అవాంఛితమైన గృహానికి ఉపాదులైన అవిద్యావాసనలన్నిటిని కూకటివేళ్లతో పెకలించి విముక్తి పొందినవాడు. అందుకే ఆయన విముక్తుడైనవాడు అంటున్నాము. తన మనస్సులోపల దాగిన గృహ నిర్మాతను తన సాధనాప్రయత్నంతో కనుగొన్న సత్యసందర్శకుడు. తృష్ణను, దాని వాసనలను అంతం చేసిన వాడు. స్థితప్రజ్ఞుడు శ్రమణ గౌతముడు. ఇపుడు సిద్ధార్థుని చిత్తంలో మలినాలన్నీ క్షయమైపోగా చిత్తం పరిశుద్ధతనొంది నిర్మలమైంది. మనసులోని ఆవరణలన్నీ తొలగి సంయక్ సంబుద్ధుడయ్యాడు గౌతముడు. ఆరేళ్లపాటు సాగిన అద్భుత పోరాటం తరువాత 35వ ఏట శ్రమణ గౌతముడు బుద్ధుడైనాడు. బుద్ధత్వంతో పాటు త్రైవిద్యా జ్ఞానాన్ని కూడా వశం చేసుకున్నాడు.

పుబ్బె నివాసానుస్సతి ఇఃణ - చుతూపపాత ఞాన - ఆసవక్ఖయ ఞాన

**1. పూర్వ నివాసానుస్మృతి:** పూర్వ నివాసానుస్మృతికి సంబంధించిన జ్ఞానం కలుగగా తన గత జన్మలలోని వివిధ విషయాల వివరణలను గుర్తుతెచ్చుకున్నాడు. గతించిపోయిన సుదీర్ఘ కాలంలో - వేల సంవత్సరాలలో ఎవరు ఎక్కడు పుట్టారో... వారి జాతి, నామ, గోత్రాలేమిటో ప్రత్యక్షంగా చూశాడు. ఇది రాత్రి మొదటిజాములో అతడు సాధించిన జ్ఞానం.

**2. దివ్యచక్షు జ్ఞానం:** పూర్వనివాసానుస్మృతి వల్ల మనస్సు శుద్ధినొంది స్వచ్ఛమైన తరువాత తథాగతుడు తన మనస్సును జీవుల భవాభావాలపై ప్రసరింప చేశాడు. ఈ దివ్య చక్షు జ్ఞానం సంక్రమించడంవల్ల తథాగతుడు జీవులు పుట్టడం, అంతరించిపోవడం, తిరిగి మళ్లీ మళ్లీ పుట్టడం గమనించాడు. జీవులన్నీ ఒక అస్థిత్వం నుంచి వేరొక అస్థిత్వం లోకి మారడం గమనించాడు. అదొక ప్రవాహౌద్యమ సమంగా సాగడం అర్థం చేసుకున్నాడు. జీవుల సత్కర్మలకు - మంచిజన్మ, జీవుల చెడు కర్మలకు - చెడు జన్మలు, జీవుల కర్మానుసారంగా పుట్టడం - గిట్టడం కళ్లముందు జరుగుతున్నట్లు చూశాడు. ఇది అతడు ఆరాత్రి రెండవ జాములో సాధించిన రెండవ విద్యాజ్ఞానం.

**3. ఆస్రవక్షయ జ్ఞానం:** తథాగతుడు పునర్జన్మల కారణాన్ని కనుగొని భావికి సంబంధించిన అజ్ఞానాన్ని పరిహరించి తన పవిత్రమైన మనస్సును ఆస్రవాల పరిచ్ఛేదంవైపుకు ప్రసరించి, వాస్తవ విషయానుగుణంగా: "ఇది దుఃఖం, ఇది దుఃఖం కలగడం; ఇది దుఃఖ నివృత్తి, ఇది దుఃఖ నివృత్తి మార్గం" అని గుర్తించాడు. అలాగే: "ఇవి ఆసవాలు, ఇది మాలిన్యం పట్టడం; ఇది ఆసవాల నివారణం, ఇది ఆసవాల నిరోధానికి దారితీసే మార్గం," అని గ్రహించాడు. ఈ విషయ జ్ఞానంతో అతని మనస్సు... విషయ వాంఛామలినం నుంచి, అస్థిత్వ తృష్ణా మలినం నుంచి, అవిద్యామలినం నుంచి విముక్తమయ్యింది. తథాగతునికి యథాభూతజ్ఞానం సంప్రాప్తించింది. ఆయనకిప్పుడు జ్ఞానోదయమయింది. విమోచనానందపూర్ణమైన పవిత్ర జీవితం సిద్ధించింది. పునర్జన్మ అంతమయింది. శ్రమణ గౌతముడిపుడు బుద్ధుడైనాడు. ఇది రాత్రి చివరిజాములో అతడు అర్జించిన మూడో జ్ఞానం.

గౌతమ బుద్ధుడు పొందిన జ్ఞానం అదేదో అద్భుత శక్తుల సముదాయం కాదు. యుగయుగాలుగా మానవుడు పడుతున్న సంసార యాతనా సమస్యలకు ఇది ఒక పరిపూర్ణ పరిష్కారమార్గం. తథాగతుడైన బుద్ధుని ప్రపంచ ధర్మాలన్నిటిలో, ధర్మప్రవర్తకులందరిలో ఉన్నతంగా నిలిపింది ఈ జ్ఞానోదయమే. సత్యాన్వేషియై శాంతియుత మార్గోపకారియైన జ్ఞానాన్ని పొంది, జీవితం అశాశ్వతం, దుఃఖభరితం అనే సత్యాలతో మానవ జాతిని మేల్కొల్పిన శకపురుషుడు తథాగతుడు. మానసిక పరిణతికి ఆధారమైన అష్టాంగమర్గాన్ని ఉపదేశించి వసుదైక కుటుంబ భావనతో సమాజాలకు దారి చూపించిన వెలుగు ప్రధాత ఆయన. కరుణ - అహింసలు పరస్పర పరిపోషకాలు, విశ్వసమాజ భావరసస్ఫోరకాలు, అని చాటి చెప్పిన కరుణాపయోనిధి జన్మ పరంపరలతో కూడిన సంసారం నుండి మానవులందరూ విముక్తులై నిర్వాణం చేయడమే బుద్ధుని ధ్యేయం. బుద్ధుడు తన ఉపదేశాలలో నైతిక శీలానికి అధిక ప్రాధాన్యం ఇచ్చాడు. కర్మలకు కారణం మనస్సు. ఒక మనిషి చేసే కర్మ కేవలం అతనిపైనే కాక అతని చుట్టూ ఉన్న సమాజంపై ప్రభావాన్ని చూపుతుంది. మనిషి అజ్ఞానంతో తన ఇచ్ఛానుసారం తన చీకటి ప్రపంచాన్ని నిర్మించుకుంటున్నాడు... అంటే అర్థం... ఈ ప్రపంచం మానవుని మనోనిర్మితం అని కదా...! ఈ ప్రపంచాన్ని సృష్టిస్తున్నది మనస్సే... అని స్పష్టంగా చెప్పిన జ్ఞానమయుడు బుద్ధుడు. ఈ మర్మాన్ని గ్రహించే తథాగతుడు మానవుడు కర్మబంధము నుండి విముక్తం కావాలని పిలుపునిచ్చాడు. ఆయనకు మనపట్ల ఎంత కారుణ్యమో... దీనినిబట్టి మనం గ్రహించగలం.

తరతరాలకు తరగని తన జ్ఞానకాంతిని అందించిన పూర్ణ మానవుడు, పరిపూర్ణ మానవుడు బుద్ధుడు.

**కన్నూరి అలెగ్జాండర్, నల్లగొండ. ఫోన్: 918 265 0230.**

## రాజ్యాంగ పరిషత్తులో మహిళలు-8
# సుచేత కృపలాని
### (జూన్ 25, 1904 - డిసెంబర్ 1, 1974)

*- ముత్తంగి వేంకట భారతలక్ష్మి*

శ్రీమతి సుచేత కృపలాని స్వాతంత్ర్య భారతదేశంలో తొలి మహిళా ముఖ్యమంత్రి. పరిపాలనా దక్షతతో దేశంలో అన్ని రాష్ట్రాలలో పెద్దదైన ఉత్తరప్రదేశ్ రాష్ట్రాన్ని సమర్థవంతంగా నడిపించింది. భారత ప్రధాని ఇందిరాగాంధీ కంటె ముందు పరిపాలనా పగ్గాలు చేతపట్టింది. చరిత్ర ఉపాధ్యాయినిగా జీవితం ప్రారంభించిన సుచేత చరిత్రనే సృష్టించింది. బెంగాల్ బ్రహ్మ సామాజిక కుటుంబానికి చెందిన సుచేత అంబాలా (పంజాబ్ రాష్ట్రం)లో 25 జూన్, 1904లో జన్మించింది. తండ్రి యస్.యన్. మజుందార్ మెడికల్ ఆఫీసర్ కావడం వలన ఒక రాష్ట్రం నుండి మరో రాష్ట్రానికి తరచు ట్రాన్స్‌ఫర్లు అవుతూ ఉండేవి. అందుచేత సుచేత మజుందార్ విద్యాభ్యాసం అనేక విద్యాసంస్థలలో జరిగింది. కిన్నార్డ్ కాలేజీ లాహోర్, ఇంద్రప్రస్థ కాలేజీ, ఢిల్లీ, పంజాబ్ యూనివర్శిటీ, సెయింట్ స్టీఫెన్ కాలేజీలో ఎమ్.ఏ. హిస్టరీ చేసింది. జాతీయోద్యమం ఊపందుకొంటున్న రోజులవి. సుచేత తన అసంపూర్ణ ఆత్మకథలో చిన్ననాటి జ్ఞాపకాలు, విశేషాలు వ్రాసుకొన్నారు. పదేళ్ళ వయసులో సుచేత ఆమె తోబుట్టువులు తమ తండ్రిగారు స్నేహితులతో జలియన్ వాలాబాగ్ నరమేథం గురించి మాట్లాడుకొంటుంటే, అవి విని చిన్న పిల్లలైనా వారిలో ఉద్రేకం ఉప్పొంగేది. ఆ కోపాన్ని వాళ్ళతో ఆడుకొనే ఆంగ్లో-ఇండియన్ పిల్లల మీద చూపించేవారు, వారిని నిక్‌నేమ్స్‌తో పిలిచి ఎగతాళి చేస్తూ, జలియన్ వాలబాగ్ మారణ హోమం తర్వాత ప్రిన్స్ ఆఫ్ వేల్సు ఇండియా పర్యటించడానికి ఢిల్లీ వచ్చినప్పుడు, ఆయనను స్వాగతించడానికి స్కూలు పిల్లల్ని కొంతమందిని కుద్సియా పార్క్ దగ్గర నిలబడమన్నారు. అలా నిలబడడం సుచేతకు, ఆమె సోదరి సులేఖకు ఇష్టం లేదు. కాని టీచర్ని ఎదిరించి చెప్పే ధైర్యం వాళ్లకు లేదు. 'మా పిరికితనం మాకే సిగ్గుచేటు అనిపించింది' అని వ్రాసుకొన్నారు. కిన్నార్డ్ కాలేజీలో చదువుతున్నప్పుడు బైబిలు క్లాసు టీచరు హిందూ మతం గురించి చులకనగా మాట్లాడింది. సుచేత, సులేఖలకు చాలా కోపం వచ్చింది. ఇంటికి వెళ్ళాక తండ్రికి చెప్పి వారికేదైనా మార్గం చూపమన్నారు. ఆయన పిల్లలకి హిందూ మతానికి సంబంధించినవి చెప్పగా, ఆ మర్నాడు క్లాసులో టీచరుకు భగవద్గీతలో శ్లోకాలతో సమాధానం చెప్పారు. ఆ తర్వాత మళ్ళీ ఆ టీచరు హిందూ మతం గురించి మాట్లాడలేదు.


సుచేత కృపలాని

ఆమెకు పుట్టుకతోనే దృఢసంకల్పం, ఉక్కులాంటి వ్యక్తిత్వం రాలేదు. పెరిగిన వాతావరణం, ఎదుర్కొన్న పరిస్థితులు సుచేతను మనోనిగ్రహం, ఆత్మవిశ్వాసం, ధైర్యంగల మహిళగా చేశాయి. చిన్నప్పుడు సిగ్గు, బిడియంతో కుంచించుకుపోయే బాలిక, ఆత్మస్థైర్యంతో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని తర్వాత రాజకీయ జీవితంలో ఆటుపోట్లు తట్టుకొని గెలిచే మహిళగా రూపొందింది. కాలేజీలో చదువుతున్న రోజుల్లోనే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనాలని అభిలషించేది. 1929లో హఠాత్తుగా ఆమె తండ్రి, తర్వాత సోదరి మరణించడంతో కుటుంబ పోషణ భారం ఆమెపై

పడింది. లాహోర్ కాలేజీలో ఆమెకు ఎక్కువ జీతం వచ్చే ఉద్యోగం వచ్చినా, పరిపాలనను వ్యతిరేకించే హిందూ బెనారస్ యూనివర్శిటీలో 'కాన్‌స్టిట్యూషన్ హిస్టరీ' ప్రొఫెసరుగా చేరింది. ఆ రోజుల్లో విద్యాలయాలు, యూనివర్శిటీలు స్వాతంత్ర్య పోరాటానికి పనికొచ్చే యోధులకు స్థావరాలు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా పనిచేస్తున్న ఆచార్య జె.బి. కృపలాని (జీవత్రామ్ భగవాన్‌దాస్ కృపలాని) స్వాతంత్ర్య సమరంలో పాల్గొనే యువకుల్ని ఎంపిక చేయడానికి తరచూ బెనారస్ యూనివర్శిటీకి వచ్చేవారు. ఆయన కార్యకలాపాలు సుచేతను రాజకీయాల వైపు ఆకర్షించాయి. ఆమె క్లాసులో కూడా ఎక్కువగా స్వాతంత్ర్య పోరాటం గురించి ఉపన్యాసాలిచ్చేది. 1934లో బీహార్ భూకంపం సమయంలో ఆచార్య కృపలాని, సుచేత కలిసి పనిచేశారు. ఆమె తనకంటే 20 ఏళ్ళు పెద్ద అయిన ఆచార్య కృపలానీని వివాహం చేసుకోవాలని నిర్ణయించుకొన్నది. వారిరువురి కుటుంబాలు ఈ పెళ్ళికి ఒప్పుకోలేదు. మహాత్మాగాంధీ కూడా అనుమతించలేదు. కృపలాని వివాహం చేసుకొని వెళ్ళిపోతే తనకు కుడి చేయిలా ఉండే వ్యక్తి దూరమవుతాడని గాంధీజీ సుచేతను మరొకరినెవరినైనా వివాహం చేసుకోవాలని సూచించారు. ఆమె అలా చేయడం, 'నీతిమాలిన పని, విశ్వాస ఘాతుకమైన పని' అని నిర్మొహమాటంగా చెప్పింది. సుచేతకు గాంధీజీ అంటే ఎంతో భక్తిగౌరవాలు. ఎట్టకేలకు గాంధీజీ ఒప్పుకొన్నారు. వారి వివాహం 1938లో జరిగింది. వారి వివాహ అనంతరం గాంధీజీకి ఇద్దరు మంచి సేవా కార్యకర్తలు లభించారు. కృపలానీ సేవాతత్పరత, అంకితభావం సుచేతను ఉత్తేజపరిచాయి. ఆమె పూర్తిగా రాజకీయ రంగంలో ప్రవేశించి, సత్యాగ్రహ యాత్రలలో ముందంజవేసి ఉద్యమ నాయకురాలైంది. 1940లో సుచేత కాంగ్రెస్ మహిళా విభాగాన్ని ప్రారంభించింది. ''ఎంతోమంది స్త్రీలు కాంగ్రెస్‌లో చేరి జాతీయ పోరాటంలో పాల్గొన్నారు. కానీ వారికి సరైన ఆర్గనైజేషన్ లేదు. మహిళా కాంగ్రెస్ విభాగం కాంగ్రెస్‌తో సమాంతరంగా ఉండాలి. కాంగ్రెస్ ఆర్గనైజేషన్‌లో భాగంగా నేను ఒక రాష్ట్రం నుండి మరో రాష్ట్రం వెళ్ళి మహిళా కార్యకర్తలను కలుసుకొని, చిన్నచిన్న మహిళా విభాగాల్ని నెలకొల్పాను" అన్నారామె. ఆ విధంగా సుచేత కృపలాని 'గ్లాస్ సీలింగ్'ని బ్రద్దలు కొట్టింది. 1941 నాటికి రెండు 'అండర్ గ్రౌండ్' సెంటర్లు రాజకీయ కార్యకలాపాలు నిర్వర్తించడానికి ఉండేవి. రెండు సెంటర్లని మహిళలే నడిపించేవారు. విప్లవాత్మక సెంటర్‌ని 'ఫైర్‌బ్రాండ్' అరుణా అసఫ్ అలీ నిర్వర్తిస్తే అహింసాయుతంగా మరో అండర్‌గ్రౌండ్ సెంటర్ని సుచేత నిర్వహించేది. ఆమె రాజకీయ కార్యకలాపాలను అరికట్టాలని బ్రిటీష ప్రభుత్వం ఆమెను అరెస్టు చేసి లక్నో జైలులో జూలై - 1945 వరకు ఉంచారు. బ్రిటిష్ ప్రభుత్వం ఒప్పందం కుదిరాక రాజకీయ ఖైదీలు అందర్నీ విడుదల చేసింది.

1946లో సుచేతకు ఎన్నో మహత్కార్యాలు చేసే అవకాశం లభించింది. మేథోసంపత్తితోపాటు, సుచేత స్వాతంత్ర్యోద్యమంలో చేసిన విశేష కృషి ప్రాధాన్యం వలన ఆమెను రాజ్యాంగ పరిషత్తు (కాన్‌స్టిట్యూఎంట్ అసెంబ్లీ)కు ఎంపిక చేశారు. భారత రాజ్యాంగం, చార్టరు తయారు చేసే సబ్‌కమిటీలలో ఆమెను వేశారు. సుచేత రాజకీయ అంకిత భావానికి ముగ్ధులైన మహాత్మాగాంధీ ఆమెను కస్తూర్బా గాంధీ నేషనల్ మెమోరియల్ ట్రస్ట్‌కు ఆర్గనైజింగ్ సెక్రటరీగా 1946లో నియమించడానికి తోడ్పడ్డారు. ఆ సంవత్సరంలో నౌఖాలీలో హింసాత్మకమైన మతకలహాలు చెలరేగగా ఆమె, గాంధీజీ, కృపలానీలతో దమనకాండ జరిగిన ప్రదేశానికి చేరుకొని బాధితులకు ఎనలేని సహాయం చేశారు. 14 ఆగస్టు, 1947 భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన అర్ధరాత్రి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చారిత్రాత్మక ప్రసంగం *ట్రై ఎస్ట్ విత్ డెస్టినీ* కి ముందు సుచేత కృపలాని *వందేమాతరం* జాతీయ గీతాన్ని తొలిసారిగా సమావేశ ప్రారంభ సమయంలో ఆలపించారు. సమావేశ అనంతరం ఆమె *సారే జహాఁసే అచ్ఛా, జనగణమణ* గీతాల్ని ఆలపించడం చారిత్రక సన్నివేశం.

స్వాతంత్ర్యం సిద్ధించాక, సుచేత కృపలాని రాజకీయ జీవితం కొనసాగించింది. నెహ్రూజీతో రాజకీయంగా విభేదాలు వచ్చి ఆమె భర్త ఆచార్య కృపలాని, *ది కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీ* (కె.యమ్.పి.పి.) 1950లో స్థాపించినపుడు ఆమె కృపలాని పార్టీ కె.యమ్.పి.పి. టికెట్ మీద 1952 జనరల్ ఎలక్షన్లలో న్యూఢిల్లీ నియోజకవర్గం నుండి ఎన్నికయ్యారు. లఘుపరిశ్రమల మంత్రిగా నియమించబడ్డారు. కొన్నాళ్ళ తర్వాత ఆమె తన భర్త పార్టీ వదలిపెట్టి సిద్ధాంతపరమైన విభేదాల వలన కాంగ్రెస్‌లో తిరిగి ప్రవేశించింది. అయిదేళ్ళ తర్వాత 1957 అదే నియోజకవర్గం నుండి కాంగ్రెస్ టికెట్‌పై గెలిచారు. మేథోసంపత్తితో పాటు ఆమెకు అద్భుతమైన వాగ్ధాటి, దేశ సేవపై అంకితభావం ఉన్నాయి. అందుచేతనే సుచేత 'ప్రముఖ పార్లమెంటేరియన్' స్థానాన్ని సంపాదించుకుంది. భార్య, భర్త ఇద్దరూ వేర్వేరు రాజకీయ పార్టీలకు విధేయులై ఉన్నా పరస్పర గౌరవాభిమానాలతో ఒకరినొకరు వారి విధానాల గురించి ప్రశ్నించుకోకుండా ఒకే ఇంట్లో ఉండడం అరుదైన విషయం. వారి జంట ప్రజాస్వామ్యంలో ఓ విలక్షణమైన ఉదాహరణ. 1962లో సుచేత ఉత్తరప్రదేశ్ స్టేట్ అసెంబ్లీ ఎన్నికలలో కాన్పూర్ నియోజకవర్గం నుండి గెలుపొంది ఢిల్లీ క్యాబినెట్ మినిస్టర్‌గా పారిశ్రామిక, సాంఘిక, సంక్షేమ శాఖను సమర్థవంతంగా నిర్వహించారు. ఆ మరుసటి సంవత్సరమే ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలో కమలాపతి త్రిపాఠీ - జె.బి. గుప్తాల మధ్య విభేదాలేర్పడి, గుప్తా ఎలక్షన్‌లో ఓడిపోవడం చేత సుచేత కృపలానీను ఢిల్లీలో కేంద్ర మంత్రి పదవి వదలిపెట్టి ముఖ్యమంత్రి పదవి పగ్గాలు చేపట్టమని అభ్యర్థించారు. 1963-67 వరకు ఇండియాలో అతిపెద్ద రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నుకోబడ్డారు. ఆమె పదవీ కాలంలో రాష్ట్రం ఆర్థికంగా క్రిందికి దిగజారకుండా రక్షిస్తూ, పరిపాలనను పారదర్శకంగా ఉంచారు.

ఆమె పదవీ కాలంలో కనీ వినీ ఎరుగని సమ్మె జరిగింది. 62 రోజులపాటు వేతనాల పెంపుపై రాష్ట్ర ఉద్యోగులు సమ్మె చేశారు. ఆమె స్థిరంగా వ్యవహరించి, సమ్మె నాయకులు ఒప్పందానికి వచ్చాక, అంగీకరించారు. నిజాయితీ, చిత్తశుద్ధి, తెలివితేటలు, కష్టపడి పనిచేసే మనస్తత్వంతో ఆమె ఎన్నో సమస్యలు పరిష్కరించారు. 1967లో సుచేత ఆఖరిసారిగా లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1971లో క్రియాశీల రాజకీయాలు వదలిపెట్టి కృపలానీ దంపతులు ఢిల్లీలో స్థిరపడ్డారు. వారి ఆస్తిపాస్తులను ఢిల్లీలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఇచ్చివేశారు. సుచేత ఆచార్య కృపలానీ, మహాత్మాగాంధీలతో స్వాతంత్ర్య పోరాట చరమ దశలో చాలా ప్రభావితమైన పాత్ర వహించారు. సుచేత విపరీతమైన స్వాతంత్ర్య భావాలు కల వ్యక్తి కాని స్వాతంత్ర్య ఉద్యమానికి కట్టుబడి ఉంది. సర్వసాధారణంగా అందరూ కలిసి చేసే ఉద్యమాలలో స్వాతంత్ర్య భావాలు కల వ్యక్తులు ఇమడడం కష్టం. కాని సుచేత కృపలాని ఉద్యమంలో భాగంగా ఉన్నా, తన వ్యక్తిత్వాన్ని కాపాడుకొంటూ ఆధునిక రాజకీయ చరిత్రలో అత్యంత ప్రభావితం చేసే వ్యక్తిగా నిలిచింది.

*



## రాజ్యాంగ పరిషత్తులో మహిళలు - 9

# మాలతీ చౌదరి

**(జులై 25, 1904 - మార్చి 15, 1998)**

మార్క్సిస్టు మహిళా నాయకురాలిగా పేరొందిన మాలతీ చౌదరి ఒరిస్సాలో ఎన్నో ప్రాంతాలలో వివిధ తెగలకు, జాతులకు చెందిన వారి కోసం పాటుపడింది. ఆమెకు కార్మికుల పట్ల ఉన్న అంకితభావం, ఒరిస్సాను సోషలిజంవైపు త్రిప్పింది. నిజమైన మార్క్సిస్టులా ఆమె ప్రజల కోసం ప్రజలతో పని చేశారు. బ్రిటిష్ ప్రభుత్వ దమన నీతికి బలైపోతున్న రైతుల కోసం ఆమె గొంతు విప్పింది. అస్పృశ్యతను వ్యతిరేకిస్తూ పోరాడింది. కులతత్వాలను ప్రతిఘటించింది. బాలల చదువు, స్త్రీల స్థితిగతులు మెరుగుపరచడానికి ఆమె శ్రమించింది. మాలతీ దేవి సేవాతత్పరత, ఆమె అనంతరం రాష్ట్ర, దేశ స్థాయిలో నిలిచింది. మాలతీ దేవి సుసంపన్నమైన మధ్యతరగతి బ్రహ్మ సామాజికుల కుటుంబంలో జన్మించింది. ఆమె తండ్రి కుముదనాథ్ సేన్ ప్రఖ్యాత బారిష్టరు. మాలతీ రెండున్నరేళ్ళ వయసులో తండ్రిని కోల్పోయింది. తల్లి స్నేహలత సేన్ మాలతీని పెంచి పెద్ద చేసింది. స్నేహలత రచయిత్రి, అనువాదకురాలు. రవీంద్రుని గీతాలను 'జుగళాంజలి'గా అనువదించింది. మాలతీ కుటుంబం స్వతహాగా బెర్హంపూర్ (ఒరిస్సా)కు చెందినది. తర్వాత వారి కుటుంబం బీహార్‌కు వచ్చి అక్కడ నుండి తూర్పు బెంగాల్‌కు వచ్చింది. మాలతీ బంధువులంతా బ్రిటిష్ ప్రభుత్వంలో ఉన్నత పదవులు అలంకరించారు. తాతగారు బెహారి లాల్ గుప్తా ఐ.సి.యస్. ఆఫీసరు. మాలతీ సోదరులు పి.కె. సేన్ ఇన్‌కమ్ టాక్స్ కమీషనర్, మరో సోదరుడు కె.పి. సేన్ ఇండియన్ పోస్టల్ సర్వీస్ ఆఫీసర్. ఆమె దగ్గర బంధువులు వెస్ట్ బెంగాల్ హోంమంత్రిగా, చీఫ్ సెక్రటరీగా పని చేశారు. అటువంటి కుటుంబ నేపథ్యంగల మాలతీ మాత్రం పదవుల కోసం వెంపర్లాడలేదు. ఆమె బడుగు ప్రజల కోసం పని చేయాలని నిర్ణయం తీసుకోవడం గాంధీజీ ప్రభావం వలన, శాంతినికేతన్ వాతావరణం వలన. పదహారేళ్ళ వయసు (1921)లో మాలతీ దేవిని శాంతినికేతన్‌లో చేర్పించారు. గురుదేవులు రవీంద్రనాథ్ ఠాకూర్ బోధనలు, సిద్ధాంతాలు ఆమెనెంతగానో ప్రభావితం చేశాయి. లలిత కళలకు ఆలవాలమైన శాంతినికేతన్‌లో చదువుతోపాటు సంగీత, నృత్య నాటికలలో పాల్గొనేది. ప్రకృతి ఒడిలో, పచ్చని చెట్ల నీడలో గురుకుల వాతావరణంలో ఆమె ఆరేళ్ళు గడిపింది. ఆమెతోపాటు మరో ఎనిమిదిమంది బాలికలు నూతనంగా నిర్మించిన 'బాలికాగృహం'లో ఉండేవారు. వారిలో అమర్త్యసేన్ తల్లి ఒకరు. మాలతీ తల్లి 'విశ్వభారతి స్మృతులు'లో ఇలా వ్రాసింది - ''మాలతీ విశ్వభారతిలో చాలా ఆనందంగా ఉంది. అక్కడ ఉండి చదువుకోవడం వలన ఎంతో లబ్ధి పొందింది. గురుదేవుని ప్రభావం, ఆయన బోధనలు, దేశభక్తి, ఆదర్శాలు మాలతీని ప్రభావితం చేసి ఆమె జీవితాన్ని తీర్చిదిద్దాయి''. గురుదేవులు ఆమెను 'మినూ' ('కాబూలీవాలా' కథలో చిన్న పిల్ల పేరు) అని పిలిచేవారు. గురుదేవుని పాదాల చెంత ఆమె చక్కని విలువలు, సిద్ధాంతాలు, విద్య, సంస్కృతి స్వంతం చేసుకొంది. శాంతినికేతన్‌కు ప్రాక్, పశ్చిమ దేశాల నుండి వచ్చిన ఆచార్యులు (ఉపాధ్యాయులు) వివిధ లలిత కళలు, తోటపని నేర్పేవారు. విద్యార్థినిగా మాలతీ ఉత్సాహంగా నృత్యనాటికలలో, సంగీతోత్సవాలలో పాల్గొనేది. మాలతీ దేవి శాంతినికేతన్‌లో చదువుకొంటున్న సమయంలో నాబ కృష్ణ చౌదరి అనే జమీందారీ కుటుంబానికి చెందిన యువకుడు ఒరిస్సా నుండి విద్యనభ్యసించడానికి వచ్చాడు. బెజవాడ గోపాలరెడ్డి, జి. రామచంద్రన్, సయ్యద్ ముఖతాబ్ ఆలీ, ఆయన



మాలతి చౌదరి

సహోధ్యాయులు. 1927లో మాలతీ శాంతినికేతన్‌లో చదువు పూర్తి చేసుకొని నాబ కృష్ణ చౌదరిని వివాహం చేసుకొన్నది. వారిరువురూ అనాభియా అనే పల్లెటూరు (జగత్‌సింగ్‌పూర్ జిల్లా, ఒరిస్సా)లో స్థిరపడ్డారు. శాంతినికేతన్‌లో ఉండగా మాలతీదేవిని పియర్సన్ అనే ఆంగ్ల ఉపాధ్యాయుడు ఆమెను గిరిజనుల కోసం కృషి చేయమని ఉద్భోదించారు. మాలతీదేవి జీవితాంతం గిరిజనుల కోసం, బడుగు వర్గాల కోసం శ్రమించి తన జీవితాన్ని అంకితం చేసింది.

వివాహం అయిన తర్వాత మాలతీకి ఒరిస్సా క్రియాశీల కార్యక్రమాలకు కేంద్రం అయింది. వారిరువురూ వ్యవసాయాభివృద్ధితోపాటు గ్రామీణ పునర్వ్యవస్థీకరణకు పూనుకొన్నారు. విద్య లేకపోవడం వలన పల్లె ప్రజలు అభివృద్ధి సాంధించలేకపోతున్నారని వయోజన విద్యా కేంద్రాలు చుట్టుప్రక్కల పల్లెటూళ్ళో పెట్టించారు. ఇంతలో ఉప్పుసత్యాగ్రహం దేశమంతటా ఊపందుకొన్నది. మాలతీదేవి, ఆమె భర్త ఉద్యమానికి నడుం బిగించి ప్రజల్ని ఉత్తేజపరిచారు. పర్యవసానంగా అరెస్టు చేయబడి జైలులో నిర్బంధించబడ్డారు. జైల్లో ఉన్నా తోటి ఖైదీలకు జాతీయ గీతాలు ఆలపించడం గాంధీజీ సిద్ధాంతాలను ప్రచారం చేయడం మొదలుపెట్టారు. 1930వ దశకంలో ఆమె రైతాంగ పోరాటంలో ప్రధాన పాత్ర పోషించారు. కొంతమందితో కలసి *ది ఉత్కళ ప్రావిజనల్ కిసాన్ సభ* స్థాపించారు. కటక్‌లో ప్రారంభోత్సవ సభ ఏర్పాటు చేశారు. ఆ సభలోనే జమీందారీ పద్ధతిని రద్దు చేయాలనే చారిత్రాత్మక నిర్ణయం తీసుకొన్నారు. ఆ తర్వాత కిసాన్ కమిటీలు చాలా ఏర్పడ్డాయి. అప్పులవాళ్ళ బారి నుండి, భూస్వాముల బారి నుండి పేద రైతులను రక్షించడానికి 'కిసాన్ ఆందోళన్' నాయకత్వం వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆమె తన ఉపన్యాసాల ద్వారా ప్రజలను ఉత్తేజపరిచింది. వెట్టిచాకిరి నిర్మూలించాలని, బంజరు భూములు, అటవీ ప్రాంతంపై అక్కడ గిరిజన ప్రజల హక్కుల కోసం పోరాడారు. మాలతీ చౌదరి రైతాంగ ఉద్యమాన్ని కేవలం ఉపన్యాసాలతో సరిపెట్టలేదు. కార్యాచరణ పథకం ద్వారా రైతులకు విద్య నేర్పడం, శిక్షణా శిబిరాలు నిర్వహించడం చేశారు. 'సారథి' అనే ఒరియా వార పత్రికను ప్రచురించడానికి తన నగలు అమ్మి ఆమె ధనసహాయం చేశారు. 1933లో మాలతీ, ఆమె భర్త 'ఉత్కళ కాంగ్రెస్ సోషలిస్టు వర్కర్స్ లీగ్' పెట్టారు. ఇదే మొదటి సోషలిస్టు సంస్థ. మార్క్సిస్టు ఆర్గనైజేషన్ అవడంవలన కార్మికులను సంఘటితపరచి వివిధ రకాల అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడారు. ఈ ఆర్గనైజేషన్ కులతత్త్వం, అస్పృశ్యతకు వ్యతిరేకంగా ఉద్యమించారు. తర్వాత ఈ సంస్థ ఆలిండియా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీకి ఒరిస్సా బ్రాంచిగా మారింది. 1934లో మాలతీదేవి గాంధీజీ పాదయాత్రలో కీలక పాత్ర పోషించింది. ఆమె పాదయాత్రలో మధ్యమధ్య మజిలీలు, నిర్వహణ బాధ్యత తీసుకొంది. ఎందుచేతనంటే అంతకు ముందే ఆమె ఆ ప్రాంతాల్లో పని చేసింది. ప్రజల దృష్టిని పాదయాత్ర వైపు మళ్ళించగలిగింది. నిర్భయంగా నిస్సంకోచంగా మాట్లాడే స్వభావం ఆమెది. ఆమెను గాంధీజీ 'తుఫానీ' అని పిలిచేవారట. 1934లో గాంధీజీ ఒరిస్సాలో పాదయాత్ర చేస్తున్నప్పుడు ఆయనతోపాటు పాదయాత్రలో పాల్గొన్నది. రోజంతా నడిచి నడిచి అలసిపోయిన గాంధీజీ, ఆయన ఆ రోజు కార్యక్రమం ప్రకారం వెళ్ళవలసిన హరిజనవాడకు వెళ్ళలేకపోయారు. ఆయన కోసం వేచి ఉన్న హరిజనులు నిరాశ చెందినా, మహాత్ముడు రాలేకపోయినందుకు మన్నించి సరిపెట్టుకొన్నారు. కాని మాలతీ చౌదరి ఊరుకోలేదు. గాంధీజిని సూటిగా ప్రశ్నించింది: "బాపూ! మీరు చేసిన పని సరిగా లేదు" అని. గాంధీజీ క్షమాపణలు చెప్పి, నిష్కల్మషమైన నవ్వుతో ఆమెను శాంతపరిచారు. పెట్టుబడిదారీ వ్యవస్థను వ్యతిరేకిస్తూ రాట్నంపై నూలు వడకటం, సహాయ నిరాకరణోద్యమ యాత్రలు చాలాచోట్ల నిర్వహించారు. ఉద్యమాలు నిర్వహిస్తున్నందుకు మాలతీ 1921, 1930, 1933, 1942లో అరెస్టు చేయబడ్డారు. ఆమెతో పాటు మిగతా స్త్రీలు సరళాదేవి, రమాదేవి చౌదరి మొదలైనవారంతా

జైలుకు పంపబడ్డారు. 1946లో ఆమె 'బాజీరౌత్ ఛత్రవాస్'ను స్థాపించారు. స్వాతంత్రోద్యమ యోధుల పిల్లలకు విద్య నేర్పించడానికి ఈ విద్యాసంస్థ స్థాపించారు. బాజీరౌత్ అనే పన్నెండేళ్ల పిల్లవాడు అద్భుత ధైర్యసాహసాలు ప్రదర్శించి, బ్రిటిష్ శత్రుసేనలను తన బోటులో నదిని దాటించడానికి నిరాకరించడంతో వాళ్ళు ఆ బాలుణ్ణి కాల్చి చంపారు. దేశం కోసం తన ప్రాణాలర్పించిన బాజీరౌత్ పేరిట మాలతీ చౌదరి విద్యాసంస్థను స్థాపించారు. మొదట్లో స్వాతంత్ర్య యోధుల పిల్లల కోసం ఏర్పాటు చేయబడిన ఈ విద్యాసంస్థకు హరిజన్, గిరిజనులు మిగతా వెనుకబడిన వర్గాల పిల్లలు ఒరిస్సా అన్ని ప్రాంతాల నుండి రావడం మొదలుపెట్టారు. 'బాజీరౌత్ ఛత్రవాస్' అనతి కాలంలో జాతీయస్థాయి విద్యాసంస్థ అయింది. ఇప్పటికీ ఒరిస్సాలో ఈ సంస్థ ఎంతోమంది అనాథలకు, హరిజన, గిరిజనులకు ఆశ్రయాన్నిస్తోంది.

1946లో మాలతీ చౌదరి ఒరిస్సా కాంగ్రెస్ కమిటీకి ప్రెసిడెంట్‌గా ఎన్నుకోబడ్డారు. 9 డిసెంబర్, 1946 ఆమెను కాన్‌స్టిట్యూఎంట్ అసెంబ్లీ (రాజ్యాంగ పరిషత్తు)లో పాల్గొనడానికి ఎంపిక చేశారు. రాజ్యాంగ డ్రాఫ్టు తయారు చేయడంలో తోడ్పడిన 15 మంది మహిళలలో ఆమె ఒకరు. రాజ్యాంగ పరిషత్తు వాతావరణంలో ఆమె ఇమడలేకపోయింది. ఉద్దండులైన పురుషుల మధ్య ఆమె తానొక చిన్న స్కూలు విద్యార్థినిలా ఉన్నట్లు భావించారు. రాజ్యాంగ పరిషత్తు సభ్యురాలిగా ఆమె మిగిలినవారితో ఏకీభవించలేకపోయింది. రాజ్యాంగ శ్రమజీవులకు, బడుగు వర్గాలకు న్యాయం చేకూర్చలేదనిపించిందామెకు. మహాత్మాగాంధీ నౌఖాలీ యాత్ర ప్రారంభం కాగానే ఆమె ఆయనతో పాటు అక్కడకు చేరుకొని బాధితులకు సేవలందించింది. ఓ పాతికేళ్ళ తర్వాత ఆమె రాజ్యాంగ పరిషత్తు నుండి ఎందుకు బయటకు వచ్చేశారో ఓ లేఖలో వివరించారు. మాలతీ బేసిక్ విద్య తరువాత చదువు కొనసాగించడానికి అనేక విద్యాసంస్థలు నెలకొల్పారు. పెట్టుబడిదారీ వ్యవస్థను వ్యతిరేకిస్తూ మాలతీ రాట్నంపై నూలు వడకడం, సహాయ నిరాకరణోద్యమ యాత్రలు నిర్వహించి గ్రామీణ ప్రజలను జాతీయోద్యమం వైపు మళ్ళించారు. అందుచేత ఆమెను బ్రిటిష్ ప్రభుత్వం (1921, 1930, 1936, 1942) అరెస్టు చేసి జైల్లో పెట్టింది. ఆచార్య వినోబా భావే భూదాన ఉద్యమంలో భాగంగా ఒరిస్సాలో పాదయాత్ర చేసినపుడు మాలతీ దేవి ఆయనను అనుసరించారు. వినోబా భావేతో పాదయాత్ర చేస్తున్నప్పుడు ఆమె ప్రజలు చెప్పుకోలేని కష్టాలకు గురి అవ్వడం ఆమె కళ్ళారా చూశారు. పల్లె ప్రాంతాలలో ముఖ్యంగా స్త్రీలు మూఢనమ్మకాలకు బలికావడం గమనించారు. అంగుల్ అనే ఊరిలో 'ఉత్కళ నవజీవన మండల్' అనే సంస్థను ఏర్పరిచారు. ఈ సంస్థ గ్రామీణాభివృద్ధికి, గిరిజనుల సంక్షేమానికి పాటుపడుతోంది.

మాలతీదేవి భర్త నాబ కృష్ణ చౌదరి 1936లో ప్రావెన్‌షియల్ ఎలక్షన్లలో లెజిస్లేటివ్ అసెంబ్లీకి సభ్యులుగా ఎన్నికయ్యారు. ఒరిస్సాలో 26 చిన్న చిన్న రాజ్యాలు / సంస్థానాలు ఉండేవి. వారంతా బ్రిటిష్ వారి ఆధీనంలో సామంత రాజులుగా కప్పం చెల్లిస్తూ ఉండేవారు. కాంగ్రెస్ పార్టీ, మహాత్మాగాంధీ ఆ రోజుల్లో రాజ్యాల గురించి, వాటి పరిపాలన గురించి పట్టించుకునేవారు కాదు. కాంగ్రెస్‌లో కొంతమంది సంస్థానాలన్నీ దేశంలో విలీనం చేయాలని అనుకున్నారు. ఒకే భాష మాట్లాడే ప్రజలంతా ఒకే రాష్ట్రంలో వుండాలని వాంఛిస్తూ, మాలతీ, నాబ కృష్ణ చౌదరి దంపతులు ప్రజామండల ఉద్యమం చేపట్టారు. గాంధీజీ కాంగ్రెస్ సేవా కార్యకర్తలందరూ రాజకీయ రంగంలోకి రానక్కర్లేదని ప్రజాశ్రేయస్సే ధ్యేయంగా పని చేయాలని ఆదేశించారు. గాంధీజీ ఆశయాలను అక్షరాలా అమలు పరిచింది మాలతీ చౌదరి. స్వాతంత్ర్యం వచ్చాక మాలతీ, నాబ కృష్ణ చౌదరి దంపతులు తమ జీవితాన్ని సోషలిస్టు ఆశయాలతో పూర్తిగా ప్రజా సేవకు అంకితం చేయాలని నిర్ణయించుకున్నారు. భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ మాలతీ దేవిని నాబ కృష్ణ చౌదరి ముఖ్యమంత్రిగా ఒరిస్సా రాష్ట్రాల పగ్గాలు చేపట్టడానికి ఒప్పించమని

ఉత్తర ప్రత్యుత్తరాలు చేశారు. ఎట్టకేలకు నాబ కృష్ణ చౌదరి ఒప్పుకొని 1950లో ప్రావెన్షియల్ స్టేట్‌కు ముఖ్యమంత్రి అయ్యారు. 1952 జనరల్ ఎలక్షన్ సమయంలో నాబ కృష్ణ చౌదరి పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొంది ముఖ్యమంత్రి అయ్యారు. జమీందారీ కుటుంబం నుండి వచ్చినా నాబ కృష్ణ చౌదరి జమీందారీ పద్ధతి రద్దు చేశారు. 1951 మాలతీ చౌదరి తన భర్త ముఖ్యమంత్రి అయినప్పుడు షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల వారి గురించి బడుగు వర్గాల దురవస్థను ఎత్తి చూపించింది. గిరిజనులు హక్కుల గురించి, పేద రైతుల గురించి ఆమె అవిశ్రాంతంగా పాటుపడటం వలన ఆమెను 'మదర్ ఆఫ్ ఒరిస్సా' (ఒరిస్సా రాష్ట్రానికి తల్లి) అని పిలిచేవారు. తల్లి హృదయం బలహీనమైన బిడ్డల గురించి ఎలా తల్లడిల్లుతుందో మాలతీ దేవి దళిత వర్గాల గురించి అదే విధంగా స్పందించి, వారిని అక్కున చేర్చుకొని ఉపాధి కల్పించేది. 1955లో నాబ కృష్ణ చౌదరి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి సర్వ సేవా సంఘ అధ్యక్షుడిగా ప్రజల కోసం పని చేయాలని నిశ్చయించుకున్నారు. అస్సాంలో అస్సాం ప్రజలకు బెంగాలీ ప్రజలకు మధ్య ఘర్షణ ఏర్పడి తీవ్ర సంక్షోభం చెలరేగినప్పుడు మాలతీ దేవి, ఆమె భర్త, రమాదేవి చౌదరి, జయప్రకాష్ నారాయణ్ అందరూ అస్సాం వెళ్లి పరిస్థితి చక్కబెట్టి వచ్చారు. తూర్పు పాకిస్తాన్ బంగ్లాదేశ్‌గా ఆవిర్భవించినప్పుడు బంగ్లాదేశ్ నుండి శరణార్థులు ఇండియాకు వచ్చారు. మతం పేరుతో అల్లరిమూకలు భారతదేశంలోని హిందువులను హింసించడం మొదలుపెట్టారు. కొంతమంది శరణార్థులు ఒరిస్సాకు వచ్చారు. అక్కడున్న హిందువులు స్థానిక ముస్లింల మీద ప్రతీకారం తీర్చుకోవాలని హింసాకాండకు పూనుకొన్నారు. వెంటనే అక్కడకు మాలతీ దేవి, రమాదేవి, నాబ కృష్ణ చౌదరి వెళ్లి రెండు వర్గాలను శాంతింపజేశారు. ఒరిస్సా సివిల్ లిబర్టీస్ కమిటీ ప్రెసిడెంట్‌గా మాలతీ చౌదరి నక్సలైట్లను చంపడాన్ని తీవ్రంగా గర్హించిన మొదటి వ్యక్తి. అమాయక ప్రజల్ని నక్సలైట్లని ముద్ర వేసి దారుణంగా కాల్చి చంపుతున్నారు పోలీసులు. మాలతీ దేవి ఆమె భర్త అక్కడకు వెళ్లి మీటింగ్‌లు పెట్టి నిజం తెలుసుకున్నారు. ఆ విధంగా అర్థం లేని హింసాకాండ మాన్పించి, ఉరిశిక్ష విధించబడిన నక్సలైట్ లీడర్ల తదితర నక్సలైట్ల కోసం రాష్ట్రపతికి లేఖ రాసి వారికి క్షమాభిక్ష పెట్టించారు.

1975లో నేషనల్ ఎమర్జెన్సీ విధించినందుకు నాటి ప్రధాని ఇందిరాగాంధీ నియంతృత్వ పోకడలను తీవ్రంగా విమర్శించింది మాలతీ దేవి. పర్యవసానంగా ఆమెను అరెస్టు చేసి కటక్ జైల్లోను, ఆమె భర్త నాబ కృష్ణ చౌదరిని బారిపాద జైలులో పెట్టారు. నాబ కృష్ణ చౌదరి జైల్లో ఉండగా ఆరోగ్యం క్షీణించి పక్షవాతం బారిన పడ్డారు. అప్పుడు ఆయనను, మాలతీ చౌదరిని విడుదల చేశారు. తరువాత వారిద్దరూ అంగుల్ చేరుకొని పేద ప్రజల కోసం పనిచేయ సాగారు.

అవిశ్రాంత యోధురాలు మాలతీ చౌదరి పదవులు తిరస్కరించి, గిరిజనులు, హరిజనుల కోసం పాటుపడి ధైర్యంగా వలస పాలకులు, ఫ్యూడల్ పాలకులు (సంస్థానాధీశులు) భారత ప్రభుత్వాధికారి దుర్వినియోగులకు వ్యతిరేకంగా గొంతెత్తి పోరాడింది. గాంధేయవాదులు, శాంతినికేతన్‌లో సహాధ్యాయులు అయిన మాలతీ, నాబ కృష్ణ చౌదరి దంపతులు తాము నమ్మిన సిద్ధాంతాలను ఆచరణలో పెట్టి ప్రజా సేవే పరమార్థంగా జీవించి తనువు చాలించిన నిష్కామ యోగులు.

ముత్తంగి వేంకట భారతలక్ష్మి
కాకినాడ. ఫోన్: 944 021 5330.



# బుద్ధుడి అనన్యత

*– కన్నడం: కె.ఎస్. భగవాన్*
*– తెలుగు: వేలూరి కృష్ణమూర్తి*

బుద్ధుడు జన్మించి (క్రీ.పూ. 560-480) ఇప్పటికి రెండువేల సంవత్సరాలకు పైబడింది. ఈ సుదీర్ఘమైన కాలావధిలో అతడు ప్రవేశించని దేశం లేదు, ప్రభావం చేసిన మనసు లేదు. ప్రపంచంలోని సాహిత్యం, కళా విజ్ఞానులందరూ అతడి వెలుగులో వికసించారు. 20వ శతాబ్దం చూచిన గొప్ప మేధావి, తత్వవేత్త బర్ట్రెండ్ రస్సెల్ మరియు గొప్ప విజ్ఞాని ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ 'బుద్ధుడి ధర్మమే రేపటి మానవ సమాజానికి ధర్మమౌతుందని,' ప్రవాదిలాగా అన్నారు. వారన్న ఈ మాటలు వారు ఇతర దేశాలవారైనా, ఇతర ధర్మాన్ని అవలంబించేవారైనా, వారు బుద్ధ ధర్మం గొప్పతనాన్ని గుర్తించి వేనోళ్ళ పొగిడారు. పరిపక్వమైన మనసు, జాతి-మతాతీతమై, దేశ-కాలాలకు అతీతంగా ఆలోచిస్తుంది. సామాన్యంగా ప్రతి ఒక ధర్మమూ యితర మతాలవారిని తమకు సమానం కాదు, ఆ మతస్థులు తమలాంటి మనుష్యులు కారన్న భావనను తమ అనుయాయుల మనసులలో నింపడం మనం గమనించవచ్చు. క్రైస్తవ మతంలో క్రిస్టియన్లు కాని వారిని 'పెగన్' అంటారు. ఇస్లాం తన మతంలో నమ్మకం ఉంచని వారిని 'కాఫిర్' అని పిలుస్తారు. బ్రాహ్మణ ధర్మం, లేక హిందూ ధర్మం చాతుర్ వర్ణాలను అంగీకరించని వారిని 'పాఖండి' అని అంటారు. ఈ అన్ని శబ్దాల అర్థం కొంచం అటూ-యిటూ ఒకటే అవుతుంది. అంటే, అన్ని మతాలూ మనుష్యుడికి విరోధంగా ఉన్నాయి. కాని, బౌద్ధ ధర్మం మాత్రం ఈ అసహజమైన భావనను ఉంచుకోక అందరూ ఒకటేనని భావించి ఆచరిస్తుంది. ఒకమారు భగవాన్ బుద్ధుడు తన అనుయాయులైన బిక్కువులందరినీ ఒకచోట చేర్చి యిలా అన్నాడు:

'చూడండి సోదరులారా, మీరందరూ సంఘంలో చేరారు. మీరందరూ ఒకటే. ఎలా? సముద్రానికి వేరు వేరు నదులు ప్రవహిస్తాయి. వాటికి వాటిదే అయిన ప్రత్యేకమైన పేరు, రూపం, ఆకారం ఉంటాయి. గంగా, యమునా, బ్రహ్మపుత్రా, సరస్వతి, అచిరావతి మొదలైనవి. ఆ నదులన్నీ సముద్రం చేరిన మీదట తమ పేర్లు, రూపాలు, ఆకారాలు-అన్నిటినీ పోగొట్టుకొని ఒకటే అయిపోతాయి. అలాగే మనమందరం, అని మనసు కరిగేలాగా ఆ మాటలను అన్నాడు.

మనకు తెలిసినంతవరకు మనవ జాతంతా ఒకటన్న అద్భుతమైన కల్పనను ప్రపంచ చరిత్రలో మొట్టమొదటిసారి చాటి చెప్పినవాడు భగవాన్ బుద్ధుడు. ఇలాంటి అపూర్వమైన ఆలోచనకు భరత ఖండం మాతృభూమన్నది గర్వించాల్సిన సంగతి. కాని, దీనికి విరుద్ధమైనదే యిక్కడ ముళ్ళ కంపల్లాగా పెరిగినదన్నది అంతే దుఃఖించాల్సిన సంగతి. దేవుడి గురించి బుద్ధుడు ఏమీ చెప్పలేదన్నది మనకందరికీ తెలిసిన విషయమే. ఈ గ్రహంపై మొదటిసారి మానవుడు ఆలోచన ప్రారంభించినప్పటి నుండీ, అతడిని పీడిస్తూ వచ్చిన విషయం దేవుడు! దేవుడున్నాడా, లేడా అన్న పర-విరోధమైన వివాదాలు ప్రపంచమంతటా ప్రసరించాయి. ఇది ఎంతైనా వ్యక్తిగతమైన నమ్మకం - అపనమ్మకాల సంగతౌతుంది. వస్తు నిష్టతతో కూడిన, విజ్ఞానపరమైన విషయమనిపించదు. దేవుడు సార్వత్రికమని అన్నా అతడు అన్నిచోట్లా, అందరిలోనూ ఒకే విధంగానూ ఒకే రూపంలోనూ ఉండడు. కాని, అన్నిచోట్లా నీళ్ళు ఒకే విధంగా ఉంటాయి, అగ్ని ఒకే విధంగా ఉంటుంది, ఒకే సూర్యుడు, ఒకే చంద్రుడు. వేరు వేరుగా ఉన్నట్టయితే అవి వాటిలాగా ఉండవు. ఇలా ఉన్నందువల్లనే బుద్ధుడు ఈ విషయంగా ఏం చెప్పడానికి ఇష్టపడలేదు. 'మన చుట్టూ, కష్టాలున్నాయి; జనులు బాధపడుతున్నారు. వారి దుఃఖాన్ని శమనం చేయడానికి నేను ప్రయత్నిస్తున్నా'నని చెప్పిన బుద్ధుడి మాటలు చాలా అర్థగర్భితంగా ఉన్నాయి. వేరే ఎవరైనా అయితే వినేవారిని తబ్బిబ్బు చేసేలాగా మాట్లాడి తన చాణాక్షతను చూపించేవాడు. కాని, బుద్ధుడు, తనపై జనులకు అపారమైన ప్రేమ, నమ్మకం భక్తి గౌరవాలున్నప్పటికీ దానిని దురుపయోగం చేసుకోక అత్యంత ప్రామాణికంగా మాట్లాడాడు. కనపడని శక్తి లేదా

వ్యక్తి గురించి మాట్లాడడానికంటే సహమానవుల కష్టంలో భాగం పంచుకోవడం అత్యంత ఎక్కువ శ్రేయస్కరమన్నదాన్ని బుద్ధుడు అత్యంత మననీయంగా ఆచరణీయంగా చెప్పాడు. బోధకుడి నోటిమాటలకంటే సాహాయక హస్తమే ఎక్కువ పవిత్రమౌతుంది. ప్రపంచంలోని ఏ సంత మహంతులైనా దేవుడిని చూచివుండరని ధైర్యంగా చెప్పవచ్చు. ఎందుకంటే ఇంతవరకు చరిత్రలో దేవుడిని గురించి జరిగినదంతా కేవలం కల్పన, వ్యక్తిగతమైన నమ్మకం మాత్రమే! దేవుడునాడన్నదానికి ఎలాంటి సార్వత్రికమైన ఆధారాలు లేవు. మనిషి తాను మొదటి నుండీ విని, భావించుకొని వచ్చిన రూపమే అతడికి దేవుడిగా కనబడింది, అంతే. ప్రేమికులలో తీవ్రమైన ఆకాంక్ష కలిగినపుడు తమకు ప్రీతి పాత్రులైనవారే వారి కంటికి కనబడుతారు. దీనికంటే భిన్నమైన వివరణ మనోవైజ్ఞానిక వస్తుస్థితి మరొకటి లేదు! దేవుడి విషయంలో రష్యా దేశపు గొప్ప నాయకుడు, ప్రపంచంలోని ధీమంతులలో ఒకరైన లెనిన్ అన్న మాటలు దారిదీపమయ్యాయి. ఒకమారు అతడిని చూడడానికి పల్లె నుండి ఒక ముసలాయన వచ్చాడు. అతడు భుజంపై కంబళిని కప్పుకొని చేతిలో ఊత కట్టెను పట్టుకొన్నాడు. అతడు 1917 మహాక్రాంతి సమయంలో లెనిన్‌తో క్రియాశీలుడై ఉండిన వ్యక్తని ప్రతీతి. లెనిన్‌కు పల్లెవారంటే అపూర్వమైన ఆత్మీయత. వారిద్దరూ కబుర్లు మాట్లాడుకొంటున్నపుడు ఆ ముసలాయన, 'లెనిన్, మనమేమో దేవుడు లేడని చెప్పి జనులను నమ్మించి క్రాంతి చేసేశాము. ఇపుడు నువ్వూ నేను మాత్రమే ఉన్నాం. నిజం చెప్పు. నీకేమనిపిస్తుంది? దేవుడు ఉన్నాడా లేడా?' అని అన్నాడు. లెనిన్ మనసును చాలా కలచివేసిన సందర్భమది! వేరెవరైనా అయితే బహుశా హెచ్చరిక తప్పేవారు. కాని, లెనిన్ గారిది ఎప్పుడూ జాగ్రత్తగా ఉండే చైతన్యం. అతడు చెప్పిన మాటలు సర్వమాన్యమైనవి. 'చూడు పెద్దాయనా, దేవుడి విషయంలో, విజ్ఞానం ఈరోజు కాకుంటే ముందెప్పుడో ఒకరోజు ఒక నిర్ణయానికి వచ్చి తీరుతుంది. అప్పుడు విజ్ఞానం దేవుడున్నాడని చెబితే ఉన్నాడని అందాం. అంతవరకు ఇపుడు మనమేమని చెప్పామో అదేసరి అని పనిచేద్దాం' అని అన్నాడు. ఈ మాటలు ఎలాంటి విషయం గురించైనా తెరచిన మనసు (open mind) అవశ్యకతను సూచిస్తుంది. తెరచిన మనసు నిరంతరం అన్వేషణకు దారి. బుద్ధుడెపుడూ ప్రయోగం చేసే మనసున్నవాడు. అందులో ఎలాంటి గందరగోళం లేదు, అస్పష్టత లేదు. బుద్ధుడిది అత్యంత తేటలాంటి మనసు, తెల్లని పాలలాంటి మనసు. 'అనుష్ఠానమే అన్వేషణ, మరియు అనుభావం' అని బుద్ధుడు చాలా బాగా తెలుసుకొన్నవాడు. ఒకమారు ఐదుమంది బ్రాహ్మణులు బుద్ధుడి వద్దకు వచ్చారు. అతడి నుండి సత్యమార్గాలను తెలుసుకోవాలని వారికి కోరిక కలిగింది. వారిలో ఒకడు, 'మావారు యిలా చెబుతారు, ఇదే సరియైన మార్గం,' అని అన్నాడు. ఇంకొకడు, 'దీనిని నాకు యిలా చెప్పారు, ఇదే సత్యానికి దారి,' అని అన్నాడు. దీనితో మాకు గందరగోళం కలుగుతున్నది, సరియైన దారి ఏది భగవాన్'? అని వారు అడిగారు. 'చూడండి, మీవారు ఇది సత్యం, ఇదే దేవుడికి దారి' అని మీకు నేర్పించారు కదా'? అని బుద్ధుడు ప్రశ్నించాడు. 'ఔన'ని వారందరూ జవాబిచ్చారు. 'కాని, మీరు దేవుడిని చూశారా?'

'లేదు భగవాన్,' 'మీ తల్లితండ్రులు?'

'మీ తాత ముత్తాతలు?' 'లేదు స్వామీ.'

'వారెవరూ దేవుడిని చూడలేదా'? 'లేదు స్వామీ.'

'అలాగైతే, మీ గురువులు, ఆచార్యులు, ఎవరూ దేవుడిని చూడనే లేదా? 'ఎవరూ చూడలేదు భగవాన్'.

ఈ ప్రశ్నలను బుద్ధుడు ఆ ఐదుమంది యువకులతో అడిగాడు. వారందరూ తాము దేవుడిని చూడలేదని ఘోషించారు. అనంతరం బుద్ధుడు యిలా అన్నాడు: 'ఒక పల్లెకు ఒక అబ్బాయి వచ్చాడు. అతడు ఒకేసమంగా దుఃఖించసాగాడు. 'ఓ, నేను ఆమెను ప్రేమిస్తున్నాన'ని దుఃఖించసాగాడు. అపుడు ఆ పల్లెవారందరూ వచ్చి, 'ఆమె ఎవరు? ఎక్కడున్నది? ఎలా ఉన్నది'? అని ప్రశ్నించారు. 'నాకు తెలియదు. కాని నేనామెను చాలా ప్రేమిస్తున్నాన'ని ఆ అబ్బాయి వెక్కి వెక్కి రోదించసాగాడు. ఈ అబ్బాయిని మీరేమని పిలుస్తారు?' అని బుద్ధుడు అక్కడికి వచ్చిన వారిని అడిగాడు. 'విడువండి స్వామీ,

వాడొక పిచ్చివాడు. వాడొక మూర్ఖుడు!' అని అ యువకులందరూ ఖచ్చితపరిచారు. 'మీరు కూడా, వాడిలాగే కదా? మీ తండ్రులు, తల్లులు, తాతలు, ముత్తాతలు, ఆచార్యులు - ఎవరూ చూడని దేవుడి గురించి మీరు వాదిస్తున్నారు. ఒకరు మరొకరి గొంతును కత్తరించడానికి తయారయ్యారు కదా?' అని బుద్ధుడు బాధ పడ్డాడు.

'అలాగైతే మేమేం చేయాలి? చెప్పండి భగవాన్,' అని ఆ యువకులు ఏక కంఠంతో బుద్ధదేవుడిని వినుతించారు. 'ఇప్పుడు చెప్పండి, మీ తండ్రి - తాతలు ఎప్పుడైనా దేవుడిని కోపిష్ఠి అని మీకెపుడైనా తెలిపారా,' 'లేదు, గురువు గారూ,' 'దేవుడు దుష్టుడని, వారు మీకు ఎపుడైనా చెప్పారా? మీ ధర్మ గ్రంథాలు అలా భోధిస్తాయా'? 'లేదు స్వామీ, దేవుడెపుడూ పరిశుద్ధుడు, పరమ పవిత్రుడు'. 'అలాగైతే మీరు కూడా పరిశుద్ధులూ, మంచివారైతే, మీరు ఆ దేవుడికి దగ్గర కావడానికి సాధ్యమౌతుంది. ఈ విధంగా వాదించడంవల్ల అది సాధ్యం కాదు. అందువల్ల పరిశుద్ధంగా, మంచివారుగా అందరినీ ప్రేమించండ'ని ఆత్మీయతతో బుద్ధుడు వారికి ఉపదేశించాడు. దేవుడు లేడని నకారాత్మకంగా నడుచుకొనేకంటే మనుష్యుడినే దేవుడిగా చేసే సకారాత్మక ప్రక్రియ బుద్ధదేవుడిది. అది అతడికి స్వానుభవంవల్ల సిద్ధించింది. ఇది బుద్ధుడి జీవితం, అలాగే అతడి ఉపదేశాలని చెప్పవచ్చు.

దేవుడన్న వ్యక్తి లేదా వస్తువన్నది లేదు. పవిత్రతే దేవుడు. పరిశుద్ధతే దేవుడు అని ఈ సంవాదం సూచిస్తుంది. అదీగాక కనపడని దేవుడి గురించి నూరారు విధాలుగా పోట్లాడే మూర్ఖతను ఇది గేలి చేస్తుంది. ఇంతైనా బుద్ధుడికి స్వంత ఉద్దేశమేదీ ఉండలేదు. అన్నీ లోక కారుణ్యం మరియు లోక హితానికి ప్రేరేపితమైనవి. ఒకమారు రాజుగారి ఏదో యాగానికై తీసుకొనిపోతున్న గొర్రెపిల్లను చూచినపుడు, 'గొర్రెపిల్లను బలి ఇవ్వడంవల్ల మీరు స్వర్గానికి పోయేటట్టయితే మనుష్యుడిని బలి యివ్వడం యింకా ఉత్తమం. నన్నే యజ్ఞానికి అర్పించండి,' అని బుద్ధుడు ముందుకు వచ్చాడు. రాజు ఆశ్చర్యంతో చకితుడయ్యాడు. ఇలా పశు-పక్షులపైనంతా బుద్ధుడికి అపారమైన స్నేహముండినది. సమానమైన ప్రేమ ఉండినది. ఎక్కడా తారతమ్యం చూపలేదు. ప్రపంచం చూచిన సమానతా తత్వ బోధనలో బుద్ధుడు మొట్టమొదటివాడు, అలాగే మహోన్నతమైన దార్శనికుడు.

* * *

బుద్ధుడు జీవించి ఉపదేశం యిస్తున్న సమయానికే సంస్కృతభాష వాడుక తప్పిపోయింది. అతడి కొద్దిమంది బ్రాహ్మణ శిష్యులు అతడి బోధనలను సంస్కృత భాషకు అనువాదం చేయడానికి వారి అనుమతిని కోరారు. దానికి బుద్ధుడు- 'వద్దు, నేను ఉంటున్నది సామాన్యుల కోసం; సామాన్య జనుల కోసం ఉండేవాడిని నేను. సామాన్య జనుల భాషలో నేను మాట్లాడేవాడిని' (వినయ పిటక 4.33.1) అని స్పష్టంగా తెలిపాడు. అందువల్ల ఈనాటికీ, అతడి పూర్తి బోధనలు త్రిపిటకాలాలలో జనుల భాషైన పాళీలోనే ఉండిపోయాయి.

సార్వత్రికంగా మెచ్చుకోలుకు యోగ్యమయ్యేటటువంటి గుణాలే బుద్ధుడి జీవిత పర్యంతం నిండుకొని ఉన్నాయి. అతను రాత్రికి రాత్రే అందరినీ వదలి పారిపోయాడన్నది తప్పు. స్వతహా బుద్ధుడే అరియపరియేసన సుత్త, అత్తదండ సుత్త, మహాస్వచ్ఛ సుత్తలలో (మజ్జిమ నికాయ, భాగం 1, పరియేసన సుత్త, సం.26 మరియు మహాసచ్చక సుత్త సం.36) తన తల్లి తండ్రులకు, భార్యకు తెలిపే అంతఃపురాన్ని త్యజించి సన్యాసి అయ్యానని తెలిపాడు. అతడు ప్రపంచంలోని అందరు మహాపురుషులకూ మాదరిగా ఉన్నాడనిపిస్తుంది. రాముడు, కృష్ణుడు, క్రీస్తు, మహమ్మద్ (క్రీ.శ. 632) మొదలైనవారందరూ బుద్ధుడి తరువాత వచ్చినా బుద్ధుడిని మీరినటువంటి గుణాలు వీరెవరిలోనూ కనపడవంటే అతిశయోక్తి కాదేమో!

అవతార పురుషుడనే శ్రీరాముడు మరుగులో నిలబడి - దానికి ఎలాంటి కారణమున్నా - వాలిని చంపడం అతడికి తగినైనది కాదు. అనంతరం సీతను భూదేవి తన గర్భంలోనికి ఈడ్చుకొన్నపుడు అతడు తన జీవితం చరమాంకంలో నిరాశచెంది సరయూ నదిలో పడి ఆత్మహత్య చేసుకొంటాడు. (వాల్మీకి రామాయణం, ఉత్తర కాండం 110.7). మరొక అవతార పురుషుడు

శ్రీ కృష్ణుడు తనవారైన యాదవులు తమలోనే పోట్లాడుకొని నాశనమవుతుండడాన్ని చూసి అసహనం చెంది జుగుప్సతో ప్రతిహతుడై అడవికి వెళ్ళిపోతాడు. అక్కడ చెట్టుక్రింద పడుకొని ఉన్నపుడు ఒక వేటకాడు అతనిని ఒక మృగమని తప్పుగా తలచి బాణం వేసి చంపుతాడు. 'నేనూ నా తండ్రి ఒక్కటే'నని (Holy Bible, New Testament, St. John 10.30) ఏసుక్రీస్తు చెప్పడంలో తానే దేవుడు అన్న అర్థమున్నది. అతడు తన జీవితం చివరలో విఫలతను అనుభవించినట్టు కనపడుతుంది. అతడిని శిలువకు కట్టి ములుకులతో బంధించి వ్రేలాడదీసినపుడు అత్యంత ఆర్తంగా 'ఓ తండ్రీ, నా చేయి ఎందుకు విడిచావు? (St. Mathew, 27.46) అని మొర్రపెడుతాడు. వెంటనే అతడు 'వారిని క్షమించు, వారేం చేస్తున్నారో వారికే తెలియద'ని (St. Luke, 23.34) అన్నాడన్న అతడి మాటలు, 'నాకు తెలుసు, వారికి తెలియదు' అని సూచించడంవల్ల తను గొప్ప అనడానికి తోడుగా, అహంకారమూ ఉన్నదనిపిస్తుంది. మహమ్మద్ చివరి రోజులు కూడా దుఃఖమయమైనవే. ప్రపంచంలోని అందరు మహాపురుషులూ తాము దేవుడి అవతారమని లేదా దేవుడి అంశమై ఉన్నామని నమ్మకమున్నవారు.

శ్రీరాముడు, అలాగే శ్రీకృష్ణుడు దేవుళ్ళనే పూజ గైకొంటున్నారు. శ్రీకృష్ణుడు, 'అంతటినీ విడిచి నాకు శరణు కా. నిన్ను అన్ని పాపాల నుండీ నేను విడిపిస్తా, శోకించకు' - 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య మాం ఏకం శరణం వ్రజం, అహం తే సర్వ పాపేభ్యో మోక్ష యిష్టామి మా శుచః' అని భగవద్గీతలో (18.66) ఘోషించాడు. ఎలాంటి చెడ్డపని చేసినా భగవంతుడికి శరణైతే మోక్షం ప్రాప్తమవుతుందన్న నమ్మకమున్నది. ఇది సన్మార్గ బోధన కాదు. పాపకృత్యాలకు ప్రచోదన చేసినట్టవుతుంది. ఇస్లాం మత సంస్థాపకుడైన ప్రవాది మహమ్మద్ 'దారి చూపడానికి దేవుడు ప్రపంచానికి అప్పుడప్పుడూ ప్రవాదులను పంపుతాడు. వారిలో 'నేను చివరి ప్రవాది'నన్న అర్థం వచ్చే మాటలను పవిత్ర ఖురాన్‌లో చెప్పాడు. అంటే, 'నా మాటే చివరి'దని ఆదేశించడం అపరిపూర్ణత, అలాగే అహంకారపు లక్షణమౌతుంది. కాని, దైవత్వపు ఈ ఏ అంశాన్నీ తనకు ఆరోపించుకోకపోవడం బుద్ధుడి విశిష్టత! బుద్ధుడు మనుష్యుడిగా జన్మించి దైవత్వాన్ని సంపాదించి దేవుడై ఉన్నా, దానిని త్రోసిపుచ్చి మనుష్యుడిలా ప్రవర్తించిన ఏకైక అనుపమ, అపూర్వమైన అనుభావి. 'నేనూ, మీలాగే జన్మదాల్చిన మానవుడిని. ఈ దారిలో నేను నడిచి ఈ సత్యాలను తెలుసుకొన్నా. మీరూ ఈ దారిలో వెళ్ళి చూడండి. ఇవి సత్యమని మీకనిపిస్తే వీటిని అంగీకరించండి, లేకుంటే తిరస్కరించండి,' అని పిలుపు యిచ్చినది అతడి జిజ్ఞాస యొక్క మనోభావాన్ని చూపుతుంది. జిజ్ఞాసే జ్ఞానానికి మూలం. నేను చెప్పినదే చివరిమాట అన్న ధోరణిని బుద్ధుడు ఎపుడూ ప్రదర్శించలేదు. దీనివల్ల బుద్ధ ధమ్మ మూలభూతమవడానికి మరియు దాని అనుయాయులు మూలభూతవాదులు కావడం సాధ్యంకాని మాట. ఎందుకంటే, పూర్తి స్వతంత్రపు మనసు సంకుచిత వాదానికి పిడుగులాంటిది! ప్రపంచంలోని మహాపురుషులు మరియు ధర్మ సంస్థాపకులను గమనిస్తే వారందరూ తమ చివరి కాలంలో ఒకటి కాకుంటే మరొక రీతిలో నిరాశ చెందినది, అలాగే శోకభరితులైనది మనం గమనించవచ్చు. కాని, బుద్ధుడి అవసానం అత్యంత ఆనందకరమైనది.

చుందుడన్న అస్పృస్యుడు బుద్ధుడిని తన యింటికి పిలిచి పంది మాంసం వడ్డించినపుడు బుద్ధుడు సంతోషంతో భోజనం చేశాడు. కొద్దిగా కోలుకొన్నా అతడి ఆరోగ్యం క్షీణించింది. చివరి ఘడియలలో చుందుడు వెళ్ళి దుఃఖిస్తూ నిలబడి ఉండగా బుద్ధుడు అతడిని తన వద్దకు పిలిచి అతడి శరీరాన్ని తడిమి, 'దుఃఖించకు, తథాగతుడికి చివరి భోజనం యిచ్చిన పుణ్యాత్ముడివి నువ్వు,' అని సాంత్వనపు మాటలన్నాడు. తన జీవితమంతా సమానతను బోధించి సంచరిస్తున్న బుద్ధుడు తన చివరి రోజులలో దానిని చాలా అతిశయంగా అనుష్టానం చేశాడు. అప్పటి ధర్మం మరియు సమాజం దృష్టిలో, 'పాపులు దిగువ జాతిలో జన్మిస్తారన్న భావన, అలాగే సిద్ధాంతం 'పేరుకు పోయింది. దానిని బుద్ధుడు కేవలం సాధారణంగా కనిపించే ఒకమాట ద్వారా- 'నువ్వు పుణ్యాత్ముడవు,' అని అనడంతో ఆ పాపులన్న మచ్చను తుడిచివేశాడు. బుద్ధుడి కాలపు చరిత్ర మరియు జనుల మనోభావాలను గమనిస్తే

బుద్ధుడి మాటలు చాలా క్రాంతికారకమనిపిస్తాయి. బుద్ధుడి జీవితమంతా క్రాంతి చేస్తానని చెప్పకుండానే అభూతపూర్వమైన క్రాంతి చేసిన అసామాన్యమైన పోరాటమైంది. ఇది ఘర్షణ లేకుండా నయంగా అనస్తీషియా యిచ్చి చేసిన అపరూపపు శస్త్ర చికిత్సయింది. అప్పటి రాజకీయ వ్యవస్థ మరియు పరిపాలన పద్ధతి గురించి బుద్ధుడికి అంతటి విరోధమున్నట్టు కనపడదు. దానిని అతడు చాలామటుకు అంగీకరించినట్టు కనపడుతుంది. లేకుంటే అప్పటి రాజమహారాజులు అతడి రాక కోసం వేచివుండి ఆతురతతో అతడికి రెడ్ కార్పెట్ వేసేవారు కాదు. బుద్ధుడిదంతా జనుల బుద్ధిని మార్చడం. భావంలో మార్పువస్తే మాత్రం భవంలో మార్పు సాధ్యమౌతుంది. అందువల్ల బుద్ధి మార్పు చెందితే అన్నీ మారుతాయని బుద్ధుడు స్వానుభవంతో తెలుసుకొన్నాడు. ఇహాన్ని మంచి-చెడ్డ అన్న బేధం లేకుండా అందరూ సుఖంగా జీవించడానికి జరిపే స్థానంగా మార్చాలన్న ఆతంకం అతడిదై ఉండేది. దానిని అతడు తన సంఘ వ్యవస్థలో పూర్తిగా సిద్ధింపజేసుకొని కృతార్థుడయ్యాడు. బుద్ధుడి ధమ్మంలో మూడు ముఖ్యమైన అంశాలున్నవి. బుద్ధ, ధమ్మ మరియు సంఘ. (బుద్ధం.. ధమ్మం.. సంఘం... శరణం గచ్ఛామి) శరణం అన్నదానికి అర్పించడం, దాసుడవడం, అని సాధారణంగా అర్థం చేసుకొంటే బుద్ధుడికి గొప్ప అపచారం చేసినట్టే. బుద్ధుడంటే ఒక వ్యక్తి కాదు. అది జ్ఞానానికి చిట్ట చివరిది. సంకేతం. బుద్ధ మరియు అతడి ధమ్మాన్ని నిఖరంగా అర్థం చేసుకొంటే ఆ దారిలో ప్రయాణం చేసి, అదే సరియైనదని అనుభవం కలిగి దానిని అంగీకరించడమని అర్థం. అర్థం చేసుకోకుండా, అనుభవం లేకుండా అంగీకరించడం మౌఢ్యమౌతుంది. అలా చేస్తే బుద్ధుడి ధమ్మానికి గొప్ప హాని చేసినట్టే. సరియైన దానిని తెలుసుకొన్నవాడు బుద్ధుడు. దానిని అతడు జీవించి చూపినందువల్ల అది ధమ్మమైంది. దానిని ప్రచారం చేయడానికి అతడు నిర్మించిన వ్యవస్థే సంఘ. బుద్ధ, ధమ్మ-మనోవాక్కాయాల త్రికరణపూర్వక సాధన యొక్క సమీకరణం మరియు సాక్షాత్కారం!

బుద్ధుడు తన నలభైమంది శిష్యులను ఎంచుకొని వారిని ప్రపంచంలోని అన్నిచోట్లకు పంపించేటపుడు చెప్పిన మాటలు గొప్పవి: 'మీరు వెళ్ళి అన్ని జాతుల వారితోనూ, మరియు అన్ని దేశాలవారితోనూ కలిసి జీవించండి. అందరి హితానికీ, అందరి లాభానికీ ఈ ఉత్కృష్టమైన ఉపదేశాన్ని బోధించండి.' కాలం, దేశం, జాతి, మతంలాంటి అన్నిటినీ దాటి బుద్ధ ధమ్మ ప్రపంచపు హృదయాన్ని ముట్టినది. బుద్ధుడి చిరస్మరణీయమైన మాటలు యివి: 'ప్రాచీన గ్రంథాలను చూపి, ఇది ప్రమాణమని చెబితే నమ్మకండి. అన్నిటినీ పరీక్షించండి. అన్నిటినీ ప్రయత్నించండి. అందులో ఎక్కువమంది హితం, ఎక్కువమంది సుఖం కనిపిస్తే దానిని అందరికీ యివ్వండి,' అని చెప్పి బుద్ధ దేవుడు మహానిర్వాణానికై వెళ్ళాడు. బుద్ధుడి మానసిక ఆరోగ్యం అపూర్వమైనది. అక్కడ దేవుళ్ళు, దేవతలు, దేవదూతలు, భూతగణాలులాంటి వేటికీ అవకాశం లేదు. మానవ సమాజాన్ని దేవానుదేవతలు మరియు దేవతల నుండి మొట్టమొదట విడిపించిన అపూర్వమైన ఆలోచనాపరుడు, మరియు గొప్ప మానవుడు బుద్ధుడు. అతడిది స్వచ్ఛమైన మనసు. పరిపూర్ణమైన మనసు. మరణించే సమయంలోనూ అతడి మెదడులోని ప్రతియొక జీవకోశమూ పూర్తిగా ఆరోగ్యకరంగా ఉండినది. బుద్ధుడు ప్రపంచం చూచిన అత్యంత ఆరోగ్యవంతమైన ఉపదేశకుడు, గొప్ప ధర్మ గురువు. బుద్ధుడి పరినిర్వాణం పొందిన సమయంలో అతడి శిష్యులు గురువుకు ఇలా విన్నవించారు: 'మీ నిర్యాణానంతరం మేమేం చేయాలి? తెలుపండి.' 'ఏమీ వద్దు.' 'మీకు ఎలాంటి స్మారకం నిర్మించాలి'? 'భౌతిక క్రియ, బౌద్ధిక క్రియకంటే సులభం, నిజమే. కాని, బుద్ధత్వమేమైనా విగ్రహత్వం నుండి సిద్ధిస్తుందా? మీకు యిష్టమైతే నన్ను మట్టిలో మూసి కప్పివేయండి. లేకుంటే ఏమీ చేయకండి,' అని బుద్ధుడు చెప్పినా అతడికై అసంఖ్యాకమైన మందిరాలు ప్రపంచమంతటా నిర్మాణమయ్యాయి.

తన శిష్యులతో బుద్ధుడు యిలా అన్నాడు: 'ఈ చెట్టు క్రింద ఏదైనా పరవండి. నా చివరి కాలం సమీపిస్తున్నదని నాకు అనిపిస్తున్నది,' అని బుద్ధుడు కూర్చోవడానికి వీలుకాక అలాగే క్రింద పడుకొన్నాడు.

అతను వెంటనే చెప్పిన, చేసిన మొదటి పని - 'వెళ్ళి చుందనికి తెలపండి. నా అత్యుత్తమమైన దాసులలో అతడు ఒకడు. అతడు యిచ్చిన భోజనంవల్ల నేను నిర్వాణం పొందుతున్నాను. ఈ దేహం నుండి విడుదల పొందుతున్నా.' అపుడు అనేకమంది బుద్ధదేవుడి నుండి ఉపదేశం పొందడానికి వచ్చారు. అపుడు ఒక భిక్షువు, 'ఇప్పుడు గురుదేవుల వద్దకు వెళ్ళకండి, గురుదేవులు నిర్వాణం పొందుతున్నార'ని అనగా దానిని వినిపించుకొన్న బుద్ధుడు 'వారిని నా వద్దకు విడువండి,' అని అన్నాడు. అనంతరం ఇంకెవరో వచ్చారు. అప్పుడు మరణించే స్థితిలో ఉన్న గురుదేవులు అన్నారు: 'ఓ ఆనంద! నేను వెళ్ళిపోతున్నా. నా కోసం దుఃఖించకండి. నన్ను ఎక్కువగా పట్టించుకోకండి. నా జీవితం ముగిసింది. మీ విడుదలను మీరే హెచ్చరికతో తెలుసుకోండి. మీలో ప్రతి ఒక్కరూ నాలాగే ఉన్నారు. మీలో నేనూ ఒకడిని, అంతే, మరేమీ కాదు. ఈరోజు నేనిలా అయ్యానంటే, అది నన్ను నేనే రూపించుకొన్న ఫలం. మీరు శ్రద్ధతో శ్రమించండి. నేను ఏమయ్యానో మీరూ అదే కావాలి.'

పూజ, యజ్ఞం, విధి, విధానాలు ధర్మం కావు. ధర్మమంటే ఒక ఘడియ ప్రార్థన చేసి, అనంతరం రోజంతా దానికి విరుద్ధంగా నడుచుకోవడం కాదు. జీవితం పూర్తి ప్రార్థనలాగే పవిత్రంగా ఉండాలని బ్రతికి చూపిన మహానుభావుడు బుద్ధుడు. దీనివల్ల దేవతలు చాలా అసంతుష్టులయ్యారన్న కథ ఒకటి ఉన్నది. 'ఇతడు ఉంటే మనకు జీవించడానికి అవకాశముండదు. ఇతడివల్ల మనకు అర్పిస్తున్న నైవేద్యమంతా తప్పిపోయింది. ఎందుకంటే ఇతడిని చూస్తే జనులు పావనులౌతారు. ఇతడిని ఏమైనా చేసి ముగించివేయాలి', అని దేవతలందరూ చేరి కుట్ర పన్నారు. వారందరూ వేషాలు మార్చుకొని వచ్చి బుద్ధుడిని వేడుకొన్నారు: 'భగవన్, మేమొక పెద్ద యాగాన్ని చేయాలని ఉన్నాము. దానికై ఒక సరియైన స్థలాన్ని వెదుకుతున్నాము. ఎక్కడా తగిన స్థలం లభించలేదు. తాము అంగీకరిస్తే దానిని వివరిస్తాము,' అని అన్నారు. 'అలాగే కానీండి, చెప్పండి,' అని అన్నాడు బుద్ధుడు. 'మేము చేయాల్సిన యజ్ఞానికి చాలా ప్రశస్థమైన స్థళం తమరి హృదయప్రదేశమని' అన్నారు. బుద్ధుడు ముందు వెనుకలు చూడక, 'అలాగే కానీండి, మీ యాగం ప్రారంభించండి,' అని నేలపై ఎల్లెలకల పడుకొన్నాడు. దేవతలు చాలా సంతోషంతో అతడి గుండెపై యజ్ఞకుండాన్ని రచించి, అగ్నిని ఉంచి చాలా సమయం యాగం చేసి యజ్ఞకుండం క్రింద ఉన్న బుద్ధుడిని చితకబాదేశారు. 'మన శత్రువైన ఇతడిని, మనం ముగించి వేశాము. ఇకమీదట మనం నిరంతరంగా ఉండవచ్చు'నని మాట్లాడుకోసాగారు. కొంత సమయం తరువాత పైకి లేచిన బుద్ధుడు వారితో, 'మీ యాగ క్రియ ముగిసినదా? మీకందరికీ ఆనందం కలిగిందా?' అని ప్రశ్నించాడు. దేవతలు తమకు కలిగిన ఆశ్చర్యం మరియు దిగ్భ్రాంతిని దాచుకొంటూ, 'మీకు ఏమైనదోనని మేము భయపడిపోయాము,' అని అన్నారు. దానికి బుద్ధుడు నవ్వుతూ,' పవిత్రతను నాశనం చేయడం సాధ్యమా? పవిత్రత పోతే జీవితం ఉండదు, లోకముండదు,' అని దేవతలకు బుద్ధి చెప్పారు. బుద్ధుడు పరమ పావన మూర్తియై ఉండేవాడన్న విషయం పైన తెలిపిన రూపకం ధ్వనిస్తుంది. ఈ అద్భుతమైన రూపకాన్ని చేసినవారు బుద్ధుడి అనుయాయులు కాదు. అతడి తీవ్రమైన విరోధులని తెలుసుకొంటే బుద్ధుడి గొప్పతనం మన మనసుకు బాగా విశదమౌతుంది.

'దేవుడి గురించి, మీ నూరారు వాదవివాదాలన్నీ నాకు అవసరం లేదు. మంచివారుగా ఉండండి, మంచిని చేయండి,' అన్నదే బుద్ధుడి ఉపదేశం యొక్క పరిపూర్ణ సారమని అని తెలుపవచ్చు. బుద్ధుడు మంచికి అవతారమై ఉండేవాడు. మంచితనం లేదా నైతికతను ధర్మానికి ప్రాణంగా చేసిన కీర్తి బుద్ధుడిది. అంతవరకు నీతి మరియు మానవీయతకు వెలలేకుండా విధి నిషేదాలు, అలాగే శాస్త్రాల కట్టై ఉండేది ధర్మం. అది మానవీయత యొక్క మహాప్రసాదమని ప్రపంచానికి మొట్టమొదటిసారి చూపినవాడు మానవులలో మహామానవుడైన బుద్ధుడు. అతడంతటి మానవీయ అంతఃకరణమున్న జ్ఞానిని, మానవతావాదిని ప్రపంచం మరలా చూడలేదనిపిస్తుంది!

**వేలూరి కృష్ణమూర్తి, మైసూర్. ఫోన్: 944 897 7877.**


# బహుముఖ ప్రజ్ఞాశాలి – జి.డి. నాయుడు

– వి.వి. వేంకట రమణ

ప్రస్తుత కాలంలో టెక్నాలజీ విపరీతమైన పురోగతి సాధించి ఉండవచ్చు. కానీ, టైమ్ మెషీన్‌తో ఒక శతాబ్దం వెనక్కి తిరిగి చూస్తే, ఆకాలంలో ఈ సాంకేతికతలు ఏవీ లేవు. కానీ, అప్పటి శాస్త్రవేత్తలలో కొందరు వేసిన బీజం ప్రస్తుత సాంకేతిక అభివృద్ధికి ప్రధాన కారణం అనేది మనం మరిచిపోకూడదు.

ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ముఖ్యమైన ఆవిష్కరణలలో భారతీయులు భాగస్వాములైనప్పటికీ, వారి గురించి భారతీయులైన మనం అసలు పట్టించుకోం. భారతీయ శాస్త్రవేత్తలు కూడా చాలా ముఖ్యమైన ఆవిష్కరణలు చేశారు. అలాంటి ఆవిష్కర్తలలో విస్మరించలేని అద్భుతమైన వ్యక్తి జి.డి. నాయుడు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, వ్యవసాయంవంటి అనేక రంగాలలో ఆయన ఎంతో కృషి చేశాడు. ఎన్నో అడ్డంకులన్నింటినీ అధిగమించి ఒక అనివార్యమైన శక్తిగా నిలిచాడు.

గోపాలస్వామి దొరస్వామి నాయుడు తెలుసా లేదూ, దొరస్వామి నాయుడు ఎవరో తెలుసా అంటే, ఏమో తెలీదు అనేస్తాం. అదే జి.డి. నాయుడు పేరెపుడైనా విన్నారా అని అడిగితే ఎందుకు తెలియదూ అంటాం. జి.డి. నాయుడు పూర్తి పేరు గోపాలస్వామి దొరస్వామి నాయుడు. భారతదేశంలో మొట్టమొదటి ఎలక్ట్రిక్ మోటారును తయారు చేసిన ఘనత ఆయనది. రేజర్ బ్లేడ్ కనిపెట్టిన మేధస్సు ఆయనది. ఒక్కమాటలో చెప్పాలీ అంటే, ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. అంతే కాదు. ఆయన ప్రఖ్యాతి గాంచిన ఇంజనీరు, నిరంతర అన్వేషకుడూ కూడా. దక్షిణ భారత దేశంలో పారిశ్రామిక విప్లవానికి కారణభూతుడై భారతదేశపు ఎడిసన్ అని కూడా పేరు పొందాడాయన. నేటి తమిళనాడులోని కోయంబత్తూర్ పట్టణానికి సంపద సృష్టికర్తగా కూడా ఆయనను పేర్కొంటారు. ఆయన వ్యక్తిగత వివరాలు ఎక్కువగా జనంలోకి రాలేదు. కానీ ఆయన చేసిన ఎన్నో ఆవిష్కారాలు ప్రజల్లో నేటికీ నిలిచి ఉన్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, వంద శాస్త్రజ్ఞుల పెట్టు ఆయన. భారత దేశపు ఆణిముత్యం ఆయన. అంత గొప్ప ఖ్యాతి చెందిన జి.డి. నాయుడు కేవలం మూడవ తరగతి వరకు మాత్రమే చదువుకున్నారంటే, మనకు ఆశ్చర్యం కలగక మానదు. 1893 మార్చి 23వ తేదీన కోయంబత్తూరు దగ్గరలోని కలంగల్ అనే గ్రామానికి చెందిన ఒక పేద తెలుగు రైతు కుటుంబంలో జన్మించాడు. నాయుడు పుట్టిన కొద్ది నెలలకే తల్లిని కోల్పోయాడు. బాల్యంలో పాఠశాల తరగతులకు హాజరు కావడాకి పెద్దగా ఇష్టపడలేదు. పైగా బడిలో ఉండే కాస్త సమయంలో కూడా ఇసుకను విసిరే అలవాటు కారణంగా ఉపాధ్యాయులతనిని తరచూ శిక్షించేవారు. దాంతో ఆయన కేవలం 3వ తరగతి చదువుతోనే ఆపేశాడు. కానీ కలలు కనడం మానలేదు. అడుగడుగునా రిస్క్ తీసుకోవటానికి భయపడలేదు.



గోపాలస్వామి దొరైస్వామి నాయుడు

పారిశ్రామిక, ఎలక్ట్రికల్, మెకానికల్, అగ్రికల్చరల్ (హైబ్రిడ్ సాగు), ఆటోమొబైల్ ఇంజనీరింగ్ రంగాలలో ఆయన చేసిన కృషి ఎన్నలేనిది. జి.డి. నాయుడు భారతదేశంలో మొట్టమొదటి విద్యుత్ మోటారును తయారు చేశాడు. ఎలక్ట్రిక్ రేజర్, పదునైన రేజర్ బ్లేడులను తయారు చేశాడు. రెండు సీట్ల కారును తయారు చేశాడు. వివరంగా చెప్పాలంటే, నాయుడు కనుగొన్న, తయారు చేసిన విలక్షణమైన పరికరాలు కొన్ని ఇలా ఉన్నాయి - తొలి విద్యుత్ రేజర్, బహు పదునైన బ్లేడు, దూరం సరిచేసే కెమెరా భాగం, పండ్ల రసం తీసే పరికరం, ఎలక్ట్రానిక్ ఎన్నికల యంత్రం, కిరోసిన్‌తో నడిచే ఫ్యాను, ఐదు వాల్వుల రేడియో, రెండు సీట్ల మోటారు కారు, జి.డి. నాయుడు పాలిష్, వ్యవసాయ రంగంలో సీడ్‌లెస్ రకం ఆరెంజి, ప్రత్తి విత్తనాలకు రూపకల్పన చేశాడు.

తన కంపెనీ బ్లేడ్ కోసం హిట్లర్ నుండి బహుమతిని పొందాడు. ఫోర్‌స్ట్రోక్ ఇంజిన్‌ను కూడా అభివృద్ధి చేశాడు. ఆ కాలంలోనే ఆయన ప్రొజెక్షన్ టి.వి., మెకానికల్ కాలిక్యులేటర్, టికెట్ వెండింగ్ మెషిన్లకు రూపకల్పన చేశాడు.

చిన్నప్పటి నుంచీ కూడా ఆయన నిత్యాన్వేషిగా, ఎపుడూ ఏదో ఒక కొత్త విషయం నేర్చుకోవాలి, ఒక కొత్త ఆవిష్కారాన్ని ప్రజలకు ఉపయోగపడేలాగా తేవాలనీ ఆశపడేవాడు. అప్పటికి అతని తండ్రి పేదవాడు. పొలం పని తప్ప వేరే ఎరుగడు. అలాంటి సమయంలో పొలం పనులలో తండ్రికి సాయం చేస్తూ, ఒక మోటారు సైకిలును చూశాడు. దానిని కొనడానికి తగిన డబ్బు లేకపోవడంతో, దాన్ని కొనడానికి డబ్బు సంపాదించాలని ఒక హోటల్‌లో వెయిటర్‌గా దాదాపు మూడేళ్లపాటు పనిచేసి, దాచుకున్న మొత్తంతో ఆ మోటారు సైకిల్‌ను కొన్న తరువాత, అనేకసార్లు దానిని మొత్తంగా ఏ భాగానికాభాగం విడదీసి, తిరిగి బిగించటంలో సమయం గడిపాడు. అలా ఆటోమొబైల్స్ గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నాడు. ఆ తరువాత మెకానిక్ అయ్యాడు.

కాటన్ మిల్లులో చేరడానికి ముందు కొద్ది రోజులు మెకానిక్‌గా పనిచేసిన నాయుడు, తన స్వీయ అభ్యాసం ద్వారా ఎన్నో నేర్చుకున్నాడు. తన పత్తి వ్యాపారాన్ని బొంబాయిలో విస్తరించడానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు. ఒక ఆటోమొబైల్ కోచ్ కొనుగోలుతో 1920లో తన రవాణా వ్యాపారాన్ని ప్రారంభించాడు. ఆ సమయంలో నాటి పారిశ్రామికవేత్త రాబర్ట్ స్టెయిన్స్, నాయుడు మోటారు కోచ్ కొనడానికి రూ. 4,000/- రుణ సాయం చేశాడు. రాబర్ట్ ఇచ్చిన ధనంతో ఒక చిన్న మోటారు వాహనాన్ని కొనుగోలు చేసి పొల్లాచి, పళనిల మధ్య నడిపాడు. అనతి కాలంలోనే యునైటెడ్ మోటార్ సర్వీస్ (UMS) సంస్థను స్థాపించాడు. 2500 మంది కార్మికులతో అది ఒక పెద్ద సంస్థగా మారింది. ఆరంభమైన కొద్ది సంవత్సరాలకే, దేశంలోనే అత్యంత సమర్థవంతమైన 258 ప్రజా రవాణా వాహనాలను కలిగి ఉండింది. ఆ సంఖ్య తర్వాతి రోజుల్లో 600, 700 దాటింది. అతను టికెట్లు ఇవ్వడానికి ఒక యంత్రాన్ని కనుక్కొని, దానిని తన బస్సుల్లో ఉపయోగించాడు. తాను తన గదిలో ఉండగా, కర్మాగారంలో ఏమి జరుగుతుందో పర్యవేక్షించడానికి ఒక రహస్య పరికరాన్ని రూపొందించుకున్నాడు. తన ఉద్యోగులతో కలిసిమెలిసి తిరుగుతూ వారి సాధక బాధకాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేవాడు.

జి.డి. నాయుడు, డి. బాలసుందరం నాయుడుతో కలిసి భారతదేశపు మొట్టమొదటి స్వదేశీ మోటారును అభివృద్ధి చేశాడు. అది విజయవంతమైంది. ఈ సంస్థ ద్వారా 1937లో భారతదేశపు మొదటి మోటారు వాహనాన్ని తయారు చేశాడు. అది భారతదేశంలో ఉత్పత్తి అయిన మొట్టమొదటి మోటారు. నేషనల్ ఎలక్ట్రిక్ వర్క్స్ అనే జి.డి. నాయుడు కర్మాగారం నుండి ఉత్పత్తి అయింది. ఆ తర్వాత బాలాసుందరం టెక్స్ టూల్, దాని తర్వాత లక్ష్మి మెషిన్ వర్క్స్‌ను ప్రారంభించారు.

నాయుడు రూపొందించిన 'రసెంట్' హీల్‌బ్రాన్ అనే రేజర్, చిన్న మోటారును కలిగి ఉండేది. ఇది డ్రై బ్యాటరీతో పనిచేసేది. నాయుడి ఇతర ఆవిష్కరణలలో అతిసన్నని షేవింగ్ బ్లేడ్లు, ఫిల్మ్ కెమెరాల కోసం దూరాన్ని సర్దుబాటు చేసే లెన్స్, ఫ్రూట్ జ్యూస్ ఎక్స్ ట్రాక్టర్, ట్యాంపర్ ప్రూఫ్ ఓటు-రికార్డింగ్ మెషిన్, కిరోసిన్ నడిచే పంకా (ఫ్యాన్) - ఇలా చాలానే ఉన్నాయి.

1935లో, లండన్లో కింగ్ జార్జ్ V యొక్క అంత్యక్రియలను ఆయన తన కెమెరాతో చిత్రీకరించాడు. జర్మనీలో అడాల్ఫ్ హిట్లర్‌ను కలిశాడు. మహాత్మాగాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్‌వంటి భారతీయ నాయకులను కూడా ఆయన తన కెమెరాతో చిత్రీకరించాడు. నాయుడు 1936 సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేసి ఓడిపోయాడు. అప్పటి నుండి రాజకీయాలకు బయటి వ్యక్తిగా మిగిలిపోయాడు. ఆ కాలంలోనే రోల్స్ రాయిస్ కారు బహుమతిగా పొందిన వ్యక్తి ఆయన. 1937లో భారతదేశంలో మొట్టమొదటి ఎలక్ట్రిక్

మోటారును ఆయన తయారు చేశాడు. నేటికీ ఇది వ్యవసాయానికీ, పరిశ్రమలకూ చాలా సహాయకారిగా ఉంది. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో, ఆయన యూరప్ వెళ్లాడు. అపుడు రేజర్ బ్లేడ్లకి చాలా కొరత ఉండేది. అపుడు నాయుడు ఎలక్ట్రిక్ రేజర్‌కు రూపకల్పన చేశాడు. ఒకసారి చికాగోలోని ఒక విశ్వవిద్యాలయంలో ఆరెంజ్ జ్యూస్‌లో విటమిన్ల గురించి పరిశోధన చేసే ప్రొఫెసర్‌ను కలిశారు. పరిశోధన కోసం, ప్రొఫెసర్ ఒక జ్యూసర్‌ను సిద్ధం చేశాడు. కానీ, నారింజ రసం తయారీలో, నారింజ విత్తనాలు వృధా అవుతున్నాయనీ, రుచి మారుతోందనీ ఆ ప్రొఫెసర్ చెప్పారు. అప్పటికే కొంత కాలంగా దానిపై పరిశోధన చేస్తున్న నాయుడు, తన సింపుల్ కాయిన్ స్ప్రింగ్ ఆలోచనను ఆ ప్రొఫెసర్‌తో పంచుకున్నాడు. అలా పండ్ల రసాన్ని తీసే జ్యూసర్‌ను కనుగొన్నాడాయన. 1936లో జర్మనీలోని లీప్ జిగ్‌లో రేజర్ బ్లేడ్‌ల కోసం జరిగిన ప్రదర్శనలో నాయుడు రూపొందించి ప్రదర్శించిన యు.ఎం.ఎస్. రేజర్ బ్లేడు 3వ బహుమతిని గెల్చుకుంది. సాధారణంగా బంగాళాదుంపపై ఉండే తోలు తీయవడానికి ఎక్కువ సమయం కావాలి. 1940 ప్రాంతాల్లో జి.డి. నాయుడు కనుగొన్న ఒక సాధనంతో ఈ బంగాళాదుంపలపై తోలును వేగంగా, సులభంగా తీసేయడం సుసాధ్యమైంది.

1941లో, భారతదేశంలో 5వాల్వ్ రేడియో సెట్లను కేవలం రూ. 70/- చొప్పున తయారు చేయగల సామర్థ్యం తనకు ఉందని ప్రకటించాడు. 1944లో పారిశ్రామిక వ్యాపకాలకు స్వస్తి చెప్పిన ఆయన పూర్తిగా సంఘసేవకు, బడుగు ప్రజల సేవకు అంకితమయ్యాడు. పేద విద్యార్థులకు పలు ఉపకారవేతనాలు, సంక్షేమ కార్యక్రమాలు, కళాశాలకు దానధర్మాలు చేశాడు. ఆయన ఎన్నో అపురూపమైన సాధనాలను రూపొందించినప్పటికీ, సరైన గుర్తింపు రాలేదు. 1945నాటికి ఆయన రవాణా సంస్థలో 600 బస్సులు ఉండేవి. వాటిని నిర్వహించడానికి శిక్షణ పొందిన మెకానిక్స్ లేకపోతే, నాయుడు అమెరికా వెళ్ళాడు. అక్కడ ఫోర్డ్ జనరల్ మోటార్స్ సందర్శించాడు. అక్కడి మెకానిక్స్ నుంచి ఎలా శిక్షణ ఇవ్వాలో, ఏమి చేయాలో నేర్చుకున్నాడు. వెనక్కి వచ్చిన తర్వాత, ఏ మాత్రం ఆలస్యం చేయకుండా, 1945లో కోయంబత్తూర్‌లో ఒక పాలిటెక్నిక్ ఇనిస్టిట్యూట్‌ను ప్రారంభించాడు. అపుడే కోయంబత్తూరులో తొలి ఇంజనీరింగ్ కళాశాలకు నాంది పలికాడు. నాయుడు చేసిన ప్రయత్నాలకు ఎన్నో విరాళాలు తోడై, భారతదేశపు మొదటి పాలిటెక్నిక్ కళాశాల - ఆర్థర్ హోప్ పాలిటెక్నిక్, తోడుగా ఆర్థర్ హోప్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ స్థాపించబడ్డాయి. నేడు దీనిని ప్రభుత్వ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ (జి.సి.టి.)గా పిలుస్తున్నారు, ఈ కళాశాలకు నాటి మద్రాస్ గవర్నర్ ఆర్థర్ హోప్ పేరు పెట్టాడు. 1945లో జి.డి. నాయుడు ఆ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశాడు. తాను పనిచేసిన నాలుగేళ్ల వ్యవధిలో విద్యార్థుల ఉన్నతికీ, కోర్సులలో మార్పులకీ, కాలేజి అభివృద్ధికీ ఎన్నో సూచనలను చేశాడు. ఏక కాలంలో రెండు కోర్సులు కూడా చేయవచ్చున్నది ఆయన వాదన. కానీ, నాటి బ్రిటిష్ ప్రభుత్వం ఆ సూచనలను పట్టించుకోకపోవడంతో, జి.డి. నాయుడు తన పదవికి రాజీనామా చేశాడు. పాలిటెక్నిక్ కోర్సులు నేర్పడానికి రెండేళ్లు సరిపోతాయని ఆయన సూచించాడు. ఆ తర్వాత రెండు సంస్థలనూ ప్రభుత్వ ఆధ్వర్యానికి ఇచ్చివేశాడు.

ఆ కాలంలో ఉండిన గోడగడియారాలు పనిచేయాలంటే, వాటికి రోజూ కీని ఇవ్వాల్సి వచ్చేది. 1950 ప్రాంతాల్లో నాయుడు రూపొందించిన గోడ గడియారంలో వారంలో కేవలం ఒకసారి కీ ఇచ్చే వెసులుబాటు కలిగింది. నాయుడు తన యు.ఎం.ఎస్. ఫ్యాక్టరీలో రేడియోగ్రామ్‌ను తయారు చేశాడు. ఇది 6 కవాటాలు, 4 బ్యాండ్లు, 4 స్పీకర్లు కలిగి ఉండేది. ఇందులో ఒకసారికి 10 గ్రామఫోన్ రికార్డులను భర్తీ చేయవచ్చు. అలాంటి సదుపాయాలతో నాయుడు భారతదేశంలో మొదటిసారిగా రేడియోగ్రామ్‌ను ప్రవేశపెట్టాడు. ఆ తర్వాత రకరకాల రేడియోగ్రామ్‌లను భారత దేశానికి పరిచయం చేశాడు. తమిళంలో

డయలింగ్ రేడియోను తొలిసారిగా పరిచయం చేసింది ఆయనే. అంతే కాదు, కాలిక్యులేటర్, బ్లేడ్, ఆటోమేటెడ్ టికెటింగ్ మెషీన్‌ను జిడి నాయుడు ఆవిష్కరణలతో చేర్చవచ్చు. భవనాలను బలోపేతం చేయడానికి 1950లో సిమెంట్ మిశ్రమాన్ని సృష్టించాడు. భవనాలకు మరింత బలం చేకూర్చే ఈ మిశ్రమానికి మంచి ఆదరణ లభించింది. పేద ప్రజలందరికీ తలా ఒక స్వంత ఇల్లు ఉండాలన్నది ఆయన స్వప్నం. 1950లో దీని కోసం ఒక పథకానికి రూపకల్పన చేశాడు. రాత్రిపూట ఈ ఇళ్లను నిర్మించే ప్రణాళికను కూడా ఆయన రూపొందించాడు.

1952లో, రెండు సీట్ల పెట్రోల్ ఇంజిన్ కారు కేవలం రూ. 2,000/- ఖర్చుతో రూపొందించి విడుదల చేసినా, దానికి అవసరమైన లైసెన్స్ ఇవ్వడానికి నాటి ప్రభుత్వం నిరాకరించడంతో దాని ఉత్పత్తి ఆగిపోయింది. కేవలం యంత్రాలకు మాత్రమే అతని ఆవిష్కరణలు పరిమితం కాలేదు. తన మూలాలను మరచిపోకుండా, నాయుడు వ్యవసాయ కార్యకలాపాలలో కూడా చురుకుగా పాల్గొనేవాడు. ఆయన పది అడుగుల ఎత్తైన పత్తి మొక్కలను పెంచాడు. అలాగే, ప్రత్తి, మొక్కజొన్న, బొప్పాయిలలో పరిశోధించి కొత్త రకాలను ప్రవేశపెట్టాడు. అలా హైబ్రిడ్ సాగుపై పరిశోధన కూడా చేశాడు. ఆయన వ్యవసాయ క్షేత్రాన్ని సర్ సి.వి. రామన్, విశ్వేశ్వరయ్యలు సందర్శించారు. ఉదయం 6 గంటలకు పునాది వేసి సాయంత్రం 5 గంటలకెల్లా, అంటే కేవలం 11 గంటల్లో ఇల్లు నిర్మించవచ్చని స్వయంగా ఇల్లు నిర్మించి చూపాడు. ఇది ఏ గిన్నీసు బుక్కుల్లోనూ రికార్డు కాలేదు.

1967లో ఆయన జి.డి. నాయుడు పారిశ్రామిక ప్రదర్శన ప్రారంభించాడు. ఇది ప్రతి ఏడూ సందర్శకులను విశేషంగా ఆకర్షించేది. జిడి టెక్నికల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, జి.డి. నాయుడు ఛారిటీస్, ఇండస్ట్రియల్ లేబర్ వెల్ ఫేర్ అసోసియేషన్, గవర్నమెంట్ కాలేజీ ఆఫ్ టెక్నాలజీ, గవర్నమెంట్ కాలేజీ ఆఫ్ కోయంబత్తూరు ఆయన స్థాపించిన సంస్థలలో మరికొన్ని. ఆయన ఇంజనీరింగ్, తయారీ రంగాలలో ఎందరికో ఉపాధిని కల్పించాడు. మరెందరెందరికో మార్గదర్శకుడైనాడు. సమాజంలోని అణగారిన వర్గాలకు పరిశోధన స్కాలర్‌షిప్‌లు, సంక్షేమ పథకాలకు నిధులతో సహా అనేక దాతృత్వ చర్యలను చేపట్టాడు. అటువంటి బహుముఖ ప్రజ్ఞాశాలియైన జి.డి. నాయుడు 1974 జనవరి 4వ తేదీన మరణించాడు.

జి.డి. నాయుడు గొప్పతనం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆయన చేసిన ఆవిష్కారాలకు ఎన్నో నోబెల్ బహుమతులు ఆయనకు దక్కాల్సింది. భారతీయుడైనందున, కనీసం ఒక్కటి కూడా దక్కలేదు. అంతెందుకు, ఆయన తయారు చేసిన రెండు సీట్ల కారుకే కాదు మరెన్నో ఆవిష్కారాలు ప్రజల్లోకి వ్యాపారాత్మకంగా రావడానికి నాటి ప్రభుత్వం అనుమతినీయలేదు. నాయుడు తయారు చేసిన పరికరాలు, పనిముట్లు, కోయంబత్తూరులోని జి.డి. నాయుడు ప్రదర్శనశాలలో ఇప్పటికీ ఉన్నాయి.

ప్రస్తుతం ఆయన కుమారుడు జి.డి. గోపాల్, మనవడు జి.డి. రాజ్‌కుమార్, మనవరాలు శాంతిని ఉన్నారు. కోయంబత్తూరులోని జి.డి. మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ స్కూల్ జి.డి. నాయుడు పేరు మీద ఉంది. దీనిని గోపాల్ సతీమణియైన చంద్ర నిర్వహిస్తున్నారు. మనవడు జి.డి. రాజ్‌కుమార్ ఇప్పుడు జీడీ ఇండస్ట్రీస్‌ను నడుపుతున్నారు.

సి.వి. రామన్ మాటలలో చెప్పాలంటే, ఒక గొప్ప విద్యావేత్త, ఇంజనీరింగ్, పరిశ్రమలలో అనేక రంగాలలో ఒక వ్యవస్థాపకుడు, తన సహచరులపై ప్రేమతో నిండిన హృదయపూర్వక వ్యక్తి, కష్టాలతో ఉండే వారికి సహాయం చేయాలనే కోరిక ఉండేవాళ్లు ఏ కోటిమందిలో ఒక్కరుంటారు. జి.డి. నాయుడు అలాంటి వ్యక్తి. నాయుడు భావితరాలవారందరికీ ప్రేరణగా ఉంటాడు. ఇటువంటి బహుముఖ ప్రజ్ఞాశాలి ఈ కాలంలో అరుదు.

---

డా. వి.వి. వేంకట రమణ, ఫోన్: 944 123 4429.

# రఘునాథ నాయకుడు

– అమినేని సిద్దయ్య నాయుడు

దక్షిణ భారతదేశ చరిత్రలో ధృవతారలా చరిత్ర పుటల్లో నిలచి, చెరగిపోని స్థానాన్ని ఆర్జించుకొని, వైభవోపేతంగా ఒక్క వెలుగు వెలిగినది విజయనగర సామ్రాజ్యం. హరిహరబుక్కరాయలచే స్థాపించంబడి, కాలక్రమేణ ఆనాటి ముహూర్త బలంతో బలపడి శ్రీకృష్ణదేవరాయల కాలంనాటికి పరాకాష్టనధిరోహించి అజరామర కీర్తి గడించినది. అనేక కవులకు, కళాకారులకు, నాట్య కళావిదులకు, శిల్పాచార్యులకు పాదుగా నిలిచి, వారి-వారి రంగాలలో నైపుణ్యాభివృద్ధికి తోడ్పడి, తీగలు తీగలుగా విస్తరించి, దేశ-విదేశాలలో తన ఉనికిని వ్యాప్తి గావించినది. ఆనాటి ఏలికల ఆదరణ ఆయా కళల పెరుగుదలకు పాదు చేసి నీరు పెట్టింది. సాహితీవేత్తలకు, లలితకళాభిమానులకదొక సుందర స్వప్నంగా నిలిచిపోయింది. సర్వకళలూ, ఆదరాభిమానాలు పొంది దేశవిదేశాలలో ఖ్యాతిగాంచినది. ప్రజలు సుఖశాంతులతో, సుభిక్షంగా మనుగడ సాగిస్తుండగా రాజులు అలజడులను, తిరుగుబాట్లను నిర్దాక్షిణ్యంగా అణచి సమర్థవంతంగా వాటి పని పట్టేవారు. రసజ్ఞులైన కళాభిమానులు, మనసున్న మారాజులున్నప్పుడు ఆనాటి లలిత కళా వైభవం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విస్తరిల్లి నభూతో న భవిష్యత్‌లా కళా చరిత్రలో పదికాలాల పాటు పదిలంగా నిలిచింది. ఆనాటి చక్రవర్తుల కీర్తి ఉజ్వల తారకల్లాగ వెలుగొందుచుండగా విదేశీ యాత్రికులు సైతం నోరేళ్ళబెట్టుకొని సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయి, "అయ్యారే! ఎక్కడా ఇంతటి వైభవాన్ని కాంచి ఎరుగమ"ని తమ-తమ రాతల్లో ప్రపంచానికి వెల్లడించారు. రత్నాలు రాసులుగా పోసి అమ్మినారని వారు చాటించారు. కాలవశాన కొంత కాలానికి అంతటి విజయనగర సామ్రాజ్యం పతనమై చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. ముష్కరుల మూర్ఖత్వానికి శిల్ప కళ చెదిరిపోయింది. కవులు, కళాకారులు దిక్కుతోచక, దిక్కులేక, ఆదరించి అక్కున చేర్చుకునే నాథుడు లేక - పుట్టకొకరు - గుట్టకొకరు చెల్లాచెదురై - పక్షుల్లాగా ఎగిరిపోయారు. స్వాతి చినుకులకై ఎదురు తెన్నులు చూసే ముత్యపు చిప్పల్లా, తగిన అదను కొరకు గంపెడాశతో ఎక్కడెక్కడా అని ఎదురు తెన్నులు చూస్తూ జీవితాన్ని నెట్టుకొస్తున్నారు.



రఘునాథ నాయకుడు

కొంతకాలానికి నాయక రాజుల రూపంలో వారికి ఒక ఆశల హరివిల్లు గోచరించి, తమకు ఒక ఆసరా, ఆలంబన దొరికాయని సంబరపడ్డారు. తంజావూరు, మధురనేలిన నాయక రాజులు వారికొక వేగుచుక్కై ఆలంబన ఆశగా గోచరించారు. ఆ రాజ వీరులు మనస్సున్న మంచి మారాజులు. చల్లని నీడనిచ్చే తరువుల్లాంటి. వారు తమకుగల కళలపై మక్కువను కార్యరూపంలో చూపించ సాగించారు. ఆ నాటి పాలకుల పాలనలో అలజడులు, తిరుగుబాటులు తక్కువగా ఉన్నందువలన ప్రజలు, రాజులు ప్రశాంత వాతావరణంలో మనుగడ కొనసాగిస్తుండగా, కళల వికాసానికి సానుకూల వాతావరణం ఏర్పడినది. అక్కడక్కడ - అప్పుడప్పుడు పొడచూపుతున్న తిరుగుబాట్లను తమ-తమ అనుభవ సామర్థ్యంలో, తిరుగులేని పరాక్ర - విక్రయాలతో మొగ్గలోనే త్రుంచి శాంతిభద్రతలను అదుపు తప్పకుండా కాపాడేవారు. ఆనాడు దేశమంతటా తురుష్కుల అలజడుల ముప్పు పొంచి ఉంది. కానీ దక్షిణాదిన ముఖ్యంగా తమిళనాట చాలా తక్కువనే చెప్పాలి. కానీ వారి ప్రోద్బలంతో చెలరేగే తిరుగుబాట్లను తమ సహజ భుజ బల పరాక్రమంలో అణగద్రొక్కేవారు. అట్టి నాయక రాజులలో తంజావూరును పాలించిన రఘునాథ నాయకుడు చరిత్ర పుటల్లో తెలుగు ఖ్యాతిని చిరస్థాయిగా నిలిపినాడు. ఇతడు స్వయంగా కవియై

కవులను, పండితులను ఆదరించి తన సకల విద్యాగోష్ఠులతో సరస్వతీదేవికి రంగస్థలాన్ని సమకూర్చి, ఆ అమ్మ కరుణ కటాక్షాలు సమృద్ధిగా పొందినాడు. రాయల యుగమున ప్రారంభమైన ప్రబంధ రచన తంజావూరు రాజుల కాలమునకు ప్రబలమై వేళ్లూనుకుని శృంగార ప్రధాన ప్రబంధ యుగానికి పరిణమించి తెలుగుతనానికి వన్నె చిన్నెలద్ది మధుర తరములగు కావ్య విశేషములకు దారితీసింది. రఘునాథ నృపాలుని కాలమున సంస్కృతాంధ్ర వాంఙ్మయము అభివృద్ధి పదంలో పరుగు పెట్టింది. సమగ్ర సంగీత సాహిత్యాలకు సముచిత స్థానాన్ని సంపాదించుకున్నవి.

చక్రవర్తి బలపరాక్రమశాలియై కవి, పండిత పోషకుడై, అనేక కావ్య ప్రబంధములకు కృతికర్తయై కీర్తినందించాడు. ఇతని యశస్సును దశదిశలా, ఊరువాడలా ప్రాకి అనేక ప్రదేశముల నుండి కవులు, కళాకారులు తమ-తమ ప్రతిభా-పాటవాల ప్రదర్శనకు వలసబాట పట్టారు. ముఖ్యంగా తెలుగు నడి గడ్డ నుండి తంజావూరు బాట పట్టినారు. తండ్రి అచ్యుతప్ప నాయకుని కాలమున 'రమానటీ నర్తన రంగశాల' సరస్వతీదేవి విలాసమున కాలవాలమై వెలుగొందినది. తండ్రి మార్గంలో కుమారుడు పారిజాతాపహరణ ప్రబంధం యామద్వయమున చెప్పగా వ్రాయసగాండ్రకు వ్రాయడానికి మిక్కిలి శ్రమ కలిగినదని చెప్పెడివారు. ఇతని రచనలన్నీ అవతార మూర్తి శ్రీ రామచంద్రుడాదిగాగల దశావతార స్తోత్రముతో ప్రారంభమగుచున్నవి. ఇతడు తోపూరు యుద్ధమున ప్రబల శత్రువులనణచి వేసిన తదుపరి పదునైదు వత్సరములు విశ్రాంతిగా ప్రశాంత వాతావరణంలో రాజ్యపాలన చేసినట్లు చరిత్ర వెల్లడించుచున్నది. ఆ సమయమున అతని దృష్టి కళలపై మరలినది. కవులు, పండితులు, కవయిత్రులు, గాయకులు, గాయకీమణులతోపాటు నాట్యమున ఆరితేరినవారిని చేరదీసి, సత్కరించి కీర్తి గడించారు. ఆనాడు చంద్రగిరి రాజ్యమున ఖ్యాతి గడించిన విదుషీమణి మధురవాణి యొక్క ప్రతిభా పాటవాల గురించి విని ఉన్నాడు. నాట్యాభినయనమందేకాక, మధుర గాయని, విశేషించి కవనమునల్లుటలో దిట్ట. ఇటువంటివారు అరుదుగా ఉంటారని భావించి, ఆమె విధించిన షరతులన్నీ ఒప్పుకొని, బేషరతుగా తన ఆస్థానానికి సగౌరవముగా రప్పించుకున్నాడంటే కళలపై అతనికున్న మక్కువ తేటతెల్లమవుతున్నది. ఆమెను తన పట్టమహిషితో సమానంగా గౌరవిస్తానని, ఆమె గౌరవానికి లోటుపాట్లు కలగకుండా కాపాడుతానని మాట ఇచ్చినాడంటే ఆమె ఎటువంటి విదుషీమణో ఇట్టే తేలిపోతుంది.

నాయక రాజుల కాలమున మహిళా లోకంలో అణగి ఉన్న సాహిత్యోపాసనను బయటకు తీసి, చిగురింప చేసి, వారి ద్వారా కావ్యాలు సృష్టింప చేశాడు. వారు కూడా తమ-తమ కవితా సామర్థ్యాలలో కవనాలలల్లి ఔరా అనిపించి, 'ముదితల్ నేర్వగ లేని విద్యగలదే ముద్దాడ నేర్పించినన్' అనే నానుడికి సార్ధకతను ఆపాదించారు. ఆనాటి కవితకు వన్నె పెట్టిన వారిలో రంగాజమ్మ, ముద్దుపళని, మధురవాణి, రామభద్రాంబలాంటి వారెందరో. విజయనగర కాలములో లేనిదీ, నాయకరాజుల కాలమునకు పరిణతి చెందినదీ ఇదే. ఒక్కొక్క విదుషీమణి తమ-తమ కవితా సామర్థ్యంతో రసజ్ఞులను మెప్పించి, మగమహారాజుల సరసన ధాటిగా - ధీటుగా నిలిచే సరికి, మగ మహారాజులు తబ్బిబ్బై తట్టుకోలేక ఈర్ష్యాద్వేషాలతో, అహంకారముతో, తర్వాతి రోజుల్లో వారి గ్రంథాలు అశ్లీలంగా ఉన్నాయనే కుటిల, కుంటి సాకులతో, కుతంత్రాలు పన్ని నిషేధింపజేసే స్థాయికి వెళ్లారంటే వారి నైజాన్ని అర్థం చేసుకోవచ్చు. వారికంటే ఎక్కువగా, అశ్లీలంగా వ్రాసిన మన గొప్ప కవులనేవారి సంగతి ఏమిటో! ఆడవారనే చులకనబుద్ధితో మగవాళ్ళమనే గర్వాంధులైన కొందరు ప్రబుద్ధులు భావితరాల్లో జరగబోయే పరిణామాలను కాంచలేని అంధులు.

రామభద్రాంబ, మధురవాణి ఆదిగాగల కవయిత్రులు రఘునాథుని ఆస్థానానికి అలంకార ప్రాయమై వన్నెలద్దారు. సంస్కృత, తెలుగు భాషల్లో అత్యంత సుందర సురుచిత ప్రబంధాలను రచించి, చిర యశస్సులైనారు. మధురవాణి గురువు రఘునాథ

నాయకుడు. ఆమె కవితా మాధుర్యానికి కారకుడేకాక ఆమెకు ఆ పేరునిడుటకు కారకుడితడే. ఆమె గొప్ప నాట్యగత్తె. గజ్జ కట్టిందంటే సభ మంత్రముగ్ధమౌతుంది.

రఘునాథ నాయకుడు రచించిన నాలుగు ఆశ్వాసముల రామాయణములు మూడు ఆశ్వాసములతో లభ్యమగుచున్నది. మిగిలినది శిథిలమైన. సంగీత వీడ్కోలు ఇతని పాండిత్యము, అద్వితీయము, యజ్ఞనారాయణుని 'సాహిత్య రత్నాకరము'లోని ఆరవ సర్గ ఇందులకు సాక్ష్యము. ఇతడు 'జయంతసేన' ఆదిగాగల రాగమునకు కర్తగా నిలిచియున్నాడు. ఆనాటి వీణవాద్యమును మెరుగుపరచి, తాను తయారు చేసిన వీణపై ప్రతిరాగమును దానిపై స్పష్టపరచి ఆనాటి వైణికుల మెప్పించే రఘునాథ భూపాలుని కవిత్వము మృదు మాధుర్య గుణైక ప్రధానమని విమర్శకుల ప్రశంసలందినది. సంగీత సంబంధిత గ్రంథములలో 'సంగీత సుధ', 'భారత సుధ'యను గ్రంథములను రచించి, సంగీతములోని తన ప్రతిభను వెల్లడించినాడు. మహాభారత తాత్పర్య సంగ్రహమనే కావ్యాన్ని రచించినాడని తెలియుచున్నది. ఇంకనూ, పారిజాతాపహరణము, గజేంద్ర మోక్షము, రుక్మిణి కృష్ణ వివాహమును యక్షగానము, అచ్యుతాభ్యుదయము, శృంగార సావిత్రి, నల చరిత్ర, రఘునాథ రామాయణము ఇతనిచే రచింపబడినవి.

ఈతని కవిత్వము ధారాశుద్ధి కలిగి ద్రాక్షాపాకమున నల్లేరు మీద బండిలా సాఫీగా సాగిపోతూ, ఉదాత్తములగు భావనలలో, శయ్యారీతుల కూడి ఉన్నదని తన ఆస్థాన కవి, శ్లేషలో చమత్కారము పలికించిన చేమకూర వెంకట కవి శ్లాఘించి యున్నారు. వెంకట కవి రచన విజయవిలాసము 'క్షితిలో నీ మార్గమెవరికిన్ రాదు సుమీ' అని 'చక్కెర మడిలో అమృతము పారించి, పండించిన చేమకూర 'యనీ పండితులు, కవులు, విమర్శకులు, అసాధారణముగ ప్రశంసించిన కవి శేఖరుడు చేమకూర. కాగా మధురోదాత్తము, రసవ్యంజకమగు భావసంపద, కవితకు ప్రాణప్రదమైనది. ఇదే కావ్యమును కాంతా సమ్మితమొనర్చును. రఘునాథుని కవితా కథనంలో అలంకారములు, భావములు, వృత్తులు, శయ్యాదిగాగలవి చక్కగా ఒదిగిపోయినవి. వ్యంగ స్వరూపములగు అలంకారమునకొక చక్కని ఉదాహరణ.

*సొగసైన నా మోము జోడగల్గిన జాలు*
*గలువ తీడున్నాడు కడయకెల్ల*
*నునుదాలి యూర్పు మూర్కొన గల్గిన జాలు*
*బవమానుడున్నవాడవలి కెల్ల*
*గళకు జొపులెఱుంగ గల్గిన జాలు*
*గొని రూపులున్నవి కొదవకెల్లి*
*నింపు బల్కుల నాలకింపగల్గిన జాలు*
*జిలుకచాలున్నది వెతికికెల్ల*
*ననుచు దలపోసి... - శృంగార సావిత్రి*

వస్తువుచే నలంకార ధ్వనికిని, కవి ప్రౌఢోక్తి మూలక ధ్వనికి ఇంతటి సొగసైన ఉదాహరణ కవులలో అరుదుగా కనిపిస్తుంది.

*ఈ కాంత చివురు మోవి సుమంత చవిగొన్న*
*నమరేంద్రుని తోడ బోరాడ రాదె*
*ఈ బోటి చురుకు జూపే పాట బారిన*
*నించు విల్తునిగలహించరాదె*
*ఈ చాన తేట పల్కే మైన దొరకిన*
*బ్రహ్మతోడను వాదు పెట్టరాదె*
*ఈ కమ పసిడి మే నెద నూన గల్గిన*
*హరికి గోలారిక నుంచరాదే (శృంగార సావిత్రి - ఆ.1)*

ఇచట వ్యంగ్యములకు రూపకాతిశయోక్త్యాదులైన అలంకారముల ఆస్వాదించుట రసికుల లక్షణము. ఈ సరస కవిని అతని ఆస్థాన కవి వసంతమగు చేమకూర కవి-

*తారస పుష్టిమై ప్రతిపదంబున్ / జాతియు వార్తయుం జమ*
*త్కారము నర్థగౌరవముగల్గననేక కృతుల్ ప్రసన్నగం*
*భీర గతిన్ రచించి మహిమించినచో నిక నన్యులెవ్వర యా*
*రీ! రఘునాథ భూపరసికా గ్రణికిం జెవిసోక చెప్పగన్*

అని శ్లాఘించినాడు.

రఘునాథుని కొలువు కూటమంతా సాహిత్యమయము. వాతావరణమంతా లలిత కళాభరితము. సదస్యులంతా అనేక శాస్త్ర పారంగతులు, మహావిద్వాంసులు.

సాధారణ ప్రతిభగల కవిగాని, గాయకుడుగాని ఆ సభాప్రాంగణమున నిలదొక్కుకొని నిలువగలేడు. తీవ్ర విమర్శలకు గురికాక తప్పదు. కావుననే కవి చౌడప్పలాంటి-

*నేరుతునని మాటాడగా*
*వారిజభవునంత వానవసమేతంజా*
*వూరి రఘునాథ నాయకుని*
*గారి సభను కుందవరపు కవి చౌడప్పా*
*అని అన్నాడంటే ఇక చెప్పవలసినదేమున్నది.*

రఘునాథుని అలంకార ప్రయోగాలలో స్వభావోక్తికి మచ్చుతునక. ఇది శృంగార సావిత్రి కావ్యములోనిది.

*ప్రొద్దున తచితాబసుపు పూసుక కుంకుమ బొట్టు దీర్చియా*
*పెద్దలకెల్ల కైమ్రొక్కి దన పెనిమిటికిం పరిచర్య చేయగా*
*బ్రొద్దొక జాము సాగుటయు బోటిని బిల్చి ప్రియంబు తోడనిన్*
*వద్దన లేము చాలు నుపవాసము పారణ సేయుమింకిటన్*

రఘునాథ రామాయణములోని కవిత్వానికి శృంగార సావిత్రి కవనాన్ని పరిశీలిస్తే చాలు దగ్గరి పోలికలు గోచరిస్తాయి. సావిత్రి ఇతివృత్తము మహాభారతములోని అరణ్య పర్వమున మార్కండేయుడు ధర్మరాజుకు ఈ కథను వినిపించాడు. సావిత్రి కథ సహజముగ కరుణ, శాంతరసముల ప్రధానమైనది. కానీ ఈ కవి శృంగార రసాన్ని ప్రధానముగా చేసుకొని, తన కల్పనా చాతుర్య ప్రతిభా పాండిత్యముతో చాతుర్యంతో తనదైన శైలిలో ఈ ప్రబంధ రాజాన్ని సృష్టించాడు. హాస్యరసమునకు కూడా ఇందు చోటు కల్పింపబడి, చక్కగా పోషింపబడినది. ఆ కాలము నాటి సాంఘిక ఆచారాలు, కట్టుబాట్లు ఇందు చొప్పించబడినవి సందర్భానుసారముగా. అప్పటి వేశ్యావినోదము, క్రీడా వినోదములు, ఇందు కనిపిస్తాయి. రాజుల ఆస్థానంలోని సభామర్యాదలు, ఆనాటి సాంప్రదాయాది కట్టుబొట్లు తంజావూరు యొక్క సౌభాగ్యము, కవితా గోష్టులు ఇందు చక్కగా గోచరిస్తాయి. ఆనాడు అమలులో ఉన్న రాచరికపు అలవాట్లు, ఆచరణలో ఉన్న అంశాలు, అశ్వపతి రాజరిక వర్ణనలో చొప్పింపబడి సమగ్రముగా వర్ణింపబడినవి. సత్యవంతుడు నారదుని కడ విద్యాభ్యాస మొనరించుచున్నప్పుడు కవిత్వము, సంగీతము, విద్యలలోని మెళకువలు వివరించబడినవి. ఈ భూపాలునిచే రచింపబడిన వాల్మీకి చరితము సమగ్రముగా లభించిన గ్రంథము. తన ఇష్ట దైవమయిన శ్రీరామచంద్రుని ఆజ్ఞమేరకు ఈ గ్రంథం రచించినటుల చెప్పుకున్నాడు. ఇందులోని ఈయన ప్రయోగాలు, ఈతని వ్యాకరణ విజ్ఞానమునకు నిదర్శనము.

ఈ వాల్మీకి చరిత్ర వాశిష్ఠ రామాయణములోని ధర్మకండమందును, భర్తవిజయమునందును కనిపించును. జన్మతః కిరాతకుడైన వాల్మీకి, (దారి) దోపిడీ వృత్తియందుండి అందులో భాగంగా సప్తర్షులను బాధించుట మూలంగా పూర్వ పుణ్యము వలన వారి అనుగ్రహ ప్రాప్తిచే మంత్రోపదేశాన్ని పొంది తద్వారా శ్రీరామ సాక్షాత్కారమును పొందెను. తద్వారా శ్రీమద్రామాయణ కావ్య రచనకు పూనుకొనుట లోక విదితమే.

పై విషయాన్నే తన కావ్యానికి వస్తువుగా గ్రహించి, రాజు కావ్యమునల్లినాడు. మూలకథకు కూర్పులు, చేర్పులు చేర్చి, మెరుగులు దిద్ది, ప్రబంధీకరించి తన నైపుణ్యాన్ని లోకానికి విదిత పరిచినాడు.

పాలకడలిలో శ్రీమహావిష్ణువును దర్శించుకొని తిరిగి వచ్చుచూ అనేక పుణ్యక్షేత్రాలను, తీర్థాలను సేవించుకొని వచ్చుచున్న నారదునికి, వాల్మీకి తటస్థ పడతాడు. ఈ చిన్న కథను తీసుకొని ఒక బృహత్తర ప్రబంధాన్ని నిర్మించడం ఈతని కల్పన చమత్కృతికి నిదర్శనం. ఇందు మూడవ అశ్వాసమునందు రంభ, ఊర్వసుల వివాద ప్రసంగములు, వర్ణించిన నాట్య విభేద వర్ణన ఇతని కల్పితమే. ఇందు ఇతని నాట్యశాస్త్ర ప్రతిభా పాండిత్య విశేషాలు వెల్లడియగుచున్నవి.

ఈ రఘునాథ నాయకుడు విజయనగర సామ్రాజ్యమునేలిన శ్రీకృష్ణదేవరాయల తరువాత మరలానంతటి రాజ కీర్తిని గడించి, అజరామరుడైనాడు.

అమినేని సిద్ధయ్య నాయుడు
రాజాం, కడప. ఫోన్: 911 059 9227.

# నిశ్శబ్దం

– *దామెర వేంకటరావు*

*వేరులో నుండి కొమ్మలు వెలసినట్లు*
*అన్ని శబ్దాలు నిశ్శబ్దమందే పుట్టె* అన్నాడు గాలిబ్ దాశరథి తెలుగు కలంలోంచి. నిజమే కదా! నిశ్శబ్దం అన్ని శబ్దాలకు జన్మస్థానమే కదా! విశ్వమంతా ఆక్రమించేది నిశ్శబ్ద వామనరూపం. అనంతకాల గమనం నిశ్శబ్దంగా సాగిపోతూ ఉంటుంది. నిన్న, నేడు, రేపుల చక్రాన్ని నిలువరించడం ఎవరితరం! కాలం అమూర్తం. ఆకాశమంతా ఆవరించి, రసమయ జగత్తులో రమిస్తున్న కాలం ఓ నిశ్శబ్ద ఇంద్రజాలం. నిశ్శబ్దం నిరాకారం, నిర్గుణం. అంతటా ఆవరించిన నిశ్శబ్దాన్ని కనే, వినే శక్తి భౌతిక చక్షుశ్రవణేంద్రియాలు అనుకుంటుందా?

సృష్టి, స్థితి, లయలు నిశ్శబ్దంగా జరిగిపోతుంటాయి. గర్భస్థ జీవి రూపకల్పన, పెరకువ, ఆవిర్భావం అంతా నిశ్శబ్దంగానే జరుగుతుంది. అప్పుడు కదా నిశ్శబ్దంలోంచి శబ్దం పుడుతుంది. సృష్టిలోని ప్రతి వస్తువునూ నియంత్రించేది నిశ్శబ్దమే. అనాది నుండి మానవుడి క్రమ వికసన నిశ్శబ్దంగానే జరిగింది. ఏ మహాశక్తి దోహదం చేసిందో, ఎలా చేసిందో ఊహకందనిది. హేతువుకు చిక్కనిది. చేతనలోంచి స్వప్నంలోకి, అందులోంచి సుషుప్తిలోనికి, అంతిమంగా తురీయావస్థలోనికి, నిశ్శబ్దంగా నడిపించుకుపోయేది, తిరిగి స్వస్థానానికి చేర్చేది నిశ్శబ్ద క్రియే. తురీయమే పరిపూర్ణ శాంతి సాగరం.

గ్రహతారకల గమనం, భ్రమణం నిశ్శబ్దమే. భూభ్రమణం వినిపించదు. కనిపించదు. అనిపించదు. సూర్యోదయం, అస్తమయం, చంద్రుని వృద్ధి క్షయాలు, వెలుగు చీకట్లు, ఎండావానల తాపాలు, శాపాలు, శిశిర వసంతాల ఋతుశోభలు, ఏ సవ్వడీ లేకుండా వడివడిగా కదిలిపోతుంటాయి. ఇదంతా నిశ్శబ్ద ప్రక్రియే కదా! మహార్ణవాలలోంచి మాటా, పలుకూ లేకుండా గగనతలానికి ఎగసిపోతుంది ఆవిరి రూపంలో జలసిరి. తిరిగి శరాలలా, వరాలలా కురుస్తుంది. ఈ పరిభ్రమణంలో శబ్దం కొంత వినిపించినా, దాని మాతృస్థానం నిశ్శబ్దమే !

అందమైన విరులను వికసింపజేసేది, కనిపించకుండా, నిశ్శబ్దంగా కురిసే ప్రశాంత తుషారమే కదా. పూల గిన్నెల్లో మధువు నింపడం, కసరు కాయ మధుర ఫలంగా మారటం, మొక్క మౌనంగా ఎదిగి మహావృక్షం కావడం మనకు కనరాని, వినలేని మహానిశ్శబ్ద మంత్రం. విజయానికి ఖచ్చితమైన భరోసా నిదానపు పెరకువ. మంచి పండు కావాలంటే సూర్యరశ్మితో బాటు, వాన తడిలో నిదానంగా పక్వానికి రావాలి. ఇదంతా నిశ్శబ్ద ప్రక్రియ. ప్రశాంతతని చేకూర్చే ఈ నిశ్శబ్దమే కొంత మందిని భయభ్రాంతులని చేస్తుంది. "ఈ అనంత రోదసిలోని అంతేలేని నిశ్శబ్దం, నన్ను భయంతో నింపేస్తుంది" అంటాడు పాస్కల్. "నేనింకా ఇంకా సముద్రయానం చేస్తూనే ఉన్నాను. ప్రశాంత ద్వీపం ఎక్కడుంది ప్రభూ!" అని ఆక్రోశిస్తాడు కలాం. సాగరం విరామం లేక నిరంతరం పలికేది అనంత విశ్వంలో ధ్వనించే సమాధానం లేని ప్రశ్న. అంబరం సమాధానం అర్థంకాని నిశ్శబ్దం. అదే అమృతత్వం. సాగర ప్రశాంతత దాని అలల అలజడిలోనే ఉన్నది. అవమానాలకి, అవహేళనలకి నిశ్శబ్దపు దరహాసమే సరియైన సమాధానం. కాంతిని చూస్తాం. దానిది నిశ్శబ్ద ప్రయాణం. వేడి వెలుగూ, చల్లని వెన్నెలా, కటిక చీకటి

అన్నీ నిశ్శబ్దంగా ప్రవేశించి, జీవితాన్ని ఆనంద విషాదాల తెరలతో కప్పివేసి, అంతే నిశ్శబ్దంగా నిష్క్రమిస్తాయి తిరిగి రావడానికి. సప్త వర్ణాల సమాహారం ఇంద్రధనుస్సు నిశ్శబ్దంగా ఏర్పడుతుంది. ఏడు రంగుల సమ్మేళన శ్వేత కారణం నిశ్శబ్ద చేతన. ఉషాబాల కపోలకాంతి నిశ్శబ్ద చైతన్యం.

జననం, మరణం జీవిత ప్రవాహానికి ఇరుగట్లు. అవి నిశ్శబ్దతనే పాటిస్తాయి. ప్రవాహం మాత్రం కొంత సందడి చేస్తుంది. "ఈ జీవితంలోకి మనం ఎక్కణ్ణించి, ఎలా ప్రవేశించామో, ఆ మూల స్థానానికి తిరిగి తరలిపోతాం. అదే సృష్టి శక్తిస్థానం. అదే మృత్యుస్థానం. కనుక, మృత్యువు ఓ నిశ్శబ్దవరం" అంటాడు టాల్‌స్టాయ్.

ఏకాంతంలో, ఒంటరితనంలో నిశ్శబ్దపు సంకేతాలందుతాయి. కాని ఏకాంతానికి, ఒంటరితనానికి మధ్య గల భేదం మనం గ్రహించాలి. మనం మనసారా కోరుకునేది ఏకాంతం. మనపై బలవంతంగా రుద్దబడేది ఒంటరితనం. ప్రాపంచిక కార్యకలాపాలకి దూరంగా నీలో నువ్వు అనుభూతుల ప్రసారం జరుపుకునేది ఏకాంతంలో. విషాదానికి, వేదనకి గురిచేసేది ఒంటరితనం. నిశ్శబ్దపు భాష అవ్యక్తం. నిశ్శబ్దం ఒక మౌన ప్రవక్త. నిశ్శబ్దంలో సత్యవాణి గుండెచప్పుడు వినిపిస్తుంది.

అంతర్ముఖుడైన మనిషి ఆలోచనల లోచనాలు విప్పుతాడు. మానసిక మౌనంతో, స్వానుభవంతో, సహానుభూతితో భవిష్యద్దర్శనం చేస్తాడు. మౌనంతో స్వచ్ఛమైన సర్వోన్నతమైన కాలపు నడవల ద్వారా నిశ్శబ్దంగా ప్రతిధ్వనించే కవి గాయకుల, జ్ఞానుల అడుగుల సవ్వడిని వింటాడు. దానికి తన మనసు, మేథస్సు చేసిన నిశ్శబ్ద స్వరాభిషేకంతో, మాధుర్యపు సొగసులద్దుతాడు. లోకానికందిస్తాడు. "నేను ప్రార్థన చేసేటపుడు దైవంతో మాట్లాడుతాను. అధ్యయనం చేసేటపుడు దైవం నాతో మాట్లాడుతాడు" అన్నాడో జ్ఞాని. ఈ మాటలన్నీ నిశ్శబ్దంగానే జరుగుతాయి. లౌకిక కార్యక్రమాల్లో మాటలాడక తప్పదు. భావవ్యక్తీకరణకి భాష అవసరం. "మౌనం అభివ్యక్తమైతే భాష. భాష అవ్యక్తమైతే మౌనం" అన్నాడు సంజీవ్‌దేవ్. తక్కువ మాట్లాడి, ఎక్కువ వినడం కోసమే మనిషికి ఒక్క నాలుక, రెండు చెవులు ఇవ్వబడ్డాయి. 'వీనుల విందుగ వేణుగానం'లాంటి మాధుర్య శబ్దం, మానసిక ప్రశాంతతకి బలమిస్తుంది. మానవుడు వ్యక్తపరచలేని దానిని, సంగీతం వ్యక్తపరచి, విశదపరుస్తుంది. నాదబ్రహ్మల సునాదమంతా ఈ ప్రశాంత విశాల మహాసాగరంలోంచి పుట్టిందే. జయదేవుని అష్టపదుల, ఆనందలాస్యం, అన్నమయ్య పదాల సన్నుతి, నారాయణతీర్థుల తరంగాల అంతరంగం, నిశ్శబ్ద నిర్వాణానికి వేసిన నిచ్చెనలే !

'నా ఆడంబర ఆభరణాల కింకిణీధ్వనులు, నీ ప్రేమ గుసగుసలను విననీయక అడ్డుపడుతున్నవి. కమ్మని తెమ్మెరల్లో తేలివచ్చే నీ మధుర గానాన్ని వినాలని నా మౌన హృదయం ఆరాట పడుతోంది. గుండె గొంతుకలో కొట్లాడుతూ, నీ పాటకు శృతి కలపాలని, పెనుగులాడుతూంది. ఈ భావోద్రేకాల రాపిడిలో నీ రథ చక్రాల మృదు శబ్దం వినరాదు. నీ సడిలేని అడుగుల సవ్వడి నా మనోద్వారం వద్దనే ఆగిపోతుంది. నా ఆనంద, విషాదాల స్వర లయల, నా గీతాల నిట్టూర్పుల బాష్ప మేఘాలను నీ పాదాల చెంతకు చేర్చాలనే తపన. నా గీతాలన్నీ తమ వివిధ రాగాలను ఒక్క స్వరధుని లోనికి సమీకరించి, మౌనార్ణవంలోనికి ప్రవహించి లీనమవనీ! ఇలాంటి వినమ్ర భక్తి భావ తీవ్రతతో గీతాంజలిని సమర్పించిన రవీంద్రునిది నిశ్శబ్దారాధనే! మనిషి ఆలోచనా పుష్పాలని మధుర వాగ్ధారా ఫలాలుగా మారుస్తుంది దేవదేవుని మౌనం.

మౌనానికర్థం తెలుసుకోవడం, మాటల భావమంత సులభ సాధ్యం కాదు. మాటలకందని భావాలు మౌనం ఆధీనంలో ఉంటాయి. మాటకంటే మౌనం మహిమాన్వితం. మూగమనసుల భాషకు రాగమద్దుతుంది మౌనం. మౌని మస్తిష్కంలో మహత్తరమైన భావాలు రూపుదిద్దుకుంటాయి. పసిడివంటి మౌనం యోగ సిద్ధికి సోపానం. వినిపించిన రాగాలకంటే వినిపించని రాగాలు మధురతరం అన్నాడు ఓ కవి. వినిపించని రాగాలను వినగలిగినవాడే యోగి. "తన మూగమనసు చేసే ఎడతెరిపి లేని

రొదనణచివేసేందుకే మానవుడు ఘోషించే గుంపుల 'మధ్యకు పోతాడ'ని అంటాడు టాగోర్. మానసిక ప్రశాంతతే మానసిక మౌనం. ఇది సాధించడమంత సులభమనుకోను. జపాలు, తపాలు, యోగాలు, ధ్యానాలు ఇవన్నీ మానసిక మౌనం - ప్రశాంతత సాధించడానికే కదా! క్రమక్రమంగా లౌకిక బంధాలు తగ్గించుకుంటూ ప్రశాంతతను సాధించుకోవాలి. ఆ ప్రస్థానానికి చేరుకోవడానికి మహాఋషులు మౌనాన్ని ఆశ్రయించడంలోని మర్మం గ్రహించాలి మనం.

మనసు నిశ్శబ్దానికి మరో సంకేతం. అది చేరలేని ఎత్తులు లేవు. చూడలేని లోతులు లేవు. రెక్కలు చాచుకుంటూ ఎక్కడికైనా పోగలదు. దేనినైనా శోధించగలదు, సాధించగలదు. అందుకోలేని, అందనంత వేగం దానిది. అది అనుభవాల పేటిక, అనుభూతుల వాటిక. నిశ్శబ్దపు నినాదాలు చేస్తుంది. శోకాల శ్లోకాలల్లుతుంది. పన్నీటిని, కన్నీటిని కలబోసి ప్రవహింపజేస్తుంది. ఆనంద విషాదాల తాండవమాడుతుంది. అది ఆడని ఆట లేదు. పాడని పాట లేదు. ఇన్నీ మౌనంగానే - ఇంతా నిశ్శబ్దంగానే. చీకటి వెలుగుల చదరంగ మాడుతుంది. అది చేసే రొద వినిపించదు. మనసులో నిశ్శబ్దానికి చోటుండాలి. మనసెల్లవేళలా రణగొణ ధ్వనులతో నిండివుంటుంది. ఆలోచనలతో రద్దీగా ఉంటుంది. సంఘర్షణలతో సతమతమౌతూ ఉంటుంది. అలాంటి మనసులో ప్రశాంతతకి చోటుదొరకాలి. నిశ్శబ్దానికి ఆవరణ కరువైతే, దాన్నందుకునే దారేది?

*మనిషి ఏకాకియైనను మనసులోన / గుంపులుగ భావములు చేరి గోష్ఠిజరుపు* అన్నాడు గాలిబ్. కమనీయంగా, రమణీయంగా పాడుతుంది. అంతలోనే విషాదంగా, విలాపంగా రోదిస్తుంది. ఏదీ వినిపించదు. అంతా నిశ్శబ్దంగానే. కాని కనిపిస్తుంది. ఎలా! వదనపు సదనంలో. మమతానురాగాల పెన్నిధీ, మాయా మర్మాల సన్నిధీ ఔతుంది. అరిషడ్వర్గాల శరాఘాతమౌతుంది. ఈషణ త్రయ పోషణా కేంద్రమౌతుంది. ఆత్మీయ, స్పర్శ కోసం కన్నీరౌతుంది. దైవమౌతుంది. దయ్యమౌతుంది. శక్తి స్వరూపం, స్వభావం నిశ్శబ్దమే. విశ్వమంతటా, అణువణువునా శక్తి నిశ్శబ్దంగా నిక్షిప్తమై ఉంటుంది. బాహ్య ప్రేరణ, ఘర్షణ కలిగినప్పుడే, విస్ఫోటనం జరుగుతుంది. నిశ్శబ్దంలోంచి శబ్దం వివిధ పరిమాణాల్లో పుడుతుంది. వినాశనమే జరుగుతుందో, వికాసమే జరుగుతుందో విధి ఆధీనం. మనసు రగిలినా, రాగిల్లినా, కన్నీళ్ళు ఆగకుండా, ఆరకుండా, జారిపోతుంటాయి, చెంపలమీంచి నిశ్శబ్దంగా వాటి శక్తి ఏపాటిదో !

శూన్యం నిశ్శబ్దానికో ప్రతీక. ''మనిషి శూన్యం. శూన్యంలో జనించి, శూన్యంలోనికే అంతరిస్తాడు. ఆస్తి, నాస్తిల కలయికే శూన్యానికి నిర్వచనం. ఉద్ధృతమైన, ఉన్మాదవస్థ వంటి ఆనందపు శిఖరస్థాయే అది. ఆదే సమాధి అవస్థ కూడ. శూన్యం అనేది అమరం. శాశ్వతం. వృద్ధాప్యం, వ్యాధి, మృత్యువు దైవం పంపే ముగ్గురు దూతలు. మరణం జీవితానికి పరాకాష్ఠ. శూన్యమైన మనస్సు దయ్యాల కర్మాగారం అన్నది అర్థంలేని మాట. దీని వ్యతిరేకమే సత్యం. ఆలోచనలు నిండిన మనస్సే దయ్యాల కర్మాగారం. శూన్యమైన మనస్సు దైవత్వం నిండినది'' అలా సాగుతుంది బౌద్ధం ప్రవచించే శూన్యవాదం. ఈ వాదంతో ఎవరు ఏకీభవించినా, ఏకీభవించకపోయినా, నిశ్శబ్ద సోపానాల నధిరోహింపజేసి, శిఖరానికి చేర్చేవారే ఆ దూతలు.

ఇవాళ ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న కాలుష్యాలన్నిటిలో శబ్ద కాలుష్యాన్ని మించింది మరోటి లేదు. మనిషి సృష్టించిన ఈ శబ్ద కాలుష్యం మనిషి మస్తిష్కాన్ని, హృదయాన్ని మట్టిపాలు చేస్తున్నది. యంత్రాల రొద ఓ పక్క, కుతంత్రాల సొద మరోపక్క. భూమ్మీద ఏదో మూల ఎప్పుడూ ఆధునిక యుద్ధభేరీల మోత ఓ పక్క, ఆకలి కేకలోపక్క, అల్లరిమూకలోపక్క, అయినదానికి, కానిదానికి అత్యుత్సాహం ప్రదర్శించే ఆనంద హేలలో పక్క, బరువు బాధ్యతల కింద అణగారిపోతున్న ఆశల జ్వాలలింకోపక్క, ఊరేగింపులూ, ఉరుకుల పరుగుల జీవితాలు - ఇలా సమాజంలోని శాంతి సౌభాగ్యాలకు సవాలుగా, నోరెత్తి, హోరెత్తి, అల్లకల్లోలం, అతలాకుతలం చేస్తున్న అవాంఛిత శబ్ద

కాలుష్యాన్ని అరికట్టే దారీ, తెన్నూ కానరావటం లేదు. నిశ్శబ్దపు శక్తియుక్తుల కోసం, శాంతి కాంతుల కోసం, నిరాశా, నిస్పృహలననణచుకుంటూ, మనిషి ఎదురు చూపులు కొనసాగుతునే ఉన్నాయి.

పండిన పత్రం, పుష్పం, ఫలం నిశ్శబ్దంగా నేలరాలుతాయి. అంటే జీవితపు అంతిమ దశ సూచించేది నిశ్శబ్దం. గుడిలో నిశ్శబ్దం. మృత్యుశయ్య చెంత నిశ్శబ్దం. స్మశానంలో నిశ్శబ్దం. ఇదంతా మనిషికి అర్థం కాని మహాశక్తికి నిశ్శబ్ద నీరాజనాలనర్పించడమే ! ప్రాణి శరీరంలోని జీవప్రక్రియ అనుక్షణం, మెలకువలోను, నిద్రలోను, శబ్ద రహితంగా కొనసాగుతూనే ఉంటుంది. అది నిశ్శబ్దంవైపు పయనిస్తూ, జీవన వేదానికి భాష్యం చెప్పే ఒక అనంత యాత్ర. నిరంతర యాత్ర. దాని గమనం, తన గమ్యమైన పరిపూర్ణ నిరాకార, నీరవ శక్తి సామ్రాజ్యం. ఈ యాత్ర వైయక్తికం కాదు. ఇది సామూహిక యాత్ర. నిశ్శబ్దం పలు రకాలు (రూపాలు కాదు). రెండు శబ్దాల మధ్య, రెండు మాటల మధ్య, రెండు ఆలోచనా తరంగాల మధ్య స్వల్ప విరామం కూడా నిశ్శబ్దమే. భయం గుప్పిట్లో చిక్కినప్పుడు మనసులో ఆవరించేదీ నిశ్శబ్దమే. ఇది క్షణికం, తాత్కాలికం.

ఏకాగ్రతతో, సాధనతో, సాధించేది ప్రాపంచిక ప్రయోజన్నానాశించి, ప్రయత్నపూర్వకంగా సాధించేది. మానసిక మౌనం కాదు. నిజమైన నిశ్శబ్దం కాదు. ఏ బాహ్య ప్రేరణ లేకుండా, స్వతఃసిద్ధంగా, దానికదే మనసునావరించేదే నిశ్శబ్దం. మనసు, మస్తిష్కం ఒక అలౌకిక భావనా ప్రపంచం లోనికి జారుకునే ధ్యానం నిశ్శబ్దానికి దారి చూపుతుంది. మన కోరికల్లో, మన ఆనంద, విషాదాల్లో, మన లౌకిక సంబంధాల్లో, ఒక క్రమత సాధించిన ధ్యానమే నిత్యమైన, సత్యమైన నిశ్శబ్ద శిఖరానికి సోపానాలు నిర్మించగలుగుతుంది. అన్ని సౌకర్యాలు అమరినా, అన్ని ఆనందాలు లభించినా, అన్ని సుఖాలు పొందినా, అంతరంగంలో ఏదో అనిర్వచనీయమైన కొరత, ఏదో ఒంటరి అవేదన. అదే నిశ్శబ్ద తీరాలకి నడిపించి, నిల్చోబెట్టేది. నిజమైన నిశ్శబ్దానికి అవధులు లేవు. అంతం లేదు.

*శబ్దం నిండిన ప్రకృతినిండా అందమైన నిశ్శబ్దం.*
*పరిమళించే విరుల నిశ్శబ్దం.*
*పంచేంద్రియాలు పరవశించే నిశ్శబ్దం.*
*నిశ్శబ్దం నైరూప్యం నిశ్శబ్దం. నీ(?) రూపం.*
*అందుకే నా నవ్వు నిశ్శబ్దం, నా ఏడ్పు నిశ్శబ్దం.*
*నా మాటా, పాటా నిశ్శబ్దం.*
*నా ఊపిరి నిశ్శబ్దం. నిట్టూరుపు నిశ్శబ్దం!*

మహార్ణవాల నీలిమనంతా మనసులో నింపేసుకుందామన్న నా తపన నిశ్శబ్దానికి నివాళి.

దామెర వెంకట రావు
రాజాం, శ్రీకాకుళం. ఫోన్: 970 180 5597.

"…. ***మిసిమి*** మిసమిసలాడుతూ పాఠకులను మురిపిస్తూ, కాలానుగుణంగా సరికొత్త హంగులతో ముస్తాబై దర్శనమిస్తూ సాటి పత్రికా సాహితిలో తనకు ఎవరూ సాటిలేరని సవాలు విసురుతున్నట్లుంది. ***మిసిమి*** మార్చి (2020) సంపాదకీయం దీనికనుగుణంగా, అన్ని విధాలా సరిపోలుతున్నది. అలతి అలతి పదాలతో అనంతార్థాలను సంపాదక సాహితీ వీణపై పలికించారు. మహామహులను తికమకపెట్టే మూడు పదాలు సామాన్య వాడుకలోనివే. నాగరికత, సంస్కృతి, సంప్రదాయాల విశ్లేషణ మీకే చెల్లింది. మూడు వేరు-వేరుగా కనిపించినా ఒకదానితో మరొకటి ముడిపడి పూలదండలా ఇమిడిపోయిన వైనాన్ని పండిత పామరులకర్థమయ్యే రీతిలో ద్రాక్షాపాకంలో వడ్డించారు. చాలా కాలంగా మదిలో గూడుకట్టుకొని గజిబిజిగా ఉన్న సాలెగూటి చిక్కును విడదీసి విశదీకరించారు. చిత్రలేఖనంపై వస్తున్న కోడూరు పుల్లారెడ్డి వ్యాసాలు పరిశోధనాపరంగా, అత్యంత ప్రామాణికంగా ఉండి, నిపుణుల నైపుణ్యానికి మెరుగులు దిద్దుబాటుగా, సహాయకారిగా నిలుస్తున్నది. పాశ్చాత్య చిత్రకళ లోతులను చక్కగా విశ్లేషిస్తూ ఆయా కళాకారుల జీవితాల్ని పరిచయం చేసే తీరు చక్కగా ఉన్నది. వాటినన్నింటినీ గ్రంథరూపంలో చూడాలని పాఠకలోకం ఎదురు చూస్తున్నది…."

*- అమినేని సిద్ధయ్య నాయుడు, రాజాం, కడప*

# శ్రీశ్రీతో నా జ్ఞాపకం

*- ఎండ్లూరి సుధాకర్*

ఇప్పటి తరానికి ఏ డిగ్రీలోనో, ఎం.ఏ. తెలుగులోనో శ్రీశ్రీ పరిచయమవుతున్నాడు. నా తరానికైతే ఉన్నత పాఠశాల స్థాయిలోనే శ్రీ శ్రీ హృదయప్రవేశం చేసేవాడు. నా చిన్నతనంలో శ్రీశ్రీ కవితాశబ్దాలు నాలోని నాదాలు. నలుదిక్కులా నినదించే నినాదాలు. నేను ఏడవ తరగతిలోనే కవితా పరిశ్రమ మొదలు పెట్టాను. చిన్నచిన్న గేయాలు రాసి బాలకవిగా

యువకవిగా గుర్తింపు పొందాను. ఆనాటి మా అధ్యాపకుల నోళ్లల్లో శ్రీశ్రీ పేరు తరచూ వినబడుతూ వుండేది.

ఆయన కవితాపాదాల్ని ఉటంకించని ఉపాధ్యాయుడు అరుదుగా వుండేవాడు. తొంభైశాతం అధ్యాపకులు బ్రాహ్మణులు కావటంవల్ల ప్రాచీన సాహిత్యంలోని పద్యాల్ని అవకాశం దొరికినప్పుడల్లా శ్రీశ్రీ, దాశరధి, ఆరుద్ర, సినారె గేయాల్ని వినిపిస్తూ వుండేవారు. 'మహాప్రస్థానం' కవితల్ని పదోతరగతిలో చదువుకున్నాను. ధారణ చేసాను. అర్థం తెలిసినా తెలియకపోయినా తరగతి గదుల్లోని మిత్రులకు గొంతెత్తి వినిపించే వాణ్ని. శ్రీశ్రీ బాణీలను అనుకరిస్తూ పేరడీలు కట్టేవాణ్ని. ఆయన పదాలతో గారడీ విద్యలు చేసేవాణ్ని. ఆనాటి అభ్యాసం వల్ల నేను పొందిన లబ్ధి అంతా ఇంతా కాదు. అ తరువాత నేనూ తెలుగు అధ్యాపకుణ్నయ్యాను. హైస్కూల్ నుంచి విశ్వవిద్యాలయం స్థాయిలో పాఠాలు చెప్పాను 'మహాప్రస్థానం' పాఠ్యాంశంగా ఉన్నప్పుడు తరగతిగదికి పుస్తకం తీసుకెళ్లే అవసరం అంతగా వుండేది కాదు. అంతగా శ్రీశ్రీ నన్ను ఆకట్టుకున్నాడు. నా చుట్టూ శబ్దాల సౌధాలు కట్టుకున్నాడు.

శ్రీశ్రీని మొదటిసారి చూసింది 1980వ దశకంలో. హైదరాబాద్ లోని నా నల్లకుంట ఒరియంటల్ విద్య, పండిత శిక్షణ (tpt), ఉస్మానియా విశ్వవిద్యాలయం నిజాం కళాశాల లో ఎం.ఎ. తెలుగు. ఎంఫిల్ అన్నీ కూడా ఈ దశాబ్దంలో పూర్తయ్యాయి. ఒకవైపు చదువుకుంటూ మరోవైపు ఉద్యోగపర్వంలో ఉన్నకాలం కూడా ఇదే. తెలుగు సాహిత్యంలో ఈ సమయం అమూల్యమైంది. అపురూపమైంది. ఉద్యమాల ఉరవళ్లతో- విశ్వవిద్యాలయాల ప్రాంగణాల ఉద్రిక్తపు వాతావరణాలతో, పోలీసుల పహారాలతో, గోడలమీద విప్లవ నినాదాలతో, శ్రీశ్రీ, చెర, శివసాగర్ల కవిత్వ పాదాల వాల్పోస్టర్లతో, ఇరానీ టీల వేడివేడి కవితా చర్చలతో అనాటి పరిస్థితులూ పరిసరాలూ ఈ నాటికీ కళ్ల ముందు సజీవంగా కదులుతుంటాయి. ఇపుడు తలచుకుంటే శ్రీశ్రీ జీవించిన కాలంలో జీవించడం ఆయనను కళ్లారా చూడడం గొప్ప అనుభవాన్ని, అనుభూతిని మిగిల్చింది. నా జ్ఞాపకాల అద్దం లోకి  చూసుకుంటే నా రెండు కళ్లల్లో శ్రీశ్రీయే కనబడతాడు. బహూశా నా కౌమారంలో అంతగా నన్ను ప్రభావితం చేసాడు.

1981లోనో 1982లోనో తేదీలను సరిగ్గా తేల్చలేనుగాని హైదరాబాద్ లోని బషీర్ బాగ్ ప్రెస్క్లబ్లో శ్రీశ్రీగారికి సంబంధించిన పెద్ద సభ జరిగింది. మద్రాసులో కుదువబెట్టుకున్న ఆయన ఇంటిని వేలం వేస్తున్నారని శ్రీశ్రీ ఇంటిని విడిపించుకోవటానికి విరాళాలు సేకరిస్తున్న సభ. ఆ రోజు సాయంత్రం ప్రెస్క్లబ్ కిటకిటలాడిపోయింది. శ్రీశ్రీని చూడడానికి, ఆదుకోడానికి ఎందరో అభిమానులొచ్చారు. ఇక ఉస్మానియా విశ్వవిద్యాలయ వామపక్ష విద్యార్థుల సంగతి చెప్పనక్కరలేదు. ఒకవైపు వి.వి.లాంటి విరసం నేతలు, మరో వైపు ఉరసం (ఉస్మానియా రచయితల సంఘం) రచయితలు, నందిని సిధారెడ్డి, నాళేశ్వరం శంకరం, గుంటూరు ఏసుపాదం, గుడిహాళం రఘునాథం, విజయ రావు వంటి ప్రగతిశీల కవులతో పాటు రత్నమాల, అంబిక లాంటి ఆనాటి విప్లవ వనితలు, మరెందరో పాత్రికేయులతో సభ కిక్కిరిసిపోయింది. ఈనాడు కనిపించే  సాంస్కృతిక దళారులు, సంపన్నులు, పారిశ్రామికవేత్తలు ఆనాటి సభలో ఎవరూలేరు. అంతా సామాన్యులు, మహాప్రస్థానంలో కనిపించే మనుషులు. వేదికమీద శ్రీశ్రీ ని చూస్తున్నంతసేపూ ఒక మార్క్స్ నో, ఒక మావోనో, ఒక చేగువేరానో చూస్తున్నంత ఉద్వేగానుభూతి, ఒక గగుర్పాటు. శ్రీశ్రీ అభిమానులు జోలెపట్టారు. ఎవరూ వెనకడుగు వేయకుండా తమ వంతు సహకారం అందించారు. ఎవరో ఒక స్త్రీమూర్తి పేరు తెలియదుకానీ నా కళ్లముందరే తన మెడలోని బంగారపు గొలుసుని, చేతి ఉంగరాన్ని తీసి ఆ జోలెలో వేసింది. ఆ దృశ్యం చూడగానే మహాత్మాగాంధీ ఏలూరు వచ్చినపుడు స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబానికి చెందిన శ్రీమతి మాగంటి అన్నపూర్ణ తన నగలన్నీ ఒలిచి, మూటగా మలిచి గాంధీ గారికి ఇచ్చిన సంఘటన మదిలో మెదిలింది. శ్రీ శ్రీ ని ఆదుకున్న ఆ అజ్ఞాత స్త్రీ ఎవరో తెలుసుకోవడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఆ రోజు నా జేబులో ఐదు రూపాయలున్నాయి. అవి మా నాయిన నా నెల ఖర్చుకి ఇచ్చిన డబ్బులు. వెనకాముందు ఆలోచించలేదు. నేను సైతం శ్రీశ్రీ కోసం చిన్న సమిధనయ్యానన్న తృప్తి ఇప్పటికీ నన్ను ఆర్ధ్రహృదయుణ్ని చేస్తుంది. ఆ తరువాత శ్రీ శ్రీ కొన్నాళ్లకి నాంపల్లిలోని కాట్రగడ్డ వారి అన్నపూర్ణ హొటల్ లో దిగాడని తెలిసి కళాశాల మిత్రులతో కలిసి వెళ్లిచూడగలిగాను. 1983లో ఎన్ టీ రామారావు

*మిగతాది 84వ పుటలో....*

# మహా శూన్యత సూత్రం

– *ఈమని శివనాగిరెడ్డి*

నేను ఈ విధంగా విన్నాను ఒకానొక సమయంలో భగవాన్ కపిలవస్తులోని నిగ్రోదారామంలో శాక్యుల మధ్య ఉంటున్నారు.

ఆ ఉదయ సమయంలో, భగవాన్ పై వస్త్రా (సంఘాటి)న్ని ధరించి, భిక్షాపాత్ర తీసుకుని భిక్ష (పిండపాతం) కోసం కపిలవస్తులోకి వెళ్ళారు. ఆయన కపిలవస్తులో పిండపాత చారిక ముగించుకుని తిరిగివచ్చి, భోజనం చేశాక, ఆ పగలు గడపటానికి కాళఖేమకుడనే శాక్యుని విహారానికి వెళ్ళారు. అక్కడ అపులిడు కాళఖేమక నివాసంలో అనేక శయనాసనాలు తయారవుతున్నాయి. అది చూసిన భగవానుడు: ఇక్కడ కాళఖేమకశాక్యుని నివాసంలో చాలా శయనాసనాలు సిద్ధంగా ఉన్నాయి. ఇక్కడ చాలామంది భిక్షువులు ఉంటున్నారా! అని అనుకొన్నారు.

అప్పుడు, ఆ సమయంలో ఆయుష్మాన్ ఆనందుడు అనేకమంది భిక్షువులతో కలిసి చీవరాల తయారీలో ఉన్నాడు. సాయం సమయంలో భగవాన్ పటిసల్లాన (ధ్యానం) నుండి లేచి, ఘట అనే శాక్యుని విహారానికి వెళ్ళాడు. వెళ్ళిన తరువాత, అక్కడ తన కోసం ఏర్పాటు చేయబడిన ఆసనం మీద కూర్చుని, ఆయుష్మా ఆనందుని ఇలా అడిగారు.

''ఆనందా! కాళఖేమక శాక్యుని విహారంలో అనేక శయనాసనాలు ఏర్పాటు చేయబడినాయి. అక్కడ చాలామంది భిక్షువులు ఉంటున్నారా?''

అప్పుడు ఆనందుడు, ''భంతే! శాక్య కాళఖేమక విహారంలో అనేక శయనాసనాలు ఏర్పాటు చేయబడ్డాయి. అక్కడ చాలామంది భిక్షువులు ఉంటున్నారు. మేము చీవరాలు చేసే సమయం వచ్చింది భంతే.''

''ఆనందా! సంఘారామ సహచర బృందానందం వలన, దాని నుంచి ఆనందాన్ని పొందడంవలన, దాని ఆనందానికి అంకితం కావడంవలన, సంఘంలోని ఆనందంవలన, సంఘంలో ఆనందం పొందడంవలన, సంఘానందానికి అంకితం కావడంవలన ఒక భిక్షువు శోభించడు. కానీ ఒక భిక్షువు సంఘానికి దూరంగా, ఏకాంతంగా నివసిస్తాడు. అతడు కావాలనుకొన్నప్పుడెల్లా, ఏమీ కష్టం లేకుండా నెక్ఖమ్మ (త్యాగంవలన) సుఖం, వివేక (ఏకాంతంవలన) సుఖాన్ని, ఉపశమ (శాంతి వలన) సుఖాన్ని, సంబోధి సుఖాన్ని పొందుతాడు.

''నిజంగా ఆనందా! సంఘారామ బృందంలో ఆనందించే సంఘారామ సహచర బృందంలో ఉండటంవలన ఆనందించే సంఘారామ సహచర బృందం నుంచి కలిగే ఆనందానికి అంకితమయ్యే సంఘం ఆనందించే సంఘంలో ఉండటంవలన ఆనందించే, సంఘంలోని ఆనందానికి అంకితమయ్యే ఆ భిక్షువు తాత్కాలిక ఆనందాన్నిచ్చే చేతోవిముక్తి ఎప్పుడూ ప్రవేశించలేడు. లేదా శాశ్వత అచంచల చేతో విముక్తిలో ప్రవేశించి విహరించటం (ఉండటం) అతనికి అసంభవం. కానీ మనం ఒకటి ఆశించవచ్చు ఒక భిక్షు సమాజానికి దూరంగా ఏకాంతవాసం చేస్తే, అతడు తాత్కాలికమైనది, ఆనందాన్ని ఇచ్చేది అయిన, చేతోవిముక్తిలోగానీ లేదా శాశ్వతమూ, అచంచలమైన చేతోవిముక్తిలోగానీ ప్రవేశిస్తాడు.

''ఆనందా! మారే, విపరిణామం చెందే, ఏ ఒక్క రూపం కూడా దానిని కోరే ఆనందించేవానిలో శోక, పరివేదన, బాధా, దుఃఖ, ఆయాసాలను కలిగించకుండా ఉంటుందని నేను ఎరుగను.''

''ఏమైనా, ఆనందా, తథాగతుడు కనుగొన్న ఈ విహారం (ఆవాసం)లో అంటే ఆంతరంగికంగా అన్ని నిమిత్తాలను ఆమనసికారం చేసి శూన్యతలో ప్రవేశించి విహరించడం, ఈ విధంగా తథాగతుడు అక్కడ విహరిస్తున్నప్పుడు, ఆయన్ను భిక్షుణీలు, భిక్షువులు, ఉపాసకులు, ఉపాసికలు, గృహస్తులు,రాజులు, రాజ మహామాత్యులు, తీర్థికులు (ఇతర గురువులు) తీర్థికుల శిష్యులు సందర్శిస్తే, అప్పుడు వివేక (ఏకాంత) ఉన్ముఖ, వివేకం వైపు చూస్తున్న వివేకం వైపు వాలి ఉన్న,

త్యాగంతో ఆనందం పొందుతున్న, ఆస్రవ భూమికలైన విషయాలను ఉపసంహరించబడిన వదిలివేసిన చిత్తంతో అనివార్యంగా వారిని పంపివేసే విధంగా, వారితో ఆయన మాట్లాడతారు.

''అందుకని ఆనందా! ఒక భిక్షువు నేను అంతరంగికంగా శూన్యంలోకి ప్రవేశించి విచారింతునుగాక'' అని ఆకాంక్షిస్తే, అతడు తన మనసును అంతరంగికంగా దిటవు పరుచుకొని, శాంతింపజేసి, ఏకత్వానికి తెచ్చి ఏకాగ్రతను సాధించుకోవాలి. ఆనందా! మరి అతడు ఏ విధంగా దానిని అంతరంగికంగా దిటవుపరిచి, ఉపశమింపజేసి, ఏకత్వానికి చేర్చి, ఏకాగ్రతను సాక్షాత్కరింపజేసుకుంటారు?

''ఇక్కడ, ఆనందా! ఒక భిక్షు కామసుఖాలు దూరంగా, అకుశల ధర్మాలకు దూరంగా, మొదటి ఝానంలో ప్రవేశించి విహరిస్తాడు. అతడు రెండో ఝానంలో... మూడో ఝానంలో.. నాలుగో ఝానంలో (ఈ ఝానం అదుఃఖ మసుఖమై, ఉపేక్షవలన శుద్ధమైన సతితో ఉంటుంది) ప్రవేశించి, విహరిస్తాడు. అలా ఒక భిక్షువు అంతరంగికంగా, తన మనస్సును దిటవు పరుచుకొని, ఉపశమింపజేసుకొని, ఏకత్వానికి చేర్చి, సమాధిని పొందుతాడు.''

''అప్పుడు ఆ భిక్షువు అంతరంగికంగా శూన్యతను మనసికారం చేస్తాడు. అతడు అంతరంగికంగా శూన్యతను మనసికారం చేసినప్పుడు, అతని చిత్తం అంతరంగికంగా శూన్యతలోకి ప్రవేశించదు. లేదా విశ్వాసాన్ని, స్థిరత్వాన్ని, నిశ్చయాన్ని ఆర్జించదు. విషయం అలా ఉన్నప్పుడు అతడు ఏ విధంగా అర్థం చేసుకొంటాడు. నేను అంతరంగికంగా శూన్యతను ఆమనసికారం చేసినప్పుడు, నా చిత్తం అంతరంగికంగా శూన్యతలోకి ప్రవేశించి ఉండలేదు. లేదా విశ్వాసాన్ని, స్థిరతను, వినిశ్చయాన్ని ఆర్జించడం లేదు. ఈ విధంగా అతడు దానికి సంబంధించిన సన్ప్రజజ్ఞతను కలిగి ఉంటాడు.

''అతడు బాహ్యంగా శూన్యతను మనసికారం చేస్తాడు. అతడు బాహ్యంగా, అంతరంగా శూన్యతను మనసికారం చేస్తాడు. అతడు అక్షోభ (అలజడి లేమి, అన్యాకులత = మనసికారం చేస్తాడు. అతడు అలా అక్షోభను మనసికారం చేస్తుండగా అతడి చిత్రం అక్షోభలోకి ప్రవేశించదు, లేదా విశ్వాసాన్ని, స్థిరతను, నిశ్చయాన్ని ఆర్జించదు. అతడు ఆ స్థితిలో ఉండి, ఇలా అర్థం చేసుకొంటాడు. ''నేను అక్షోభను మనసికారం చేసుకొంటున్నప్పుడు నా చిత్తం అక్షోభ (అనేఞ్జ)ను ప్రవేశించడం లేదు. లేదా విశ్వాసాన్ని, స్థిరతను, వినిశ్చయాన్ని అర్జించడం లేదు''. ఈ విధంగా అతడు దానికి సంబంధించిన సమ్పజానతను పొందినవాడు (పూర్తి ఎరుక కలిగినవాడు) అవుతున్నాడు.

''అంతట ఆ భిక్షు అంతరంగికంగా చిత్తాన్ని దిటవుపరిచి, ఉపశమింపజేసి, ఏకత్వానికి తెచ్చి, ఇంతకు ముందులాగే, అదే సమాధి సంజ్ఞ మీద (అదే సమాధి నిమిత్తం మీద) ఏకాగ్రం చేస్తాడు. అంతట అతడు అంతరంగికంగా, శూన్యతను మనసికారం చేస్తాడు. అతడు అలా అంతరంగికంగా శూన్యతను మనసికారం చేస్తుండగా, అతని చిత్తం అంతరంగికంగా, శూన్యతలోకి ప్రవేశించి, విశ్వాసాన్ని, స్థిరతను, వినిశ్చయాన్ని ఆర్జిస్తుంది. విషయం అలా ఉండగా, అతడు ఇలా అర్థం చేసుకొంటాడు. 'నేను అంతరంగికంగా శూన్యతను మనసికారం చేస్తుండగా, నా చిత్తం శూన్యతలోకి అంతరంగికంగా ప్రవేశిస్తుంది. విశ్వాసాన్ని, స్థిరతను, వినిశ్చయాన్ని ఆర్జిస్తుంది'. ఈ విధంగా అతనికి, దానికి సంబంధించిన సమ్పజాన (పూర్తి ఎరుక) కలుగుతుంది

అతడు బాహ్యంగా శూన్యతను మనసికారం చేస్తాడు.. అతడు శూన్యతను అంతరంగా, బాహ్యంగా మనసికారం చేస్తాడు. అతడు అక్షోభను మనసికారం చేస్తాడు. అతడు అక్షోభను మనసికారం చేస్తుండగా, అతడి మనసు అక్షోభలోకి ప్రవేశించి, విశ్వాసాన్ని, స్థిరతను, వినిశ్చయాన్ని ఆర్జిస్తుంది. విషయం అలా ఉండగా, అతడు ఇలా అర్థం చేసుకొంటాడు. 'నేను అక్షోభను మనసికారం చేస్తున్నప్పుడు నా చిత్తం అక్షోభలోకి ప్రవేశించి, విశ్వాసం, స్థిరత, వినిశ్చయాలను ఆర్జిస్తుంది'. ఈ విధంగా అతనికి, దానికి సంబంధించిన పూర్తి ఎరుక ఉంది.

''ఈ విధంగా ఆనందా! భిక్షు విహరిస్తుండగా

(ఉంటుండగా) అతని మనస్సుకు నడవాలనిపిస్తే, అతడు ఇలా అనుకొంటూ నడుస్తాడు. 'నేను ఈ విధంగా నడుస్తుండగా, పాప అకుశల ధర్మాలైన అభిజ్ఞ, దోమనస్సు (లోభ, దుఃఖ) నన్ను పైకొన కుండు గాక. ఈ విధంగా అతనికి, దాని గురించి సస్పుజాన (పూర్తి ఎరుక ఉంది. ఒక భిక్షు ఇలా ఉంటుండగా, అతని మనస్సుకు నిలబడాలని తోస్తే, అతడు నిలబడతాడు. అతని మనస్సుకు కూర్చోవాలనిపిస్తే అతడు కూర్చుంటాడు.. అతని మనస్సుకు పడుకోవాలనిపిస్తే అతడు పడుకొంటాడు. ఇలా అనుకొంటూ 'నేను ఈ విధంగా పడుకొని ఉండగా, పాప అకుశల ధర్మాలేవీ నన్ను ఆవహించకుండుగాక' ఈ విధంగా, దానికి సంబంధించిన సమ్పజాన అతనికి కలుగుతుంది.

''ఒక భిక్షు ఈ విధంగా ఉంటూ ఉండగా అతని మనస్సుకు మాట్లాడాలనిపిస్తే అతడు ఇలా నిర్ణయించుకొంటాడు. 'అటువంటి కథనాలు (మాటలు) హీనం, గ్రామ్యం, మొరటు, తుచ్ఛం, అనర్థాలు. పైగా అవి అభ్రమకు, విరాగానికి, నిరోధానికి, శాంతికి, అభిజ్ఞకు, బోధికి, నిర్మాణానికి దారి తీయవు. ఆ కథనాలు ఏమంటే, రాజుల, దొంగల, మంత్రుల, సేనల, అపాయాల, యుద్ధాల, ఆహార పానీయాల, దుస్తుల, పరుపుల, పూలదండల, సువాసనల, చుట్టాల, వాహనాల, గ్రామాల, పట్టణాల, నగరాల, జనపదాల, స్త్రీల, శూరుల, వీధుల, బాలల, మృతుల, అల్ప విషయాల, ప్రపంచం పుట్టుక, సముద్రం పుట్టుక, భవాభవ కథనాల (సంబంధించిన మాటలు)ను మాట్లాడను. ఈ విధంగా అతడు సమ్పజానుడు అవుతున్నాడు. కాని అతడు నిర్ణయించుకొంటాడు. క్షాళనకు సంబంధించిన, చిత్త విముక్తికి అనుకూలించే, పూర్తిగా భ్రమలను తొలగించే, విరాగ, నిరోధ, శాంతి, అభిజ్ఞ, బోధి, నిర్వాణాలకు దారితీసే కథనాలను - అంటే అల్పేచ్ఛ (చిన్న కోరిక) మీద, సంతుష్టి మీద, ఏకాంత మీద, సమాజానికి దూరంగా (అసంవర్గం), వీర్యారంభం, శీల, సమాధి ప్రజ్ఞ, విముక్తి, విముక్తి జ్ఞాన దర్శనాల మీద కథనాలను (మాటలను), నేను అలాంటి కథనాలను చేస్తాను' ఈ విధంగా అతడు సమ్పజానుడవుతున్నాడు.

''ఇలా ఉంటూ, అతనికి ఆలోచించాలనిపిస్తే అతడు ఇలా నిర్ణయించుకుంటాడు. తాను చేసే అటువంటి ఆలోచనలు హీనం, గ్రామ్యం, మొరటు, తుచ్ఛం (అనార్య), అనర్థాలతో కూడుకున్నవి కాకూడదు. పైగా ఆలోచిస్తే అవి అభ్రమకు, విరాగానికి, నరోధానికి, శాంతికి, అభిజ్ఞకు, సంబోధికి, నిర్వాణానికి దారి తీయవు. అంటే ఆ ఆలోచనలు కామవాంఛల, ఆలోచనలు, వ్యాసాద (ద్వేష) ఆలోచనలు, క్రూర ఆలోచనలు. నేను అటువంటి ఆలోచనలు చేయబోను. ఈ విధంగా అతడు దాని గురించి సమ్పజానుడవుతున్నాడు.

''ఆనందా! అక్కడ ఐదు కామగుణాలు ఉన్నాయి. ఆ ఐదు ఏమిట? కోరిన, వాంఛించిన, ప్రియమైన, ఇష్టమైన, కామవాంఛలతో ముడివడిన, రాగాన్ని రేకెత్తించే, కంటితో గుర్తించదగిన రూపాలు (వస్తువులు).. చెవితో గుర్తించదగిన ధ్వనులు.. ముక్కుతో గుర్తించదగిన వాసనలు.. నాలుకతో గుర్తించదగిన రుచులు.. శరీరంతో తాకి గుర్తించదగిన స్పర్శలు. ఇవే ఆ ఐదు కామగుణాలు.

''అక్కడ ఆనందా! ఒక భిక్షువు ఈ విధంగా తన మనస్సును పునఃపరిశీలించుకొంటూ ఉంటాడు. 'ఈ పంచ కామగుణాలకు సంబంధించి మానసిక ఉత్తేజం, ఏ సందర్భంలోనైనా ఉప్పతిల్లుతుందా?' ఈ విధంగా తన చిత్తాన్ని పునర్విమర్శించుకొన్నాక, భిక్షువు 'ఈ పంచ కామగుణాలకు సంబంధించిన మానసిక ఉత్తేజం, కొన్ని సందర్భాలలో నాలో లేచిందీ' అని అర్థం చేసుకొంటాడు. అప్పుడతడు 'పంచ కామగుణాలకు సంబంధించిన ఛంద, రాగం, నా నుంచి తొలగిపోలేదు అని అర్థం చేసుకొంటాడు. ఈ విధంగా అతడు దానికి సంబంధించిన సమ్పజానుడవుతున్నాడు. కానీ అలాకాక, పునర్విమర్శ తరవాత భిక్షువు ఈ పంచ కామగుణాలకు సంబంధించి నాలో ఏ మానసిక ఉత్తేజమూ ఉప్పతిల్లలేదు అని అర్థం చేసుకొంటాడు. అప్పుడతడు 'పంచ కామ గుణాలకు సంబంధించి, ఛంద రాగాలు నా నుంచి తొలగిపోయాయి' అని అర్థం చేసుకొంటాడు. ఈ విధంగా అతడు సమ్పజానుడవుతున్నాడు.

"ఆనందా! అక్కడ పంచ ఉపాదాన స్కంధాలు (ఉపాదానంతో ప్రభావితమైన పంచస్కంధాలు) ఉన్నాయి. వీటికి సంబంధించి ఉద్ధాన పతనాల గురించి ఒక భిక్షు ఇలా ఉపాసిస్తూ ఉండాలి. 'రూపం అట్టిది. దాని సముదయం అట్టిది. దాని అంతర్థానం (అస్థంగం) అట్టిది. వేదన అట్టిది. వేదన సముదయం అట్టిది. దాని అంతర్ధానం అట్టిది. సంజ్ఞ అట్టిది. దాని అంతరార్థంఅట్టిది. సంఖారాలు అట్టివి. సంఖారాల సముదయం అట్టిది. వాటి అంతర్ధానం అట్టిది. విజ్ఞానం అట్టిది. విజ్ఞాన సముదయం అట్టిది. దాని అంతర్ధానం అట్టిది.

'ఆనందా! అతడు ఈ పంచ ఉపాదాన స్కంధాల సముదయ, అంతర్ధానాలను ఈ విధంగా ఉపాసిస్తూ ఉండగా, నేను ఈ పంచ ఉపాదాన స్కంధాల ఆధారంగా ఉన్నాను' అనే మానం (గర్వం) అతని నుంచి తొలగిపోతుంది. వినయం అలా ఉండగా, ఆ భిక్షువు 'ఈ పంచ ఉపాదాన స్కంధాల ఆధారంగా 'నేను ఉన్నాను' అనే గర్వం (మానం) నా నుంచి తొలగిపోయింది' అని అర్థం చేసుకొంటాడు. ఆ విధంగా అతడు సమ్ప్రజానుడవుతున్నాడు.

'ఆనందా! ఈ ధర్మాలకు పూర్తిగా ఉపాయ కుశలమైన భూమిక ఉంది. అవి ఈ ధర్మాలు, ఆర్యధర్మాలు, లోకుత్తరాలు. అవి పాపిని ప్రవేశించనీయవు.'

'ఆనందా! నీవు ఏమంటావు? వెళ్ళిపొమ్మని చెప్పినా ఒక శిష్యుడు గురువు సన్నిధినే అన్వేషించడంలో, అక్కడతను ఏ మంచిని చూస్తున్నాడు?'

'భంతే! మా ధర్మాల బోధకు మూలం భగవానుడు. భగవాన్! మేము భగవానునితో పోతున్నాము. భగవానుడు మాకు శరణం. ఈ మాటలకు అర్థం ఏమిటో భగవానుడు వివరిస్తే బాగుంటుంది. భగవానుని నోటి నుండి విని భిక్షువులు వాటిని గుర్తుపెట్టుకొంటారు' ఆనందుడన్నాడు.

'ఆనందా! ఒక భిక్షువు సూత్రాలు, గేయాలు, వ్యాకరణం కోసం గురువుకు అనుబంధితం కారాదు. అలా ఎందుకట, ఆనందా! చాలా కాలంగా ధర్మాలు నేర్చుకొన్నావు. ధారణ చేశావు. వాచకంగా కంఠస్థం చేశావు. మనస్సుతో పరీక్షించావు. దృష్టితో లోతులకు పోయావు. కానీ ఆనందా! క్షాళనకు సంబంధించిన చిత్త విముక్తికి దోహదం చేసే, పూర్తిగా భ్రమలు తొలగించే, విరాగ, నిరోధ, శాంతి, అభిజ్ఞ, సంబోధి, నిర్వాణాలకు దారి తీసే, అంటే అల్ప ఇచ్ఛ మీద కథ సంతుష్టి మీద, కథ ఏకాంతం మీద, కథ అసంసర్గం మీద, కథ వీర్యారంభం మీద, కథ శీల, కథ సమాధి, కథ ప్రజ్ఞ, కథ విముక్తి జ్ఞాన దర్శనాల మీద, కథనాలు అటువంటి కథనాల కోసం ఆనందా! భిక్షువు అతనిని వెళ్ళిపొమ్మని చెప్పినా కూడా, గురువు సన్నిధిని అన్వేషించాలి.

ఆనందా! ఇది ఇలా ఉంది కనుక, ఒక ఆచార్య ఉపద్రవం సంభవించవచ్చు. అంతేవాసి (శిష్యుని) ఉపద్రవం సంభవించవచ్చు. బ్రహ్మచారి ఉపద్రవం సంభవించవచ్చు.

'మరి ఒక ఆచార్య ఉపద్రవం ఎలా సంభవిస్తుంది? ఇక్కడ ఎవరో ఒక ఆచార్యుడు ఏకాంత స్థలానికి వెళతాడు. అది అరణ్యం. వృక్ష మూలం, పర్వతం, కందరం, గిరి గుహ, శ్మశానం, కీకారణ్యం, బహిరంగ ప్రదేశం, గడ్డివామి - ఏదైనా కావచ్చు. అతడు ఈ విధంగా ఉపసంహారుడై ఉంటుండగా, పట్టణం నుంచి, జనపదం నుంచి బ్రాహ్మణులు, గృహపతులు అతనిని సందర్శిస్తారు. ఫలితంగా అతడు దారి తప్పుతాడు. వాంఛ కలుగుతుంది. తృష్ణ పాలవుతాడు. విలాస జీవితానికి మరలుతాడు. ఈ ఆచార్యుడు ఆచార్య ఉపద్రవంతో ఉపద్రవానికి గురయ్యాడు. కలుషితం చేసే పునర్భవాన్ని తెచ్చి పెట్టే కష్టాల పాలు చేసే, దుఃఖ పరిపాకం చెందే, భావిజన్మ (పునర్భవం)కు, జరా మరణాలకు దారి తీసే అకుశల ధర్మాలతో అతడు తాడితుడవుతాడు. ఆనందా! ఇది ఆచార్య ఉపద్రవం సంభవించే తీరు.

ఆనందా! మరి ఏ విధంగా అంతేవాసి (శిష్యుని) ఉపద్రవం సంభవిస్తుంది. ఆ గురువు శిష్యుడు, గురువు ఏకాంతాన్ని అనుసరిస్తూ ఏకాంత స్థలానికి వెళతాడు. అది అరణ్యం. గడ్డివామి కావచ్చు. ఈ విధంగా అతడు ఉపసంహరించుకొని ఉంటుండగా, బ్రాహ్మణులు, గృహపతులు పట్టణం నుంచి, జనపదం నుంచి అతనిని

సందర్శిస్తారు. ఫలితంగా అతడు దారి తప్పి, వాంఛలతో నిండి, తృష్ణకు లోనై, విలాస జీవితానికి మరలుతాడు. ఈ అంతేవాసి, అంతేవాసి ఉపద్రవంతో ఉపద్రవానికి గురయ్యాడు. కలుషితం చేసే అకుశల ధర్మాలతో అతడు తాడితుడవుతాడు. ఆనందా! ఇదీ అంతేవాసి ఉపద్రవం సంభవించే తీరు.

ఆనందా! మరి బ్రహ్మచారి ఉపద్రవం ఎలా సంభవిస్తుంది? ఇక్కడ అర్హంత, సమ్మాసంబుద్ధ, విజ్జాచరణ సంపన్నుడు, సుగతుడు, లోకవిదుడు, అనుత్తర పురిసదమ్మ సారధి, దేవమానవుల సత్థా, బుద్ధుడు అయిన తథాగతుడు లోకంలో అవతరిస్తాడు. అతడు ఏకాంత ప్రదేశానికి వెళతాడు. అది అరణ్యం.. గడ్డివామి కావచ్చు. అతడు ఈ విధంగా ఉంటూ ఉండగా, బ్రాహ్మణులు, గృహపతులు ఆయన్ను సందర్శిస్తారు. అయినా అతడు దారి తప్పడు. కానీ ఈ గురువు శిష్యుడు, గురువును అనుసరించి ఏకాంత ప్రదేశానికి వెళతాడు. అది అరణ్యం... గడ్డివామి కావచ్చు. అతడు ఈ విధంగా ఉంటూ ఉండగా, బ్రాహ్మణులు, గృహపతులు పట్టణం నుంచి, జనపదం నుంచి వచ్చి, ఆయన్ను సందర్శిస్తారు. ఫలితంగా అతడు దారి తప్పుతాడు. వాంఛలలో మునిగి, తృష్ణకులోనై, విలాస జీవితానికి మరలుతాడు. ఇలాంటి బ్రహ్మచర్య జీవితం గడిపే ఇతడు బ్రహ్మచర్య ఉపద్రవానికి బాధితుడైన వాడవుతున్నాడు. కలుషితం చేసే.. అకుశల ధర్మాలతో అతడు తాడితుడవుతాడు. ఈ విధంగా బ్రహ్మచారికి, బ్రహ్మచారి ఉపద్రవం సంభవిస్తుంది. ఆనందా! ఇక్కడ బ్రహ్మచారికి, ఈ బ్రహ్మచారికి ఉపద్రవం, ఆచార్యుని ఆచార్య ఉపద్రవం కలిగించే ఉపద్రవం కంటే ఎక్కువ బాధాకరం, ఎక్కువ చేదు ఫలితాన్ని తెచ్చిపెడుతుంది. ఇంక విపత్తుకు దారి తీస్తుంది.

అందుకని ఆనందా! ద్వేషంతో కాదు, నాతో మిత్రునివలె ప్రవర్తించు. అది నీకు దీర్ఘకాల హిత సుఖాలను తెచ్చి పెడుతుంది. ఆనందా! మరి శిష్యులు గురువుతో మిత్రత్వంతో కాకుండా, ద్వేషంతో ఎలా ప్రవర్తిస్తారు? ఇక్కడ ఆనందా, గురువు అనుకంపతో, శిష్యుల మేలుకోరి, శిష్యులకు కరుణతో 'ఇది మీ హితం కోసం, ఇది మీ సుఖం కోసం' అని ధర్మాన్ని బోధిస్తాడు. అతడి శిష్యులు చెప్పింది వినరు, చెవినే పెట్టరు, అర్థం చేసుకోవడానికి మనస్సు పెట్టరు. వారు తప్పునపడి, గురుబోధ నుంచి ప్రక్కకు మరలుతారు. ఈ విధంగా శిష్యులు గురువు యెడ, మిత్రత్వంతోకాక, ద్వేషంతో ప్రవర్తిస్తారు.

ఆనందా! మరి శిష్యులు ఒక గురువు యెడ ద్వేషంతోకాక, మిత్రత్వంతో ఎలా ప్రవర్తిస్తారు? ఆనందా! ఇక్కడ గురువు కరుణతో, వారి హితం కోరి, దయ కారణంగా, వారికి ధమ్మాన్ని బోధిస్తాడు. 'ఇది మీ హితం కోసం, ఇది మీ సుఖం కోసం'. అతడి శిష్యులు, ఆయన చెప్పేది విని, చెవిని ఒగ్గి, అర్థం చేసుకోవడానికి మనసు పెడతారు. వారు తప్పున పడరు. గురు బోధ నుంచి ప్రక్కకు మరలరు. ఈ విధంగా శిష్యులు గురువు యెడ, ద్వేషంతోకాక, మిత్రత్వంతో ప్రవర్తిస్తారు. అందుకని ఆనందా, నీవు నా యెడ ద్వేషంతో కాక, మిత్రత్వంతో ప్రవర్తించు. అది నీకు దీర్ఘకాల హితాన్నిస్తుంది. సుఖాన్నిస్తుంది. 'నేను నిన్ను ఒక కుమ్మరి ముడి తడి మట్టిని చూసినట్లుగా చూడను. నిన్ను పునఃపునః నిగ్రహిస్తూ, నీకు వక్కాణిస్తాను. ఆనందా పునఃపునః మందలిస్తూ నీకు చెబుతాను. ఆనందా! పరీక్షకు సారం (చేవ) మాత్రమే నిలుస్తుంది. 'యోసారో సోఠస్సతీ.

ఈ విధంగా భగవానుడు అన్నాడు. ఆయుష్మాన్ ఆనందుడు భగవానుడి మాటలను అభినందించాడు.

*మహాశూన్యత సూత్రం సమాప్తం*

సుత్తపిటకలోని మజ్జిమనికాయలో మూడోదైన శూన్యతవర్గంలోని మహాసుఞ్ఞత సుత్తమనే రెండో భాగానికి ధనిస్సరో భిక్షువు ఇంగ్లీషు అనువాదం, అన్నపరెడ్డి బుద్ధఘోషుని మహా శూన్యతా సూత్రమనే (బుద్ధుని మధ్యమ సంభాషణలు) తెలుగు అనువాదం ఆధారంగా... వారికీ, మరియూ దేవళ్ళ శంకర్ గారికి గౌరవపూర్వక కృతజ్ఞతలతో...)

తెలుగు: డా. ఈమని శివనాగిరెడ్డి
విజయవాడ. ఫోన్: 984 859 8446.

# యన్.టి.ఆర్. సమగ్ర జీవిత కథ

*– పాటిబండ్ల దక్షిణామూర్తి*

ఏ భాషా సాహిత్యంలోనైనా, జీవిత చరిత్రలు ఒక ముఖ్యమైన ప్రక్రియగా పరిగణింపబడుతున్నాయి. ప్రసిద్ధ వ్యక్తుల జీవిత చర్యలు వ్రాయటం కత్తి మీద సామువంటిది. ఆ వ్యక్తి విశిష్ట గుణాలను వివరిస్తూ, వారి బలహీనతలను కూడా గుర్తించి, సమతుల్యతను పాటించటం చరిత్రకారుని ముఖ్యవిధి.

ఆంగ్లంలో డి.డి. కొశాంబి నుంచి, రాజమోహన గాంధీ, రామచంద్ర గుహవంటివారు జీవిత రచనా రంగంలో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పారు. తెలుగులో 'వేమన' (రాళ్లపల్లి, వి.ఆర్. నార్ల, ఎన్. గోపి) "వీరేశలింగం" (అక్కిరాజు రమాపతిరావు), "గురజాడ" (శ్రీశ్రీ), "తాపీధర్మారావు" (ఏటుకూరి ప్రసాద్), "అల్లూరి సీతారామరాజు" (పడాలరామారావు), "ధర్మవరం", "స్థానం" (మొదలి నాగభూషణశర్మ), "జాషువా" (యండ్లూరి సుధాకర్), "తుమ్మల" (గురుప్రసాదరావు), "డా॥ సి.ఆర్. రెడ్డి", "నార్ల", "ముట్నూరి", "ఆచార్య రంగా" (గొర్రెపాటి వెంకట సుబ్బయ్య), "సంజీవదేవ్", (రావెల సాంబశివరావు) వంటి మహనీయుల జీవిత చరిత్రలు పాఠకుల ప్రశంసలు పొందాయి.

1983 జనవరిలో ఎస్. వెంకటనారాయణ అనే జర్నలిస్టు "యన్.టి.ఆర్" ఎన్నికల్లో ఏ విధంగా అఖండ విజయం సాధించారో వివరిస్తూ ఆంగ్లంలో ఒక పుస్తకం వ్రాశారు. యన్.టి.ఆర్. కాలధర్మం చెందిన 5 సంవత్సరాలకు వార్తాపత్రికల నుండి సేకరించిన సమాచారానికి, తన వ్యక్తిగత పరిశీలనకు జోడించి, 2000 సంవత్సరంలో సీనియర్ జర్నలిస్ట్ ఐ. వెంకటరావు నిర్దుష్టంగా, నిష్పక్షపాతంగా "ఒకే ఒక్కడు" అనే పుస్తకాన్ని ప్రచురించారు. ఇప్పుడు "యన్.టి.ఆర్. సమగ్ర జీవిత కథ"ను కె. చంద్రహాస్, కె. లక్ష్మీనారాయణ మరింత సమగ్రంగా పరిశోధించి, తగిన ఆధారాలతో విషయ సేకరణ చేసి తెలుగు ప్రజలకందించారు.

ఈ పుస్తకంలో చాలామందికి తెలియని వాస్తవాలను పాఠకుల ముందుంచారు. సినిమాల్లో పాటలు వ్రాయడానికి ప్రసిద్ధ కవి డా. సి.నా.రె. మొదటిసారి మద్రాస్ వచ్చినప్పుడు యన్.టి.ఆర్. స్వయంగా స్టేషన్‌కు వెళ్లి ఆహ్వానించటం కవులపట్ల ఆయనకున్న గౌరవాభిమానాలకు ఒక ఉదాహరణ.

1951లో 'పాతాళభైరవి' అఖండ విజయోత్సవంలో ఆ చిత్ర విజయానికి ముఖ్యకారకులందరికీ విజయా ప్రొడక్షన్ అధినేతలు ఒక కారు బహుమతిగా ఇచ్చారు. తనకిచ్చిన 'బ్యూక్' కారును యన్.టి.ఆర్. తన వద్ద చాలా కాలం భద్రపరుచుకున్నారు. దాన్ని ఫాదర్ (నాగిరెడ్డి) ఇచ్చిన కారు అని అందరితో ఆయన ప్రేమతో చెప్పుకునేవారు. ఆనాడు కులభేదాలు లేవు. ఈనాడు కూడా లేవు. ఆ విభేదాలను ఎగదోసేది రాజకీయ నాయకులేనని నిష్పాక్షిక విమర్శకుల అభిప్రాయం.

1966లో 'పద్మశ్రీ' బిరుదును సీనియర్ నటుడు అక్కినేనికి భారత ప్రభుత్వం ప్రకటించింది. బ్రహ్మానందరెడ్డికి యన్.టి.ఆర్. పట్ల విపరీతమైన అభిమానం అందువల్ల చివరి నిమిషంలో "పద్మశ్రీ" గ్రహీతల్లో యన్.టి.ఆర్. పేరు చేర్చటం జరిగింది. ఆ విధంగా ఇద్దరు అగ్రనటులూ ఒకే సంవత్సరం "పద్మశ్రీ" పురస్కారాన్ని అందుకున్నారు. తరువాత సంవత్సరాల్లో ఒకరు పౌరాణిక, జానపద చిత్రాల్లోను

మరొకరు సాంఘిక, మానసిక సంఘర్షణ ఇతివృత్తంగా తీసిన చిత్రాల్లోను సాటిలేని నటులుగా తెలుగు చలనచిత్ర రంగానికి రెండు నేత్రాలుగా భాసించారు. ''బ్రదర్ మీరు ముక్కుసూటి మనస్తత్వం కలిగినవారు, రాజకీయాలు మీకు పడవు'' అని ఎ.ఎన్.ఆర్., యన్.టి.ఆర్. ను హెచ్చరించారు.

1961లో విడుదలైన 'సీతారామ కల్యాణం'లో పదితలల రావణాసురుడు కైలాస పర్వతాన్ని పైకెత్తిన సన్నివేశంలో రవికాంత్‌నగాయిద్ తన ట్రిక్ ఫొటోగ్రఫీ నైపుణ్యంతో 10 శిరస్సులతో 'ఓం నమశ్శివాయ'' జపిస్తూ వివిధ రకాలయిన ముఖకవళికలను ప్రదర్శిస్తూ ఆయన చూపిన నటన తెలుగు సినిమా చరిత్రలో మరపురాని సన్నివేశం, ఆ చిత్రానికి యన్.టి.ఆర్. దర్శకుడైనా తన పేరు (మరికొన్ని చిత్రాల్లో కూడా) టైటిల్స్‌లో వేసుకోలేదు. 1977లో విడుదలైన 'దాన వీర శూర కర్ణ'లో త్రిపాత్రాభినయం అనితరసాధ్యం ఆ చిత్రం షూటింగ్ సందర్భంగా ఉదయం సెట్టుకు వచ్చిన దగ్గర నుంచి రాత్రి పొద్దుపోయి షూటింగ్ ప్యాకప్ చెప్పేవరకు మూడు కిలోల బరువున్న కిరీటాన్ని అలాగే ధరించారు.

ప్రసిద్ధ తత్వవేత్త, మాజీ రాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్, యన్.టి.ఆర్.కు పురస్కారం అందిస్తూ ''నేను భగవద్గీత చదువుతున్నప్పుడల్లా మీ స్వరూపమే నాకు కనిపిస్తుంది'' అన్న ప్రశంస ఏ కళాకారుడికైనా గర్వకారణం. ''యన్.టి.ఆర్. కష్టజీవి, తపస్వి, కీర్తి, ధనం సముపార్జించుకున్నా, పని దగ్గరకు వచ్చేటప్పటికి అహర్నిశలు శ్రమించేవారని ధూళిపాళ సీతారామశాస్త్రిగారి మాటలు అక్షర సత్యాలు. యన్.టి.ఆర్. జ్ఞాపకశక్తి అపారం. ఒక్కసారి మనిషిని చూస్తే మరిచిపోయేవారు కాదు. గొంతు కూడా గుర్తుపట్టకలరు. క్రమశిక్షణ, సమయపాలన, రోజుకు 18 గంటలు కఠోర పరిశ్రమ, అవినీతిపట్ల వైముఖ్యంవంటి యన్.టి.ఆర్. విశిష్ట గుణాలను రచయితలు ఈ పుస్తకంలో పాఠకుల మనస్సులకు హత్తుకునేలా వివరించారు. ఆ విశిష్ట గుణాలన్నీ ఆయన రాజకీయ జీవితంలో కూడా భాగమయ్యాయి. తెలుగు చలనచిత్ర రంగంలో శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, దుర్యోధనుడు, కర్ణుడు, రావణాసురుడు, భీష్ముడువంటి పౌరాణిక పాత్రల్లో అద్వితీయంగా నటించి, కొన్ని ఉత్తమ చిత్రాలకు దర్శకత్వం వహించి, పురాణ పాత్రలను తెలుగు ప్రజల మనస్సులలో ప్రతిష్ఠించారు. మరుగున పడిన కొంతమంది పాత నటీనటులకు తన చిత్రాల్లో పాత్రలను ఇచ్చి ప్రోత్సహించారు. జాతీయ స్థాయిలో కె.వి. రెడ్డి తర్వాత మహత్తర పౌరాణిక చిత్రాల సృష్టికర్తగా పేరు తెచ్చుకున్నారు. వారి అడుగు జాడల్లోనే కమలాకర కామేశ్వరరావు, ఎం.ఎస్. గోపాలక్రిష్ణన్ (తమిళం)వంటివారు ఉత్తమ పౌరాణిక చిత్రాలను నిర్మించారు.

**రాజకీయ విజయాలు:**

మహోజ్వల సంస్కృతి కలిగిన తెలుగు వారి చరిత్రలో 1982 మార్చిలో ఒక నూతనాధ్యాయం ప్రారంభమయింది. 33 సంవత్సరాలు తెలుగు చరిత్రరంగంలో మకుటంలేని మహారాజుగా వెలుగొందుతూ, తన కీర్తిప్రతిష్ఠలకు కారకులైన సామాన్య ప్రజల బాధామయ జీవితాలకు, నాటి రాజకీయ పరిస్థితులకు వ్యాకులపడి, తన శేషజీవితాన్ని ప్రజాసేవలో సద్వినియోగ పరచాలనే సదాశయంతో రాజకీయాలకు ఒక అర్థం పరమార్థం కల్పించాలనే ధ్యేయంతో 9 మాసాల తెలుగుదేశం పార్టీ 35 సంవత్సరాలుగా రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ గుత్తాధిపత్యాన్ని బద్దలుకొట్టి 1983 జనవరి 9న రాష్ట్రంలో ప్రథమ కాంగ్రెసేతర ప్రభుత్వ స్థాపన సన్నివేశాలను కళ్లకు కట్టినట్లుగా రచయితలు ఈ పుస్తకంలో వర్ణించారు. రాజకీయంగా అనేక ఒడిదుడుకులకు లోనైనా, క్రమశిక్షణ, క్రమవర్తన, సమయపాలన, అవినీతిపట్ల వైముఖ్యం ఆయన రాజకీయ జీవితంలో కూడా భాగమయ్యాయన్న రచయితల మాటలు అక్షర సత్యాలు, నిరుపేదలకు కిలో బియ్యం రెండు రూపాయలకు ఇవ్వడం, మహిళా, ఆరోగ్య, తెలుగు విశ్వవిద్యాలయాలను

స్థాపించటం, తెలంగాణా ప్రజలను పట్టి పీడిస్తున్న పటేల్ పట్వారీల వ్యవస్థను రద్దుచేయటం, మహిళలకు ఆస్తిహక్కు కల్పించటం, తన కుటుంబ సభ్యులను రాజకీయాలకు దూరంగా ఉంచటం యన్.టి.ఆర్. కీర్తిప్రతిష్టలను ద్విగుణీకృతపరచాయని రచయితలు స్పష్టపరిచారు.

1974లో యన్.టి.ఆర్. పదవీభ్యుతుడైనప్పుడు అధికమైన ప్రజాసానుభూతితో సి.పి.ఐ., సి.పి.ఎం., బి.జె.పి.వంటి ఇతరత్ర పక్షాల మద్దతుతో అనారోగ్యంగా ఉన్నా రాష్ట్రమంతటా పర్యటించి, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం మహోధృతంగా తిరిగి ముఖ్యమంత్రిగా ఒక నెల రోజుల్లోనే ప్రమాణస్వీకారం చేయటం దేశ చరిత్రలోనే అపూర్వ విజయంగా రచయితలు ఆనాటి సంఘటనలను పాఠకులకు చక్కగా గుర్తు చేశారు. జాతీయ స్థాయిలో ప్రతిపక్షాల ఐక్యతకు విశేష కృషి చేసారు. రాజకీయ ప్రత్యర్థులు ఎన్ని రకాల అపవాదులు, అనుచిత విమర్శలు చేసినా యన్.టి.ఆర్. సహనం, నిగ్రహం కోల్పోయేవారు కాదు. తన జీవిత కాలంలో ఇందిరాగాంధీ పార్టీని మన రాష్ట్రంలో ఓడించగలుగుతారని తాను ఊహించలేదని మాజీ రాష్ట్రపతి సంజీవరెడ్డి యన్.టి.ఆర్.ను ప్రశంసించారు.


1974 జులై 18న టెక్సాస్ హార్ట ఇన్‌స్టిట్యూట్‌లో ప్రసిద్ధ కార్డియాక్ సర్జన్ డెంటన్‌కూలే యన్.టి.ఆర్.కు శస్త్ర చికిత్స చేశారు. డా. మాధుర్ ఆయనకు సహాయకునిగా ఉన్నారు. డా. సోమరాజు అనుక్షణం యన్.టి.ఆర్. చెంతనే ఉన్నారు. తదుపరి రోజుల్లో రాజకీయ ప్రత్యర్థులు ఆయనకు శస్త్ర చికిత్స అసలు చేయనేలేదని దుష్ప్రచారం చేశారు. ఇటువంటి విశేషాలన్నీ ఈ పుస్తకంలో పుష్కలంగా ఉన్నాయి. రాజీవ్‌గాంధీ హత్యానంతరం దుండగులు యన్.టి.ఆర్. ఎస్టేట్‌ను, తను కళాత్మకంగా నిర్మించుకున్న సినిమా థియేటర్లును ధ్వంసం చేసినా, యన్.టి.ఆర్. నిగ్రహం కోల్పోలేదు.

యన్.టి.ఆర్. తన ప్రసంగాల్లో తనకిష్టమైన రాయప్రోలు వారి గేయం "ఏ దేశమేగినా, ఎందు కాలిడినా, ఏ పీఠమెక్కినా, ఎవ్వరేమనినా పొగడరా నీ తల్లి భూమి భారతిని నిలుపరా నీ జాతి నిండు గౌరవము" తాదాత్మ్యంతో ఆలపించేవారు. "తెలుగుదేలయన్న... దేశభాషలందు తెలుగు లెస్స" అన్న శ్రీ కృష్ణదేవరాయల పద్యాన్ని శ్రోతల చప్పట్ల మధ్య పరవశిస్తూ పాడేవారు. చలనచిత్ర రాజకీయ రంగాల్లో అనితర సాధ్యమైన విజయాలను సాధించి, కొన్ని తప్పిదాలను కూడా యన్.టి.ఆర్. చేశారు. ఒకసారి ఒకే కలం పోటుతో 31 మంది మంత్రులను రాజీనామా చేయించారు.

కొన్ని నిర్ణయాలను నాటకీయంగా ఆవేశంతో అమాయకత్వంతో, అనుభవ రాహిత్యంతో తీసుకునేవారు. కాషాయ వస్త్రధారణ అందులో ఒకటి. రాత్రిళ్ళు క్షుద్రపూజలు, స్త్రీ వేషధారణ చేస్తున్నారని ప్రత్యర్థులు దుష్ప్రచారం చేస్తున్నా ఖండించలేదు.

అన్నిటికంటే పెద్ద తప్పిదం తన రెండవ భార్య విషయంలో జరిగింది. బసవతారకం మృతి తర్వాత, ముఖ్యమంత్రిగా విశేష సేవలందిస్తూనే ఒంటరి జీవితం గడిపారు. కొద్దిగా పక్షవాతం వచ్చిన సందర్భంలో తనకు సేవలు చేసిన వ్యక్తిని నమ్మి రెండవ వివాహం చేసుకున్నారు. ఆమె గృహిణిగా, సేవకురాలిగా పరిమితం అవ్వకుండా, రాజకీయాల్లో అనుచిత జోక్యం చేసుకుంటూ, యన్.టి.ఆర్.కు రాజకీయ వారసురాలిగా ఎదగాలని ప్రయత్నిస్తుంటే ఆమెను నియంత్రించలేకపోయారు. ఆమెను విశ్వసించి యన్.టి.ఆర్. తన పతనానికి తానే నాంది పలికారు. తప్పని పరిస్థితుల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత యన్.టి.ఆర్. ఆశయాలను విధానాలను అనుసరించి పేరు తెచ్చుకున్నారు. ఆహారం విషయంలో యన్.టి.ఆర్. క్రమశిక్షణ పాటించేవారు కాదు. మధుమేహం, అధిక రక్తపోటు, గుండెవ్యాధి, పక్షవాతం మొదలైన వ్యాధులున్నా తనకేం ఫరవాలేదనే ధీమాతో ఔషధాలు కూడా సరిగా వాడేవారు కాదు.

1996 జనవరి 17 రాత్రి నిద్రపోతుండగా 'కార్డియాక్




అరెస్ట్‌వల్ల హఠాన్మరణం పొందారనటంలో ఎలాంటి వివాదంలేదు. ఇటువంటి వివరాలన్నీ రచయితలు నేటి తరానికి తెలియచేసిన తీరు అభినందనీయం.

* * *

*కొన్ని చిన్న తప్పులు:* సుమారు 65 సంవత్సరాలుగా వార్తాపత్రిక పాఠకునిగా, ఉత్తమ చలన చిత్రాల పట్ల ఆసక్తి కలిగిన వ్యక్తిగా, ఈ పుస్తకాన్ని ఆ మూలాగ్రంగా పరిశీలించి ఈ పుస్తకంలో ఏవైనా కొన్ని చిన్న తప్పులైనా ఉంటాయని ఈ సమీక్షకుడు ప్రయత్నం చేయటం జరిగింది. ఆనాటి రాష్ట్ర ఆర్థిక మంత్రి కోన ప్రభాకరరావు 1948లో విడుదలైన 'ద్రోహి' చిత్రంలో హీరాగా నటించారని వ్రాశారు (257వ పేజీ). ఆ చిత్రంలో కె.ఎన్. ప్రకాశరావు హీరోగా నటించగా కోన ఒక విలన్‌గా నటించారు. మరోచోట మాజీ మంత్రి బొజ్జ గోపాలకృష్ణారెడ్డి అని వ్రాశారు. ఆయన ఇంటి పేరు బొజ్జల. ఇది అచ్చుతప్పు అయి ఉండవచ్చు.

మొత్తం మీద మహాసముద్రంవంటి యన్.టి.ఆర్. జీవిత గాథను శోధించి, అధ్యయనం చేసి నిష్పాక్షికమైన వాస్తవాలతో కూడిన ఈ 624 పేజీల బృహద్గ్రంథం రచయితలు కాటా చంద్రహాస్, కొడిదెల లక్ష్మీనారాయణ అభినందనీయులు. మంచి గెటప్, ముద్రణతో వెలువడిన ఈ పుస్తకం యన్.టి.ఆర్. పట్ల తెలుగు చలన చిత్ర రాజకీయ రంగాల పట్ల ఆసక్తిగల ప్రతి ఒక్కరూ చదవదగిన పుస్తకం.

* * *

**యన్.టి.ఆర్.**

సమగ్ర జీవిత కథ

*- కె. చంద్రహాస్, కె. లక్ష్మీనారాయణ*

*పేజీలు: 648, ₹: 400/-*

ప్రతులకు: అన్ని పుస్తక విక్రయ కేంద్రాలు.

**డా. పాటిబండ్ల దక్షిణామూర్తి**
**తెనాలి. ఫోన్**: 790 101 4749.

*75వ పుట తరువాయి....*

## శ్రీశ్రీతో నా జ్ఞాపకం


తెలుగుదేశం పార్టీ స్థాపించి ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన కాలం. ఆయన 'వేటగాడు' సినిమా రెండు వందల రోజులు ఆడింది కాబోలు. సికింద్రాబాద్ లోని పరేడ్గ్రౌండ్లో మధ్యాహ్నం మూడు గంటలకి ఉత్సవ సభ ఏర్పాటు చేశారు. ఆ కార్యక్రమం తిలకించడానికి నేనుంటున్న దోమలగూడ( దో మహల్ గూడ) గగన్మహల్ బస్తీ నుంచి చీకటి దత్తాత్రేయుడు అనే కవిగారితో కలిసి మిత్రబృందంతో ఆ సభకి ఉత్సాహంగా వెళ్లాను. ఎన్టీఆర్ నిలువెల్లా తెల్లని సూట్లో ఉన్నాడు. హీరోయిన్ శ్రీదేవి జిగేల్మనిపించే చీరకట్టులో వుంది. శ్రీశ్రీగారు నల్లప్యాంట్, తెల్లచొక్కాతో టక్కువేసుకొని, కొద్దిపాటి మాసిన గడ్డంతో అలసటగా కన్పించారు. ఆ సభకు ఆయన ముఖ్య అతిథి. అంతకు ముందే 'అల్లూరి సీతారామరాజు ' సినిమాకి ' తెలుగు వీర లేవరా దీక్ష బూని సాగరా' అనే గీతానికి జాతీయ స్థాయిలో ఉత్తమ గేయ రచయితగా అవార్డు పొందాడు. ఆనాటి సభావ్యాఖ్యాత సినారె తన గంభీర కంఠంతో 'శ్రీ అంటే విషం, శ్రీ అంటే అమృతం' అనే కవిత చదివి శ్రీశ్రీ విరాట్ స్వరూపాన్ని ఆవిష్కరించారు. లక్షలాది మంది జనం మధ్యన శ్రీశ్రీని చూడటం ఒక మరుపురాని అనుభవం. ఈ సభ వేసవిలో జరిగినట్టు జ్ఞాపకం. అదే సంవత్సరం జూన్ 15న శ్రీశ్రీ అస్తమించాడనే వార్త విన్నాను. భావోద్వేగాల్నీ, దుఃఖాన్ని ఆపుకోలేక బాత్రూమ్లో కూర్చుని ఏడ్చాను. ఇప్పటి తరానికి వింతగా వుండొచ్చుగానీ కవుల విషయంలో రచయితల విషయంలో మేమిలాగే స్పందించేవాళ్లం. ఈనాటి తరానికి సినీతారలు, క్రికెట్ తారలే ఆరాధ్యులు, నాతరంలో గొప్ప రచయితలూ, మేధావులు, కళాకారులు స్ఫూర్తిని కలిగించేవారు. అలాంటి కవితాస్ఫూర్తి నా సాహిత్య జీవితంలో శ్రీశ్రీ ఇచ్చాడు. ఇప్పుడు పెద్దయ్యాక అధ్యయనాలు అనుభవాలు, ఉద్యమాలు, వాదవివాదాలు, అస్తిత్వ వాదాలు వీటన్నిటి మధ్య శ్రీశ్రీని అధ్యయనం చేయడంలో కొత్త కోణాలు చూశాను. ఈ నాటి కొత్తతరం అడుగుతున్న ఎన్నో ప్రశ్నలకు 'ఏది సత్యం ? ఏది అసత్యం?' అనే మీమాంస శ్రీశ్రీ విషయంలో నిత్యం వెంటాడుతూనే ఉంటుంది. ఏది ఏమైనా చిన్ననాటి శ్రీశ్రీ జ్ఞాపకం మాత్రం నాలోంచి చెరిగిపోలేదు.

ఆచార్య ఎండ్లూరి సుధాకర్, హైదరాబాద్. ఫోన్: 850 019 2771

# ప్రాణం రంగు ?

– కిల్లాడ సత్యనారాయణ

ప్రాణం తియ్యగా ఉంటుందా? పుల్లగా ఉంటుందా? ఊపిరి ఆగిపోయిన జార్జి ఫ్లాయిడ్‌నడుగు. బంకర్లో దాక్కొన్న ట్రంప్‌నడుగు. ఎంత తియ్యనో చెబుతారు. ఎంత వెన్నెలో చూపుతారు. గొంతును నులిమేస్తున్న మోకాళ్ళనో, ఊచకోత కోస్తున్న కత్తినో అడిగితే ఏం చెబుతుంది? ప్రాణం చేదు అంటుంది. ప్రాణం చీమ అంటుంది. ప్రాణం కరివేపాకు అంటుంది. ఒక్క కానిస్టేబుల్. వాడి దుశ్చర్య. అమెరికా అంతటినీ రోడ్డు మీదకు ఈడ్చింది. వందల మైళ్ళు నడచి, అలసి, సొలసి ఆకలితో, దాహంతో, నొప్పితో ప్లాట్ ఫామ్ మీదే ఎముకల గూడైపోయిన తల్లిదీ ప్రాణమే. ఆ తల్లి లేస్తుందని, లేచి పాలిస్తుందని, పోషిస్తుందని నిమురుతూ, లేపుతూ తల్లి చుట్టూ ఆశగా తిరుగుతున్న చిట్టి తల్లిదీ ప్రాణమే. మేరీ అన్తోనేట్‌కేం తెలుసు ప్రాణం విలువ? రాబ్ స్పియర్ చేతుల్లో వీధుల్లో తిరిగిన 16వ లూయిస్ తలకు తెలుసు ప్రాణం విలువ. శిలువేసిన చేతులక్కాదు, శిరసెత్తిన దేహానికి తెలుసు ప్రాణం రంగు. యూదులకు ఒక నీతి, నీగ్రోలకు ఇంకొకటా. హిట్లర్ చేస్తే తప్పు. తెల్లవారు చేస్తే ఒప్పు. అంటరానితనం ఇంకా ఎందుకు బ్రతికుంది? రంగును బట్టి నీతులు మారతాయా? ఖండమేదైతేనేం? ఖండితం చేయడమే కర్మమా? తోకచుక్కలు కూడా ప్రశ్నిస్తాయి. కుందేళ్లు కూడా గర్జిస్తాయి - ప్రవాహ గతిని మనం విననప్పుడు. నిశ్చల తటాకంలో రాయి విసిరినప్పుడు. ఇప్పుడు శిలలు కూడా పరిగెడుతున్నాయి. నువ్వు కళ్లు మూసుకున్నావు. అది నీ తప్పు. ఇప్పుడు చెప్పులు కూడా బుసకొడుతున్నాయి. నువ్వు చెవులు మూసుకున్నావు. అది నీ తప్పు. కళ్లు, చెవులూ మూసుకున్నామని గడియారం ముల్లు ఆగిపోతుందా? సముద్రం హోరు శాంతిస్తుందా? నువ్వూ నేనూ ఏం చూశాం జీవితాన్ని? తెల్లారక ముందే బెడ్ కాఫీ. కాలు కదపనక్కర్లేకుండా కార్లు. ఆలోచన మొలవనక్కర్లేదు. అంగట్లో అన్నీ. మన మాంసాన్నే మనం తిని బతకాల్సిన జీవితాన్ని విన్నామా? మన మూత్రాన్నే మనం తాగి ఊపిరి తీసుకున్న బ్రతుకును కన్నామా? అలాంటి పరిస్థితుల్లో కూడా బతకాలని తాపత్రయ పడతారే... వాళ్ళది అసలు సిసలు ప్రాణమంటే. ఆష్ విజ్ హోలోకాస్ట్ నుండి బయటపడ్డ విక్టర్ ఫ్రాంకెల్ ఆ కోవలో వాడే. క్యాంప్‌లో అతను అడుగు పెట్టగానే ఒక పెద్ద అరుపు. 'మీకు రెండు నిమిషాలు. మీ ఒంటి మీదున్న అన్నింటినీ విడవాలి, బట్టలతో సహా' రెండు నిమిషాల్లో నగ్న విగ్రహాలయ్యారు. ఆ తర్వాత గుండు చేశారు. కనుబొమ్మలతో సహా శరీరం నున్నటి రాయిలా గీకివేశారు. ఇప్పుడు పోగొట్టుకొనేందుకు తన దగ్గర ఏమీ లేదు, ఒక్క నగ్న శరీరం తప్ప. గజగజ వణికించే చలి. కప్పుకోడానికి ఏమీ లేదు. మలాన్ని దూరంగా మోసుకెళ్ళేవారు. అది ముఖం మీదకు తుళ్లేది. అసహ్యించుకుంటే కొరడా దెబ్బలు. ఫ్రాంకెల్ ఒకసారి పులుసు త్రాగుతుంటే, కిటికీలో నుండి ఒక పిల్లాడి శవం పడింది. తిండి కోసం నానా తంటాలు పడేవారు. చిత్రహింసలు అనుభవించాడు.



Indian Support for George Floyd, While We Remain Silent on Violence at Home, Is Hypocritical, Performative Wokeness

కాన్‌సెంట్రేషన్ క్యాంప్‌లో చలికి, ఆకలికి, గ్యాస్ చాంబర్ బాధలకి చాలామంది ప్రాణాలొదిలారు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత కాన్ సెంట్రేషన్ క్యాంప్ నుండి ఫ్రాంకెల్ బయటపడ్డాడు. అప్పుడు "అర్థం కోసం అన్వేషణ" (Man's search for meaning) రాశాడు. అందులో జర్మన్ తత్వవేత్త నీషే మాటలు ఉటంకించాడు. "ఎందుకు జీవించాలో తెలిసినవాడు, ఎంతటి కష్టాన్నైనా భరించగలడు".

ఎన్ని ప్రాణాలు ఊపిరొదలాలి ప్రాణం రంగు మనకు తెలియాలంటే. ఎంత నెత్తురు పారితే తెలుస్తుంది - నెత్తురు ఎక్కడున్నా, ఎవరిలోనైనా ఎరుపే అని. ఎన్ని దశాబ్దాలు, ఎన్ని శతాబ్దాలు. అగ్రరాజ్యమైనా, ఆఫ్రికా దేశమైనా వీధుల్లో జాత్యహంకారం విచ్చలవిడిగా తిరుగుతోంది. ఎందుకని? కొందరికి చప్పట్లు ఆగిపోతే గుండె చప్పుళ్ళు ఆగిపోతాయి. కొందరికి సుఖం ఎండిపోతే గొంతు తడి ఆరిపోతుంది. ఇవన్నీ ఉన్నవాళ్ళకి చిటికెడు ఆర్ద్రత కొదవైతే, ఒళ్ళు కొయ్యబారుతుంది. ప్రాణం తీసుకోడానికి, ప్రాణం తీయడానికి కారణాలు కొల్లలు. ప్రాణం పొయ్యడానికి, ప్రాణం పెంచడానికి ప్రేమ ఒక్కటి చాలు. చంపడానికి, చావడానికి మధ్య నిశ్శబ్దం. ఊపిరికి ఊపిరికి మధ్య నిశ్శబ్దం. ఊపిరి కోరుతున్న నోటికి, కావలసిన తిత్తులకు మధ్య నిశ్శబ్దం. మరణం తర్వాత కూడా నిశ్శబ్దం. ఈ నిశ్శబ్దాలను వినే హృదయమేది? అందుకే మరణ మృదంగం.

సినిమా సగంలో ఆపేస్తే? హాల్లో కుర్చీలు గాల్లో ఎగురుతాయి. జీవితాన్ని మొగ్గలోనే తుంచేస్తే..... హ్యాపీ ఎండింగ్ మాట? సినిమాలు, సీరియళ్లు... కొట్టడం, చంపడం. ఇదే హీరోయిజం. హింసకు అంత మార్కెట్ ఉందా? ఆటైనా, పాటైనా, సినిమా ఐనా, జీవితమైనా కడదాకా సాగితేనే అందం. రనౌట్ అయితే గుండె తీగను కత్తిరించినట్లే. అందుకే జీవితాన్ని కెలెడియోస్కోప్‌లో చూడు. గజిబిజిగా రంగు రంగులు కనిపించొచ్చు. గమనిస్తే వాటిలో ఒక పాటర్న్ ఉంటుంది. అదే జీవన సౌందర్యం. ఎవడురా ప్రాణాలకు విలువ కట్టేది? మృగాలే కట్టవు. మనం మనుషులం. హెచ్చు తగ్గులేంటి? నీచ కమీనాలేంటీ? నువ్వూ నేనూ వీడు వాడూ అందరం అన్నదమ్ములం. అక్కా చెల్లెలం. అన్నా చెల్లెలం. మూలం ఒకటే. ప్రాణమంటే ఊపిరి తీసుకున్నప్పటి నుంచి ఊపిరి పోయిందాకా చేసే ప్రయాణమేనా? మమకార మాధుర్యం ఉండక్కర్లేదూ? కిళ్లీ తిన్న తర్వాత పండిన నాలుకలా నవరసాలతో జీవితం పండనక్కర్లేదూ? హింస ఏ రూపంలో ఉంటేనేం? ఏ చేతిలో ఉంటేనేం? ఏ లక్ష్యం ఐతేనేం? హంసలాంటి మానవత్వాన్ని పొరలు పొరలుగా ఒలిచి, పరిచి, కరిచి, చెరచి పీల్చి పిప్పి చేయడమే కదా హింస నిజస్వరూపం. రాజ్యం బాంబులేసి ఊర్లని బూడిద చేస్తే ఎలా రైటు? రాజ్యం ముద్రపూసుకున్న మృగం నిస్సహాయుల్ని నమిలేస్తుంటే ఎలా తప్పు కాదు? పదవిని బట్టీ, పెదాలను బట్టీ రంగులు మారే విలువలు మిణుగురు కాంతులే.

పక్షపాతం పక్షవాతంరా బాబూ. నా కులమూ, నా మతము, నా రంగు, నా జాతి, నా దేశం... ఈ నా నా గజ్జి ఎప్పుడు పోతుంది? నువ్వు చావు బతుకుల మధ్య టపటపా కొట్టుకుంటుంటే ఈ నా లో ఒక్కటీ కనబడదే. అప్పుడు ఎవ్వడో మనిషన్నవాడు నీ కన్నీళ్లను తుడుస్తాడు. అలాంటప్పుడు వివక్ష ఎందుకు? స్త్రీల పట్ల. వృద్ధుల పట్ల. కొన్ని కులాల పట్ల. కొన్ని వర్ణాల పట్ల.

కళ్ల తెరు ఇకనైనా. లేకుంటే నీ కన్నీళ్లు తుడిచే మనిషి వివక్షలో మసైపోతాడు చూడు. ఒక్క మృగాన్ని వదిలెయ్యడం వల్ల ఎన్ని ఊర్లు తగలడుతున్నాయో.

అమెరికాకైనా, అంబాజీపేటకైనా ఒకటే రూలు. అడవి మృగాల్ని స్వేచ్ఛగా వీధుల్లో తిరగనీయకు. హింస భయానికి పుట్టిన బిడ్డ. భయాన్ని తొలగిస్తే ప్రేమ పరిమళిస్తుందా? లేదు. చీకటిని పోగొట్టాలంటే దీపం వెలిగించాలి. అంతేగాని చీకటిని వెళ్లగొట్టడంవల్ల వెలుగు రాదు. శాంతిలో కదా ప్రాణం పుష్పిస్తుంది. ఏ ఏదేశమేగినా ఎందు కాలిడినా... ఏ వూరు వెళ్లినా, ఏ కుటుంబం చూసినా - సెంటు భూమి కోసమో, బకెట్ నీళ్ల కోసమో కత్తులు దూస్తున్నారు. తుపాకులు పేలుస్తున్నారు. ప్రాణాలు తీస్తున్నారు. ప్రాణాలు ఒదులుతున్నారు. యుగాలు మారినా బుద్ధులు మారడం లేదెందుకని? ఇంతకన్నా మెరుగ్గా, శాంతిగా ఉండలేమా?

*ఎక్కడ మనసు నిర్భయంగా ఉంటుందో / ఎక్కడ మనుషులు తలెత్తి తిరుగుతారో / ఎక్కడ జ్ఞానం విరివిగా వెలుస్తుందో / సంకుచిత కుడ్యాల నడుమ / ఎక్కడ ప్రపంచం భాగాల కింద విడిపోలేదో...*

అని విశ్వకవి రవీంద్రుడు గొంతు చించుకుని చెప్పాడు. వినబడలేదా? విశ్వకవి గోడలు పగలగొట్టమంటున్నాడు. మనం పాత గోడలకు రంగులేస్తున్నాం. వీలైన చోట

కొత్త గోడలు కడుతున్నాం. మనిషిని మనిషిగా చూడ్డం ఇక సాధ్యమే కాదా? టెక్నాలజీ గ్రామాన్ని గ్లోబునీ ఒకటి చేసింది. కొరోనా గ్లోబంతా పీలుస్తున్నది ఒకే వాయువని నిరూపించింది. ఇంకా ఏం చేయాలి, నీ రంగు పిచ్చి పోడానికి. పాఠ్యపుస్తకాలు మార్చుదాం. మనిషిని మనిషి గౌరవించడం నేర్పుదాం. 'పాపిని కాదు, పాపాన్ని ద్వేషించు' అని చెప్పుదాం. రంగులన్నీ కలిసి ఉన్న ఒక కపోత వర్ణం వెలిగిద్దాం.

(అమెరికాలో 25/5/20న జార్జ్ ఫ్లాయిడ్ హత్య తరువాత పెల్లుబికిన జన సముద్రానికి స్పందించి)

కిల్లాడ సత్యనారాయణ, మంగళగిరి. ఫోన్: 833 398 7838.

*6వ పేజీ తరువాయి...*

**మిసిమి ముత్యాలసరం - 2015 - 2019**

| సంవత్సరం - సంచిక | వ్యాస శీర్షిక | రచయిత / రచయిత్రి |
|---|---|---|
| 2015 - మే | 1. మానసిక రుగ్మతలు బుధుని దివ్యౌషధాలు<br>2. ధర్మావరణం | - చంటిగారి శ్రీనివాసరెడ్డి<br>- డి. చంద్రశేఖర్ |
| " - జూలై | 1. జీవనయానం<br>2. సాహిత్యము - సైన్సు | - డా. దాశరథి రంగాచార్య<br>- ప్రొ. చందు సుబ్బారావు |
| " - ఆగస్ట్ | 1. మన పురాణాల్లో నిజాలు<br>2. నేనెందుకు రాస్తాను<br>(రెండు భాగాలు) | - సాయి పాపినేని, జయశ్రీనాని<br>- ఎస్.ఎన్. భైరప్ప<br>(ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ) |
| " - సెప్టెంబర్<br>" " | 1. మానవతావాదం - శాస్త్రీయ దృక్పథం<br>2. సామినేని ముద్దుకృష్ణ<br>3. మా అమ్మ ఓబుళమ్మ | - రావిపూడి వెంకటాద్రి<br>- ఆరుద్ర<br>- కోడూరు పుల్లారెడ్డి |
| " - అక్టోబర్ | 1. సాహిత్యం - ఒక కళ: ఆర్థర్ షోపెన్ హావర్<br>(మూడు భాగాలు) | - ముక్తవరం పార్థసారథి |
| " - నవంబర్ | 1. జీనోమ్ కథనం | - ముక్తవరం పార్థసారథి |
| " - డిసెంబర్ | 1. ప్రథమాంధ్ర నాటక కళాపరిషత్ - అధ్యక్షోపన్యాసం | - చట్టి చినపూర్ణయ్య పంతులు |
| 2016 - జనవరి | 1. హంపీ నుంచి హరప్పాదాక<br>- డా. తిరుమల రామచంద్ర<br>2. వేదనాదం<br>3. జానపద నాటక సాహిత్యం | - రావినూతల సత్యనారాయణ<br><br>- డా. దాశరథి రంగాచార్య<br>- ఎన్. భక్తవత్సల రెడ్డి |
| " - ఫిబ్రవరి | 1. నాటకం అంటే? భారతీయ దృక్కోణం<br>2. భవాని | - ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ<br>- వల్లభనేని అశ్వినీకుమార్ |
| " - మార్చి | 1. ఆంధ్ర నాటక రంగ చరిత్ర<br>2. కథలెందుకు | - శ్రీనివాస చక్రవర్తి<br>- వల్లభనేని అశ్వినీకుమార్ |
| " - ఏప్రిల్ | 1. పీఠిక<br>2. వారసత్వం | - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం<br>- సాయి పాపినేని, జయశ్రీనాని |

గానకోకిల

# వేదవతి ప్రభాకర్

*– మంతెన సూర్యనారాయణ రాజు*

'గానకోకిల' బిరుదాంకితురాలు వేదవతి ప్రభాకర్ గురించి తెలియని రేడియో శ్రోతలు సంగీతకారులుగాని ఉండరనుకుంటా! ఈమె బెంగుళూరు - మైసూరుల మధ్యనున్న రామ్‌నగర్‌లో శ్రీ కంఠయ్య, రుక్మిణి దంపతులకు 8/11/1942లో జన్మించారు. వేదవతి లాలిపాటలను గానం చేయడంలో మేటి. తాను పుట్టింది కన్నడ దేశంలో అయినా ఆంధ్రప్రదేశ్ మెట్టినిల్లయింది. వేదవతి తండ్రి ఎయిర్ ఇండియాలో పనిచేస్తున్నందున పిల్లలంతా బెంగళూరులోనే ఉండేవారు. అక్కడ వారి ఇంటికి సమీపంలో 'గానసమాజ' ఆడిటోరియం ఉండేది. ఆమె తన సోదరీమణులతో పాటు తండ్రితోనూ అక్కడికి వెళుతుండేది. ఎక్కువగా ప్రతి ఆదివారం అక్కడ ప్రోగ్రాములు జరుగుతుండేవి.



వేదవతి ప్రభాకర్

ఆ గానసభలో కుటుంబ సభ్యులతో పాటు వేదవతి ఎమ్.ఎస్. సుబ్బులక్ష్మి, డి.కె. పట్టమ్మాళ్‌వంటి ప్రసిద్ధ గాయనీమణుల, గాయకుల కచేరీలకు వెళ్ళేది. అక్కడి నుంచి తిరిగి వచ్చాక 'పాడితే అలా పాడాలి' అని శ్రీ కంఠయ్యగారు అనేవారు. ఆమె నానమ్మ కూడా వేదవతికి పాటలు నేర్పేది.

వేదవతి గారి ఇంట్లో అందరికన్నా ఆమె కంఠమే మాధుర్యంగా ఉండేదని ఆమె చెప్పుకున్నారు. ఆ కారణంగా సంగీత విద్వాంసురాలు జి. చెన్నమ్మ గారి వద్దకు వేదవతిని కర్ణాటక శాస్త్రీయ సంగీతాధ్యయనం నిమిత్తం పంపించారు. పదేళ్ల వయసులోనే ఆమెకు సంగీత శిక్షణ ప్రారంభించబడింది. తండ్రికి బదిలీల ఉద్యోగమాయె. అందుచేత ఆమెను వాళ్ళ అమ్మమ్మ గారి ఇంట్లో ఉంచి మిగిలిన సంతానంతో వారు తిరిగేవారు. వాళ్ల పిన్నితో పాటు వేదవతి సంగీత సాధన చేస్తుండేది. అనంతరం రమాపతి మాస్టారు అనే ఆయన ఆమెకు త్యాగరాజ కృతులు నేర్పేవారు. అవి ఇంచుమించు తెలుగు భాషలోనే ఉన్నందున ఈమెకు అర్థం కాకున్నా వారు చెప్పిన బాణీలో పాడటం అలవర్చుకున్నారు. తన బి.ఎ. పట్టా తీసుకున్నాక కొంత కాలానికే రొద్దం ప్రభాకర్‌రావుతో (అనంతపురంవాసి) వేదవతి గారికి వివాహం జరిగింది.

వైవాహిక జీవితం ఆరంభమయ్యాక కూడా వేదవతీ ప్రభాకర్ అత్తమామలకు సంగీతం అంటే పంచప్రాణాలు. పైగా వారిది కళాకారుల కుటుంబం. ఆమె మామగారు హనుమంతరావుగారు న్యాయవాది. ఆయన అన్న రాజారావు మంచి నటులు. ఈమెకు అత్తారింటికి వెళ్లేనాటికి కన్నడం తప్ప తెలుగు అసలు రాదు. అయితే కోడలి అభిరుచి యెరిగిన ఆయన ఒక గురువును పెట్టి కొన్ని కృతులు నేర్పించారు. ఆ తర్వాత ఆమె తొలిసారిగా కాపురం పెట్టింది కందుకూరులోనే. కళాకారులకు బదిలీల జీవితం తప్పనిసరి. విజయవాడలో ఆమె ఉన్నప్పుడు నాటి రాష్ట్రపతి వి.వి. గిరి గారి ధర్మపత్ని ఒకరు మహిళా సంఘం ప్రారంభోత్సవానికి వచ్చారు. న్యాయంగా ఆ సభలో ప్రసిద్ధ రేడియో గాయని శ్రీరంగం గోపాలరత్నం గారు పాడాల్సి ఉంది. అప్పటికి ఆమె ఆరోగ్యం పాడై అక్కడికి రాలేకపోయారు. అక్కడున్నవారంతా వేదవతిని పాడమని అడిగారు. ఇంక పాడక తప్పదనిపించింది ఆమె ఒక త్యాగరాజస్వామి కృతి పాడారు. అప్పటికీ ఆ కార్యక్రమం ముగిసింది.

ఆకాశవాణి ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ వేదవతి ప్రభాకర్ గారిని సంప్రదిస్తూ "మీరు బాగా పాడారు - రేడియో ఆడిషన్ కోసం ఎందుకు ప్రయత్నించకూడదు" అన్నారు. అప్పటికే ఆమె తెలుగు కొంచెం-కొంచెంగా మాట్లాడగలుగుతుండేవారు. అందువల్ల తెలుగు పాటలు పాడలేనన్న అనుమానాన్ని వేదవతి వ్యక్తం చేశారు. అప్పుడు గోపాలరత్నం గారి సోదరులు గోవిందాచార్యులు

గారు రోజు మా ఇంటికి వచ్చి పాటలు, అర్థాలు తెలుసుకుంటూ, ఉచ్చారణలో మెలకువలు తెలుసుకోమని ప్రోత్సహించారు. అప్పుడు ఆమె ప్రతి పాటను తన మాతృభాష కన్నడంలోకి వ్రాసుకుని ప్రాక్టీస్ చేస్తూ ఉండేది. ఆ విధంగా వేదవతి పదిహేను పాటలు అధ్యయనం చేశాక విజయవాడ ఆకాశవాణి ఆడిషన్‌లో అర్హతను సంపాదించుకున్నారు. ఆ ముచ్చట తీరాక వేదవతీప్రభాకర్ తొలిసారిగా 'భక్తి రంజని'లో పాడారు. అనుకోకుండా భర్త ప్రభాకర్‌గారికి ఉద్యోగరీత్యా హైదరాబాద్ బదిలీ అయింది. హైదరాబాద్ ఆకాశవాణిలో పా.ప. గారి సోదరుడు పాలగుమ్మి విశ్వనాథం, చిత్తరంజన్ గారలు లలితగీతాల రూపకల్పన చేసి ప్రాణం పోసేవారు. ఆనాటి జానపద విభాగంలో వింజమూరి సీత వేదవతి గాయనిగా తీర్చిదిద్దుతూ లలిత గీతాలు ఆలపించడంలోని మెలకువలను చెబుతుండేవారు. విశ్వనాథంగారి ఆధ్వర్యంలో పి. సావిత్రి, ఎ.వి. సావిత్రిగార్లతో ఈమె ఇచ్చిన ఒక ప్రోగ్రాం - కోపల్లె శివరామ్ గారి 'కృష్ణాష్టమి' సందర్భంగా చేసిన మరొక ప్రత్యేక కార్యక్రమం వేదవతి ఆకాశవాణి శ్రోతలకు సన్నిహితంగా చేశాయి. ఇప్పుడు చెప్పుకున్న రెండు ప్రోగ్రాముల్లో యశోద - చిన్ని కృష్ణయ్యకు చెప్పే సన్నివేశంలో తాను పాడిన 'కన్నడ కథ చెప్పనా... కమ్మని కథలే చెప్పనా' పాట చాలామంది శ్రోతలను అలరించింది. దాంతో ఆమె ఆకాశవాణి గాయనిగా ప్రసిద్ధికెక్కింది.

పాలగుమ్మి విశ్వనాథం కొన్ని మీరా భజన పాటలు పాడిస్తే వాటిని విన్న హెచ్.ఎమ్.వి. మంగపతి వేదవతిగారిని కలిసి - ఒక ఇ.వి. కార్డు కొరకు నాలుగు 'మీరాభాయి' భజనల్ని పాడమన్నారు. అది కూడా సుప్రసిద్ధ సినీ సంగీత దర్శకులు - పెండ్యాల నాగేశ్వరరావు గారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు - ఆమె అది అదృష్టం భావించింది. వేదవతి భర్తకు తిరిగి హైదరాబాద్ నుంచి విజయనగరం బదిలీ అయింది. ఎలాగైనా ఆ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలి అని ఆమె చెన్నై వెళ్లి వింజమూరి అనసూయగారింట్లో ఉంటూ పెండ్యాల వారి ఇంటికి వెళ్ళేది. రోజుకు ఒకటి చొప్పున ఆయన సహాయకుడు ఎం.ఎల్. నరసింహం ఆమెతో ప్రాక్టీస్ చేయించేవారు. అక్కడే తింటూ - రోజంతా ఆమె మీరా భజనలు సాధన చేసేది. వారు ఆమెను ప్రేమతో ఆదరించినందువల్ల పాడిన నాలుగు భజనలు ఎంతో రక్తికట్టాయి. ఆ మీరా భజనల్లో ఒక్కో పాటకూ ఒక్కో ప్రత్యేకత ఉన్నది. ముఖ్యంగా షహనాయి, మురళి, సితార్, మువ్వలు ప్రత్యేకంగా ఒక్కో భజనలో హైలెట్ చేస్తూ పాడించారు. అవి నేటికీ ఆకాశవాణి వారు ప్రసారం చేస్తూనే ఉన్నారు.

ఆమె మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారితో కలిసి 'భద్రాచల సుప్రభాతం' ఆలపిస్తే పాలగుమ్మి వారి రచన, సంగీత బాణీలు కూర్చిన ''అమ్మదొంగా... నిన్ను చూడకుంటే నాకు బెంగా..'' పాట పాడించారు. ఆ పాటకు ప్రేక్షక శ్రోతల నుంచి ఊహించని స్పందన రావడం విశేషం. నేటికీ ఆమె ఏ కచేరీకి వెళ్ళినా ఆడియన్స్ ఈ పాటనే పాడమంటూ అడుగుతుండటం పరిపాటి. వేదవతి జి.వి. అయ్యర్ నిర్మించిన *ఆదిశంకరాచార్య* చిత్రంలో ఆలపించిన సంస్కృత శ్లోకాలు, కన్నడంలో పాడిన దాస కృతులు తనకు ఎంతో పేరు తెచ్చి పెట్టినట్లుగా ఆమె ఇప్పటికీ చెబుతుంటారు. దినదిన ప్రవర్ధమానమవుతూ ఆమె 'శాండిల్య'గారి నిర్వహణలో అన్నమయ్య ట్రస్టు ఏర్పడిన అనంతరం బర్మింగ్ హామ్ - లండన్‌లోని భారతీయ విద్యాభవన్‌లో ఒక ప్రోగ్రాం జరిగింది. అక్కడికి వెళ్ళిన కళాకారులతోపాటుగా, గాయనిగా ఈమెను ఎంపిక చేశారు. ఆమె కచేరీ ముగియగానే టంగుటూరి సూర్యకుమారి (సుప్రసిద్ధ గాయని) స్టేజి నుంచి కచేరీ ముగించి వచ్చిన వేదవతి ప్రభాకర్‌ని ఆలింగనం చేసుకుని అభినందనలు తెలిపారు. ఇంకో ఇంటర్నేషనల్ ఫోక్ ఫెస్టివల్‌ను ఢిల్లీ ఐ.సి.సి.ఆర్. వారు నిర్వహించిన సందర్భంగా ఈమె వాయువ్య ఆసియా దేశాలయినటువంటి బాగ్దాద్, సిరియా, టర్కీ, తునీషియాలాంటి దేశాలు పర్యటించారు.

ఇప్పటికీ ఆమె కుటుంబంతో కాలక్షేపం చేస్తూ ఆనందంగా ఉన్నారు.

డా. మంతెన సూర్యనారాయణ రాజు, ఫోన్: 998 954 2228.

# వేనరాజు – ఖూనీ రూపకాలు

– పి.సి. వెంకటేశ్వర్లు

మనిషి తన వివేచనాశక్తితో ప్రశ్నించడం మొదలు పెట్టినప్పటి నుండి వాద ప్రతివాదాలనే భావనలు సమాజంలో ఆరంభమయ్యాయి. చారిత్రకంగా పరిశీలించినప్పుడు సమాజ గమనంలో ప్రచారంలోకి వచ్చిన ధార్మిక సిద్ధాంతాలు, వాటిని సూటిగా ప్రశ్నించిన ప్రత్యేక వాదాలు మనకి భారతదేశంలో కనిపిస్తున్నాయి. చార్వాకం, బౌద్ధం, జైనంవంటివి ఈ కోవకు చెందినవే. తార్కికంగా ఆలోచించినప్పుడు, వాస్తవంగా పరిశీలించినప్పుడు సత్యాన్ని నిగ్గుతేల్చేటప్పుడు సిద్ధాంతాలు-పూర్వపక్షాలు కనిపిస్తాయి. బహుశా శాస్త్రవేత్తలైన న్యూటన్, ఐన్‌స్టీన్‌వంటివారు ఈ కోణం నుండే ఆలోచించి రాకెట్ ప్రయోగ సిద్ధాంతాలను, ఉపగ్రహ నియమాలను రూపొందించి ఉంటారు. ఇలాంటి వాద-ప్రతివాద కోణం నుండి పరిశీలించినప్పుడు ప్రతి రంగంలోను రెండు విభాగాలు స్పష్టంగా కనిపిస్తాయి. అలాంటివే మనకు తెలుగు సాహిత్యంలో కనిపిస్తున్న భావ, భౌతికవాద దృక్పథాలు. తెలుగు సాహిత్యంలోని రచయితలు కొందరు సనాతన సంప్రదాయవాదాన్ని సమర్థించే భావవాదులుగా, వాస్తవికతను, భౌతికతత్వాన్ని నేపథ్యంగా చేసుకొని ముందుకు సాగిన అభ్యుదయవాదులుగా కనిపిస్తున్నారు. తాజమహల్‌లోని ప్రేమతత్వాన్ని, సౌందర్యాన్ని చూడమని భావవాదం చెబితే, దాని నిర్మాణం కోసం చెమటను చిందించిన కూలీల కష్టాలను చూడమని చెబుతుంది భౌతికవాదం. ఇలాంటి రెండు పరస్పర విరుద్ధమైన దృక్పథాల నుండి వచ్చిన రచన-ప్రతిరచనలే విశ్వనాథ సత్యనారాయణగారి 'వేనరాజు' నాటకం త్రిపురనేని రామస్వామి చౌదరిగారి 'ఖూనీ' నాటిక. వీటిలోని వాద-ప్రతివాదాలను తెలుసుకోవడం ఈ వ్యాసోద్దేశం.

విమర్శ అనేక రకాలుగా సాగుతుంది. ఒక కాలంలో వచ్చిన రచనలను ఆ కాలంలోని విమర్శనా సామాగ్రితోనే వర్ణనాత్మకంగా విమర్శించడం ఒక పద్ధతి. ఒకే కాలంలోని రచనలను నేటి కాలానికి సమన్వయం చేసి విశ్లేషించడం. మరో పద్ధతి. ఒకే కాలంలో వచ్చిన రచనల మధ్య పోలికల్ని, భేదాల్ని తులనాత్మకంగా పరిశీలించి అందులోని వాస్తవాలను పాఠకుడికి చెప్పడం ఇంకో పద్ధతి. ఈ వ్యాస మూడో విభాగానికి చెందింది. ఎఱ్ఱన, సోమన రాసిన హరివంశాల్ని పరిశీలించడం, మను-వసుచరిత్రలను తులనాత్మకంగా బేరీజు వేయడం వ్యత్యాసాలను గుర్తించడంవంటివి ఒక కాలంలోని ఒకే విధమైన రచనల్ని పరిశీలించడానికి ఉదాహరణలుగా చెప్పవచ్చు. అలా కాకుండా పన్నెండు, పదమూడు శతాబ్దాల్లో హైందవంలోని శైవ, వైష్ణవ మతదృక్పథాలతో వచ్చిన రచనల్ని, అందులోని ఖండనల్ని పరిశీలించడం మరోక విధమైన తులనాత్మక పద్ధతి. ఒకనాటి ధర్మాన్ని పునరుద్ఘాటిస్తూ, ఆ కాలంలో పాటింపబడ్డ ధార్మిక విధానాల్ని అనుసరించడం ఉత్తమమని చెప్పే విశ్వనాథవారి 'వేనరాజు' నాటకం, అదే ఇతివృత్తాన్ని హేతువాద దృష్టితో చూస్తే ఎలా ఉంటుందో చెప్పే త్రిపురనేని వారి 'ఖూనీ' నాటిక రెండింటిలోను ఇతివృత్తం ఒకటే అయినప్పటికీ, నాయకుడు ఒకడే అయినప్పటికీ, వాద-ప్రతివాదాలు వ్యతిరేక దిశల్లో సాగాయి. అయితే ఈ రెండు రూపకాలకు మూలం భాగవతంలోని చతుర్థస్కంధం. ఆ కథను తెలుసుకుంటేగానీ, ఇద్దరు కవులు దాన్ని ఎలా తమ ఆలోచనలకు అనుగుణంగా మార్చుకున్నారో అర్థంకాదు.

తెలుగులో పోతన స్వతంత్ర రచనలాగా రూపొందించిన భాగవత పురాణంలో నాల్గవ స్కంధంలో 'వేనుడు' అనే రాజు కథ ఉంది. రాజర్షి అయిన అంగరాజు అశ్వమేధయాగం చేస్తుంటే దేవతలు హవిస్సులు తినడానికి రాకపోవడం, అందుకు కారణాన్ని ఆయన ఋషులను అడగడం, వారు సంతానం కోసం యాగం చేయమనడం, ఆ రాజు భార్య సునీథాతో కలిసి హోమం చేయడం, దివ్యపురుషుడిచ్చిన పాయసం వల్ల ఆ దంపతులకు వేనుడు పుట్టడం జరుగుతుంది. అతడు చిన్నతనం నుండి అధర్మమార్గంలో పెరగడం, తన ఈడుపిల్లల్ని దయలేకుండా కొట్టడం, అవసరమైతే చంపడం, ధనుర్బాణాలతో సాధుమృగాల్ని వధించడం చేస్తుంటాడు. కొడుకు తత్త్వం నచ్చక అంగరాజు రాజ్యం విడచి వెళ్ళిపోతాడు. రాజులేని రాజ్యంలో ప్రజలు పశువుల్లా ప్రవర్తించడంతో వేనుణ్ణి రాజును చేస్తారు. అతడు యజ్ఞయాగాలు చేయవద్దని నిషేధిస్తాడు. విష్ణువే రాజైనప్పుడు, రాజు శరీరంలోనే దేవతలందరూ ఉంటారని, తననే ఆరాధించమని శాసిస్తున్న ఆ వేనుణ్ణి మునులు సంహరిస్తారు. కొడుకు శరీరాన్ని తల్లి కాపాడి ఒకచోట ఉంచుతుంది. లోకంలో ఉపద్రవాలు రావడంతో మునులు తమకు కనిపించిన వేనుడి దేహంలోని తొడను మదించగా నిషాదుడు పుడతాడు. అతణ్ణి, అతని సంతతిని అడవిలో నివసించేలా మునులు ఆజ్ఞాపిస్తారు. తర్వాత వేనుడి కుడిచేతిని మదించగా 'పృథువు' పుడుతాడు. ఎడమ చేతిని మదించగా 'అర్చి' పుడుతుంది. వారిద్దరికీ మునులు వివాహం చేస్తారు. ఆ పృథువే తర్వాత కాలంలో గొప్ప చక్రవర్తిగా, షట్చక్రవర్తుల్లో ఒకడుగా పేరుపొందుతాడు.

పురాణాల్లోని ఒక అసంబద్ధమైన, అశాస్త్రీయమైన కథను తీసుకొని విశ్వనాథ తన సనాతనధర్మ సమర్థనా సిద్ధాంత భూమికను అమలు పరచడానికి 'వేనరాజు' నాటకాన్ని రాశాడు. ఆ వాదాన్ని ఖండించడానికి త్రిపురనేని వారు వేనరాజులోని నిబద్ధతను, ముందుచూపును వివరిస్తూ 'ఖూనీ' నాటిక రాశాడు.

**వేనరాజు:**

పది అంకాలతో, పద్నాలుగు పాత్రలతో, నూటనలభై ఒక్క పుటలతో విశ్వనాథ వారి 'వేనరాజు' 1930లో వచ్చింది. ఇందులో మూడున్నర స్త్రీ పాత్రలు కాగా, పదిన్నర పాత్రలు పురుషులవి. ఇతివృత్తం రాజాంతఃపురాన్ని దాటదు. ఇందులో వాస్తవ జీవితంలో కంటికి కనిపించని పిశాచాల పాత్రలు, విస్మయాన్ని కలిగించే ఆవు స్త్రీగా, స్త్రీ పురుషుడిగా, భూమి మగువగా మారే పాత్రలు కూడా కనిపిస్తాయి. ఈ నాటకానికి కేంద్ర బిందువు వేనరాజు. ఒక నాస్తికుని తత్త్వాన్ని, ఆలోచనలను, చర్యలను వ్యంగ్యంగా చెప్పడానికి 'వేనరాజు' పాత్రను ఉపయోగించుకున్నాడు విశ్వనాథ. భాగవతంలోని వేనుడిలో లేని విచిత్ర స్వభావాలను అతికించాడు విశ్వనాథ. పెళ్ళిచేసుకోని బ్రహ్మచారిగా, తన రాజ్యంలో ఎవరూ వివాహాలు చేసుకోకూడదని ఆజ్ఞాపించే కఠినాత్ముడిగా వేనుణ్ణి చిత్రించాడు. వేనరాజు దృష్టిలో పెళ్ళి కృత్రిమ బంధం. జారత్వంవంటి పాపకార్యాలకు కారణం. అందుకే ఆయన వివాహాన్ని నిషేధించాడు. పెళ్ళి వల్ల స్త్రీలపై పురుషులు పెత్తనం చేసే అధికారం వస్తుందని, స్త్రీలకు సమాన హక్కు ఉండదనే వాదాలు చేస్తాడు. ఒకే గర్భంలో పుట్టిన స్త్రీ పురుషుల మధ్య వివాహ ప్రతిపాదన చేస్తాడు. స్మృతులు చెప్పే సంతానం కోసమే వివాహమనే సిద్ధాంతాన్ని వ్యతిరేకిస్తాడు. దేవుడికి సంబంధించి కొన్ని ఊహలు, స్మృతికర్తలు ప్రతిపాదించిన పొంతనలేని సిద్ధాంతాల వల్ల అనేక సమస్యలు వచ్చాయనేది వేనుడి ప్రతిపాదన. పాతభావాలన్నీ వదిలిపెడితేగాని, బాగుపడమని ప్రతి ఒక్కరూ స్వతంత్రంగా ఆలోచించాలని వేనుడు అంటాడు. గాలి కంటికి కనిపించకపోయినా చెట్లు ఊగడం, చల్లని స్పర్శ తెలియడంవంటివి గాలి ఉందని ఋజువు చేస్తున్నాయంటాడు. వేదాలు పౌరుషేయాలని, వాటిని ఎవరైనా చదవవచ్చుని, ఋషుల్లాగా ప్రతి మనిషికి అవయవాలు, ఆలోచనలు ఉన్నాయి కాబట్టి అంతా సమానమేనంటాడు. రాజు పరమాత్మ అని, ప్రజలు జీవాత్మలని చెప్పుకొస్తాడు.

విశ్వనాథ వేనరాజు మూర్ఖుడిగా కనిపించినా, ప్రేమ, ఔదార్యం లేనివాడిగా కనిపించడు. తండ్రి అయిన అంగరాజును బంధించమని చెప్పినప్పటికీ, అతని స్వేచ్ఛకు భంగం కలగకుండా చూడమని సేవకులకు చెబుతాడు. తన ప్రాణస్నేహితుడైన గౌతముడు (బ్రాహ్మణుడు) తన ఆలోచనల్ని, చర్యల్ని వ్యతిరేకిస్తున్నప్పటికీ అతణ్ణి ప్రేమగానే చూస్తాడు. తమ ఇద్దరి మధ్య పోరాటాన్ని చంద్రుడు, వెన్నెల మధ్య పోరాటంగా అభివర్ణిస్తాడు. తాను వివాహాలు నిషేధించినా, గౌతముడు పెళ్ళిచేసుకున్నాడని తెలుసుకుని ఆలోచిస్తాడు. అయినా అతనిపట్ల కోపాన్ని ప్రదర్శించడు. సుఖంగా ఉండమని దీవిస్తాడు. లేని భగవంతుణ్ణి సృష్టించి, ఆ భగవంతుడు లేడనేవాడిని నాస్తికుడనడం వెర్రికాదా! అని అంటుంటాడు. పృథువును చిన్నతనం నుండి ఆడపిల్లగా చెప్పిన తండ్రి ఆలోచనలను తప్పు పడుతాడే కానీ, తండ్రిపై కోపపడడు. పృథువు పురుషుడని తెలిస్తే, తాను దుర్మార్గంగా సోదరుణ్ణి చంపుతాడని తన తండ్రి భావించడాన్ని వేనరాజు గుర్తిస్తాడు. పిశాచాలు, దయ్యాలువంటి మిథ్యావాదాన్ని అంగికరించని వేనరాజును గౌతముడు, అంగరాజు, భటులు కలసి నాటకమాడి భ్రమకు గురి చేస్తారు. మొదట పిశాచాలు భ్రాంతిగా భావించిన వేనరాజు, చివరకు చుట్టూ ఉన్నావారు కల్పించిన భ్రాంతితో పిశాచాలు నిజమని నమ్ముతాడు. నమ్మకంలేని కర్మసిద్ధాంతాన్ని నమ్మేలా అంతఃపురంలోని పరిస్థితులు చేస్తాయి. అయినప్పటికీ, వీటన్నింటికి కారణభూతుడైన గౌతముణ్ణి, తండ్రిని చంపడానికి ప్రయత్నించడు. తనతో యుద్ధం చేయమని గౌతముడు రెచ్చగొట్టినా వేనుడు మాత్రం శత్రుభావం చూపడు. మానసిక, సంఘర్షణలో చుట్టూ ఉన్నవారు తనను క్షోభ పెడుతున్న సమయంలో, తన చుట్టూ పెద్ద సాలీడు దారాలు అల్లుకున్నాయని గ్రహిస్తాడు. వాటినుండి బయటపడటానికి వీలుకాదని తెలుసుకుంటాడు. మిత్రుడైన గౌతమునికి డాలు, కత్తి ఇచ్చి తనతో యుద్ధం చేయమంటాడు. తన చుట్టూ అల్లుకున్న సాలెగూడులు తన కర్మగా భావించి గౌతముడి చేతిలో మరణిస్తాడు.

సంప్రదాయాన్ని, స్మృతులను, ధర్మాలను యథాతథంగా అనుసరించకపోతే వేనరాజులాగా పతనమవుతారని చెప్పడానికే విశ్వనాథ ఈ నాటకాన్ని రాశాడు. వేనరాజులోని దృఢసంకల్పాన్ని కొత్తకొత్త ఆలోచనలను లోతుగా వివరిస్తూనే, కర్మసిద్ధాంతపు పునాదుల్లో వేనరాజును సమాధి చేశాడు విశ్వనాథ. ఒక వ్యక్తి ఆలోచనలతో వ్యవస్థను మార్చడం సాధ్యం కాదని, తరతరాలుగా వస్తున్న ఆర్షసంస్కృతిని గౌరవించి, ముందుకు తీసుకెళ్ళాలనేది విశ్వనాథ సిద్ధాంతం. ఇదే ఆలోచన బ్రాహ్మణుడైన గౌతముడిలో, అంగరాజులో, పృథువు, భూదేవివంటి వారిలో కనిపిస్తుంది. అందుకే వీరంతా మాట్లాడిన ప్రతిమాట విశ్వనాథ ప్రతిపాదించిన సైద్ధాంతిక భూమికలో నుండి వచ్చినవే. వేదాలను అపౌరషేయాలని అనేకసార్లు చెప్పే గౌతముడు, తనను ప్రేమగా చూసుకునే వేనుణ్ణి అంతం చేయకపోతే ధర్మానికి హాని కలుగుతుందనే దృఢసంకల్పంతో అతణ్ణి చంపేస్తాడు. అలాగే పృథువు చెప్పిన మాటల్లో కూడా విశ్వనాథ వారి సనాతనధర్మ అనుసరణ సిద్ధాంతం స్పష్టంగా కనిపిస్తుంది. రాపిడిలో నుండి పుట్టిన అగ్నిని పూర్వకాలం నుండి ఇప్పటికి ఉపయోగిస్తున్నట్లే పూర్వకాలం నుండి వస్తున్న స్మృతులను అనుసరించాలని, నూతన ఆవిష్కరణలు అవసరం లేదని చెప్పడం విశ్వనాథ వారి ఆలోచనలను ప్రతిఫలింపజేయటమే. నాటకం చివరలో భూదేవి చెప్పిన ''వేనరాజు మతమువంటి దుష్టమతములు వచ్చుచునేయుండును. పోవుచునేయుండును. పైని నిప్పులు మట్టించి తగుల బెట్టునేగాని ఈ లోపలి నిత్యమై పసిమి కళ ఈ యంకురములకు చేటేలేదు'' అని చెప్పిన మాటలు విశ్వనాథలోని లోతైన ఆలోచనలకు సజీవ సాక్షాలు. నాస్తిక సిద్ధాంతం, పౌరషేయవాదంవంటివి ఎన్ని వచ్చినా సనాతనంగా సాగే కర్మసిద్ధాంతం అనే సజీవ పదార్థాన్ని ఏమి చేయలేవని చెప్పడానికి వేనుడి కథను విశ్వనాథ 'వేనరాజు' నాటకంగా మలిచాడు.

ఖూనీ:

త్రిపురనేని వారి 'ఖూనీ' నాటిక విషయానికొస్తే ఇది సెప్టెంబరు 1, 1935వ తేదీన సూతాశ్రమం నుండి వెలివడింది. నాలుగు అంకాలు, ఐదు పాత్రలు, డెబ్బైరెండు పుటలు కలిగిన నాటిక. ఇతివృత్తం అంతపురాన్ని దాటి అరణ్యాల్లోకి మునుల ఆశ్రమాలదాకా వెళ్ళింది. విశ్వనాథ భాగవతంలోని వేనుడి పాత్రకు చేసిన అన్యాయాన్ని గుర్తించి ఈ నాటికను రాసుకొంటున్నట్లు 'ఖూనీ' నాటిక తొలిపలుకుల్లో చెప్పుకున్నాడు.

ఈ నాటిక మునిపల్లెలో యజ్ఞశాలలో జంతుబలి ఇవ్వబోతున్న సంఘటనతో ప్రారంభమవుతుంది. యజ్ఞాల్లో జరిగే జీవహింసకు, యజ్ఞాలు చేయాలనే పూర్వాచార సంప్రదాయానికి తాను వ్యతిరేకమని రాజైన వేనుడు ప్రకటించినప్పటికీ, మునిపల్లెలో యజ్ఞం జరుగుతుంది. సర్వసైన్యాధ్యక్షుడైన ధృష్టవర్మతో అక్కడికి వెళ్ళిన వేనుడు ఆ కార్యాన్ని ఆపిస్తాడు. అక్కడ గౌతమమహర్షికి, వేనరాజుకు వాదోపవాదాలు జరుగుతాయి. విష్ణువు రాజురూపంలో ఉంటాడని చెప్పే "నా విష్ణుః పృథివీ పతిః" అనే స్మృతివాక్యాన్ని అనుసరించి తాను భగవంతుడి అంశేనని చెప్తాడు వేనుడు. తాను శాశ్వతంగా బ్రతకాలని కోరుకోవడం లేదని, ఎవరైనా మరణించాల్సిందేనని, ఋషిపరంపరలో పుట్టి మరణించకుండా మిగిలిన ఒక్కమహర్షి పేరు చెప్పమని హేతుబద్ధంగా ప్రశ్నిస్తాడు వేనుడు. యజ్ఞయాగాదులు లోకకల్యాణం కోసమని ఋజువు చేస్తానంటే ఎవరికైనా అనుమతిస్తానంటాడు. మేఘాల వల్ల వర్షాలు వచ్చేది నిజమేనని, అందులో యజ్ఞధూమం మాత్రమే లేదని, ఎన్నో ధూమాలు ఉన్నాయని వివరిస్తాడు. తాను యజ్ఞాలు నిషేధించి కొన్ని సంవత్సరాలైనప్పటికీ, ఇంకా మేఘాలు కనిపిస్తూనే ఉన్నాయి కాబట్టి, వర్షాలు పడుతూనే ఉన్నాయి కాబట్టి, వర్షాలకు యజ్ఞాలు మూలం కాదని ఋజువు చేస్తాడు వేనుడు. జంతువును యజ్ఞపశువుగా చేసి దానిని ఉత్తమ గతులకు పంపించడంకంటే మునిపుంగవుల్ని యజ్ఞపశువులుగా చేస్తే వెంటనే మోక్షం లభిస్తుంది కదా అంటాడు వేనుడు. ఈ ప్రశ్నలన్నింటికి గౌతముడు దగ్గర సమాధానాలు ఉండవు.

వేనుడు తల్లిచాటు బిడ్డగా పెరిగి విద్యాబుద్ధులు నేర్చి, ధర్మాధర్మ నిరూపణ చేయడం కోసమే నూతనమైన ఆలోచనలతో రాజ్యానికొస్తాడు. తాను చేసే మంచి పనులకు ప్రతిఫలంగా తన తల్లికి సద్గతులు కలుగుతాయని అనుకుంటాడు. తనపైన, తన పాలనపైన తల్లికి నమ్మకం కలిగిస్తాడు. గౌతముడు తన ఇంటికి వచ్చి, రాజమాతకు వేనుడి పాలనపై నిరసన వాక్యాలు చెప్పినప్పటికీ వేనుడు ఏమీ కోపగించుకోడు. పదిజీవుల్ని చంపి ఒక జీవిని పోషించడంకంటే, ఒక జీవినిచంపి పది జీవులను పోషించుకోవడం ఉత్తమమని చెబుతాడు. మతవిధ్వంసం చేస్తున్నావని గౌతముడు ప్రశ్నించినప్పుడు మతం పేరుతో ఒకరి గొంతులు ఒకరు కోసుకోవడం గుర్తుచేసుకోమని, మతం సృష్టించిన విధ్వంసాలను మరిచిపోయావా అని గౌతముణ్ణి నిలదీస్తాడు. మోక్షమంటే సంసారబంధ విమోచనమైనప్పుడు, వివాహం చేసుకోకుంటే సరిపోతుంది కదా? అని ప్రశ్నిస్తాడు. తన సేనాని ధృష్టవర్మను కొడుకైన పృథువును తెలివిగా గౌతముడు తమ మార్గంవైపు తిప్పుకొన్నప్పుడు వేనుడు మౌనంగా ఉండిపోతాడు. వారంతా కన్నబిడ్డను కూడా మాయమాటలతో తండ్రికి వ్యతిరేకంగా మార్చారని తల్లితో చెప్పి బాధపడుతాడు. "ఎవరి కొరకు నా జీవిత సర్వస్వము వెచ్చించి అభ్యుదయం గూర్ప యత్నించితినో వారే నాయుద్యమమునకు సుముఖులు కాలేకపోయిరి. ప్రాకృత జనంబు మలకిలో మునింగి తెలుతున్నారు." అని బాధపడతాడు. మునులు తనబిడ్డను, సైన్యాధ్యక్షుణ్ణి రెండు కత్తుల్లాగా చేతుల్లో పట్టుకొని తనపైకి పంపుతున్నారని, వారిని ఏమీ చేయలేకనే తాను మరణించబోతున్నానని అంటాడు. రాజ్యానికి దూరంగా జీవనం సాగించే నిషాదుడు తన ప్రాణాన్ని కాపాడటానికి ద్వారం వద్దకు వచ్చి నిలబడడం చూసినప్పుడు వేనుడు చలించిపోతాడు. చివరకు గౌతముడి మేధోపరమైన కుట్రలో భాగంగా వేనుడు ధృష్టవర్మ చేతిలో కొడుకైన

పృథువు సాక్షిగా మరణిస్తాడు. స్వామి ద్రోహం చేసిన ధృష్టవర్మ తప్పును తెలుసుకొని పిచ్చివాడవుతాడు. తమకుట్ర బయటపడుతుందని గ్రహించిన గౌతముడు పృథువుచేత ధృష్టవర్మను చంపిస్తాడు. మునులు తమ తెలివితేటలతో వేనుణ్ణి సంహరించి తమ ఉనికిని నిలుపుకున్నారనే సందేశంతో నాటిక ముగుస్తుంది.

ఈ రెండు రూపకాలను పరిశీలించిన తర్వాత మూలంలో ఉన్న కథ నాటకాల రూపంలో వచ్చేటప్పటికి పూర్తిగా మారిపోయిందనిపిస్తుంది. దానికి కారణం కథను నాటకంగా మలచిన కవులిద్దరూ భిన్న దృక్పథాలు కలిగినవారు కావడం. మూలంలోలాగా రెండు నాటకాల్లో నాయకుడు వేనుడే. అలాగే మూలంలోలాగే గౌతముడికి వేనుడికి మధ్య సైద్ధాంతిక పరమైన సంఘర్షణతో రెండు నాటకాల్లో కథ నడుస్తుంది. రెండు నాటకాలు వేనుడి మరణంతో ముగుస్తాయి. భాగవతంలో వేనుడి అవయవాల నుండి నిషాదుడు, పృథువు, అర్చి పుట్టినట్లు ఒక అసహజమైన కల్పన కన్పిస్తుండడంవల్ల దానిని నాటక కవులిద్దరు వదిలిపెట్టేశారు.

నాటక రచయితలిద్దరూ ఒకరు మూర్తీభవించిన కర్మసిద్ధాంతవాదికాగా, మరొకరు నాస్తికత్వాన్ని జీర్ణించుకున్న భౌతికవాది. అందుకే ఒకరు చేసిన ప్రతిపాదనలను మరొకరు ఖండించుకుంటూ వచ్చారు. విశ్వనాథ 'వేనరాజు' రాయకుండా ఉంటే కవిరాజు 'ఖూనీ' రాసేవాడు కాదు. ఒకవేళ విశ్వనాథ వేనరాజును అంత దుర్మార్గుడిగా చూపించకుండా ఉంటే కూడా కవిరాజు 'ఖూనీ' జోలికి పోయేవాడు కాదేమో. వేనరాజు నాటక ప్రదర్శన మద్రాసులో జరిగినప్పుడు దానిపై వ్యతిరేక భావనలు రావడం, ఆ పుస్తకాన్ని నండూరి శేషాచార్యులు ఇంటిలో కవిరాజు చూడడం, వేనరాజు పాత్రకు విశ్వనాథ చేసిన అన్యాయాన్ని గుర్తించి త్రిపురనేనివారు ఆలోచించడం 'వేనరాజు' నాటకానికి ప్రతిగా 'ఖూనీ' రావడానికి కారణమైంది. భాగవతంలో వేనరాజుకంటే పెద్ద నాస్తికుడిగా విశ్వనాథ వేనరాజును తయారు చేశాడు. వివాహాన్ని పూర్తిగా నిషేధించడం, స్వలింగ వివాహాలను సమర్థించడం, ఒకే గర్భంలో పుట్టిన స్త్రీ పురుషుల మధ్య వివాహం వంటి ఆలోచనలను రేకెత్తించడంవంటివి విశ్వనాథ వేనరాజు ద్వారా ప్రతిపాదించడం ఎవరూ జీర్ణించుకోలేని అంశాలు. రాజు మతానికి, దైవానికి బానిస కావాలనే ఆలోచనలు విశ్వనాథవారివే. తండ్రిని, సోదరుని, స్నేహితుని, భటులను, ఆంతరంగీకులను అందరినీ శిక్షించే ఒక మనసులేని మనిషిగా వేనరాజును తయారు చేశాడు విశ్వనాథ. ఇదంతా అమూలకమే. సంప్రదాయవాదాన్ని, కర్మసిద్ధాంతాన్ని, స్మృతుల్ని బలపరుచుకోవడానికి ఇలా ఒక పాత్రను ఉపయోగించుకోవడం ఆనాడు విమర్శ లోకంలో పెద్ద చర్చ.

ఈ నేపథ్యంలో సనాతన ధర్మాల్లోని అవలక్షణాలపై, కర్మసిద్ధాంతం చెప్పే కాలం చెల్లిన మాటలపై తీవ్రస్థాయిలో గొంతు వినిపిస్తున్న త్రిపురనేని రామస్వామి చౌదరి 'వేనరాజు'లో ప్రతిపాదించిన భావాలను ఖండించడానికి మాత్రమే 'ఖూనీ' నాటికను రాశాడు. విశ్వనాథవారు చిత్రించినంత దుర్మార్గుడు వేనరాజు కాదని నిరూపించాడు. ప్రతి సన్నివేశంలోనూ మునులు చెప్పున్న వాదానికి వేనుడు అడ్డుతగలడం, కవిరాజులోని స్పష్టమైన భౌతికవాదానికి నిదర్శనంగా చెప్పవచ్చు. ఋషులను తిరస్కరిస్తే వెళ్ళే నరకలోకం ఎక్కడుందో చూపించమని అడగడం, భగవంతుడు తన రాజ్యంలో ఎప్పుడూ కనపడలేదని, ఆయన ఉద్యోగమేమిటని? సూటిగా ప్రశ్నించడం, పుట్టిన ప్రతి జంతువు గిడుతున్నప్పుడు అందులో దేవుడి పెత్తనమేందని నేరుగా అడగడంవంటివి మూలానికి భిన్నంగా విశ్వనాథకు ప్రతిగా వేనుడిలో త్రిపురనేనివారు ప్రవేశపెట్టిన భావాలు.

సనాతనధర్మ పునఃప్రతిష్ట కోసం విశ్వనాథవారు చేస్తున్న సాహిత్య వ్యవసాయంలో భాగంగా రాసిన 'వేనరాజు'ను పూర్తిగా ఖండించడానికే ఖూనీ నాటకాన్ని రాసి, తెలుగు సాహిత్యంలో వాద-ప్రతివాద సాహిత్య చర్చ లేవదీశాడు త్రిపురనేని.

డా. పి.సి. వెంకటేశ్వర్లు
తిరుపతి. ఫోన్: 949 016 4963.

# తొలి తెలుగు నవల ఏది?

**– టి. రవిచంద్**

తెలుగు స్వీయ జీవిత చరిత్రలలో వీరేశలింగం 'స్వీయ జీవిత చరిత్రము' (ప్రథమ భాగం 1911, ద్వితీయ భాగం 1915) ఆధునికాంధ్ర సాహిత్య చరిత్రలో వివాదాస్పద రచనగా మిగిలింది. ఈ వ్యాసం రాస్తున్న సమయంలోనే జయధీర్ తిరుమలరావు 'వార్త' దినపత్రికలో వీరేశలింగం స్వీయ జీవిత చరిత్రను ఆధారం చేసుకొని తొలి తెలుగు నవల ఏది? అని చర్చించారు. ఈ చర్చ కొత్తది కాదు. పాతదే. దాదాపు ఈ చర్చ ముగిసినట్లే. ప్రొ. జి.ఎన్. రెడ్డి 1955 సంవత్సరంలో మద్రాసు విశ్వవిద్యాలయానికి సమర్పించిన తమ పరిశోధనా పత్రంలో తొలి తెలుగు నవల గురించి, నవలా రచయిత గురించి ఎటువంటి వివాదానికి తావివ్వకుండా స్పష్టంగా చెప్పారు. 1878లో ప్రచురించబడిన రాజశేఖర చరిత్ర నవల వలన కందుకూరి వీరేశలింగం తొలి నవలా రచయితగా గుర్తించబడ్డాడు. ఐనను మనకు నరహరి గోపాలకృష్ణమశెట్టి రచించిన మౌలిక నవల (Original Novel) 'శ్రీరంగరాజు చరిత్ర' ఉంది. ఇది 1872లో ముద్రించబడింది. దీనిలో ఐదు ఉల్లాసములు (అధ్యాయాలు) ఉన్నాయి. ఇది మన తొలి తెలుగు నవల. కాని ఇది ఇంగ్లీషు మూలానికి అనువాదమో, అనుసరణో కాదు. స్వతంత్ర్య నవల. ఈ అభిప్రాయం జి.ఎన్. రెడ్డి దాదాపు ఐదు దశాబ్దాల క్రితమే ప్రకటించాడు. ఇదే విధంగా 1960లో తొలి ముద్రణ పొందిన కొత్తపల్లి వీరభద్రరావు పరిశోధనా గ్రంథం 'తెలుగు సాహిత్యంపై ఇంగ్లీషు ప్రభావం'లో తొలి తెలుగు నవలా రచయిత నరహరి గోపాలకృష్ణమశెట్టి జీవిత, సాహిత్యాల్ని విపులంగా చర్చించారు. ఆయన జీవితం, సాహిత్యాల గురించి అనేక కొత్త విషయాలు వెలుగులోకి తెచ్చారు. కొత్తపల్లి వీరభద్రరావు తొలి తెలుగు నవలా రచయితగా నరహరి గోపాలకృష్ణమశెట్టిని పేర్కొంటూనే, ఆయనకంటే ముందు కొక్కొండ వెంకటరత్నం పంతులు 'మహాశ్వేత' (1867) అనే నవల రాసినట్లు మరో కొత్త విషయం కూడా బయటపెట్టారు. ఈ విషయాలేవీ జయధీర్ తిరుమలరావు 'వార్త'లో రాసిన వ్యాసంలో పేర్కొనలేదు. అంతేకాదు - తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించిన జాన్ గ్రీన్‌ఫీల్డ్ లియోనార్డ్ పరిశోధనా గ్రంథం 'కందుకూరి వీరేశలింగం (1848-1919)లో కూడా వీరేశలింగం నవల 'రాజశేఖర చరిత్ర' తొలి తెలుగు నవల కాదని, సాహితీ చరిత్రకారుడు రమాపతిరావు నరహరి గోపాలకృష్ణమశెట్టి రచించిన 'శ్రీరంగరాజు చరిత్రము' (1872)ను తొలి తెలుగు నవలగా కనుగొన్నారని, కానీ వీరేశలింగం నవలకే ఎక్కువ ప్రచారం వచ్చిందని తెలిపారు. అందువల్ల తెలుగు సాహిత్యంలో సీరియస్ పరిశోధకులెవరూ నరహరి గోపాలకృష్ణమశెట్టి 1872లో రచించిన 'శ్రీరంగరాజు చరిత్ర'ను తొలి తెలుగు నవలగా గుర్తించకపోవడమనే సమస్యే తలెత్తలేదు. కానీ జయధీర్ తిరుమలరావు తమ వ్యాసంలో పేర్కొన్నట్టు నరహరి గోపాలకృష్ణమశెట్టి తన తొలి నవలలో ప్రదర్శించిన సామాజిక దృష్టి కోణం (Social Perspective) ఎంతో ఆధునికమైనది, మానవతాపూరితమైనది. కాబట్టి జయధీర్ తిరుమలరావులాంటి వారెవరైనా నరహరి గోపాలకృష్ణమశెట్టి జీవిత, సాహిత్యాలపై ఒక సమగ్ర రచనకు పూనుకొని, నూటముప్పై సంవత్సరాల క్రితమే హిందూ పురాణాలపై, వర్ణాశ్రమ వ్యవస్థపై లోతైన విమర్శ చేసిన ఆయన జీవితాన్ని ప్రజలకందించాలి. తెలుగు సాహిత్య చరిత్రలో నరహరి గోపాలకృష్ణమశెట్టికి దక్కాల్సిన సముచిత స్థానం లభించేట్టు చేయడమే సామాజిక పరిశోధకుల ప్రథమ కర్తవ్యం.


---

టి. రవిచంద్, బాపట్ల. ఫోన్: 996 613 4406.

# చదవండి...


- మిసిమి

**మూడోకన్ను - కావ్యదర్శనం:** చలపాక ప్రకాష్ కవిత్వ తత్త్వం. దీని సమీక్ష పోతగాని సత్యనారాయణ. ఇది కావ్యమని – కవిత్వ తత్త్వాన్ని, విశ్లేషిస్తూ ఈ పుస్తకం వెలువడింది. 'భావుకతను కలిగి ఉండడమే – కవికి అర్హత' అని ముందుగానే ప్రమాణం పెట్టుకొని పుస్తకం విశ్లేషించారు – కవికి ఏమేమి ఉండాలో – ఏమేమి ఉండకూడదో కూడా చిట్టా ఇచ్చారు. ఇలా కవిత్వాన్ని, కవిని ఒక గాటన కట్టివేయవచ్చా? ఇది కవిత్వమయితే మనం కవులమయితే కాళిదాసు – నన్నయ – పోతనామాత్యులను ఏమనాలి? వారివీ కావ్యాలేనా? ఇందులో మనం కొత్తగా చదవవలసింది – నేర్చుకోవలసింది ఏముందో – చదివి తెలుసుకోండి!





*పేజీలు: 80, ₹ 30/– ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, చంద్రం బిల్డింగ్, చుట్టుగుంట, విజయవాడ–520004.*


**(1) విశిష్ట మహిళామణులు:** టి. శాంతా భాస్కర్. 21 మంది మహిళల గురించి వారు సాధించిన విజయం గురించి అవి సాధించడానికి వారు పడిన కష్టనష్టాల గురించి వివరంగా విపులంగా తెలియజేశారు. ఈ 21 మందిలో రాణి రుద్రమదేవి నుంచి మదర్ థెరిసా వరకు అన్ని రంగాల నుంచి ఎంచుకున్నారు. విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. స్త్రీవాదులు తప్పక చదవాలి. *పేజీలు: 104, ₹ 85/–*





**(2) స్త్రీవాద వివాదాలు:** డా. ఎస్.వి. సత్యనారాయణ (సంపాదకుడు). శీర్షిక వివాదాస్పదంగా ఉన్నట్లుంది కదూ – స్త్రీవాదంపై చర్చలు జరిపి అనుకూల – ప్రతికూల స్పందనలు పుస్తక రూపంలో తెచ్చారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం – నవచేతన వారు కలసి స్త్రీవాదంపై సాహిత్యం జరిపిన చర్చలు ప్రచురిస్తే – వెయ్యి పుటలు దాటిపోతుందన్నారు సంపాదకులు. అంతటి చర్చను 172 పుటలకు కుదించి పాఠకులకు అందించారంటే చాలా కృషి జరిగి ఉండాలి. ఇందులో ముఖ్యంగా 1992 – 1993 వ్యాసాలనే ఇరికించామని అంటున్నారు. ఆ తర్వాత మరిన్ని సంకలనాలు వచ్చే ప్రమాదం ఉంది. అవసాన దిశగా ప్రయాణిస్తూ వాద సాహిత్యాన్ని క్లుప్తంగా అందించడంలో ఇది ముందు తరాలకు పనికి వస్తుందనే ఆశ ఉంది. *పేజీలు: 172, ₹ 150/–*




**(3) రష్యా విప్లవం భారత స్వతంత్ర సంగ్రామం:** అక్టోబరు సోషలిస్టు విప్లవ సందేశాన్ని ముందుకు తీసుకుపోవాలని – సుధాకర్ రెడ్డి గారి పిలుపు – వంద సంవత్సరాలు నిండిన ఈ అక్టోబరు విప్లవం ఎంత వరకు వెళుతుందో? రాజకీయంగా ఇప్పుడు ఎక్కడ నిలిపిందో? అక్టోబరు విప్లవం భారత స్వాతంత్ర పోరాటానికి స్ఫూర్తి అని – అన్నీ క్రోడీకరించి ఎన్నో విలువైన సమాచారాన్ని అందించారు ఈ పుస్తకంలో. *పేజీలు: 195, ₹ 160/–*






**(4) దళిత వివాదాలు:** సంపాదకుడు డా. ఎస్.వి. సత్యనారాయణ. ఇది కూడా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు – నవచేతన పబ్లిషింగ్ వారు వెలువరించారు. స్త్రీవాద – దళితవాద వివాదాలు – ఇది పైన ఇచ్చిన స్త్రీవాద వివాదాల మాదిరి సంకలనమే. ఎందరో లబ్ధప్రతిష్టులు రాసిన వాదవివాదాల సంకలనమిది. తప్పక చదవదగింది.

*పేజీలు: 312, ₹ 260/– పై నాలుగు పుస్తకాల కోసం – నవచేతన పబ్లిషింగ్ హౌస్, 12–1–493/ఎ., గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), జి.ఎస్.ఐ. పోస్ట్, హైదరాబాద్–500 068. ఫోన్: 040–29884453/54.*

**(1) కాళిదాసు ఋతుసంహారం:** తెలుగు అనువాదం కవిరాజ శిరోమణి గొట్టిముక్కల రాధాకృష్ణ రావు. ప్రపంచంలోనే అద్వితీయ కవిగా పేరుగాంచిన కాళిదాస కవి విరచితము – మన అదృష్టంకొద్దీ మనకు లభించిన కావ్యం *ఋతుసంహారం* – కథానుసారం ఆయా ఋతువులను అద్భుతంగా వర్ణించిన కవి కాళిదాసు – సంస్కృత కావ్యానికి తెలుగు పద్యాలలో రాధాకృష్ణరావుగారు – ఎంతో సంయమనంతో కూర్చారు – తెలుగు తత్వ పదాలు సమపాళ్ళలోనే ఉన్నాయి – తెలంగాణ సాహిత్య అకాడమీ వారు ప్రచురించిన ఈ పుస్తకం తప్పనిసరిగా రసజ్ఞుల చేతిలో ఉండాల్సిందే.





*పేజీలు: 44, ₹ 20/-*




**(2) రాఘవరెడ్డి రచనలు:** తెలంగాణ సాహిత్య అకాడమీ వారిది. సావిత్రి – రతివిలాపం – గోపికావల్లభా – పరిదేవనం. ఇవన్నీ రాఘవరెడ్డి రచనలే. గార్లపాటి రాఘవరెడ్డి – కాళోజీకి గురువులాంటివారు. ఇవన్నీ పద్య రచనలే. ఎంతో విలువైనవి. మళ్లీమళ్లీ చదవతగినవి. 'తరుణీ, నీ ఫణుతులు సుధాధారలన్నట్లు.. వీణదోయి నిండారు విందులయ్యే...' అంత సరళంగా ఉంటాయి వీరి పద్యాలు. వరుని విడి – ఇంకా ఏదైనా వరము కోరుము – అని యముడు సావిత్రిని అర్థిస్తున్నాడు.


*పేజీలు: 69, ₹ 30/- పై రెండు పుస్తకాల కోసం – తెలంగాణ సాహిత్య అకాడెమీ, కళాభారతి, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్-04. ఫోన్: 040-29703142.*





**జీవన వికాస్:** జె. శ్రీరఘుపతిరావు. జీవితాన్ని అద్భుతంగా ఆనందకరంగా సహజ రీతిగా ఎలా మలచుకోవాలో చెప్పిన పెద్దల సూక్తులు సంకలించి – మరికొన్ని ఆయనే రాసి యువతరానికి అందిస్తున్నారు – రావుగారు. మిమ్మల్ని జీవన పోరాటానికి సంసిద్ధం చేస్తున్నారు.

*పేజీలు: 152, ₹ 75/- ప్రతులకు: ఎమ్మెస్కో బుక్స్, 33-22-2, చంద్రం బిల్డింగ్స్, సి.ఆర్. రోడ్, చుట్టుగుంట, విజయవాడ-520 004. ఫోన్: 0866-2436643.*

**అక్షరాలతో కరచాలనం కవిత్వం:** ములుగు లక్ష్మీ మైథిలి. ఇవన్నీ వచన కవితలు. రచయిత్రి తన భావ – అనుభవ పరంపరను పాఠకులతో పంచుకుంటున్నారు. 'మా పెరటి చెట్లన్నీ / పండ్లూ పూలనిస్తాయి.. ప్రాణవాయువునిచ్చి / ఊపిరి పోస్తాయి... పండగ రోజుల్లో మా ముంగలికి / పచ్చని తోరణమై నవ్యశాఖనిస్తాయి..'





*పేజీలు: 96, ₹ 100/- ప్రతులకు: శ్రీమతి ములుగు లక్ష్మీమైథిలి, W/o M. చంద్రశేఖరరావు, ఇం.నెం. 26-9-482/2, వేదాయపాళెం (ఓల్డ్), చెప్పుల గోడౌన్ ఎదురుగా, ఎ.కె. నగర్, నెల్లూరు-524 345. ఫోన్: 944 008 8482.*



**రామకృష్ణ శతకం:** టి. అంబుజ. శతకాలకేమీ లోటు – 'రామకృష్ణ మాట – ప్రగతి బాట' అనే మాట ఊరిలో సాగింది. అన్నీ మనం – సహజం – మీరు – నేను – కలగలిసి – ఉన్నాయి. వీరు స్పృశించని విషయం లేదు.

*పేజీలు: 28, ₹ 30/- ప్రతులకు: టి. అంబుజ, W/o ఎమ్. రామకృష్ణారెడ్డి, ఇం.నెం. 2-29, గ్రా. ఇబ్రహింబాద్, మం. హన్వాడ, జి. మహబూబ్‌నగర్-509334. ఫోన్: 949 371 0142.*



**చెరగని ఆటోగ్రాఫ్:** కె.పి. లక్ష్మీనరసింహ. వచన కవితలు – తెలుగులో మాండలికం – 'గగనం యాడున్నా ఇరుసు లేని బండిలెక్కున్నది..'

*పేజీలు: 29, ₹ 25/- ప్రతులకు: కె.పి. లక్ష్మీనరసింహ, S/o పిచ్చయ్య, ఇం.నెం. 1-65, తిమ్మాపూర్ (వి), మూసాపేట (మం.), మహబూబ్‌నగర్. ఫోన్: 901 064 5470.*

# మిసిమి

మాసపత్రిక

మీరు చందాదారులుగా చేరండి   బహుమతిగా పంపండి


మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా **మిసిమి** పేర ₹ 360/- (సంవత్సర చందా) పంపి, చిరునామా వివరాలు మాకు ఫోన్ ద్వారా, ఇ-మెయిల్ ద్వారాగానీ, వాట్సాప్ (నెం : 99 49 51 65 67) ద్వారా గానీ తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని మంచి సారస్వతంతో పలకరించినట్లే......

## Our A/c Details for Online Transfer


Bank : **STATE BANK OF INDIA**
Account : **MISIMI**
A/c. No. : **10261569316**
Branch : **Saifabad, Hyderabad, INDIA**
IFS Code : **SBIN0007315**

*ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు రూ. 20/- బ్యాంకు ఛార్జీలు కలపండి.*
*ఈ ప్రక్క మెయిల్‌కు తెలియజేయండి.* e-mail: misimi90monthly@gmail.com


## మిసిమి ప్రచురణలు




**నోబెల్ వ్యాసాలు**





**మిసిమి** పార్థసారథి వ్యాసాలు




చిత్రకళా నీరాజనం




చార్లీ చాప్లిన్




**బైరన్**




**పురస్కార సాహిత్యం**





పారిజాతం




**ఏరియల్**




**సిద్ధార్థ**




దోసిట చినుకులు

ప్రతులకు:
**మిసిమి**
కార్యాలయాన్ని సంప్రదించండి.
ఫోన్:
**994 951 6567**

**మిసిమి** మాసపత్రిక
Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. **040-27645536.**